# వెన్నెల కాటేసింది నవల

## గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 34






నాగరికత నర్తించని ఆ రోజుల్లో.. అందమైన విజయనగరం వీధుల్లో..

నలభై ఏళ్ళ క్రిందట..

ఆ జాబిలి పంచింది వెన్నెల వెలుగా...వెండి మంటా..?

## ముందుమాట

చాలా సంవత్సరాల కిందట ఓ పెద్దమనిషి ఇచ్చిన దొంగ హామీలను నమ్మి నా పుస్తకాలను నేను ప్రచురించే ఊబిలో ఇరుక్కున్నాను. అలాగే పుస్తకాలు తన దగ్గరే ఉంచుకుని పంపిణీ చేస్తానన్న ప్రచురణకర్తా మాట తప్పాడు. ఈ ఇద్దరిలో ఎవరు హామీ ఇవ్వకపోయినా ఈ అనర్థంలో పడేవాడిని కాను. ప్రతిఫలాన్నాశించనన్న దొంగ హామీతో ప్రారంభమయి, నానా అనర్థాలతో, అచ్చుతప్పులతో - భయంకరంగా ముద్రితమయిన నా 'సమగ్ర సాహిత్యం' నా సాహితీ జీవితానికి ప్రతినిధి అయింది - ఈ ఇద్దరి పుణ్యమా అంటూ. ఇది నా సాహితీ ప్రస్థానానికి పట్టిన చెద.

14 వేల కాపీలు ఎక్కడ ఉంచాలో, ఎలా ఉంచాలో అనుభవం లేక - చక్కని స్త్రీమూర్తిగా పెంచిన ఆడపిల్ల తల చెడి ఇంటికి వస్తే - ఎలా కాపాడాలో తెలియని నిస్పృహతో పుస్తకాలను అస్తవ్యస్థంగా ఉంచి, కొన్ని వందల పుస్తకాలను చెదల పాలు చేసి - ఎప్పుడు వాటిని చూసినా - నా సృజన కాక నేను లోనయిన నమ్మక ద్రోహం నా గుండెను రగిలింపజేస్తూంటుంది.

ఇంత చెప్పడానికి కారణం - ఆ సంపుటాలలో వెలువడవలసిన - విలువైన నవలలు - ఇంకా ప్రచురణ కాకుండానే నిలిచిపోవడం. పిడికెడు ఆకాశం, వెన్నెల కాటేసింది, మళ్ళీ రైలు తప్పిపోయింది, బహుళ పంచమి జ్యోత్న, కాలం వెనక్కు తిరిగింది, గాలిలో ఓ క్షణం, అహంకారపు అంతిమ క్షణాలు - ఈ వరుసలో ప్రింటు కావలసిన 3 సంపుటాలు. అలాగే నా రేడియో నాటికలు, అనువాదాలు, కదంబం (ఇందులో రేడియో ప్రసంగాలు, చిన్న చిన్న కథలు, ఇతర రచనలు ఉన్నాయి) ప్రింటుకాక నిలిచిపోయిన సంపుటాలు. ఇవి వెలుగు చూడని పుణ్యం ఈ పెద్దమనుషులదే మా అబ్బాయి - "ఎలాగూ మొదలెట్టావు. పూర్తి చెయ్యరాదా?" అని ఒకటి రెండుసార్లు అన్నా - మరో 4 వేల పుస్తకాల భారం మొయ్యలేకా, వ్యాపారం నా స్వభావం కాదు కనుకా ఆ పనికి ధైర్యం చెయ్యలేకపోయాను.

ఇంకా కారణం నేను చెప్పలేదు. ఈ మధ్య అమెరికాలో ఉన్న సాహితీ మిత్రులు కిరణ్ ప్రభ నాకు ఫోన్ చేసి "మీ వెన్నెల కాటేసింది' చదవడం ప్రారంభిస్తాను" అన్నారు. ఆ రాత్రే ప్రారంభించారు. ఇక ఆపలేక రాత్రంతా ఏకబిగిన చదివి మళ్ళీ ఉదయమే ఫోన్ చేశారు "బాబోయ్! గొప్ప నవల" అంటూ. ఇలాంటి సాహితీప్రియుల కోసమయినా ఈ పుస్తకాలు ఎవరయినా ప్రచురించే పుణ్యం కట్టుకోవలసి ఉంది.

ఈ గొడవ పక్కన పెడితే – 'వెన్నెల కాటేసింది' అలనాటి ఎమెస్కో సిరీస్‌లో వచ్చిన రెండో నవల. రచనా కాలం: 1971. అప్పటికి 'పిడికెడు ఆకాశం' ప్రచురణ కావడం, మంచి స్పందన రావడం జరిగింది. అప్పట్లో ఆ నవలలు రాయడానికి ప్రోత్సాహం ఎమ్.ఎన్.రావుగారిదే. ఈ నవలని కేవలం రెండు మూడు రాత్రులలో రాసిన గుర్తు – కారణం అప్పటి నా పనిపాటల్లో (సినిమా) అంతకు మించి 'ఏకాగ్రత'ని ఏర్పరచుకోవడం సాధ్యం కాని స్థితి కనుక.

అప్పట్లో ఎమెస్కో కవర్ పేజీలన్నీ బాపుగారే వేశారు. ఆ బొమ్మలన్నీ వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లల లాగ అతి హృద్యమైనవి. వెనక అట్ట మీద నవల పరిచయం, నా పరిచయం – బాలాంత్రపు నళినీకాంత రావుగారు చేశారు. వారు నాకు మంచి అభిమాని. ఆరోజుల్లో 'ఆంధ్రజ్యోతి'లో భరాగో గారు పనిచేసేవారు. ఆయన దస్తూరీ అతి ముచ్చటయినది. ఆయన ఈ శీర్షికనీ, అడ్రసునీ రాసి – బంగీని ఎమెస్కోకి పంపడంలో సహకరించిన గుర్తు. ఈ పనిని ఇంతకన్నా మకుటాయమానంగా ఇప్పటికీ ఆయన చేస్తూనే ఉన్నారు.

నా సాహితీ వ్యాసంగంలో 'నవల' ఒక భాగం మాత్రమే కనుక – తరువాతి నా సినిమా వ్యావృత్తి నన్ను దూరంగా తీసుకుపోయింది కనుక – మలిముద్రణలకు ప్రయత్నమయినా చేయలేదు. అసలు ఆ దృష్టే ఈ 30 ఏళ్ళలో నాకు లేకపోయింది. అందుకనే నవల గురించి చాలా మంది 'మహానుభావులు' ప్రస్తావించే చాలా సందర్భాలలో కనీసం నా పేరయినా వినిపించదు. విచారం లేదు. అయితే ఈ తరం ఈ నవలని చదవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మారుతీరావుని కేవలం సినీనటుడిగానే ఎరిగిన తరం తోసుకు వస్తోంది. Don't want to die an untimely death – as a writer. అయితే ఇప్పటి తరంలో చాలా మందికి తెలుగు చదవడం రాదేమో. ఇప్పుడు సాహిత్యాన్ని 'చదువుకుని' ఆనందించే వారి తరం మైనారిటీ ఏమో! వారికి దాదాపు 38 సంవత్సరాల నాటి సాహిత్యం 'పాత చింతకాయ పచ్చడి' లాగ ఉంటుందేమో. అయితే పాత చింతకాయ పచ్చడి రుచి మరిగిన వాళ్ళు కొందరయినా ఉండకపోరు. కనుక కిరణ్‌ప్రభ గారి ఈ సాహసాన్ని మనం క్షమించవచ్చును.

ఈ నవల ఇప్పటి తరానికి నచ్చితే – 38 సంవత్సరాలపాటు నేను పాఠకుల్ని నష్టపోయినట్టు లెక్క. నచ్చకపోతే ఇన్నేళ్ళు నా సాహిత్యం మూలన పడడం వల్ల ఈ సమాజానికి ఏమీ అనర్థం జరగనట్టు లెక్క. ఈ నిర్వేదం ఇప్పటి నా వయస్సుది. ఇలా అంటున్నప్పుడు నా ఆలోచనల పదును తగ్గిందని కాదు. నా ఆలోచనలను అంగీకరించని పాఠకుల అలసత్వాన్ని అంగీకరించే 'అవగాహన, sense of humour పెరిగిందని. ఇక నవలని చదివే సాహసం చెయ్యండి.

గొల్లపూడి మారుతీ రావు

**సుబ్బుల్ని నేను ఆ ఊరికి వచ్చినరోజు సాయంకాలం నూతి గట్టు దగ్గర మొట్టమొదటిసారిగా చూశాను.** ఆ రోజు నాకు బాగా గుర్తు. మండు వేసవి. ఎండ పెళపెళలాడుతోంది. మధ్యాహ్నం తీరికగా నిద్రపోయి, ఆలస్యంగా లేచి, ఒళ్ళు చిటపటలాడుతుంటే నడుం చుట్టు తువాలు బిగించి సబ్బు తీసుకు బయలుదేరాను. పెరట్లో నూతి దగ్గరకి. నూతి ప్రక్కనే పాతరేకుల్లో చిన్న బాత్‌రూం తయారు చేశారు.

ఇక్కడ స్నానాల కింతకంటే గత్యంతరం లేదు . కాని లోపలికి వెళ్ళబోయానో లేదో ఈ అమ్మాయి కనిపించింది. పేరు సుబ్బులని మొదట నాకు తెలీదు.

"ఏమే సుబ్బులూ, ఇంకా స్నానం కాలేదా?" అని పక్క వాటాలోంచి ఓ ముసలిగొంతు కేకకి బాత్‌రూం ప్రక్కనే ఉన్న మల్లెపందిరి మధ్య నుంచి సన్నని గొంతుక జవాబిచ్చింది.

"ఇక్కడే ఉన్నాను మామ్మా - ఇంకా స్నానం చెయలేదు" అంటూ. అప్పుడు చూశాను సుబ్బుల్ని. స్నానానికి వెళ్ళే ప్రయత్నంలో ఉందిగావును. వదులుగా తెల్లటి చీర ఒళ్ళంతా చుట్టుకుంది. పైటని శరీరానికి అతుక్కునేలాగ బిగించి నడుం పక్కన దోపుకుంది. జుత్తు చెదిరి ఉంది. చేతిలో వెండిగిన్నె నిండా బొండు మల్లెలు. చాలా తెల్లటి మనిషయినా మట్టితో, పందిరి మీంచి రాలిన దుమ్ముతో కాస్త అలికినట్టుంది. చెదిరిపోయే జుత్తు మధ్య నుంచి పెద్ద కళ్ళతో నా వేపు చూసి ఆశ్చర్యపోతూ నిలబడిపోయింది. ఒక భుజం మీద పువ్వుపువ్వుల ఎర్రటి జార్జెట్ చీరె, అదే రంగు బ్లౌజు ఉన్నాయి. వెండిగిన్నె ఓ చేత్తో పట్టుకుంది. మామ్మ అరుపు విని ఒక్క ఉదుటున బాత్‌రూం వేపు నడవబోయి నన్ను చూసి ఆగిపోయింది. నేనూ సుబ్బుల్ని చూసి తెల్లబోయాను. ముందుకు వెళ్ళిపోవాలో ఆగిపోవాలో తెలీక తటపటాయిస్తున్న సమయంలో నేను మాట తెచ్చుకుని "ఫరవాలేదు. మీరు వెళ్ళండి" అంటూ నూతి వేపు ఒత్తిగిలి నిలబడ్డాను.

ఇంకా ఆలోచిస్తోంది.

వెండిగిన్నె వేపే చూస్తూ "చాలా మల్లెలే కోశారు. చాలా సేపయిందేమో వచ్చి. మళ్ళీ మీ మామ్మ పిలుస్తారేమో, వెళ్ళండి. నేను వెయిట్ చేస్తాను" అన్నాను.

అర్థం చేసుకున్నట్టు లోపలకి వెళ్ళింది. అంతలో మళ్ళీ వచ్చి వెండి గిన్నె నూతిగట్టు మీద ఉంచేసి, లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది.

నాకు స్నానం చెయ్యకుండానే నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. లోపల బాత్‌రూంలో ఉన్న సుబ్బులు గురించి ఆలోచిస్తూ నూతిగట్టు మీద చతికిలబడ్డాను. గిన్నెలో మల్లెలు నాకు కాపలా కాస్తున్నట్లు కళ్ళు విచ్చుకున్నాయి. లోపల నీళ్ళు ఒంటిమీద నుంచి కిందకి జారుతున్నాయి. తెల్లటి సబ్బు నురుగు బాత్‌రూం కాలువలోంచి బయటికి జారి మల్లెపందిరిలోకి వెళుతోంది. సుబ్బులకి బాత్‌రూంలో ముందు చోటిచ్చినందుకు కష్టాల్లో ఉన్న ఆడపిల్లని ఆదుకున్నంత గర్వపడ్డాను.

హఠాత్తుగా ఓ ఆలోచన తోసుకొచ్చింది. స్నానం చేసిన తర్వాత భుజం మీద ఉన్న పల్చటి చీర చుట్టుకురావాలిగా! మళ్ళీ నా ముందు నుంచే ఆమె వెళ్ళక తప్పదు. ఆశగా కూర్చున్నాను. శాండల్ ఉడ్ వాసన ఇక్కడికి తెలుస్తోంది. వాడిపోయిన మల్లెపువ్వుల చెండు రేకులమీంచి ఎగిరివచ్చి నా ముందు పడింది. ఆమె ఒంటిని కరుచుకున్న తెల్లచీరె  రేకులమీద గాలికి రెపరెపలాడుతోంది.

సుబ్బులు అందగత్తె ఏమీ కాదు. కాని అలాంటి సమయంలో మొదటిసారిగా చూడడం వల్ల సాధారణంగా అమ్మాయిల్లో తోచిన కొత్త అందం వేపు ఆలోచనలు పోయాయి. అప్పుడు ఆమె అందంగానే కనిపించింది. ఆ మాటకు వస్తే ఆ వయస్సులో ఉన్న ఏ అమ్మాయి అయినా నిండుగా, కొత్తగా కనిపిస్తుంది. అలాగని సుబ్బులిది కేవలం యౌవనపు మెరుపు మాత్రమే కాదు. తెల్లటి మంచుముద్ద లాంటి తెలుపు. పాలరాతితో చెక్కినట్టు ఎక్కడి అవయవాలక్కడ స్పష్టంగా నిలిచివున్నాయి. కళ్ళు పెద్దవి. అదెప్పుడు తెలిసిందంటే బాత్‌రూమ్ లోంచి బయటికి వస్తూ నా వేపు ఒక్క చిరునవ్వు విసిరి లోపలికి వెళ్ళిపోయినప్పుడు. నేననుకున్నట్లు చీరె చుట్టుకుని రాలేదు సుబ్బులు. నిక్షేపంలా కుచ్చిళ్ళు పోసి కట్టుకుని మరీ బయటపడింది. నుదిటిమీద, వీపు మీద నీటి చుక్కలు చిందరవందరగా అల్లుకున్నాయి. నా ఊహని పసిగట్టి నవ్విందా? లేక నేను ముందు చోటు చేశానని కృతజ్ఞతతో ప్రసాదించిన చిరునవ్వా అది? తికమకతో రేకుల బాత్ రూంలో దూరాను. సబ్బు పెట్టి మరిచిపోయింది. సబ్బు మెత్తగా, కొత్తగా ఇంకా సువాసనగా ఉంది.

మిగతా విషయాలు కాఫీ ఇస్తూ అమ్మ చెప్పింది. సుబ్బులు ఇల్లు గలవారి మనుమరాలు. సుబ్బులు తండ్రి మద్రాసు దగ్గర ఏదో చిన్న రైల్వేస్టేషనులో స్టేషను మాష్టరుగా పనిచేస్తున్నాడట. అమ్మాయికి పెళ్ళిసంబంధాలు చూడడానికి తాతయ్య వెంట బెట్టుకు వచ్చాడట. అంటే చాలారోజులు ఉంటుందన్నమాట. నాకు చాలా సరదా వేసింది. ఈసారి వేసవి సెలవులు ఉత్సాహంగా గడచిన సూచనలు కనిపించాయి.

ప్రతిసారీ మద్రాసు లాంటి మహానగరాన్ని వదిలి వేసవి అంతా విజయనగరంలాంటి చోట గడపాలంటే చాలా దిగులుగా ఉండేది. కానీ నాన్నగారు ఊరుకోరు. "సెలవల్లో కూడా హాస్టల్ ఖర్చులు దండుగ. నాతోపాటు ఫారెస్ట్ బంగళాలో ఉండొచ్చు. వచ్చెయ్" - అని పదేపదే ఉత్తరాలు వ్రాస్తారు. నాన్నగారు గజపతినగరం సమీపంలోని దేవుపల్లి కొండల దగ్గరి అడవిలో వంటచెరుకు, కలప కంట్రాక్టు చేస్తారు. కాపురం విజయనగరంలో. మొదట్నుంచీ ఇక్కడ ఉండడం వల్ల దేవులపల్లికే మార్చడానికి ఆయన అంగీకరించలేదు. ఆయన పట్టుదలకి తిరుగులేదు. నాకు ఎప్పటికప్పుడు విజయనగరం కొత్త. ఏదో పరాయి స్థలానికి వచ్చినట్టనిపిస్తుంది. నాన్నగారి చదువు మద్రాసులో సాగింది. నన్నూ అక్కడే చదివించాలని పట్టుబట్టారు. దగ్గర్లో ఉన్న వాల్తేరు ఆయనకు నచ్చలేదు. స్వయంగా వచ్చి బియ్యేలో చేర్పించేదాకా ఆయనకి తృప్తికలగలేదు. వేసవి సెలవలు వస్తున్నాయంటే నాకు విపరీతమయిన బెంగ. మంచి ఇంగ్లీష్ సినిమా చూడాలంటే వీలుండదు. మద్రాసు ఇడ్లీకి మొహం వాచిపోతాను. మెరీనా బీచ్, మూర్ మార్కెట్ షికార్లూ - వాటి సంగతి సరేసరి! అయితే ఈసారి కాస్త మెరుగ్గా ఉండేట్టుంది పరిస్థితి. "మరో రెండున్నర నెలలపాటు ఈ అమ్మాయికి సంబంధం కుదరకుండా చూడు భగవంతుడా!" అని మనస్సులో అనుకున్నాను.

పైజమా, లాల్చీవేసుకుని డాబా మీదకి వచ్చి నిలబడ్డాను. మేం ఉంటున్న ఇల్లు పెద్దదే అయినా చాలా అవకతవకగా కట్టారు. ఇల్లు గలవాళ్ళు ఉంటున్నది పెద్దవాటాయే అయినా ముందు నడవలోంచే వాళ్ళింట్లోకి తోవ. నడవంతా ఇద్దరికీ ఉమ్మడి. నడవలో ఓ పక్కకి డాబా మీదకి మెట్టు ఉన్నాయి. పక్కనే మరో గదికి పునాదులు తీసి వదిలేసిన ఎత్తు చపటా, పక్కనే బొగడ చెట్టూ, ఓ చిన్న బీరపాదూ ఉన్నాయి. చిన్న వీధి అది. ఎదుటి వరుసలో ఉన్న ఇళ్ళు కూడా "ఇక్కడేం జరుగుతుందో ?" అని చూడ్డానికి ముందుకు తోసుకొచ్చినట్టు కూరుకుపోయి ఉంటాయి. మా ఇంటికి ఒక పక్క చిన్న వీధి. మరో పక్క ఒక ఇంటికి సరిపడే ఖాళీస్థలం. ఎవరో కొనుక్కొని, ఇల్లు కట్టలేకో, అనవసరమనుకునో వదిలేశారు. సాయంకాలమయిందేమో పిల్లలు అక్కడికి చేరి ఆటలు ప్రారంభించారు. చూస్తూ నిలబడ్డాను. దృష్టి అటువేపు ఉన్నా ఆలోచన ఇల్లంతా పచార్లు చేస్తూంది. కళ్ళతో పెరడంతా వెదుకుతున్నాను. బొగడచెట్టుకీ, మునగచెట్టుకీ మధ్య తెల్లటి తడిచీరె గాలికి రెపరెపలాడుతోంది.

సుబ్బులుకి ఇక్కడెవరూ స్నేహితున్నట్లు లేరు. నా పరిస్థితిలోనే పడ్డట్టుంది. ముసలి దంపతులతో ఆ అమ్మాయికి రోజంతా ఎలా పొద్దుపోతుందో! జాలేసింది. ఆమె ఏదో కష్టాల్లో ఉన్నట్టూ, వెంటనే ఆమెకి నా అవసరం ఉన్నట్టూ ఊహించుకున్నాను.

ఈ ఊళ్ళో హనుమంతరావని నా చిన్ననాటి స్నేహితుడు ఒకతను ఉన్నాడు. ఇంజనీరింగు పరీక్ష పాసయి కూడా - వాళ్ళ నాన్నపోగానే తప్పనిసరిగా షాపులో కూర్చోవలసి వచ్చింది. బజార్లో పెద్ద బట్టల దుకాణం. వస్తున్నానని వాడికి ఉత్తరం రాశాను. వస్తాడేమోనని చాలా సేపు ఎదురుచూస్తూ నిలబడ్డాను.

ఎదురుగా అడ్వకేటు సోమయాజులుగారి బోర్డు కనిపిస్తోంది. ఆ బోర్డు వెనక కొంచెం దూరంగా, కటకటాల మధ్యనుంచి టేబులు వెనక ఎవరో కూర్చుని ఉన్నారు. ఇక్కడికి మనిషి గుర్తుతెలియడంలేదు. ఆయన చుట్టూ నలుగురయిదుగురు ఉన్నట్లున్నారు. నీళ్ళతో ఏదో బిగ్గరగా మాట్లాడుతూ మధ్య మధ్య నవ్వుతున్నారు. వాళ్ళంతా కేవలం కోర్టులోనే కూర్చున్నట్లు నిష్టగా కూర్చుని ఆయన మాటలు వింటున్నారు. ఆయన ఇంటిమీద కాంగ్రెసు జెండా, మసకచీకటి వేళయినా, ఎగురుతూ కనిపిస్తూనే ఉంది.

మూడిళ్ళవతల ఇంటిముందు ఓ పెద్ద లారీ ఆగివుంది. ఆ లారీ డ్రైవరు కాబోలు, కాకీ బట్టలతో ఉన్నతను లారీ తనేదన్నట్లు ఠీవిగా ఇంటి అరుగు మీద కూర్చుని బీడీ వెలిగించుకుంటున్నాడు. ఆ ఇల్లు చిన్నది. కనీసం లారీ విలువైనా చెయ్యదు. అదిన్నీ అతని జీవితంలో సంపాదించుకున్న ఆస్తిలాగా లేదు. అతనికి అందమయిన కూతురున్నట్టుంది. ఆ పిల్ల గ్లాసులో కాఫీ తీసుకొచ్చి ఇస్తే త్రాగి గ్రరున త్రేన్చి, తెలిసిన రోడ్డు మీద ప్రయాణం చేస్తున్న వాడిలాగ నిశ్చలంగా తల వెనక్కి చేరేసి బీడీ పీలుస్తున్నాడు. అతణ్ణి చాలాసార్లు చూశాను నేను. దుర్గారావు.. ఒకటి రెండుసార్లు మా నాన్నగారి కాంట్రాక్టు పనులకి వచ్చాడు కూడా. కుటుంబం పెద్దది. వంశమూ పేరున్నదే అయితే వంశపార్యంగా ఆ ఇల్లూ, తెలివితేటలూ వచ్చాయి. డ్రైవరు ఉద్యోగం మాత్రం సంపాదించుకున్నాడు. అతని భార్య కూడా దాదాపు తను డ్రైవుచేస్తున్న లారీ అంత ఉంటుంది. అతని జీవితమూ ఎక్కువసార్లు గతుకుల రోడ్డుమీదే పోతూ ఉంటుంది. కాని వాటినెలా దాటుకుపోవాలో దుర్గారావుకి తెలుసు. ఏ రోడ్డు మీద బండిని ఏ గేరులో నడపాలో అతనెప్పుడూ మరిచిపోడు. ఎలా చూశాడో అంత దూరం నుంచే నన్ను చూసి రెండు చేతులూ ఎత్తాడు. నేను నమస్కారం చేశాను. చీకటి పడుతోంది. నేనింక అక్కడే నిలబడితే కబుర్లు వేసుకోవడానికి దగ్గరికి వస్తాడని తెలుసు. అందుకని మరి జాప్యం చెయ్యకుండా మెట్లు దిగాను. మెట్ల దగ్గర మరీ చీకటిగా ఉంది.

చివరి మెట్టు మీద ఉండగానే సుబ్బులు కనిపించింది. ప్రమిదలో దీపం వెలిగించుకుని చేతిని చాటుచేసి పెరటి వేపు వెళుతోంది. పెరటివేపు వెళ్ళాలంటే నడవలోంచి పక్కగా పోవాలి. మెట్లు ఊపుగా దిగుతున్న విసురుకి ఆమె చేతిలోని దీపం గిజగిజలాడింది. చాలా శ్రమపడి మలిగిపోకుండా నిలబెట్టింది జ్యోతిని. స్థిమితంగా గోడకి ఆనుకుని నిలబడి 'సారీ' అన్నాను. తలెత్తి చూసింది. దీపం వెలుగులో ఎర్రటి బొట్టు కొట్టొచ్చినట్టు కనిపించింది. మళ్ళీ అనుకున్నాను. సుబ్బులు అందగత్తేం కాదు. కాని చాలా నిండయిన మనస్సు. అనుకోకుండా "చూడండి" అనిపిలిచాను. ఆమె ఆగిపోగానే గుండె ఝల్లుమంది. ఏం చెయ్యాలో తోచక, ***ఆడవాళ్ళ మౌనంలో అంత పెద్ద ప్రశ్న ఉన్నదని నాకు తెలియదు.*** ఒక్క క్షణం తడువుకుని "మీ సబ్బు బాత్ రూంలో వదిలేశారు" అన్నాను హఠాత్తుగా.

ఒక్క క్షణం నా వేపు విచిత్రంగా చూసి ఫక్కుమంది. "అదక్కడే ఉంటుంది" అంటూ దీపం నెమ్మదిగా కదిలిపోయింది.

హనుమంతరావుని కలిసి ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది. అప్పటికే భోజనాలు ముగించుకుని వసారాలో అరుగు మీద కూర్చున్నారు ఇంటాయన శోభనాద్రిగారు "ఏంవోయ్ పంతులూ! (కుర్రాళ్ళందరినీ అలా పిలవడం ఆయనకి సరదా) ఎప్పుడొచ్చావ్? మద్రాసు ఎలా ఉంది? అరవ్వాళ్ళు ఏమంటున్నారు?" అంటూ.

నవ్వాను. గుమ్మం పట్టుకు నిలబడి ఒక్కొక్క ప్రశ్నకే సమాధానం చెప్పాను. అడిగారు కాని ఆయనకి నా సమాధానాల మీద ఆసక్తి లేనట్లు అర్థమవుతోంది, కాని ఆయన పక్కన కూర్చున్న వ్యక్తికి నా మీద ఉన్న ఆసక్తిని కనిపెట్టాను.

"ఉంటావా?" అన్నారు చివరికి.

"ఆఁ. ఈ సమ్మర్ అంతా ఉండాలి" అన్నాను. అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు బాసినపట్టు సడలించి, పక్కనున్న వ్యక్తి వేపు తిరిగి "ఒరే రాజూ! పొగాకు కాడ ఇంట్లో మరచిపోయినట్టునాను. ఒకసారి లేచి అందుకో." అన్నారు.

ఆ మాట వినీ వినడంతో ఆ పని చెయ్యడం ఓ మహద్భాగ్యంగ లేచాడు అతను. సరాసరి లోపలికి నడిచాడు. "సుబ్బులూ, పొగాకు కాడ ఎక్కడ?" అని లోపల కేకలెయ్యడం తెల్సింది.

శోభనాద్రిగారు సహజంగా ఎవరితోనూ మాట్లాడే రకం కాదు. అనవసరంగా ఒకరితో జోక్యం కల్పించుకోరు. తూచి తూచి మాట్లాడుతారు. చాలా జాగ్రత్తగా మనిషిని పరిశీలించి మరీ చొరవ ఇస్తారు. గోల్డ్‌ఫ్రేం కళ్ళద్దాల వెనక కళ్ళు ఎదుటి వ్యక్తిని నిరంతరం పరిశీలిస్తూనే ఉంటాయి. ***కొందరి మాటలు పలకరిస్తున్నా, కళ్ళు ప్రశ్నిస్తూనే ఉంటాయి. పెదవులు చిరునవ్వు నవ్వినా, కళ్ళు కసిరినట్టుంటాయి. ముఖంలో ఒక ఇంద్రియానికీ, మరొక ఇంద్రియానికీ పొత్తు కుదరదు.*** అలాంటి వ్యక్తి శోభనాద్రిగారు.

రాజు దూరమయాడని రూఢిగా తెలిశాక కాస్త ముందుకు వంగి "నీతో కొన్ని విషయాలు మాట్లాడాలోయ్" అన్నారు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. నాతో మాట్లాడవలసిన విషయాలేమిటా అని. మా నాన్నగారి వ్యాపారం పెద్దది. ఈ 'రాజు' అనే అతనికి రికమెండేషనా? అదయితే నాకంటే మా నాన్నగారి దగ్గర ఆయనకే చొరవ ఎక్కువ ఉండొచ్చు.

చరచరా వచ్చాడు రాజు, పొగాకు కాడ పట్టుకుని ద్రౌపదిని ఈడ్చుకు వస్తున్న దుశ్శాసనుడిలాగ.

"నువ్వు చుట్టలు తగ్గించాలి తాతయ్య - ఈ వయస్సులో ఆరోగ్యం పాడయితే మరి బాగుపడేది లేదు" అంటూ దాదాపు శోభనాద్రిగారి ఒళ్ళో చతికిలబడ్డాడు. నేనతన్ని గమనిస్తున్నాననే దృష్టి ఉంది. చూడగానే నేనతన్ని గమనించాలనే దృష్టి కూడా అతనికి ఉన్నట్టు తోచింది.

"పోరా, నువ్వు నాకు చెప్పేదేమిటి? నా చుట్టల అలవాటంత వయస్సులేదు నీకు' అని శోభనాద్రిగారు విదిలించారు. ఆ మాటలకి అది తనే అన్నంత నిండుగా విరగబడి నవ్వాడు రాజు "ఫో తాతయ్యా నువ్వలాగే అంటావు" అంటూ.

"నువ్వు భోజనం చేసి రావోయ్. కబుర్లు చెప్పుకుందాం" అన్నారు శోభనాద్రిగారు తీరుబడిగా చుట్ట వెలిగిస్తూ.

ఏమయినా, ఓ రెండుగంటల క్రితం బాత్‌రూం దగ్గర ప్రారంభమయిన సంతోషమేదో జావకారిపోయింది. ఎంచేతనో ఈ 'రాజు' ఈ ఇంట్లో ఉండడం నాకంత నచ్చలేదు. అంత అందమయిన అమ్మాయికి వీడొక దుర్మార్గుడయిన తమ్ముడిలాగ కనిపించాడు. అతని వల్ల నాకు జరిగిన, జరగబోయే అపకారమేమీ లేదు. అయినా సుబ్బులుకి ఇలాంటి తమ్ముడెందుకుండాలి? ఇతనెప్పుడొచ్చాడసలు? ఆ అమ్మాయితో వచ్చినట్లు చెప్పలేదే! ఆలోచిస్తూ లోపలికి వచ్చాను.

నన్ను చూసి అమ్మ అందుకుంది "ఊరిలో ఉన్నన్నాళ్ళయినా ఇంటిపట్టున ఉండవు కదా! ఎక్కడికి వెళ్ళావు ఇంతదాకా?" అంటూ మాట్లాడకుండా కాళ్ళు కడుక్కోందుకి పెరట్లోకి వచ్చాను. పెరటి దీపం మసిబారి ఉంది. చెట్ల సందుల్లో ఎక్కడో కీచు రాయి అరుస్తోంది. మల్లెల వాసన గుప్పుమంది. నూతి దగ్గర బావిలోకి నీళ్ళు తోడుతోంది సుబ్బులు. అవసరం లేకపోయినా అటువేపు నడిచాను.

"నన్ను చూసి పక్కకి తప్పుకు నిలబడి చేద అందించబోయింది. నేను అందుకోలేదు. "మీ కభ్యంతరం లేకపోతే బాల్చీలో నీళ్ళు తీసుకుంటాను" అన్నాను.

"అయ్యో! దాని కేం!" అంది, బాల్చీ ముందుకి జరుపుతూ.

చల్లటి నీళ్ళు కాళ్లకి మెత్తగా తగిలాయి. వచ్చేస్తూ ఎంతోసేపటికి ప్రశ్న కూడదీసుకుని అడిగాను. "తమ్ముడేం చేస్తుంటాడు?" అని.

నీళ్ళు తోడుతున్నదల్లా తెల్లబోయి ఆగినట్టు గ్రహించాను వెలుగులో.

"ఎవరూ?" అంది.

"బయట అరుగుమీద మీ తాతయ్య దగ్గర కూర్చున్నతను" వివరించి చెప్పాడు.

వెంటనే ఆమె కంఠంలో విసుగుదల తెలిసింది. "అతను నా తమ్ముడేం కాదు ఎదురింటి సోమయాజులు గారి మేనల్లుడు - సత్తిరాజులు. చిన్నప్పుడు నాతో చదువుకొన్నాడు. ఈ మధ్యే వాళ్ళ ఊరునుంచి వచ్చాడు. తాతయ్య దగ్గరకు చనువుగా వచ్చి కబుర్లు చెప్పి పోతుంటాడు" కథంతా చెప్పింది నీళ్ళు తోడుతూనే.

ఆ మాటల్తో హఠాత్తుగా మల్లెపందిరి మీంచి గాలితెర వచ్చినట్లు ప్రశాంతుణ్ణయ్యాను.

"అమ్మయ్య! బ్రతికించారు... అలా చెప్పండి" అనేశాను అనుకోకుండా. ఆమె ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూసింది. నన్ను బ్రతికించడానికి ఈ విషయం ఎలా కారణం అయిందా అని నాలిక కొరుక్కున్నాను. కాని నోరు జారిపోయింది. ఆమె ముఖం చూడలేక గబగబా ఇంట్లోకి వచ్చేశాను.

తర్వాత ఇంక సుబ్బులు నీళ్ళు తోడిన శబ్దం వినిపించలేదు నాకు.

## 2

నేను భోజనం చేసి వచ్చేసరికి రాజు వెళ్ళిపోయినట్టున్నాడు. శోభనాద్రిగారు చుట్టకాల్చుకుంటూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. నన్ను చూసి "రావోయ్‌రా" అంటూ చోటు చూపించారు. నా మనసెంతో తేలిగ్గా ఉంది. ***నా కిష్టం లేని వ్యక్తి, నాకిష్టమయిన వ్యక్తికి ఏమీకాడన్న ఆలోచన*** మనసు తేలిక పరిచిందనుకుంటాను. ఆ తృప్తి ఎలాగూ మిగిలింది కనుక, రాజు మాటని ఒకసారి సమర్థిస్తూ మాట్లాడాలనిపించింది.

"మీరు చుట్టలు మానేస్తే మంచిదేమో, అతనెవరో మంచిమాటే చెప్పాడు" అన్నాను ఎలాగో సంభాషణ ప్రారంభించాలి కనక.

నన్నంత సులువుగా తోసిపారేయలేదు. ఒక్క చిరునవ్వు నవ్వి "నా చుట్టలకి చాలా కథ ఉందోయ్. ఇరవయ్యారేళ్ళనాడు పోలీసు ఠాణాలో పనిచేసే రోజుల్లో మాకో సర్కిలుండేవాడు. అఖండుడు. చెయ్యెత్తితే మరింత ఉండేవాడు. దిబ్బకొక్కు లాగ ఉండేవాడు. కోరమీసాలు. నవ్వినా కసిరినట్టే ఉండేది. ఆయన్ని చూస్తే మా అందరికీ వణుకుగా ఉండెది. దొంగలకీ, ఉద్యోగులకీ ఒక్కలాగే గుండెల్లో నిద్రపోయేవాడు ఆ ముండాకొడుకు. వాడు ఆఫీసుకి వచ్చాడంటే వణుకు. ఆపాదమస్తకం వణికిపోయేవాళ్ళం. నాకయితే ఉద్యోగంలో చేరిన కొత్తేమో, పళ్ళు కూడా బిగదీసుకుపోయేవి. 'శోభనాద్రీ' అని అరిచాడో నవనాడులూ క్రుంగిపోయి, లాలాజలం ఆరిపోయేది. నా బాధని ఆశీర్వాదం అనే హెడ్డు కనిపెట్టి ఈ చుట్ట అలవాటు చేశాడు. ఆయన ముందున్నప్పుడు ఎలాగూ మానక తప్పదనుకో. కాని ఆయన లేనప్పుడు నిండుగా చుట్ట అంటించుకుని కూర్చునేవాడిని. అప్పుడు దీని రుచి బాగా మరిగాను. మరో రెండేళ్ళకి అతను బదిలీ అయిపోయేడు గాని, చుట్ట అలవాటు వదలలేదు."

గతం నిండుగా, హాయిగా తోచినట్టుంది. ఒక్కక్షణం మళ్ళీ వెనక్కిపోయి ఆలోచనల్లో ఉండిపోయారు శోభనాద్రిగారు. అంతలో తేరుకుని "అసలు నాకు రైల్వేలో చేరాలని మొదటినుంచీ కోరికగా ఉండేది.కాని మా ఆవిణ్ణి పెళ్ళి చేసుకున్నాక పోలీసు శాఖలో చేరడం మంచిదనిపించింది. పదిమంది మీద అజమాయిషీ చేయడం ఆఫీసులో చేతనయ్యాక ఇంట్లో ఈ ఒక్కవ్యక్తి మీదా అజమాయిషీ చేసి బ్రతకగలిగాను" అని ఆగారు.

" అసలు ఆడవాళ్ళంతా అంతేనోయ్. ఆ రోజుల్లో ఈవిడ చాలా అందంగా ఉండేదని మోజుపడి పెళ్ళి చేసుకున్నాను. అత్తవారిల్లు ఆ ఊరే కదా అని వాళ్ళింట్లో మకాం పెట్టాను. నా ఉద్యోగం బదిలీ అయినా అక్కణ్ణుంచి ఊడిరానంటుంటే? పోనీ, ఉన్న రోజుల్లో సుఖపడ్డామా అంటే అదీ లేదు. 'రాజ్యం' అని భుజం మీద చెయ్యి వెయ్యబోతే మా వదినగారి పిల్లలూ, మా మరదలు పిల్లలూ చుట్టూముట్టేసేవారు. ఎందుకలా చేసేవని కేకలెయ్యబోతే నలుగురి మధ్యకీ పారిపోతుంది. నేనేదో ప్రాణం తీయబోతున్నట్లు. ఒకటి చెపుతానోయ్. పెళ్ళాన్ని లాలించటం మాట ఎలా ఉన్నా నోరారా దండించనయినా దండించలేని కాపురంలో సుఖం లేదు. మామగారు పోయేవరకూ నాకీ బాధతప్పలేదు. ఆయనపోయాక మా ఆవిణ్ణి దండించడానికి ఓపికా పోయింది. ఇప్పుడు ఎవరిమీదయినా గట్టిగా కోపం వస్తే ఇదిగో ఈ చుట్టకొసను కటుక్కున కొరికి తీర్చుకుంటాను. అంతేకానీ? కోప్పడితే ఎవరు పడతారు? కట్టుకున్న పెళ్ళామే పడకపోయాక! " నవ్వబోయి దగ్గువచ్చి ఆగిపోయారు.

"తీరా నన్ను పిలిచి చెప్పదలచుకున్నదిదేనా?" అనుకుంటూ కూర్చున్నాను. చెప్పబోయే విషయం అంతలో గుర్తుకొచ్చినట్టు నా వేపు తిరిగి "చెప్పొచ్చేదేమిటంటే నేను సాధించాలనుకున్నది మావాడూ సాధించాడు. అవడానికి స్టేషను చిన్నదేననుకో. మద్రాసు దగ్గర ఏదో చిన్న స్టేషనుమాస్టరు. మన జెండా ఊపడం మీద అన్ని వందలమంది ప్రయాణం ఆధారపడి ఉండడం ఎంత తమాషాగా ఉంటుందో చూడు. వాణ్ణి పెళ్ళిలో పసుపుబట్టల్లో చూసినప్పటికంటే... రైలు స్టేషనులో యూనిఫారంలో చూసినప్పుడు ఎక్కువ సరదా పడ్డాడనుకో! మరి వాడి కూతురే మా సుబ్బులు నీకు తెలీదు కదూ? మొన్ననే వచ్చింది. ఉండు పిలుస్తాను." అంటూ కేకేశారు.

పిలుస్తున్నప్పుడు ఆ పేరంటే, ఆ పేరున్న వ్యక్తంటే ఆయనకెంత ఆప్యాయతో అర్ధమయింది. నేనాయన్ని ఆశ్చర్యంగా గమనించడం చూసి "మా అమ్మ పేరు. అందుకని ఇదంటే నాకెంతో ఇష్టం. కొంచెం మా కోడలు పోలిక. మా కోడలు నా మనవరాలేననుకో. మా అమ్మాయిని బావమరిదికే ఇచ్చాను. అందుకనే కాస్త ఒళ్ళు చేసింది. కాని వయస్సు తక్కువే. చాలా చురుకయినది."

"అమ్మా సుబ్బులూ" అని మళ్ళీ పిలిచారు.

సుబ్బులు అక్కడికొస్తుందనేసరికి ఆ వాతావరణమంతా బరువెక్కినట్టనిపించింది. ఒక్క క్షణం నిశ్శబ్దంగా నిరీక్షణాభారంలో మాట్లాడలేకపోయాను. ఇంతలో సుబ్బులువచ్చింది. సాయంకాలం కోసిన మల్లెలు మత్తుగా జడలో నిద్రపోతున్నాయి. చేతిలో మరో తమలపాకు వంపులు తిరుగుతోంది.

"ఏం తాతయ్యా!" అంటూ స్థంభం పట్టుకు నిలబడింది.

ఆమెవేపు గర్వంగా చూశారు శోభనాద్రిగారు క్షణం. అంతలో నా వేపు తిరిగి "ఇలాంటి మనవరాళ్ళను చూస్తుంటే తొందరగా ముసలాళ్ళమయిపోతేనే ఆనందంవుందనిపిస్తోందోయ్. ఇప్పుడే ఒప్పేసుకుంటున్నాను. నా కొడిక్కింత అందమూ లేదు. చురుకుదనమూ లేదు. అంతా వాళ్ళమ్మ పోలికే." అన్నారు.

సుబ్బులుకి సిగ్గుపడడం చేతకాదు. పెదవుల అంచుల నుంచి చిరునవ్వు నవ్వి తన స్థంభానికి చేరబడి నిలుచుంది.

"ఈయన మన భావనారాయణ గారి అబ్బాయమ్మా. మద్రాసులో బియ్యే చదువుతున్నాడు. చదువు చదువుకోసమే కాని ఇతనికి వాళ్ళ నాన్నగారి కాంట్రాక్టు చాలు" అంటూ పరిచయం చేశారు.

ఆ క్షణంలో ఆమెకు ఆ మాత్రం ఆసక్తి కలిగించడం నాకు సంతోషమయింది. ఆ మాటలకి నా వేపు ఆశ్చర్యంగా చూసి "మద్రాసులో చదువుకుంటున్నారా?" అంది సుబ్బులు.

నాకెంతో తృప్తి కలిగింది. మనస్సులో మా నాన్నగారికి కృతజ్ఞతలు పలికాను.

"అవును, క్రిష్టియన్ కాలేజీలో" అన్నాను.

"మావాడు ఉన్నచోట ఉండక అమ్మాయి చదువుపాడయింది కాని, చదువుకుంటే ఈ పాటికి బియ్యేలో ఉండేదే" అన్నారు శోభనాద్రిగారు చుట్ట తిప్పుతూ.

"పోనీ, సంగీతం నేర్పించకపోయారా? మద్రాసుకి దగ్గరేగా! బాగా ఒంటబట్టేదేమో` అన్నాను.

"ఆ అక్కడికీ ఇంట్లో ఉన్న పాత హార్మోనియం మెట్లు బాదుతూంటుంది. సంగీతం ఒంటబట్టలేదు. కాని మద్రాసు వేపు నీరు ఒంటబట్టింది. అంత చిన్న వయస్సులో మరీ ఇరవై రెండేళ్ళదానిలాగ కనిపిస్తుంది" అన్నారు నవ్వుతూ.

"నాకు సంగీతం రాదు, ఏంరాదు. ఫో తాతయ్యా!" అంది.

"అన్నట్లు, చెప్పడం మరిచానోయ్. కందిపప్పు పచ్చడి చాలా బాగా రుబ్బుతుందోయ్."

"ఏమిటి తాతయ్యా, వేళాకోళం" అంది తాతయ్య భుజం చెయ్యివేసి ఊపుతూ.

ఆ చెయ్యి అలాగే పట్టుకుని "పెళ్ళి సంబంధాలు చూడవలసిన సమయం ఎలాగూ వచ్చింది కదా తల్లీ నీ అర్హతలన్నీ ఒకసారి గుర్తుచేసుకోనీ"

అనుకోకుండా ఓ మాట అనేశాను. "వేరే అర్హతలెందుకు? ఆ ముఖమే ఒక పెద్ద అర్హత."

అంతే.

"మీరూ తాతయ్యతో కలిశారా?" అంది నా వేపు కోపంగా చూసి

*కోపంగా చూడడం, కోపాన్ని అందంగా చూపడం* సుబ్బులకి బాగా చేతనవును.

నా మాటలకి చప్పట్లు చరిచారు శోభనాద్రిగారు. "భలే భలే! ఆ మాట ఒప్పుకునే అబ్బాయి కోసమే ఎదురుచూస్తున్నానోయ్. ఆ శుభముహూర్తం ఎప్పుడొస్తుందో కాని"

"చూసినా నేను చేసుకోను ఫో" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

ఆ మాటలు మామూలుగా ఆ వయస్సు అమ్మాయిలు అనేటట్టు లాంఛనంగా లేవు. కంఠంలో నిర్ధారణా, పట్టుదలా చూసి ఆశ్చర్యపోయాను. చేసుకోక ఏం చేస్తుంది?

ఆ అమ్మాయి వెళ్ళాక చాలా సేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు శోభనాద్రిగారు. నాతో ఏం చెప్పాలని పిలిచారో అది మరచిపోయారని అనుకున్నాను. కాని మరచిపోలేదు. ఆ విషయం వెంటనే అందుకున్నారు" ఇది చెప్పాలనే కూర్చోమన్నాను నిన్ను" అంటూ.

"వాడేమో ఉద్యోగం పట్టుకుని ఊళ్ళ వెంబడి తిరుగుతున్నాడు. సరుకుని బజార్లో తీసుకొచ్చి పెడితేనే కదా బేరం వచ్చేది? మా సుబ్బులు ఈ ఇంట్లోనే పుట్టింది. ఈ ఇంట్లోనే పెరిగింది. మరి ఇక్కడ ఉంచుకుని, తెలిసిన సంబంధమేదైనా చెయ్యాలని తలంపు" అన్నారు.

నేను సమాధానం చెప్పలేదు. వింటున్నాను.

"మరి ఈ విషయం నీ చెవిని వేసి నీ సహాయం కోరాలనుకుంటున్నాను ఏమంటావు?" అన్నారాయన కాసేపటికి.

నేను నవ్వేశాను. "ఇందులో నా సహాయం ఏముంటుందండీ?" అని నీళ్ళు నమిలాను.

నువ్వు కాలేజీకి వెళుతూ వస్తుంటావు. అక్కడ మనవాళ్ళు చాలామంది ఉంటుంటారు. మనవూరివాళ్ళు, చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళు ఉండే ఉంటారు. నీకు నచ్చినవాళ్ళని ఏరిపెడితివా మిగతాపని నేను చూసుకుంటాను"

"చుట్టుపక్కల వాళ్ళెవరో మీకు తెలీదా? నేను చెప్పాలా?"

"అలా కొట్టిపారెయ్యకు. అక్కడే ఉంది తమాషా. నాలాంటి వాళ్ళకు వంశం. స్థితిగతులు అర్థమవుతాయి గాని, అబ్బాయిల గుణగణాలు తెలిసిరావు. తీరా మూడుముళ్ళూ పడ్డాక వాడు వట్టి తిరుగుడు మనిషని తేలితే గుండెబాదుకోవాలి. అందుకని నీ సహాయం అవసరం. ఊరికే మనస్సులో ఉంచుకో. అమ్మాయి బంగారపు బొమ్మ చూశావు కదా!" అన్నారు.

శోభనాద్రిగారు చాలా లౌక్యులని మొదటిసారిగా అర్థం చేసుకున్నాను. భోళాగా మాట్లాడే ఆయన ధోరణి కూడా లౌక్యంలో ఒక భాగమేనేమో. హఠాత్తుగా నాకో ఆలోచన తట్టింది. ఈ విషయమంతా నాతో చెప్పడానికి కారణం మొదట నన్నే ఆకర్షించడానికా? ఒక్క క్షణం ఆశ్చర్యంతో, ఆనందంతో కదిలిపోయాను. ఎందుకు కాకూడదు? సూటిగా అడగలేక తిప్పిచెప్పి పని సాధిస్తున్నారు.

ఇంకా ఏదో చెప్పేవారే - ఈలోగా వీధివేపు కిటికీ దగ్గర ఆయన భార్య గొంతు వినిపించింది. "ఏమండీ! ఇలా రండీ..!" అంటూ.

"ఏమిటే అదీ?" అన్నారు లేవకుండానే.

"అబ్బ! రమ్మంటుంటే!" అందావిడ.

ఇక తప్పక లేచారు. "ఈ ఆడవాళ్ళతో ఉన్న చిక్కే ఇదయ్యా. ఇవాళ తారీకేమిటని అడగటానికి మహా పెద్ద రహస్యం చెప్పినట్లే కేకేస్తారు.... వస్తానుండు" అంటూ లోపలికి నడిచారు.

ఇంత రాత్రికి చల్లగాలి వీచింది. ఎదురింట్లో సత్తిరాజులు సినిమా పాట ఏదో గొణుగుతూ ముందు గదిలో పచార్లు చేస్తున్నాడు. కిటికీ తలుపు తీశాడు. అతని దృష్టి ఈ ఇంటివేపే ఉన్నదని పసిగట్టాను. ఇటు చూడనిచ్చి చెయ్యి ఎత్తి అతనికి కనిపించేలాగ ఊపాను. ఒక్కసారి ఇటువేపు ఆశ్చర్యంగా చూసి ఏమనుకున్నాడో ఏమో కిటికీ తలుపు వేసేశాడు.

లోపలి గదిలో ముసలావిడ గొంతు తెలుస్తోంది. పైకిటికీ తీసి ఉందేమో మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. శోభనాద్రిగారిని చీవాట్లు పెడుతోంది. "మీరెప్పుడూ ఇలాగే చేస్తారు. ఇప్పుడెందుకీ భాగవతం? దాన్నిక్కడికి తీసుకువచ్చాక కూడా కాస్త స్థిమితంగా ఉండనివ్వరా ఏమిటి? కనిపించిన వాళ్ళందరితోటి చెపుతూంటే అది సిగ్గుతో ఏడుస్తోంది." అంది.

"నేనెవరితో చెప్పానే? అతనితోనేగా?"

"చాల్లెండి ఇకనయినా ఊరుకోండి." అందావిడ.

మరో రెండు నిముషాలకి తలగడ పట్టుకుని అరుగు మీదకి వచ్చారు శోభనాద్రిగారు.

"ఈ ఆడవాళ్ళతో అన్నీ చిక్కేనోయ్" అంటూ చతికిలబడ్డారు.

ఏమయిందని నేనేం అడగలేదు. "దాని పెళ్ళిగురించి నేనెవరి దగ్గరా ఎత్తకూడదట. అదేం రంభా, ఊర్వశా? వాళ్ళెవరో మన కాళ్ళ దగ్గరకి వచ్చి వాలడానికి, పదిమంది నోటిలో వెయ్యనిదే ఆడపిల్ల పెళ్ళి చెయ్యగలవాఁ? మంచి సినిమా చూడాలంటేనే పదిసార్లు పదిమందిని అడుగుతాం కదా?" ఇంకా ఇలా చెప్పేవారేమో కాని, పైకిటికీ ఉన్నట్టుండి దబుక్కున మూసుకుంది అంతే, శోభనాద్రిగారు చటుక్కున నోరు మూసుకున్నారు.

నాకు నవ్వొచ్చింది. ఆయన లౌక్యులు కారు. ***లౌక్యం తనకు బాగా తెలుసనుకునే అమాయకులు,*** ఎప్పుడూ ఆలోచనలతో ఇంతసేపు గడపలేదు నేను. కాని ఇవాళ్టితో ఆయన మంచి స్నేహితులయారు.

ఇక తర్వాత మా సంభాషణ సాగలేదు.

"మరి వస్తానండీ" అని నేనే లేచాను.




"ఆఁ ఆఁ. వెళ్ళి పడుకో. చల్లగా ఉంది. కాస్త ఇక్కడ దొర్లి ఏ రాత్రికో లోపలికి చేరతాను" అన్నారు నడుం వాలుస్తూ.

ఎందుకో ఈ సారి సెలవలు చాలా హుషారుగా గడుస్తాయనిపించింది. తలుపు తోసుకుని లోపలికి వచ్చాను. అమ్మ అప్పటికే గుర్రుపెట్టి నిద్రపోతుంది. మా గదికీ, వాళ్ళ గదికీ మధ్య అడ్డుగోడ మాత్రమే ఉంది. అదిన్నీ పూర్తిగా మీదివరకూ లేదు. ముసలావిడ ముందు వసారాలో పడుకున్నట్టుంది. నేను పక్క దులుపుకునే సమయంలో గోడ అవతల బరువుగా ఊపిరి తీసుకోనడం చెవికి తెలిసింది. కాస్త జాగ్రత్తగా విన్నాను.

సుబ్బులు ఏడుస్తున్నట్టుంది. సుబ్బులు అంత సెన్సిటివ్ అనుకోలేదు. ఆ మాత్రానికే అంత బాధపడవలసిన అవసరమేముంది? ***కొందరు ఆలోచనకు బెదిరిపోయి ఆచరణతో రాజీపడతారు. మరికొందరు చాలా గొప్పగా ఆలోచించుకుంటూ ఆచరణలో జారిపోతారు.*** ఆశ్చర్యపోయాను.

****

# 3

**మర్నాడంతా** సుబ్బులు కనిపించలేదు. అసలు ఆ రోజంతా ఆ దృష్టే నాకు లేకపోయింది. సెలవల్లో ఇక్కడికి వచ్చినప్పుడు నాన్నగారు నా కప్పగించే పని కొంత ఉంటుంది. ఫారెస్ట్ రేంజరు ఆఫీసుకి వెళ్ళి ఆ పని చక్కబెడుతూ ఉండాలి. అక్కడ నాకు చాలా మంది స్నేహితులు ఏర్పాడ్డారు. అప్పుడప్పుడు వాళ్ళ జీపుల్లో నెల్లిమర్ల వరకూ వెళ్ళి రావడం కూడా కద్దు. **పనిలేనివాడికి ఉన్నన్ని వ్యాపకాలు అన్నీ ఇన్నీ కావు.**

ఆ వేళ జీపులో తిరిగి వస్తూంటే చీకటి పడింది. కొబ్బరి తోటల మధ్య నుంచి ప్రయాణం చేస్తూ హఠాత్తుగా సుబ్బుల్ని గుర్తుచేసుకున్నాను. అర్ధం కాని క్రాసువర్డు ఫజిల్ విప్పడంలో ఉన్న ఆనందాన్ని అనుభవించాను. ఒక్క రోజు అనుభవంతో తెలిసిన సుబ్బుల్ని అర్ధం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ.

వచ్చేసరికి ఇల్లంతా నిర్మానుష్యంగా ఉంది. అసలే మనుషులు తక్కువ. అందులోనూ ఉన్నవాళ్ళే కనిపించటం లేదు. మా ఇంటి తలుపులు తాళం వేసి ఉన్నాయి. వసారాలో కుర్చీలో కూర్చున్నాను. ఇంతాయన భార్య తాళాలు తెచ్చి ఇచ్చింది. "మీ అమ్మ పురాణానికి వెళ్ళారు బాబూ! నిన్ను అవసరమయితే, భోజనం పెట్టుకు తినెయ్యమన్నారు. త్వరగానే వచ్చేస్తారట."

"చీకటి పడింది. ఒంటరిగా ఎలా వస్తుంది?" అని గొణుక్కున్నాను.

"అదేం ఫరవాలేదులే. కన్యకా పరమేశ్వరీ ఆలయం ఎంత దూరం? మా సుబ్బులు కూడా వెళ్ళింది. ఈ పాటికి ఇద్దరూ వస్తూనే ఉండాలి కూడాను" ఆవిడ వెళ్ళిపోయింది.

నా దృష్టంతా హఠాత్తుగా పురాణం మీదకు మళ్ళింది. ఇక కూచోలేక రోడ్డు మీదకు వచ్చి నడక సాగించాను. సగం దూరం నడవక ముందే అమ్మా, సుబ్బులూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. నన్ను ముందు సుబ్బులే పోలిక పట్టినట్టుంది. అమ్మ భుజం కదిపింది. నా వేపు కళ్ళతో సూచిస్తోంది. అమ్మ చూసి చాలా సంతోషించింది. **స్త్రీకి అండగా నిలిచే వ్యక్తిని చూస్తే చాలా గర్వంగా ఉంటుందనుకుంటాను.** నేనలా ఆమె కోసం రావడం చాలా సంతోషాన్ని కలిగించిందిలా ఉంది. దగ్గరయాను. "చిన్నప్పట్నుంచీ వాడంతే. నేను ఒక్క క్షణం కనిపించకపోతే వెదుక్కుంటూ వస్తాడు. నేనంటే ప్రాణం వాడికి" అంటూంది. కాస్త ఎడంగా నడుస్తున్నాను. మరో క్షణంలో ఇద్దరూ నన్ను మరచిపోయారు. భగవద్గీతను బోధించే కృష్ణభగవానుడు అర్జునుడి వైరాగ్యం, ఆత్మ - పరమాత్మ, పురాణం శాస్త్రులగారికి సంసారం ఉందా? ఈ రోజు పళ్ళెంలో ఆయనకెంత డబ్బు ముట్టి ఉంటుంది? ఇలాంటి విషయాలన్నీ సునాయాసంగా వాళ్ళ మాటల్లో దొర్లిపోతున్నాయి. సుబ్బులు అమ్మ చెప్పింది వింటూ మధ్య మధ్య అర్జునుడి అస్త్ర సన్యాసాన్ని గురించి తన అభిప్రాయాల్ని వెల్లడిస్తోంది. అందులోనూ ఐహిక - ఆముష్మికాలూ, జీవకర్మ, మోక్షం ఒకటి రెండుసార్లయినా తొంగి చూసి ఉంటాయి.

బట్టల షాపులోంచి అందమయిన జంట నాలుగయిదు పార్సెళ్ళు మోసుకుని కారు దగ్గరికి వస్తోంది. భార్య చాలా నాజూకుగా పచ్చగా పొట్లకాయలాగ ఉంది. అందమయిన బొమ్మకి ఉల్లిపొర కాగితం చుట్టినట్టు నీలిరంగు చీరె ఆమె శరీరానికి వేలాడుతోంది.

ఆమెకీ సుబ్బులుకీ పోలిక చూసుకున్నాను. సుబ్బులుకి అందంగా చీరె కట్టుకోవటం తెలియదు. అసలా దృష్టే లేదు. తెల్లటి శరీరం, అందమయిన కళ్ళు. చిన్న పెదాలూ మరిచిపోతే, ఆమె ఎవరి దృష్టిలోనూ పడవలసిన అవసరం లేదు. పైపెచ్చు ఆమె మాట్లాడే అర్జున విషాదయోగం వింటే మరీ ఆశ్చర్యం కలుగుతుంది. **ఎవరికయినా, వయస్సులో ఉన్న అమ్మాయిలో ఆధ్యాత్మిక దృక్పథం చాలా ఎబ్బెట్టుగా ఉంటుంది.** పద్దెనిమిదేళ్ళ అమ్మాయి వేదాంతం మాట్లాడడం అంతగా రుచించలేదు నాకు. నేను చాలా దూరంలో ఉన్నాననుకుంది గావును. చాలా చురుకుగా మాట్లాడుతోంది మా అమ్మతో.

హఠాత్తుగా రోడ్డుకి అటుపక్క సైకిలు మీద వస్తున్న వ్యక్తిని గుర్తుపట్టాను - సత్తిరాజులు! ఎందుకో అతనూ పురాణానికే వెళ్ళివస్తున్నాడనిపించింది. ఓ క్షణం అతణ్ణి ఏడిపించాలనే పిచ్చి కోరిక కలిగి రోడ్డు దాటి అటువేపొచ్చేసాను. నన్ను చూసి ఎంతో ఆనందించినట్టు "హల్లో సార్! మా సుబ్బులు ఇంట్లో ఉంటున్నారు కదూ మీరు?" అన్నాడు.

"మీ సుబ్బులు రాకముందు నుంచీ ఆ ఇంట్లోనే ఉంటున్నాం?"

మొదట తెల్లబోయి, గుక్కతిప్పుకోకుండా నవ్వాడు. సైకిల్ దిగి నడుస్తూ "భలేవారే మీరు!" అన్నాడు.

"పురాణం ఎలా ఉంది? భారత యుద్ధం పారంభమయిందా?" అన్నాను.

నిర్ఘాంతపోయాడు. అతని రహస్యమేదో నా చేతిలో దొరికిపోయినట్టూ ఆశ్చర్యంగా చూసి "నేను పురాణానికి వెళ్ళానని మీకెలా తెలుసు?" అన్నాడు.

సుబ్బుల్ని చూపిస్తూ "వాళ్ళు వెళ్ళారుగా, మీరూ వెళ్ళక పోతారా అని" అన్నాను. గ్రహించి తృప్తిగా నవ్వుకున్నాడు. ఆ మాటకి సిగ్గుపడతాడనుకున్నాను కానీ అలా అన్నందుకు సంతోషించాడు. "అసలు ఆ విషయమే మీతో మాట్లాడాలనుకున్నాను సార్. మీరు నాకో సహాయం చెయ్యాలి" అన్నాడు. నాకర్థం కాలేదు. తెల్లబోయి చూశాను.

ఉన్నట్టుండి నాతో అన్నాడు "నేను చాలా ధనవంతుణ్ణి తెలుసా? మా అమ్మ పోతూ ఆస్తంతా మా మామయ్య ఆధీనంలో ఉంచిపోయింది. లేకపోతే ఒక వెలుగు వెలిగేవాడిని. నాకొక్కటే సమస్య" అని ఆగాడు. యావద్భారతాన్నీ జయింపనెంచిన అశోకుడు దక్షిణాది పొలిమేరలు మిగిలిపోయాయని పడ్డ దిగులు అతని ముఖంలో కనిపించింది.

"ఏమిట"న్నాను.

"మగాడికి సమస్య ఏముంటుందీ? - పెళ్ళి" అన్నాడు.

"జీవితంలో సమస్య కానిది ఏదయినా ఉంటే అదొక్కటే అనుకుంటున్నాను నేను" అన్నాను. నవ్వాడు. "మీరేదో పరిహాసం ఆడుతున్నారు. నిజం చెప్పండి. రాత్రి శోభనాద్రిగారు సుబ్బులు పెళ్ళి విషయం మాట్లాడుతున్నారు కదూ?"

జవాబు చెప్పలేదు. రోడ్డుకి అటువేపు నడుస్తున్న సుబ్బులు వేపు చూశాను. మేమిద్దరం మాట్లాడుతున్నామని గ్రహించినట్టుంది. ఉండుండి ఇటు చూస్తోంది. నేను చూడటం గమనించి ముఖం తిప్పుకుంది.

"సుబ్బులు నా క్లాస్‌మేటు" అన్నాడు సత్తిరాజులు.

"ఆ అమ్మాయి ఏమీ చదువుకోలేదట కదా?" అన్నాను.

నవ్వి. "నేను మాత్రం చదివి చచ్చానా? అయిదో క్లాసు దాకా ఇద్దరం కలిసి బడికి వెళ్ళే వాళ్ళం. తర్వాత వాళ్ళ నాన్నకి బదిలీ అయిపోయింది. నేను మరో సంవత్సరం అయిదో క్లాసే చదివి మానేశాను. తర్వాత చదువు ఒంటబట్టలేదు. సుబ్బులు ఎప్పుడయినా సెలవలకి వస్తే కనిపించేది. నేనంటే వాళ్ళ కుటుంబంలో ఓ మనిషిలాగే చూసుకుంటారు" అని ఆగాడు.

గంట స్థంభం దగ్గరికి వచ్చాం ఇద్దరం. "మంచి కమలా పళ్ళు తింటారా?" అన్నాడు. నేన్రాప్రశ్న విననట్టే నటించాను. సుబ్బులు మా వేపే చూస్తూ కాలేజీ వేపు తిరిగింది అమ్మతో పాటు.

"నేను చదువుకోనందుకు ఇప్పుడు విచారపడుతున్నాను. సుబ్బుల్ని పెళ్ళి చేసుకోడానికైనా నేను చదువుకునేవాడిని. చదువురాదని మావఁయ్య నా ఆస్తికి పెద్దయాడు కాని, వస్తేనా" చాలా దీనంగా, నిస్సహాయంగా అన్నాడు.

"మరి నా వల్ల జరిగే సహాయం ఏమిటి?" అన్నాను.

ఈసారి అమాయకమయిన కోరిక కోరాడు. "మీరు బాగా చదువుకున్నారు. డబ్బు బాగానే ఉన్నట్టుంది. ఆ ముసలాడికి మీమీద దృష్టి ఉన్నట్టుంది. అందుకే ఎవరితోనూ ఎప్పుడూ మాట్లాడంది మీతో అంతసేపు కబుర్లు చెప్పాడు. అందుకని... అందుకని..."

"చెప్పండి" అని ప్రోత్సహించాను.

"మీరు మాత్రం సుబ్బుల్ని పెళ్ళిచేసుకోకుండా జాగ్రత్తపడాలి. వాళ్ళు బలవంతం చేసినా సరే"

ఫకాలున నవ్వేశాను. అతను తెల్లబోయి చూశాడు నావేపు.

భయం భయంగా అడిగాడు "ఏం? అప్పుడే చేసుకుంటాననేశారా?"

లేదన్నాను.

"మీరు ఆ అమ్మాయి పక్కన నిలబడితే తమ్ముడిలాగా ఉంటారు" అన్నాను ధైర్యం చేసి.

"అక్కడే వచ్చింది చిక్కు" ఆ క్షణంలో అతని ముఖంలో కనిపించిన దిగులు చూస్తే ఎలాంటివాడికైనా గుండె కరుగుతుంది "అయినా నా ప్రయత్నంలో నేనున్నానులెండి. వాళ్ళూ వెళ్ళిపోయినట్టున్నారు. రండి నా సైకిలెక్కండి. ఇద్దరం పోదాం" అన్నాడు.

పక్కకి చూశాను. సుబ్బులూ, అమ్మా కనిపించలేదు. "అక్కరలేదు. మీరు వెళ్ళండి" అన్నాను. సత్తిరాజులుతో మాట్లాడాక అతణ్ణి అసహ్యించుకోవలసిన విషయాలకంటే జాలిపడవలసిన అంశాలు ఎక్కువ కనిపించాయి. **అయితే ఏదో ప్రయోజనం దృష్టిలో ఉన్న అమాయకులంత మూర్ఖులు మరొకరుండరు.** ఆలోచిస్తూ నెమ్మదిగా అడుగులు వేశాను. ఇంటికి మరో అరగంటకి చేరాను. అమ్మ నాకోసం ఎదురు చూస్తూ వసారాలో కూర్చుంది.

"తాళం జేబులో ఉంచుకుని చెప్పవేఁరా - గంటయింది ఇక్కడ చతికిలబడి" అంది నన్ను చూసి.

త్వరత్వరగా పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కున్నాను. అప్పటికే శోభనాద్రిగారు భోజనం చేసి నిద్రపోతున్నట్టున్నారు. నిన్న ఆయనతోనూ, ఇప్పుడు సత్తిరాజులతోనూ మాట్లాడాక, సుబ్బుల్ని రెండు ప్రశ్నలు అడగాలనిపించింది. భూమి గుండ్రంగా ఉంటుందని తెలుసు. కాని దానికి ఆమె ఏం గుర్తు పెట్టుకుందో తెలుసుకోవాలని ఉత్కంఠ. భోజనం చేసి కావాలని వాకిట్లోకి వచ్చి కుర్చీమీద కూర్చున్నాను. వాళ్ళింటిలో గిన్నెలు కదిలాయి. చీపుళ్ళు ఇల్లంతా తుడిచాయి. మంచాలు వాలాయి. ఇక ఇవాళ్టికి సుబ్బులు కనిపించే యోగం లేదనుకుని నిస్పృహగా చేతిలో ఉన్న పేపరు విప్పాను. జీపు కుదుపుతో ఒళ్ళు హూనమయిందేమో చిన్న కునుకు పట్టింది.

"వాకిట్లో లైటు ఆర్పేసి పడుకో సుబ్బులూ" అన్న ముసలావిడ కేక మగతలో అస్పష్టంగా వినిపించింది. అప్పుడు సుబ్బులు వాకిట్లోకి వచ్చింది. లైటు ఆర్పేయబోతూ నా చేతిలో పేపరు చూసి గతుక్కుపడి "చదువుకుంటున్నారా? అయితే చదువు పూర్తయాక ఆర్పేసి పడుకోండి" అని లోపలికి నడవబోయింది.

"సుబ్బులూ" అని పిలిచాను అనుకోకుండా. **కొన్ని పేర్లకి గారు అని చేరిస్తే బాగుండదు. ఏదో అలవాటులేని పని చేసినట్టుంటుంది.** అయినా ఎందుకు పిలవాలి ఆ అమ్మాయిని నేను? ఆలోచించేలోగానే ఆ పని జరిగిపోయింది.

విస్తుపోతూ నా వేపు చూసింది. "మీ పూర్తి పేరు నాకు తెలియదు. అందరూ అలాగే పిలిస్తేను...."

"అదే నా అసలు పేరు... ఏం పిలిచారు?" అంది సుబ్బులు మెల్లగా

"మిమ్మల్ని రెండూ ప్రశ్నలు అడగాలి" అన్నాను.

ఒక్క క్షణం మెడలో పూసల దండని వేళ్ళతో తడుముతూ అలా పస్తాయించింది. విద్యార్థిని పరీక్షాధికారి చూసినట్టు నన్ను గమనించింది.

"ఇప్పుడా? ఇంత రాత్రివేళా? మామ్మ లేస్తుంది బాబూ... రేపు చూద్దాం" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

**దేనికయినా ఆడది ఎదురు తిరగకుండా, అభ్యంతరాలని చెపితే ఆ పని ఎడల ఆమె సుముఖంగా ఉన్నట్టే లెక్క.** అంతే కాక సుబ్బులు గడుసుగా 'రేపు చూద్దాం' అంటూ రేపటికో అనుభవాన్ని పదిలంగా దాచుకుంది. నా ప్రశ్నల్ని గురించే అందమయిన కలలు కంటూ నిద్రపోతుందనుకున్నాను. కనీసం అలా అనుకుంటూ నిద్రపోవడంలో నాకు చాలా అందమయిన కలలు వచ్చాయి.

మద్రాసులో చదువుకుంటున్న నాకు ఇంతకన్నా చాలా అందమయినవాళ్ళూ, చదువుకున్నవాళ్ళూ కనిపించారు. కాని కొందరికి తాజ్‌మహల్ అందంగా కనిపిస్తే, కొందరికి అజంతా బాగుండొచ్చు. కొందరికి వాళ్ళ ఊరిలో శిథిలమైన దేవాలయమంటే మక్కువ ఉండొచ్చు. విచిత్రమేమిటంటే అది చూశాకే తమ అభిరుచి జాగృతమవుతుంది. సుబ్బులు పాత తరహా మనిషేమో కాని, తెలివి తక్కువ పిల్లేం కాదు. మరునాడు నేను మాట్లాడతానని తెలుసు. ఒంటరిగా కనిపిస్తే తను మాట్లాడాలనీ తెలుసు. అందుకని ఒంటరిగా కనిపించడం మానేసింది. ఉదయం వాకిట్లోకి వస్తే "ఏం పంతులూ! కాఫీ అయిందా?" అని పలకరించారు శోభనాద్రిగారు. తలూపాను.

"మీరో?" అన్నాను.

"ఇదిగో... మీ ఇంట్లో మీ అమ్మే ఉన్నారు కనక త్వరగా కాఫీ అయిపోయింది. మా ఇంట్లో ఒకరికి ఇద్దరయారు. ఇంకా తెమల్లేదు. ఏం సుబ్బులూ?" అని కేకేశారు. సుబ్బులు కాఫీ గ్లాసుతోనే వచ్చింది. రాత్రి నాతో మాట్లాడిన సూచన పెదవుల్లోనూ కళ్ళలోనూ కనబడుతుందేమోనని వెదికాను. కాని యథాలాపంగా కాఫీ మీదే దృష్టి ఉంచుకుని తాతయ్య దగ్గరకి వచ్చింది సుబ్బులు. నాకు కొంచెం నిరుత్సాహం కలిగింది. తాతయ్యకి కప్పు అందించింది. నా వేపు చూసి, "మీకూ కాఫీ తెచ్చేదా?" అంది.

శోభనాద్రిగారు అందుకున్నారు. "అడిగి తెస్తారటమ్మా ఎవరన్నా? అతను అప్పుడే తాగాడులే. అయినా రాక రాక ఇంటికి వచ్చాడు. వాళ్ళ అమ్మ ఇచ్చిన కాఫీ రుచించినట్టు నీ కాఫీ రుచిస్తుందా? ఏమోయ్!"

ఆ మాటలకి పూర్తిగా నిరుత్సాహపడిపోయాను. సుబ్బులు కూడా తాతయ్యతో పాటు నవ్వింది.

"మీకు అరవం వచ్చా?" అనడిగింది ఉన్నట్టుండి.

"ఓ. మా రూంమేటు కోయంబత్తూరు నుంచీ వచ్చాడు. తీరికవేళల్లో నాకు అరవం నేర్పాడు. అంతకాకపోయినా కొంతవచ్చు. అయితే నాకు వచ్చిన అరవం పూర్తిగా గ్రాంధికం" అన్నాను.

"మా సుబ్బులికి హిందీ వచ్చునోయ్. ఓ పరీక్ష కూడా ఫెయిలయింది. హిందీ సినిమా పాటలన్నింటికీ అర్థం చెపుతుంది" ఆ మాటలకి సుబ్బులు నవ్వలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టుంది.

"మీరు అరవ సినిమాలు చూస్తారా?" అంది మళ్ళీ.

"ఓ! " అన్నాను.

"వాళ్ళది చాలా మంచి భాష" అంది మురిసిపోతూ.

"మీరు అరవ సినిమా భాష చూసే వాళ్ళ భాష మంచిదనుకుంటే అసలు భాష తెలిస్తే నిరుత్సాహ పడిపోతారు" అన్నాను.

ఈ ప్రసంగం నచ్చినట్టుంది. "నేను వస్తానోయ్. కాఫీ కోసమే ఇంతసేపు తచ్చాడాను. ఇక స్నానం చేసి వీధిన పడాలి." అని లేచారు శోభనాద్రిగారు.

ఇప్పుడిక సుబ్బులుతో మాట్లాడవచ్చనుకున్నాను. కాని మన ఆలోచనలు ఆడవాళ్ళు ఎలా పసిగట్టివేస్తారో మరి "పాపం ఆయనా స్నానం చేసి వీధిలోకి వెళ్ళాలి కాబోలు. పద, తాతయ్యా. నీళ్ళు తోర్లించి ఇస్తాను" అని కాఫీగ్లాసు తీసుకుని తాతయ్య వెనకే వెళ్ళిపోయింది.

హతాశుణ్ణయిపోయాను.

ఆ సాయంకాలం మళ్ళీ స్నానానికి వస్తుందేమోనని బాత్‌రూం దగ్గర గంట సేపు కూచున్నాను. ఒకటి రెండు సార్లు స్నానాలు చేశాను. అందువల్ల మర్నాడు తెల్లారేసరికి జలుబు వచ్చిందే కాని సుబ్బులు రాలేదు.

మర్నాటి ఉదయం పేపరు చదువుతూ వీధి స్థంబానికి ఆనుకు నిలబడితే "ఒరేయ్, కరివేపాకు అమ్మిని పిలువు" అని లోపల్నుంచి అమ్మ కేకేసింది.

పావుగంటసేపు పదిరకాల బేరాలు పెట్టి రెండు రెమ్మలు వేయించుకున్నాక, అమ్మ "అమ్మాయి సుబ్బులూ! కరివేపాకు కావాలేమో మీ మామ్మని అడుగు" అంటూ లోపలికి వెళ్ళింది. పేపరు మడిచి కరివేపాకు బుట్టనే చూస్తూ నిలబడ్డాను. సుబ్బులే వచ్చింది. నన్ను చూసి యధాలాపంగా "ఏమిటండీ ఇవాళ పేపర్లో విశేషాలు?" అంది.

"ఒక అబ్బాయి మాట్లాడాలనుకుంటున్నాడని తెలిసి కూడా ఒక అమ్మాయి తప్పించుకు తిరుగుతోందట. అదే విశేషం!"

కరివేపాకు అమ్మి ఆశ్చర్యంగా చూస్తూ లేచింది. "అదేటి!అలాటి యిసయాలు రాస్తారేమిటి బాబూ?" అంటూ.

సుబ్బులు ఫక్కున నవ్వేసింది. ఆ అమ్మిని వెళ్ళిపోనిచ్చి

"ఏమిటండీ మాట్లాడుతారు?" అంది కవ్విస్తున్నట్టు

**ప్రేయసీ ప్రియులిద్దరూ వెన్నెల రాత్రిలో కలిశాక ప్రేయసీ ప్రియుని ప్రక్కనే కూర్చుని "నాకింక అరగంట వ్యవధి ఉంది చెప్పాలనుకున్నదేదో చెప్పు" అంటే "ఆ చంద్రుడెంత అందంగా ఉన్నాడో చూడు. అది చెప్పడానికే పిలిచాను" అనలేడు ప్రియుడు. "బయట నా రిక్షా ఉంది. దాంట్లో ఇంటికి వెళ్ళు" అంటాడు తప్ప.**

సరిగ్గా పరిస్థితి అలాంటిది కాకపోయినా ఆమె చూపు చూడగానే అడగాల్సిన విషయంలో సూటిదనం పోయింది. అయినా ప్రారంభించాను. " ఆరోజు మీ తాతయ్య.. "

మధ్యలో అంది "మా తాతయ్య చెప్పినదంతా మరిచిపోండి ఆయనకి పిచ్చి, ఏదేదో చెప్తారు."

ఇంకేం మాట్లాడాలో తోచలేదు.

"సత్తిరాజులు నీకు చిన్నతనం నుంచీ తెలుసటగా? నిన్ను పెళ్ళిచేసుకోవాలని.... "

"వాడుత్త వెధవ. వాడిని ఇంట్లోకి చేరనివ్వద్దంటే తాతయ్యా, మామ్మా వినరు."

నాకు నవ్వు తోసుకొచ్చింది, సత్తిరాజులు మీద ఆమె సూటిగా ప్రకటించిన అభిప్రాయానికి.

"ఏదో అడుగుతానన్నారు, అడగండి మరి" అంది.

నాకు కరచరణాలు ఆడలేదు. "నా ప్రశ్నలనిటికీ సమాధానాలు  చెప్పేసావు. నీకు పాస్‌మార్కు" అన్నాను.

"ఇంతేనా మీరడిగేది? ఇంకా ఏమిటో అనుకున్నాను. ఇదే అయితే తాతయ్య ముందడిగినా చెప్పేదాన్నిగా?" అంది నవ్వుతూ.

నేను సిగ్గు పడిపోయాను. అడగవలసిన ప్రశ్నేదో మరిచిపోయావా ఫూల్ అని గుర్తుచేస్తోందా ఈ పిల్ల? ఇంత చిన్న విషయాలకి తాపత్రయమెందుకని వెక్కిరిస్తోందా? కాని ఒక్కటి మాత్రం అర్ధమయింది. నేనేదో అడుగుతాననుకుని ఇన్ని రోజులూ తప్పించుకుంది. తీరా ఇవేనని తెలిసి నవ్వుకుంది లేక నిరుత్సాహ పడిందా? ఇంతకూ ఎలాంటివి ఆ ప్రశ్నలు?

"ఇంతేనా మీరడిగేది?" ఆ ప్రశ్నలో ఏదో సమాధానం కోసం మనస్సు ఉరకలు వేసింది. ఈ మధన అంతా గుమ్మానికి చేరబడి గమనిస్తోంది. "ఇక వెళ్ళేదా?" అంది నేను తేరుకున్నాక.

మరీ తబ్బిబ్బయి పోయాను ఆ ప్రశ్నకి.

"థాంక్స్!" అన్నాను.

లోపలికి వెళ్ళబోతూ ఆగి "నాకో సహాయం చేసి పెడతారా?" అని అడిగింది.

"తప్పకుండా. చెప్పండి" అన్నాను ఉత్సాహంగా.

"మీకు ఎప్పుడన్నా తీరిక దొరికితే నాకు అరవం నేర్పండి. ఇక్కడ పనేం లేదు. ఊరికే నేర్చుకోవాలని ఉంది."

"తప్పకుండా, తప్పకుండా. నాకు తీరికన్న మాటేఁవిటి? మీకు తీరికున్నప్పుడే చెప్పండి." అన్నాను ఆనందంతో.

"మా దుర్గ కూడా నేర్చుకుంటానంది. మధ్యాహ్నం ఎప్పుడయినా సరే. నేను రెడీయే"

"దుర్గెవరు?"

"అదిగో, ఆ మూడో ఇల్లు. తాసీల్దారుగారమ్మాయి."

సగం ఉత్సాహం చచ్చిపోయింది నాకు.

"సుబ్బులూ! కరివేపాకు ఏదే?" అని లోపల్నించీ ముసలమ్మ అరిచింది.

సుబ్బులు మరుక్షణంలో మాయమయింది.

కసిగా మూడో ఇంటి వేపు తిరిగాను. ఎదురింటి మెట్లమీద కాలానించి సైకిలు మీద కూర్చున్న సత్తిరాజులు కనిపించాడు. వాడి ముఖంలో ఏడుపు స్పష్టంగా తెలుస్తోంది. కాని నా ముఖంలో ఏడుపు వాడికి అర్థం కాలేదు. ఇద్దరం కాసేపు కసిగా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నాం.

## 4

దుర్గ అచ్చు కోతిలాగ ఉంటుంది. వాళ్ళ నాన్న తాసిల్దారు గనక ఆమె బుద్దులు కూడా అలాంటివే వచ్చాయి. వాళ్ళ నాన్నలాగే ఎప్పుడూ ఆమె స్వభావం కూడా జీపులో ప్రయాణం చేస్తూవుంటుంది. మనసంతా పంచదార పర్మిట్ల కోసం వచ్చిన జనం లాగ, ఫైళ్ళ మీద ఆర్డర్స్ కోసం వచ్చిన గుమ్మస్తాల్లాగ, మన మాటలు తనకు చేసుకుంటున్న నివేదనల్లాగ అరమోడ్పు కనులతో వినడం అలవాటు చేసుకుంది. అసలా అమ్మాయికి అరవం నేర్చుకోవాలనే ఇష్టమే లేనట్టు మొదటి మధ్యాహ్నమే అర్థమయింది నాకు. ఆ ఉదయం ఊరంతా తిరిగి తిరిగి ఒక అరవం తెలుగు పాఠ్యపుస్తకం సంపాదించి తెచ్చాను. పాఠం చెప్పడం చాలా శ్రద్ధగా ప్రారంభించాను. తీరా నాకు దొరికిన ఇద్దరు విద్యార్థినులు ఒకరికొకరు పూర్తిగా భిన్నంగా కనిపించారు. ఆ చదువే తన సర్వస్వం అయినట్టు సుబ్బులు బల్ల మీద కూర్చుంటే నేనేదో తను జీతం ఇచ్చి పెట్టుకున్న ప్రైవేటు మేష్టరునయినట్లు నిర్లక్ష్యంగా చూస్తూ కిటికీ ఊచల్ని పట్టుకు వేలాడించి దుర్గ.

"అబ్బ! ఈ అక్షరాలేమిటి బాబూ,మరీ ఇన్ని వంకర్లు! భాష వినడానికి సుఖంగా అయినా లేదు. ఎన్నాళ్ళు పడుతుందో ఇవన్నీ రావడానికి?" ఇలా మొదలెట్టింది.

"తెలుగు భాష కూడా మీకు త్వరగా వచ్చి ఉండదేమో ననుకుంటాను" అన్నాను ఇక ఉండబట్టలేక.

"ఏమో, గుర్తులేదు. మా నాన్నగారిని కనుక్కుని చెపుతాను" అని ఫక్కున నవ్వింది.

నా ముఖం ఎర్రనవడం, ఆమె పట్ల విసుగు సుబ్బులు గ్రహించిందేమో కాని మాట్లాడలేదు. అడగాల్సిన అనుమానాల్ని అడిగి తల ఎత్తకుండా వ్రాస్తోంది.

"ఏమండీ, మద్రాసులో మంచి ఇంపోర్టెడ్ గూడ్స్ దొరుకుతాయంటారు నిజమేనా?" అని అడిగింది దుర్గ, పాఠం ఆపేసి.

తెలీదన్నాను.

"కాస్త తెల్సుకుని నాకు మంచి జపాన్ శాటిన్ శారీస్ తెచ్చిపెట్టకూడదూ? డబ్బు ఇస్తాను" అంది.

"డబ్బు ఇవ్వకపోయినా తెస్తాను. మీకు అభ్యంతరం లేకపోతే, కాని మన చీరలు మీకు చాలలేదా?" అన్నాను పళ్ళ మధ్య నుంచి.

జీవితంలో ఆమెతో ఎవరూ అనివుండరేమో. వెయ్యి రకాలుగా మురిసిపోయి 'నాటీ' అంది, కళ్ళ కొసల నుంచి చూస్తూ.

సుబ్బులు ఇదంతా తనకు పట్టనట్లు రాస్తోంది.

ఈలోగా హనుమంతరావు స్కూటర్ మీద వచ్చేసరికి పాఠం ఆగిపోయింది. అంతే, అదే మొదటి పాఠం, చివరి పాఠమూను.

ఎందుకంటే ఆ సాయంకాలం సుబ్బుల్ని వాళ్ళమ్మ కేకలు వేయడం స్పష్టంగా విన్నాను.

"మన చదువే అంత మాత్రంగా వచ్చింది. ఇప్పుడా అరవం నేర్చుకోకపోతేనేం? చదువొచ్చే జాతకమయితే ఇలా ఉండడమేం?" అంటూ.

సుబ్బులు ఏం మాట్లాడినట్టు లేదు. నేను గతుక్కుమనాను. **పెద్దవాళ్ళు తమకి ఇష్టంలేని విషయాని ఖండించాలనుకున్నప్పుడు సాధారణంగా సరైన కారణం చెప్పరు.** నా దగ్గర నేర్చుకోవడం ముసలమ్మకి ఇష్టం లేదేమో. దాన్ని ఎంత అందంగా మలిచి చెప్పింది! దుర్గ రావడం వల్ల సగం ఉత్సాహం పోయిన నాకు, ఈ మాటల్తో పూర్తిగా ఉత్సాహం చచ్చిపోయింది. వీలయితే ఈ పనిని తప్పించుకొందామనుకుంటుండగా మర్నాడు ఉదయం బయటికి వెళుతున్నప్పుడు సుబ్బులు ఎలా కనిపెట్టిందో గుమ్మం దగ్గరికి వచ్చి చెప్పేసింది.

"ఏమిటో, ఎంత ప్రయత్నించినా చదువు ఒంటబట్టడం లేదండి. పని పాడవుతోందని మామ్మకి కోపం. అయినా ఇప్పుడు నాకు చదువేమిటి? మీరు తెచ్చిన పుస్తకం నాకివ్వండి చాలు..." అంది.

అమ్మ నడిగి పుస్తకం తీసుకోమని చెప్పి వీధిలోకి వెళ్ళిపోయాను. ఆ మధ్యాహ్నం దుర్గ కూడా వచ్చినట్టులేదు. మరి నాలుగు రోజుల తర్వాత వీధి గుమ్మంలో కనిపించి "మా అన్నయ ఢిల్లీ నుంచి వచ్చాడండీ. రోజుకో తెలుగు సినిమా చూస్తున్నాం.మీ అరవ పాఠాలు బాగా సాగుతున్నాయా?" అని పలకరించింది.

"మీరు లేకపోతే చదువెందుకని మీ స్నేహితురాలూ మానేసింది బెంగపెట్టుకుని" అన్నాను.

ఆ అంజనీ దేవి మూతిని జినియా పువ్వులాగ తిప్పింది. కంకరరోడ్డు మీద ఎద్దుబండి నడకలాగ సహజకాఠిన్యం ఒలికిస్తూ నవ్వింది.

తప్పించుకుని పారిపోయాను.

✡ ✡ ✡

మా స్నేహితుడొకడు కలకత్తాలో ఇంటర్వ్యూకి వెళుతున్నానంటే తెల్లవారుఝామున స్టేషనుకి వెళ్ళాను. నాలుగు గంటలకి బండి. కలిసి, శుభాకాంక్షలు పలికాక ఇంటికి బయలుదేరాను. అప్పుడే తూర్పు తెల్లవారుతోంది. చెరువు మీంచి చల్లటిగాలి వీస్తోంది. జట్కాలున్నా ఎందుకో ఆ రోజు అంతదూరమూ నడవాలనిపించింది. ఇంటికి వెళ్ళి చేసేదేమీ లేదు. అందుకని పెద్ద చెరువు దక్షిణపు గట్టంటే నడవడం ప్రారంభించాను. ఒక పక్క పచ్చటి పొలాలు, వాటికవతల వరుసగా చెట్లు, రాళ్ళు తన్నుకుంటూ వరుసగా అడుగులు వేస్తున్నాను. అలాంటప్పుడు మనసులో నిర్దుష్టంగా ఏ ఆలోచనా కుదరదు. ఏ చెట్టు గురించో, రెపరెపలాడిపడే ఆకు రంగు గురించో, చెరువులో గెంతిన కప్ప గురించో ఆలోచన కదులుతుంది. అంతలో చెదిరిపోతుంది మళ్ళీ మరో ఆలోచన వస్తుంది. అందుకే ఇలాంటి ఉదయపు నడకలో మనస్సు విశ్రాంతి తీసుకుంటుందనుకుంటాను. ఒకే ఆలోచనని అలా పెంచినప్పుడే అలసట.

ఉన్నట్టుండి ఎవరో భుజం మీద చెయ్యి వేస్తే ఉలికిపడ్డాను. పక్కకి తిరిగితే తెల్లటి బొద్దు మీదాలూ, వెడల్పాటి పాత తోలు పటకాలతో బిగించిన పాంటూ, హవాయ్ చెప్పులూ, దుక్కలాంటి చేతికర్రా, వెండిఫ్రేము కళ్ళద్దాలూ ఎదురయాయి. తాసీల్దారుగారి కుండవలసిన హంగులన్నీ సరిగా అమిరాయనుకున్నాను, మనసులో.

"నువ్వు భావనారాయణగారి అబ్బాయివి కదు?" అన్నారాయన, నాతోపాటు అడుగులు వేస్తూ, మాట్లాడితే గొంతు ఎలుగు రాసినట్టు ఆడదాని గొంతులాగ ధ్వనిస్తుంది. గొప్ప మనిషి కుండవలసిన చివరి అర్హత కూడా ఆయనకి అబ్బిందని మనస్సులో అనుకున్నాను.

నా జవాబు కోసం ఆయన ఆగలేదు. "మీ నాన్న కాంట్రాక్టు ఎలా సాగుతోంది?" అన్నారు.

"బాగానే ఉందండి" అన్నాను. "మా నాన్నగారూ మీరూ కలిసి చదువుకున్నారా?" అన్నాను ఏమనాలో తెలియక.

"ఎందుకలా అడిగావు? భావనారాయణ అంటున్నాననా? అతనికి ఆ కాంట్రాక్టు దగ్గరుండి నేనే నేనే ఇప్పించాను. అప్పట్నుంచీ చూస్తున్నాను. ఆ మాత్రం 'వొరేయ్' అనడానికి హక్కు లేదంటావా?" అన్నారాయన. ఇప్పుడిక పూర్తిగా నా భుజం మీదా, చేతికర్ర మీదా గంజి కావిడి వేసుకుని ఈడిగిలబడుతూ నడుస్తున్నారాయన.

"ఏమిటి ఈ వయస్సులోనే మార్నింగ్ వాక్ ప్రారంభించావు? నీ వయస్సులో నేను రెండు గంటలు బస్కీలు తీసి, శేరుపాలు తాగేవాడిని. కాకపోతే ఇలా ఉండేవాడినా?... నీలాగయితే పదిమంది పిల్లల్ని కనగలిగేవాడినా? దాంట్లో ఆరుగురే దక్కారనుకో" అన్నారు నా వేపు చూస్తూ.

"మార్నింగ్ వాక్‌కి రాలేదండి. మా స్నేహితుడొకడు కలకత్తా వెళుతున్నానని ఉత్తరం రాస్తే కనిపించిపోదామని"

"అలా చెప్పు. కుర్రవాడు మనవాడేనా?"

"అంటే?"

"అంటే - జాతి, కులం, ఇంటిపేరూ, ఊరూ... "

"మనవాడేనండీ. నిష్టలవారబ్బాయి."

"అలాగా! మనవాడు అంత దూరం పోతున్నాడేం ఉద్యోగానికి?"

"ఇంకా ఏదండీ. ఇది ఇంటర్వ్యూ.... ఉద్యోగం వచ్చినప్పటి మాట కదా!"

నేనేదో నేరం చేసినట్టు ఆగిపోయి చూశారు. "ఏమిటన్నావు? మనవాళ్ళు వెళ్ళిన చోట మరొకడు గెలవటమా? అసంభవం. ఒకటే చెపుతాను విను. మనవాడు వెళ్ళక చెడ్డాడు. అరవ్వాడు వెళ్ళి బాగుపడ్డాడు."

ఈ 'మనవాడు'కి అర్థం నాకు సరిగా తెలియలేదు. ఆయన ఉద్దేశం ఆంధ్రుడనా? బ్రాహ్మడనా? వైదికుడనా?

"నిష్టలవారంటే హరితస గోత్రం, మంచిదే. అబ్బాయి కెన్నేళ్ళన్నావు?"

చెప్పాను.

"భేష్! పెళ్ళయి ఉండదు బహుశా."

ఇదీ ఊహ కాదు. నాకు ఉద్దేశించి ప్రశ్న. "అవలేదండీ" అన్నాను. అంతే నా వేపు తిరిగి "ఈసారి కలకత్తా నుంచి తిరిగి వెళుతున్నప్పుడు నాకు చెప్పు. నీతో పాటు నేనూ స్టేషనుకి వస్తాను. మరచిపోకు" అన్నారు.

నాకు నవ్వొచ్చింది. పెర్మిట్లకీ, రికమెండేషన్లకీ వచ్చినవాళ్ళని మెడలు వంచి సంబంధాలకి ఒప్పిస్తాడు గావును.

"మీకెందుకండీ ఈ పెళ్ళిళ్ళ గొడవ అనుకుంటున్నావా మనసులో? ఆc..ఏముందయ్యా..వయస్సు మీద పడుతోంది. పెళ్ళాం చచ్చిపోయి అయిదేళ్ళయి పోయింది. ఖాళీ చేసిన ఇల్లులాగ బుర్ర కూడా ఖాళీ అయిపోయింది. పాతబడిపోయిందేమో దానిలో ఏ ఆలోచన ఎక్కువకాలం నిలవదు. అందువల్ల దాన్ని అప్పుడప్పుడు నింపడానికి ఏదో పనికావాలి. తీరికవేళల్లో అబ్బాయిల, అమ్మాయిల గురించి వాకబు చేస్తుంటాను. మన చేతి మీదుగా రెండు పెళిళ్ళు చేసి, వాళ్ళు సుఖంగా ఉండేట్టు చూస్తే పుణ్యమే కదా! ఇది నాకో చిన్న హాబీ. అన్నట్టు నీకు పెళ్ళికాలేదు కదూ?" అని ఆగారు.

తలూపాను.

"అప్పుడే చేసుకోకు. చదువు పూర్తి చేస్తే పెద్ద బేరం వస్తుంది."

"కట్నాల్ని కూడా మీరు ప్రోత్సహిస్తున్నారా?" అనడిగాను.

"తప్పేముంది? శక్తి ఉన్నవాడు ఇస్తాడు. కావలసినవాడు పుచ్చుకుంటాడు." అదేదో పెద్ద జోక్ లాగా ఆగి, నిలబడి చాలాసేపు నవ్వాడు. నవ్విన కొద్దీ చేతికర్ర మట్టిలో సుడులు తిరుగుతూనే ఉంది.

నాకూ ఆయన ఉద్యమానికి ఉడుతా భక్తిగా సహాయం చెయాలనిపించింది. "మా ఇంటాయన శోభనాద్రిగారని - తెలుసుగా?" అన్నాను.

"తెలియకేం? పదేళ్ళు జైల్లో ఉన్న ఓ నేరస్తుడి కుటుంబం బ్రతకలేక ఇంటిని వేలం వేస్తే కొన్నాడు. నౌఖరీ చేసినన్నాళ్ళూ ఇంట్లో జైల్లో ఉన్నట్లే ఉండేవాడు. ఆఫీసులో ఎలాగూ జైలే కదా! ఏమిటతని సంగతి?"

"ఈ మధ్య ఆయన మనుమరాలికి పెళ్ళి సంబంధాలు వెదుకుతున్నాడు. అమ్మాయిని చూసే ఉంటారు!"

"చూడకేం? చిన్నప్పట్నుంచీ తెలుసు. అయితే ఆ అమ్మాయికి పెళ్ళా? మంచి సంబంధమే!"

"మరో చిన్న క్లూ ఉంది. మా ఇంటికి ఎదురుగ్గా ఉన్న ఇంట్లో ఓ అబ్బాయి ఉన్నాడు. పేరు సత్తిరాజులు. అతనూ పెళ్ళి చేసుకోవాలనే తాపత్రయంలో ఉన్నాడు."

"అలాగా? నాకు తెలీదే!" అన్నారాయన

"ఇంకా వినండి. అతనికి చాలా డబ్బుందట. చదువుకోని పాపానికి వాళ్ళ మావఁయ్యా కస్టడీలో ఆస్తిని ఉంచి పోయిందట వాళ్ళమ్మ. లేకపోతే ఇంకా వెలిగేవాడట కొంచెం స్క్యూలూజ్. కాని అతనికో సంబంధం..."

"అవునవును. చూడాలి చూడాలి" అని తనలో తను అనుకున్నట్టు అన్నాడు.

"మీరందుకేం శ్రమ పడనక్కరలేదు. అతనే ఓ సంబంధం చూసుకున్నాడు."

"చూసుకున్నాడు? అదీ అయిపోయిందీ! ఏమిటా సంబంధం?"

"ఈ శోభనాద్రిగారి సంబంధమే. ఇక్కడ మీ పని చాలా సులభం. అమ్మాయి తాతనీ, కుర్రాడి మామయ్యా అతను చూస్తే కాస్త గట్టి ఘటంలాగే కనిపిస్తున్నాడు! ఒప్పించారంటే పని తేలికయిపోతుంది."

"కుర్రాడి మావఁయ్యా గట్టి ఘటం అంటున్నావు? కుర్రాడు ఏదయినా చెప్పాడా ఏమిటి?"

అతనికి ఆసక్తిని కలిగించే విషయం చెపుతున్నందుకు నాకు ఉత్సాహం వచ్చింది. "వేరే చెప్పాలిటండీ. కుర్రాణ్ణి చూస్తే అతని సంరక్షకుడు ఎలాంటివాడో అర్థం కావడంలేదూ? వీడో గంత. వీడికి తగ్గ బొంత అతను."

ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు ఆయన. "మరి ఆ బొంతను ఒప్పించాలంటే ఏం చెయ్యాలంటావు?"

"సింపుల్. సత్తిరాజులు వట్టి మూర్ఖుడు. తను పట్టిందే కుందేలనేవాడు. ఆ అమ్మాయిని చేసుకోవాలని తెగ మురిసిపోతున్నాడు. చెయ్యకపోతే ఏడ్చి మొత్తుకుని ఏ రైలు కిందో తలపెడతాడని చెప్పండి, చాలు. వాళ్ళ మావఁయ్యా లాయరుట కూడాను నేను ఆయన్ని చూడలేదు లెండి. ఏదీ? నేను వచ్చినప్పుడల్లా ఉండేది రెండూ రోజులే. అదీ బయటే గడిచిపోతుంది. అందుకని, ఆయన లాయరు కనక రేపు జరగబోయే విపత్తుని ఊహించుకుని పెళ్ళికి ఒప్పుకున్నా ఒప్పుకోవచ్చు."

"మంచి ఐడియా" అన్నాడు వృద్ధుడు. ఇంకా ఆలోచిస్తున్నాడాయన.

"ఏం? ఆ చదువురాని మొద్దేమిటి, ప్రేమలో పడడం ఏమిటని ఆలోచిస్తున్నారా? మొన్న నాతో స్వయంగా అన్నాడు కూడాను."

"ఏమని?"

"నన్ను ఆ అమ్మాయిని ప్రేమించకుండా జాగ్రత్తపడమని."

"అంటే నువ్వు -"

తడబడ్డాను. "అబ్బే! లేదనుకోండి. అతని విషయం చెప్పాలి కనుక చెపుతున్నాను."

"అవునవును. ఇలాంటి సందర్భాలలోకేసు చాలా స్పష్టంగా తెలియాలనుకో... సరే సరే. బాగుంది." అన్నారు ఆయన.

ఇంక అనవసరంగా ఆయన్ని రెచ్చగొట్టకూడదనుకున్నాను. ఏదో సరదాకి చెప్పాలనుకుని ఇంతవరకూ చెప్పాను. ఇంక నోరెత్తలేదు. హఠాత్తుగా మా ఇద్దరి మధ్య సంభాషణ ఆగిపోయింది. మా వీధి దగ్గరకి కూడా వచ్చేశాం. ఏదో మాట్లాడాలని మెల్లగా అన్నాను.

"మీ అమ్మాయి నాకు తెలుసు. మొన్న చూశాను."

"ఏ అమ్మాయి?" అన్నాడతను ఏదో ఆలోచనలో నుంచి తేరుకున్నట్టు.

"మీ చిన్నమ్మాయి అనుకుంటాను."

నవ్వి - "మా చిన్నమ్మాయి చచ్చిపోయి పదేళ్ళయింది. మిగతా అమ్మాయిలు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయారు. నన్ను చూడడానికి వచ్చి ఆరేళ్ళయింది" అన్నారు.

నేను నిర్ఘాంతపోయాను. మా వీధిలో నడక సాగిస్తున్నాం.

"మరి దుర్గ మీ అమ్మాయి కాదా?" అన్నాను.

"ఏ దుర్గ?" అన్నారాయన ఆశ్చర్యంగా

నేను మరింత దిగ్భ్రమ చెందాను.

పదడుగుల దూరంలో తాసిల్దారుగారింటి ముందు జీపు ఆగి ఉంది. ఎవరో తెల్లటి వ్యక్తి ఇంట్లోంచి వచ్చి జీపు ఎక్కారు. జీపు కదిలిపోయింది. నేను నివ్వెరపోయాను. ఇప్పటికి నా పొరపాటు అర్థమయింది.

నా ఆశ్చర్యానికి కారణం ఈయనకి అర్థమయినట్టుంది.

"నన్నెవరనుకుంటున్నావ్?" అన్నారాయన నడుస్తున్నవాడల్లా ఆగి, ప్రశ్నార్థకంగా మొహం పెట్టాను.

"ఇంతసేపూ నేనెవరో తెలిసే మాట్లాడావనుకున్నాను. నేను తెలీదన్నమాట!"

"గుర్తుపట్టలేదండి" అని నీరసంగా అన్నాను.

ఇద్దరం మా ఇంటి ముందుకు వచ్చాం. అతను నవ్వి నా భుజం మీద చెయ్యి వేసి, "ఇందాకటినుంచీ నువ్వు వర్ణించే ఆ సత్తిరాజులు వాడు మా త్రాష్టుడే.. వాడి మావయ్య ఆ గంతకు తగ్గ బొంతను నేనే. నేను ఇరవై ఏళ్ళుగా వాడి గురించి కనిపెట్టలేని విషయాల్ని నువ్వు సులువుగా గ్రహించేశావు. తీరిక ఉన్నప్పుడల్లా మా ఇంటికి వస్తూండు." అని కర్ర ఆడించుకుంటూ ఎదురింటిలోకి వెళ్ళిపోయారు లాయరు సోమయాజులుగారు.

నోట మాట రాక బిక్క చచ్చిపోయి రాయిలా నిలబడిపోయాను

✡ ✡ ✡

## 5

ప్రతి సెలవుల్లోనూ నాన్నగారు నాక్కొంత పని చెప్తుతారు. విజయనగరంలో ఉండేది. ఏ వారం పదిరోజులో, తర్వాత దేవుపల్లి అడవుల దగ్గరికి వెళ్ళిపోతూ ఉండేవాడిని. గజపతి నగరానికి ఆరుమైళ్ళలోనే దేవుపల్లి కొండలు ప్రారంభమవుతాయి. చాలా పొడవైన శ్రేణి అది. దాదాపు మూడువేల అడుగుల ఎత్తు. కొండ పాదాల దగ్గర చాలా దట్టమయిన అడవి ఉంది. ముందుకు వెళ్ళిన కొద్దీ సాలూరు తాలూకాలో ఆంధ్ర కొండలు ప్రారంభవుతాయి. అడవి కొద్దిగా పలచబడుతుంది. ఇక్కడ వంట చెరుకు, కలప కాంట్రాక్టు నాన్నగారిది. వంట చెరకు బయటికి పోకుండా ఎన్ని కట్టుదిట్టాలు చేసినా చుట్టుపక్కలవాళ్ళు ఏదో సమయంలో ఏదో విధంగా జారుకుంటారు. కాస్త

నదురుగా కనిపించే వ్యక్తిని చూసినా చేతిలో ఒక అర్ధరూపాయి ఉంచి ముందుకు వెళ్తారు. అది వాళ్ళ మామూలు. అడవి దాటి బయటికి పోయేసరికి అలాంటి అర్ధరూపాయలు చాలా చెల్లుబడి అవుతాయి. ఒకసారి ఒకావిడ నా చేతిలో ఒక అర్ధరూపాయి ఉంచింది. నా కర్ధం కాలేదు.

"ఇదెందుకూ?" అన్నాను.

"ఏంటి బాబూ - మామూలే కదా, ఇంతకన్న ఎక్కువ లేదు" అనేసి ముందుకు సాగిపోయింది. అప్పుడు అసలు కథ తెలిసింది. మోపులు, దగ్గర్లోనే ఉన్న మెంటాడలో అమ్ముకుని డబ్బు చేసుకుంటారు. నాకిదంతా చాలా సరదాగా ఉండేది. అక్కడి పనివాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ అడవి, తోట మధ్య పచార్లు చేస్తూ, పనివాళ్ళు తేనెపట్టులు కొట్టి పిండిన తేనె తీసుకుని గోధుమ రొట్టెల్ని తింటూ తిరుగుతూండేవాడిని. వాళ్ళకి ఎదురుగా ఓ మనిషి ఉంటే చాలు. పని యధాతథంగా జరిగిపోతుంది. నేనక్కడ ఉన్నన్నాళ్ళూ నాన్నగారికి విశ్రాంతి. ఏ భగవద్గీతో, భాగవతమో చదువుతూ దగ్గర్లోనే ఉన్న ఇంట్లోకూర్చునేవారు. వాగులో ఎన్నడూ నీటిని చూడలేదు నేను. అయితే నేను వెళ్ళేది వేసవి కావడం కారణమేమో మెత్తటి ఇసక మాత్రం ఎండకి మెరుస్తుంటుంది. సాయంకాలం వేళల్లో నాన్నగారూ, నేనూ వాగు వెంబడే చీకటి పడేవరకూ నడిచేవాళ్ళం. అక్కడ సాధారణంగా సరుగుడు మొలవదు. బాగా ఇసక ఉన్న ప్రాంతం కావాలి. కాని వాగుకి ఇవతల ఎప్పుడో కొట్టుకు వచ్చి నిలిచిపోయిన పర్రలో సరుగుడు వేశారు. ఆ దగ్గర్లోనే కొద్ది ప్రాంతంలో క్రమంగా పెంచి తోటపని చేశారు. నాన్నగారు ఉంటున్న చోటుకి అది దగ్గర ఉండడం వల్ల తరుచు మేం అక్కడికి చేరుతూ ఉండడం కద్దు. నాన్నగారితోపాటే ఒక నాయర్ని తీసుకెళ్ళేవారు. మేం వచ్చేసరికి ఇద్దరికీ వంట చేసి భోజనం సిద్ధం చేసేవాడు. భోజనం అయాక మరీ ఉక్కగా ఉంటే బయట మంచం వేసుకుని ట్రాన్సిస్టర్ పక్కనే ఉంచుకుని నిద్రపోయేవాణ్ణి. వెన్నెల రాత్రయితే చంద్రుడు సరుగుడు తోట వెనక నుంచి జైల్లోంచి తొంగిచూస్తున్న దొంగలాగ కనిపించేవాడు. గాలికి సరుగుడు చెట్లు మీదకి వంగి, ఏదో రహస్యాన్ని దాస్తున్న నమ్మకమయిన సేవకుల్లాగ కనిపించేవి. చాలా విశ్రాంతిగా, ముచ్చటగా గడిచిపోయేవి రోజులు.

వేసవి వచ్చిందంటే ఈ అందమయిన కల కనడానికి ఎప్పుడు వెళతానా అని ఉవ్విళ్ళూరేవాడిని. కాని ఈసారి మాత్రం విజయనగరం వదలిపోవాలనిపించలేదు. దానికి కారణం చెప్పేస్తాను. ***అచేతనమయిన ప్రకృతి సౌందర్యంలో కంటే చేతనాకృతిలో ఆనందం ఎక్కువ ఉన్నదేమో. కదిలేది కదిలించినట్టు హృదయాన్ని మరేదీ కదిలించలేదు.*** ఇంతకూ కారణం ఒక మాటలో సుబ్బులంటే అన్యాయమే అవుతుంది. ప్రతిసారీ ఈ ఇల్లూ, అమ్మ పెట్టే పిండివంటలూ తప్ప చుట్టూ వాతావరణం కొత్తగా ఉండేది. ఏ నవలో చదువుకుంటూ వారం రోజుల పాటు గడిపి నాన్న దగ్గరికి పారిపోయేవాడిని. కాని ఈసారి చుట్టూ వాతావరణం పరిచయమయింది. ఇక్కడ జీవితంలో మొదటిసారిగా ఏదో కదలికను గుర్తించాను. చుట్టూ ఉన్న నలుగురూ నన్ను గురించి ఆలోచిస్తున్నారు. నేనూ ఆలోచించే అవకాశం ఇస్తున్నాను. నాన్నగారి దగ్గర వాతావరణంలో సరుగుడు తోటల కదలికలూ, వాగులూ, షికార్లూ ఉన్నాయే కాని శోభనాద్రి పలకరింపులూ, లాయరుగారి కబుర్లూ, అన్నిటికీ మించి కరివేపాకు బేరం దగ్గర సుబ్బులు చిరునవ్వులూ కనిపించవు.

వీటిని విడిచి వెళ్ళడం చాలా పెద్ద నష్టం. అందుకని నాన్నగారు ఈసారి రమ్మని కబురు పంపినప్పుడు రావాలని లేదనీ, ఇక్కడే గడపదలచుకున్నాననీ చెప్పాను. కాని ఎందుకనో నాన్నగారు పట్టుబట్టారు. "నీ అవసరం ఉంది. కావాలనుకుంటే మళ్ళీ వెళ్ళిపోదువుగాని, ఒకసారి వచ్చిపో" అని వ్రాశారు. ఇక ఏడుపు ముఖంతో ప్రయాణానికి అంగీకరించాను. కాని త్వరగా వచ్చేయాలని మనస్సులో పదే పదే అనుకున్నాను.

బయలుదేరే ముందు ఒకసారి సుబ్బులుతో మాట్లాడాలనుకున్నాను. నిజానికి మాట్లాడవలసిన అవసరమేమీ లేదు. కానీ ***ఆలోచనల్లో అనుబంధాలు పెరిగినట్టు, ఆచరణల్లో పెరగడం సాధ్యం కాదేమో!*** ఈ తక్కువ వ్యవధిలో సుబ్బులు నా నిత్యజీవితంలో ఒక భాగమయిపోయింది. అయితే అమ్మ దగ్గరికి తరుచు వచ్చే మనిషి ఆ రోజు చుట్టుపక్కలకి రాలేదు. బయలుదేరవలసిన సమయం దగ్గర

పడుతున్న కొద్దీ సుబ్బుల్ని కలవకుండా వెళ్ళిపోవాలేమోనన్న ఆరాటం ఎక్కువయింది. ఇక బయలుదేరుతాననగా గదిలో బట్టలు సర్దుకుంటూ పాత డైరీని చూస్తున్నాను. నేనింట్లో లేననుకుంది కాబోలు - "అత్తయ్యగారూ!" అంటూ వచ్చింది. అమ్మ పెరట్లో ఏదో పని చేస్తోంది. గది కాస్త చీకటిగా ఉంది. ఆ రంగులో కలిసిపోవటం వల్ల కాబోలు నన్ను వెంటనే పోల్చలేకపోయింది. కాని నేను లేచి నిలబడ్డాను.

"నేను వచ్చి మీ అత్తయ్యతో స్నేహాన్ని పాడుచేసినట్టున్నాను" అన్నాను.

నన్ను చూసి త్రుళ్ళిపడింది. అంతేకాని ఆత్రంగా అక్కడినుంచి పారిపోలేదు.

"మీరా! ఇంకా మీ నాన్నగారి దగ్గరకి వెళ్ళలేదూ?" అంది.

నేను నిర్ఘాంతపోయాను. అయితే నేను వెళుతున్నట్టు తనకు తెలుసన్నమాట!

"నీకెలా తెలుసు?" అనడిగాను.

"అత్తయ్యగారు చెప్పారు. ప్రతి సంవత్సరం వెళతారటగా? చాలా బాగుంటుందటగా?"

"చూస్తే గాని ఎలా చెప్పడం? పోనీ అమ్మతో పాటు నువ్వు రాకూడదూ ఒకసారి?"

"అమ్మో! తాతయ్య ఒప్పుకోరు."

***తమ ఇష్టాలకి అందమయిన రంగు వేసే నేర్పు ఒక్క ఆడవాళ్ళకే ఇచ్చాడు భగవంతుడు.*** ఇదే మగవాడైతే 'తీరికేదీ' అనేవాడు.

"పోనీ మీ తాతయ్యని కూడా వెంటబెట్టుకు వస్తే"-

నవ్వి, నా ముఖంలోకి చూసి 'జరగని పనుల గురించి ఆలోచించి ఏం లాభం?' అంది నేను నిరుత్సాహపడుతున్నానని గ్రహించిందిగావును తలెత్తి 'మళ్ళీ ఎప్పుడొస్తారు?' అంది.

నా ఉత్సాహం కట్టలు తెంచుకుంది. "ఈసారి నాకసలు వెళ్ళాలనే లేదు. నాన్నగారు పట్టుబడుతున్నారు. త్వరగానే వచ్చేయాలి. ఎందుకనో ఈసారి నాకిక్కడే బాగుంది!"

అర్థమయింది సుబ్బులుకి. వెండిగ్లాసు నోటికడ్డం పెట్టుకుని దాన్నిండా చిరునవ్వుల్ని నింపింది.

ఇంతలో అమ్మ పెరట్లోంచి చూసినట్టుంది. 'ఏం సుబ్బులూ?' అని కేకేసింది.

"ఇక్కడే వుంటావా కొన్నాళ్ళు?"

"కొన్నాళ్ళేమిటి? చాలా రోజులుండాలి" అంటూ గుమ్మం దాటేసింది.

అనుకున్న పనిని సాధించిన తృప్తితో నిశ్చింతగా దేవులపల్లి బయలుదేరాను. అక్కడి నుంచి పదిమైళ్ళు లారీ ప్రయాణం. కంట్రాక్టరుగారి అబ్బాయినని నన్ను కాస్త జాగ్రత్తగా కూచోపెడతారు. మధ్య మధ్య లారీ ఆపి కొబ్బరిబొండాలు కొట్టిస్తారు. ఏమయినా ఈసారి ప్రయాణం అంత రక్తికట్టలేదు. నాన్నగారిని చూసి తెల్లబోయాను. గత అయిదేళ్ళలో ఇంత నీరసంగా, ఇంత పాలిపోయి ఎన్నడూ కనిపించలేదు ఆయన. ఆయన్ని చూశాక నన్నెందుకు రమ్మన్నారో ఒక విధంగా అర్థమయింది. ***తన అశక్తతను తను దాచుకునే చేవ ఉన్నంతవరకూ వయస్సు ఉన్నట్టే లెక్క. దాన్ని బయటికి చెప్పుకోవడమే వయస్సు మీరడమంటే -***

"ఇదివరకులాగ పనివాళ్ళతో నిలబడలేక పోతున్నానురా ఎంచేతో!" అన్నారు నాతో మెల్లగా. మా ఇద్దర్నీ దగ్గరగా చూస్తూ ఎవరూ తండ్రీకొడుకులనుకోరు. ఆయన నా కన్న కాస్త పొట్టిగా కనిపిస్తారు. నాన్నగారు నన్నెప్పుడూ స్నేహితుడిలాగ ఆదరిస్తారు. భుజం మీద చెయ్యేసి నడిపిస్తూ యధాలాపంగానే కబుర్లు చెపుతారు.

గుమస్తా అప్పలాజుగారు వచ్చి పలకరించారు. ఆ ప్రాంతంలోనే ఉంటున్న ఆయన్ని గుమాస్తాగా పెట్టుకున్నారు నాన్నగారు. అప్పలాజుగారు పుట్టినప్పటినుంచీ ఆ ప్రాంతంలోనే బ్రతికారు. ఆ అడవుల్లో ఎక్కడ ఎన్ని రకాల చెట్టులున్నాయో, ఏ సీజనులో కలప ధర

పెరుగుతుందో, పడిపోతుందో, ఏ చెట్టు ముందు నరికించాలో ఇవన్నీ ఆయనకు కరతలామలకాలు. ఆయనకి పెళ్ళాం లేదు. విధవ చెల్లెలు ఒకావిడ ఆయన దగ్గర ఉంటూ వండి పెడుతుంది. సీతాలు, సింహాద్రి అతని కుడి ఎడమ భుజాల్లాగ పనిచేస్తారు. సీతాలు చిన్నప్పటినుంచీ మా ఇంట్లోనే ఉంటూ వచ్చాడు. నన్ను ఎత్తుకు తిరిగాడు. నన్ను "చిన్నబాబుగోరు" అంటూ మొన్న మొన్నటి దాకా వాటేసి మీదకి ఎగరేసేవాడు. సింహాద్రిది కాస్త మధ్య వయస్సు. బొద్దు మీసాలు. ఎప్పుడూ ఒంటిమీద మూరెడు పంచె తప్ప మరేమీ ఉండదు. కండలు తిరిగిన శరీరం, చేతిలో గండ్రగొడ్డలి. ఎప్పుడూ చెట్లు నరుకుతూనో, పొగాకు నవులుతూనో కనిపిస్తాడు. మనిషి ఎంత పులిలా కనిపిస్తాడో అంతటి సాధువు. నేనంటే వాడికి మహా మక్కువ. నేనున్నాళ్ళూ సాయంకాలమయేసరికి రహస్యంగా వచ్చి నా పక్కన నిలబెడతాడు. వాడికి ఏం కావాలో నాకు తెలుసు. కల్లు తాగడానికి చిల్లర డబ్బులు ఇస్తే వంగి వంగి నమస్కారాలు చేస్తూ వెళతాడు.

ఏ అర్ధరాత్రికో సరుగుడు తోటల్లో కోనేరు పదాలు వినిపించాయంటే సింహాద్రి ఇంటికి తిరిగివస్తున్నట్లు లెక్క. వాడికి మొదట్లో చాలా అందమయిన పెళ్ళాం ఉండేది. వీడు ఒకరోజు ఇలా తాగి వచ్చేసరికి అదెవరితోనో లేచిపోయిందట! ఆ తర్వాత మరో అమ్మాయిని చేసుకున్నాడు. ఇది నల్లగా మొద్దులాగా ఉంటుంది. దగ్గిర పల్లెలోకి వెళ్ళి ఏవైనా పై పనులు చేస్తూ ఉంటుంది. అదంతా చిన్న ప్రపంచం. నాతో తీసుకువెళ్ళే ట్రాన్సిస్టర్ లేకపోతే బయటి సంగతులు నాకు తెలియవు. వాళ్ళకసలే అవసరం లేదు. నెహ్రూగారు ఎప్పుడు పోయారో, ఇందిరాగాంధీ ఎవరో వాళ్ళకి తెలీదు.

సీతాల్ని తీరికవేళల్లో కవ్విస్తే వేదాంతం చెపుతాడు. "అక్కడ పెద్ద కుర్చీల్లో ఎవరు కూర్చుంటే మాకేటి బాబూ! అక్కడ మారాజు కూర్చున్నంత మాత్రాన మా గొడ్డలి బంగారం కాదు. రాజులు మారితే రోజు కూలి మారుతుందా?"

ఇది మొదటి దశ. జీవాత్మ, పరమాత్మ, బెమ్మంగారు, చిలుకతత్వాలూ ఇవన్నీ బయటకి రావాలంటే చీకటిపడాలి. చిటికెడు గంజాయి పీల్చాలి. వీళ్ళందరి మధ్య దొరికే మూడు నెలల విశ్రాంతి ఒక సంవత్సరానికి సరిపోయేది. ఓ విధంగా నాన్నగారికీ బయట ప్రపంచంతో ఏ సంబంధమూ లేదు. చిన్న ఇంటిలో నాయరు, భగవద్గీత, భాగవతం ఉంటే చాలు. అవసరమయితే నాయరు నాన్నగారికి ఒళ్ళుపడతాడు. బట్టలు ఉతికి ఆరేస్తాడు. ఏ వారానికో పదిరోజులకో విజయనగరం వస్తే వస్తారు. లేకపోతే లేదు. అసలా వాతావరణంలోనే సాధుత్వం ఉన్నదేమోననిపిస్తుంది. ఋషులు సాధు స్వభావులయ్యాక హిమాలయాలకి పోలేదు. అటువంటి స్థలాల్లో నీరవ నిశ్శబ్దంలో భాగమయిపోయారు కనక సాధుత్వం అలవడిందనుకుంటాను.

ఓసారి సరుగుడు మొదటి వరస నరికారు. సాధారణంగా నాలుగయిదు వరుసల పని పూర్తికావాలంటే పదిరోజులు పడుతుంది. మొదటి రోజు పనేమో అందరూ బాగా అలసిపోయారు! ఆ రోజే నేను వచ్చాను అక్కడికి. సింహాద్రి మొదటిసారిగా నా దగ్గర చెయ్యిజాపాడు. కొత్త కనక ఇవ్వవలసినదాని కంటే ఎక్కువే ఇచ్చాను. అర్ధరాత్రి అయేసరికి పెద్ద కేకలు వినిపించాయి. బయటపడుకున్న నేను త్రుళ్ళుపడి లేచాను. సింహాద్రి పెళ్ళాం ఏడుస్తూ పరుగెత్తుకొచ్చింది. సరుగుడు తోటల్లోంచి సింహాద్రి తప్పతాగి వస్తూంటే ఎలుగుబంటి పట్టేసిందట? ఇంకా పెనుగులాడుతున్నాడంది. నాన్నగారు లేచారు. అంతా విని తుపాకీ తీసుకు పరిగెత్తారు. అప్పటికే అప్పలరాజుగారు, సీతాలు, మరి నలుగురయిదుగురు మనుషులూ చేరిపోయారు. చాలా పెద్ద ఎలుగుగొడ్డు. ఎలా వచ్చిందో సరుగుడు తోటల మధ్యకి వచ్చింది. ఇంకొకప్పుడయితే ఎవరూ దానికి ఎదురు నిలబడలేకపోయేవారే. కాని సింహాద్రి మైకంలో ఉన్నాడు. ఆ ఊపులో వాడికేం తెలియడం లేదు. అప్పలరాజుగారు బ్యాటరీలైటు తెచ్చారు. ఆ వెలుగులో ఓ నల్లటి పెద్ద ఆకారం, సింహాద్రి పంచె గుర్తు తెలుస్తున్నాయి. ఎలుగు గోళ్ళతో పట్టడానికి ప్రయత్నం చేస్తోంది. దగ్గర దగ్గరగా చెట్లుండటం వల్ల ఇటు నుంచి అటూ, అటు నుంచి ఇటూ మెలికలు తిరుగుతూ తప్పించుకుంటున్నాడు సింహాద్రి. శరీరం పెద్దది కనక ఎలుగు అంత సులువుగా తప్పించుకోలేకపోతోంది. అసలు సింహాద్రి దాన్ని వదిలి పారిపోవచ్చు. కాని ఆ స్పృహలోలేడతను. ఒడుపు చూసి కాలితో, చేత్తో వేస్తున్నాడు. ఇహ బూతులు చెప్పడానికి వీల్లేదు. విపరీతంగా తిడుతున్నాడు. కేకలు వేస్తున్నాడు. రొప్పుతున్నాడు.

సింహాద్రి పెళ్ళాం ఒక్కటే ఏడుపు. నాన్నగారు కాల్చేస్తానన్నారు. కాని అప్పలరాజుగారు ఒప్పుకోలేదు. "అది మొండి జంతువు బాబూ, దెబ్బ తప్పిందంటే మన ఇళ్ళమీద పడిపోతుంది. సరుగుడు తోటల్లో ఇరుక్కుంది కనక దానిని సింహాద్రి ఆపాడు కాని, బయటికి వస్తే మనం కొట్టే లోపల ఎవరినో ఒకర్ని పట్టేస్తుంది" అన్నాడు. మళ్ళీ ఆయన లైటు వేసారు. ఎప్పుడు కొట్టిందో సింహాద్రి భుజం కొట్టేసింది. రక్తం కారుతోంది. ఒక్కసారి గావుకేక పెట్టాడు సింహాద్రి. నోరార తిట్టాడు. హఠాత్తుగా అప్పలరాజు గారికి ఒక ఆలోచన వచ్చింది. సీతాలునీ, మరి నలుగురు కూలీలనూ గొడ్డళ్ళు పట్టుకురమ్మన్నారు. నరికిన మొదటి వరస సరుగుడు సరుగుడు మొదళ్ళు మిగిలిపోయి ఉంటాయి. వాటిని పదనుగా మేకుల్లాగ చీరేయించారు. అక్కడికి పదిగజాల దూరంలోనే పోరాటం సాగుతోంది. వరస వరసంతా చీరేయించాక, ఒకటి రెండు గొడ్డళ్ళు పక్కనే పడేయించారు. మెల్లగా సీతాలుని వెనకనుంచి సింహాద్రికి మాట అందే దూరానికి పంపారు. "మొదటి వరసకి గొడ్డును మళ్ళించరోయ్" అని కేకలు వేసాడు సీతాలు. అప్పటికే సింహాద్రికి చాలా మటుకు మత్తు దిగిపోయింది. ఎంత దిట్టమయిన వాడైనా ఈ పాటికి అలిసి పోయాడు. కాస్త భయం కూడా వేసినట్టుంది. సీతాలు ఒకటికి రెండు సార్లు అరవగానే అర్థం చేసుకున్నాడు. మెల్లగా వెసులుబాటు చూసుకుంటూ ఎలుగుని మొదటి వరసకి మళ్ళించాడు. చూడటానికి వచ్చిన వాళ్ళందరినీ దూరానికి పంపించేశారు అప్పలరాజుగారు. ఆయనకి వేటలో ప్రావీణ్యం ఉంది. నాన్నగారు తుపాకీ తీసుకుని ఓ మూలకి వచ్చారు. సీతాలునీ, మిగతా కూలీలనీ గొడ్డళ్ళతో సిద్ధంగా ఉండమన్నారు. సింహాద్రి మరోవేపు చూస్తూ వెనక్కి నడుస్తున్నాడు. పొరపాటున మొదళ్ళమీదకి సింహాద్రి జారాడంటే రూఢిగా చావే.. సందేహం లేదు. క్రింద క్రమొదళ్ళు, మీదన ఎలుగూ! వాడి ప్రాణానికి చాలు. అప్పలరాజుగారు ఇది గమనించినట్టున్నారు. "మొదటి వరసని చెక్కినట్టు సింహాద్రికి చెప్పరోయ్" అని అరిచారు ఉన్నట్టుండి. సీతాలు గావుకేక పెట్టాడు. సింహాద్రి ఇటు తిరిగాడు. ఎలుగు వాడిమీదకి ఉరికేసింది. ఎప్పుడు గమనించారో అప్పలరాజుగారు, ఒక్కసారి ముందుకి లంఘించి నేలమీద పడబోతున్న రెండు శరీరాల్నీ మొదటి వరసమీదకి విసిరేశారు. ఆ విసరడం ఎలుగు కింద పడేలా విసిరేశారు. క్రింద పడీపడటంతో కనీసం నాలుగు మొదళ్ళు దాని శరీరంలో దిగి ఉంటాయి. ఆ బాధతో ఒక్క అరుపు అరిచి సింహాద్రి పట్టు వదులు చేసింది. సింహాద్రిని ఒక్క లాగు లాగారు ఆయన. అంతే, మరుక్షణంలో సీతాలుతోపాటు నాలుగు గొడ్డళ్ళు దానిమీద పడ్డాయి. రెండు తూటాలు కూడా శరీరం లోంచి నేలలోకి దూసుకుపోయాయి. అంతే, గొడ్డు కదల్లేదు, సింహాద్రి మాత్రం సొమ్మసిల్లిపడిపోయాడు. భుజాల మీద, తొడల దగ్గర గోళ్ళు బలంగా దిగాయి. పక్క ఎముకలు కాస్త నలిగాయి. ఆ దెబ్బకి అంత మనిషీ రెండు నెలలు మంచం పట్టాడు. కొంతవరకూ షాక్ కూడా ఉండి ఉండచ్చు. వాడు ఇప్పటికీ తాగినప్పుడల్లా ఎలుగు కథ వీరోచితంగా చెపుతాడు. ఇంతకీ ఆ రోజు అప్పలరాజు గారి సమయస్ఫూర్తి లేకపోతే అంత సింహాద్రినీ వదులుకోవలసి వచ్చేది. అది గుర్తు చేస్తే ఆయన నవ్వి "అయినా ఊరివేపుకి ఎలుగు ఎలా వచ్చిందో ఇప్పటికీ ఆశ్చర్యమే బాబూ" అంటారు" అంటారు. ఆయన చిన్నతనంలోనూ, మరోసారి పెళ్ళయిన కొత్తలోనూ చిరుతని కొట్టడం తెలుసట గాని, ఎలుగు ఎప్పుడూ రాలేదంటారు. ఏమయినా ఇది నాకు గుర్తుండిపోయింది. అర్ధరాత్రి సింహాద్రి పాట ఎప్పుడు వినిపించినా ఒక్కసారి మనస్సులో ఈ సంఘటన కదులుతుంది.

## 6

వచ్చినప్పట్నుంచీ ఇంటి దృష్టిలో ఉండడం నాన్నగారికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆరోజు సాయంకాలం వాగులో నడూస్తూ "నీ ఒంట్లో బాగాలేదా?" అనడిగారు.

"అబ్బే! అదేం లేదు" అన్నాను.

"మరి?" అన్నారు.

"కొంత కాలేజీ వర్కు ఉంది. చదువుకోవాలి."

"అయితే పుస్తకాలు తెచ్చుకోలేకపోయావా? ఇక్కడికంటే చదువు ఇంటిదగ్గర బాగా సాగుతుందా?" అన్నారు.

నేనేం మాట్లాడలేదు. తర్వాత వ్యాపారాన్ని గురించి ఏకరువు పెట్టారు. వింటూ ఆయనతో నడిచాను. ఎంచేతనో మనిషిలో నిస్పృహ, నీరసం ప్రవేశించినట్టు కనిపెట్టాను. తిరిగి వచ్చాక నాయర్ని అడిగాను. "నాన్నగారు మామూలుగా భోజనం చేస్తున్నారా?" అని.

"లేదు బాబూ! ఈ మధ్య బొత్తిగా తగ్గించేశారు" అన్నాడు.

అయిదురోజుల తర్వాత ఓ రోజు మధ్యాహ్నం సరుగుడు తోటలో కూచుని తాటిముంజెలు తింటున్నాను. ఎండ జల్లెడలోంచి జారిన పిండిలాగ మెత్తగా అక్కడక్కడ పడుతోంది. కూలీలు ఒక్కొక్క పని చేస్తున్నారు. ఉన్నట్లుండి, దుర్మార్గుడి అహంకారంలాగ దూరాన పెద్ద పెద్ద చెట్లు కూలిపోతున్నాయి. చెట్లు కొడుతున్నప్పుడు ప్రతీ గొడ్డలి దెబ్బకీ లయ పడేటట్టు విచిత్రమయిన పదాలు ఎత్తుకుంటారు కూలీలు. వింటూ ముంజెలు తింటున్నాను. హఠాత్తుగా నాయరు పరుగెత్తుకొచ్చాడు. "చిన్నబాబుగారూ" అంటూ.

నాకు భయమేసింది "ఏమిటేమి"టంటూ లేచాను.

"నాన్నగారు మొహం తిరిగి పడిపోయారు బాబూ. స్పృహ లేదు" అన్నాడు. త్రుళ్ళిపడ్డాను. కాళ్ళలో వణుకు ప్రారంభమయింది. తెల్లవారు ఝామునే తోటకి బయలుదేరి రావడం ఆనవాయితీ. నేనున్న రోజుల్లో నాన్నగారు ఆలస్యంగా లేచి పూజా పునస్కారాలు పూర్తి చేసుకుని వస్తారు. నేను బయటే పడుకుంటాను కనక లేచి నూతి దగ్గర కాలకృత్యాలు తీర్చుకుని తోటకి బయలుదేరిపోతాను. నిన్న సాయంకాలం షికారుకి రాలేదు నాన్నగారు. "కొంత రాత పని ఉందిరా, నువ్వెళ్ళు" అన్నారు. అప్పలరాజుగారు దగ్గరే ఉన్నారు. నవ్వి "నాకేం పనిలేదు. నేను వస్తా, పదండి బాబూ.. " అన్నారు. ఉదయం కూడా నాన్నగారిని చూడలేదు. ఇప్పుడు నాయరు మాట వినగానే నాకు బేజారెత్తింది. దగ్గర పల్లెటూళ్ళోని వైద్యుణ్ణి వెంటబెట్టుకు రమ్మని సీతాల్ని పంపి నేను ఇంటివేపు పరిగెత్తాను. నా ఎరికలో ఎప్పుడూ నాన్నగారు మంచాన పడలేదు. ఎప్పుడూ తీరికగా పడుకుని ఉండడం చూడలేదు. ఆయనతో మాట్లాడినవాళ్ళకీ, పనిచేసేవాళ్ళకీ చురుకు పుట్టించే తరహా ఆయనది. అలాంటిది ఆయన్ని మంచం మీద ఊహించుకుంటే భయమేసింది. కళ్ళు చెమ్మగిల్లాయి. కాని ఇంటికి వచ్చేసరికి పరిస్థితి వేరుగా ఉంది. నాన్నగారు గడ్డం చేసుకుంటున్నారు. మమ్మల్ని చూసి చిరునవ్వు నవ్వారు. నాయరు మీద విరుచుకు పడ్డారు. "నీకు బుద్ధిలేదూ? ఆ మాత్రం దానికే పరుగుపెట్టావా ఫూల్" అంటూ.

"అదేమిటి బాబూ - ఎంత పిలిచినా మీరు కన్నువిప్పలేదు" అంటాడు నాయరు.

ఉదయం "భోజనం వద్దు. ఏదయినా ఫలహారం చెయ్య"మన్నారట. కాఫీ టిఫిన్ సిద్ధం చేశాక నాయరు పిలిస్తే లేవబోయి గుమ్మం మీదకి తూలిపోయారట. అంతే, నాయరు నడిపించి తీసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టాడు. పెద్ద దెబ్బ తగల్లేదు కాని నుదిటిమీద చిన్న బొప్పికట్టింది. కాని తనకి బాధని ఒప్పుకోలేదు. ఇలాంటిచోట అవసరమని అయిదేళ్ళ క్రిందట హోమియోపతి పుస్తకాలు చాలా తెప్పించి చదివారు. ఒక మందుల పెట్టె కొనుక్కు తెచ్చుకున్నారు. ఆ మాత్రం ఈ మాత్రం జబ్బులన్నిటికీ అక్కడి కూలీలకీ ఆయనే మందులు ఇస్తారు. ఇప్పుడు తనూ ఓ మందు తీసి వేసుకున్నారు. మరో గంటన్నరకి వైద్యుడూ వచ్చాడు. బలవంతాన పరీక్ష చేయించాం. తనకి ఒంట్లో బాలేదని సుతారమూ ఒప్పుకోరు. మొండి పట్టుదల. అతనేదో మందు చెపితే పుస్తకం తీసి తను వేసుకున్న మందే మంచిదని నిరూపించేసరికి వైద్యుడు తెల్లమొహం వేశాడు. మేమంతా చోద్యం చూస్తూ నిలబడ్డామే తప్ప నేనుగాని, అప్పలరాజుగారు గాని ఆయన్ని విశ్రాంతి తీసుకోమని నచ్చచెప్పలేకపోయాం. వచ్చిన వైద్యుణ్ణి తిరిగి వెళ్ళనివ్వలేదు. అతణ్ణి మాతో భోజనానికి కూర్చోపెట్టారు. సుష్టుగా భోజనం చేశారు. చలిజ్వరానికి మలేరియాకి మందుల విషయం ఆయనతో చర్చించారు. మధ్యాహ్నం బండి ఇచ్చి పంపారు.

కాని ఆత్మశక్తితో అనారోగ్యాన్ని జయించలేకపోయారు నాన్నగారు. సాయంకాలం ఇంటికొచ్చేసరికి చలితో వణుకుతున్నారు శాలువా కప్పుకుని, "చలిజ్వరం వచ్చిందిరా. తగ్గుతుందిలే" అన్నారు నన్ను చూసి నవ్వి. ఆ సాయంకాలమంతా ఆయన పక్కన కూర్చుని

కబుర్లు చెప్పాను. ఇంటికి వెళ్ళిపోదామంటే సుతారమూ ఒప్పుకోలేదు. మరి రెండు మూడు రోజులకీ తగ్గకపోయేసరికి ఇంటికి ఉత్తరం వ్రాశాను. నాన్నగారికి జ్వరంగా ఉందని.

మర్నాటి ఉదయం నిద్రపోతున్న నన్ను సీతాలు తట్టి లేపాడు. "బాబూ, బాబూ అమ్మగారు వచ్చారు" అంటూ. ఉలిక్కిపడి లేచాను. దూరాన బండి రావడం కనిపించింది. అమ్మ ఇలా బయలుదేరి రావడం ఆశ్చర్యం కలిగించినా ఒకందుకు మంచిదే అనుకున్నాను లేచి, నేనూ సీతాలూ రోడ్డుమీదకి నడిచాం బస్సు దగ్గర్నుంచి రెండు మైళ్ళు బండి కట్టించుకు రావాలి. తోడు లేకుండా బయలుదేరి వచ్చిందే అని ఆందోళన పడ్డాను. నన్ను చూసి -

"నాన్నగారికి ఎలా ఉందిరా" అని ఆత్రంగా అడిగింది.

"ఫరవాలేదమ్మా! ఒంటరిగా బయలుదేరి వచ్చావేం? కబురంపితే సీతాల్ని పంపేవాణ్ణిగా" అంటుండగానే అమ్మ వెనకాలెవరో మనిషి ఉండడం గమనించాను. సుబ్బుల్ని గుర్తుపట్టి ఆశ్చర్యపోయాను.

"నీ ఉత్తరం చూశాక నాకు కరచరణాలు ఆడలేదు. ఏం చెయ్యాలో తోచక బెంబేలు పడుతూంటే సుబ్బులు నాకు ధైర్యం చెప్పింది. వాళ్ళ మామ్మని అడిగి కావలిస్తే తను తోడుగా వస్తానంది. సమయానికి వాళ్ళ తాతయ్య కూడా ఊళ్ళో లేరు. వాళ్ళ మామ్మని బతిమాలి, ఆవిణ్ణి ఒంటరిగా వదిలేసి పరిగెత్తుకు వచ్చాను" అంది. నాకు చాలా ఆనందం కలిగింది. సుబ్బులు దిగగానే మా అమ్మకి వినపించకుండా థాంక్స్ చెప్పాను. సుబ్బులు మాట్లాడలేదు. మా అమ్మ కొంగు వదలనూ లేదు. నా ముఖం ఓసారి ప్రసన్నంగా చూసి ఆమె వెనక్కి నిలబడింది. ఇప్పుడు సుబ్బుల్ని చూశాక ఈ పదిరోజులూ ఎంత నీరసంగా గడిచాయో ఒక్కసారి అర్ధమయింది. ఇంతవరకూ నిరర్ధకంగా, నిర్జీవంగా కనిపించే అడవీ, చింతతోపూ, సరుగుడు తోటలూ, వారూ, సాయంకాలపు షికార్లూ, అర్ధవంతంగా, మధురంగా గోచరించాయి. రాకరాక వచ్చిన మా ప్రత్యేకాతిధికి మా తోటల్ని చూపించవచ్చు. అడవి అడవంతా తిప్పి తీసుకురావచ్చు. మధ్యాహ్నం తాటితోపుల్లోకి తీసుకెళ్ళి తాటిముంజెలు తినిపించాలి. సాయంకాలం వాగు షికారు ఉండనే ఉంది. కలలు కంటున్న ఆరాధ్యదేవత తన రాజ్యంలోకి వచ్చినప్పటి సంతోషం ఆ కొద్ది వ్యవధిలో అనుభవించాను.

అమ్మని చూడగానే నాన్నగారు ఆశ్చర్యపోయారు. కాని ఆమెని చూశాక ఆమె ఉనికి అవసరమని ఆయనకి అప్పుడనిపించినట్టుంది. ఇలాంటి సందర్భాలలో సేవ చేసే భార్య పక్కన ఉండడం నిజంగా ఎంత అదృష్టం! రోజంతా నాన్నగారి మంచం దగ్గర్నుంచి కదల్లేదు అమ్మ. ఇక్కడ ఆడవాళ్ళు స్నానం చేయడానికి నీళ్ళు లేవు. వెంటనే సీతాలుని పంపించి ఆడవాళ్ళ స్నానానికి తాటిమట్టలతో చిన్న మరుగుని అల్లించాను. ఒక్క గంటలో తాత్కాలిగంగా బాత్ రూం తయారయింది. సుబ్బులు ఇంటి వసారాలో కూర్చుని వింతగా అడివినీ, అటునుంచి వినవచ్చే రకరకాల పక్షుల అరుపుల్నీ పరికిస్తోంది. అటు నుంచి ఇటు వెళుతూ పలకరించాను.

"రమ్మని ఆహ్వానించారుగా, వచ్చాను." అంది నవ్వుతూ.

"చాలా థాంక్స్. స్నానం, భోజనం అయాక తోటా, అడవి చూపిస్తాను. ఇక్కడికి ఫర్లాంగు దాటితే అడవి మరీ దట్టమవుతుంది. కాంట్రాక్టు ఇచ్చిన భాగమంతా గుర్తుపెట్టుకుంటాం. మిగతా అడవిలో మాత్రం ఏమీ చెయ్యకూడదు. చూడ్డానికి చాలా బాగుంటుంది . మండు వేసవిలో కూడా నిండు పున్నమి లాగ ఉంటుంది. అడవిలో చెట్లమధ్య" అన్నాను.

"అసలే పెద్ద కళ్ళు. మరింత పెద్దవి చేసి, పులులుంటాయా?" అంది.

"అంటే ఉండొచ్చు. అన్నిరకాల జంతువులూ అక్కడక్కడ కనిపిస్తాయి. ఉన్నా అందమయిన అమ్మాయిల్ని ఏమీ చెయ్యవు. ఇక్కడ మనుషులకీ, జంతువులకీ మంచి అభిరుచి ఉంది" కావాలని జోక్ విసిరాడు. కాని అది సుబ్బులికి అర్ధం కాలేదు. భావకుల కవితావేశం లాగ నా జోక్ సుబ్బులు మీద ఏష్టయిందనుకుంటూ కూలీలకు పనులు చెప్పడానికి బయలుదేరాను. ఇవాళ పనంతా చురుకుగా సాగుతున్నట్టనిపించింది. అమ్మగారిని చూడడానికని కొందరు ఇంటికి బయలుదేరారు. ఉన్నవాళ్ళతోనయినా పని చేయించే దృష్టి లేదు.

చాలా మంది అయ్యగారి ఆరోగ్యం గురించి మధ్య మధ్య మాట్లాడుతున్నారు. అప్పలరాజుగారు పదకొండు కాగానే వచ్చి, "నేను కూర్చుంటాను బాబూ, ఇంటి దగ్గర ఆడవాళ్ళున్నారు. మీరెళ్ళి వాళ్ళకేం కావాలో చూడండి" అన్నారు.

మనస్సులో ఆయనకి కృతజ్ఞత చెప్పుకుని ఇంటివేపు బయలుదేరాను.

"రెండు చెట్ల కాయలు దింపించాను బాబూ! తాటి ముంజెలు రెండు గంటలకి ఇంటికి వస్తాయి" అన్నారు వెళ్ళబోతూంటే, ఏదో ఆలోచన తోచి, ఆగి "వాటిని తోపులోనే ఉంచండి. అక్కడికే వచ్చి తింటాం" అన్నాను.

ఇంటికివస్తే బయట తిరిగే సదవకాశం పోతుందనే తపన.

వెళ్ళేసరికి నాన్నగారు కూచుని కబుర్లు చెపుతున్నారు. సుబ్బులు పళ్ళరసం తీసి ఆయనకిస్తోంది. చాలా సంవత్సరాలుగా తెలిసిన వ్యక్తిలాగ ఆమెతో నవ్వుతూ కబుర్లు చెపుతున్నారు. అమ్మ నాయర్‌కు పనులు పురమాయిస్తోంది. ఇక్కడ ఇంత హాయిగా ఉండక, విజయనగరంలో ఎందుకు కాపరం పెట్టారా అని అనుకున్నాను. కాని ఈ హాయికి కారణం ఆ క్షణంలో సుబ్బులు అక్కడ ఉండడమేనని మనస్సుకు తట్టలేదు.

అమ్మ సారథ్యంలో ఎప్పుడూ లేనిది ఉప్పు, కారం బాగా దట్టించి వంట చేశాడు నాయర్! కాని భోజనం రుచి పూర్తిగా అనుభవించనివ్వలేదు అమ్మ.

భోజనం పూర్తయాక "నువ్వు ఊరికెళ్ళాలిరా!" అంది.

పిడుగు మీద పడ్డట్టు తుళ్ళిపడ్డాను నేను.

నేను మాట్లాడేలోపల "అదేం?" అన్నారు నాన్నగారు

"అక్కడ సుబ్బులు మామ్మగారు ఒంటరిగా ఇంట్లో ఉన్నారు. ముసలాయన కూడా లేరు. ఇల్లంతా ఆమె ఒక్కరూ చూసుకోవడం బాగుండదు. అదీగాక చీకటిపడేవేళకి వీణ్ణి పంపుతానన్నాను. బొత్తిగా మగదిక్కు లేకుండా వదిలేస్తే ఎలాగ?" అంది అమ్మ.

నా ఉత్సాహమంతా చప్పబడిపోయింది. సుబ్బులు ఏమనుకుంటుందోనని చుట్టూ చూశాను. గుమ్మం పక్కన కూర్చుని తమలపాకులు చుడుతోంది. తనకి విషయం ఏమీ పట్టనట్టు.

"నాన్నగారికి ఒంట్లో బాగోలేదు. నేను వెడితే ఇక్కడ పనులు ఎవరు చేస్తాను? నేను వెళ్ళను" అన్నాను.

నాన్నగారు ఏమనాలో తెలీక దిక్కులు చూశారు. "అయినా ఏదో చదువుకోవాలని ఎలాగూ వెళ్ళాలనుకున్నావుగా?" అన్నారు చివరికి.

నాకు పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది. చెప్పిన అబద్ధమే ఎదురు తిరిగింది. నిస్సహాయంగా సుబ్బులు వేపు చూశాను క్రీగంట. ఆమె పెదవుల చివర నవ్వును గుర్తించి కసిగా పళ్ళు కొరుక్కున్నాను. నేను గమనిస్తున్నానని గ్రహించినట్టు ఒకసారి తలెత్తి మళ్ళీ తన పనిలో పడింది.

"నామాట తీసెయ్యలేక వాళ్ళ అమ్మాయిని నా వెంట పంపిందావిడ. మరి నా మాట పోతే ఏమయినట్టు?" అంది అమ్మ.

నేను మాట్లాడకుండానే నాన్నగారు తీర్పు చెప్పేశారు.

"సరేలే, ఎండ చల్లబడ్డాక అలాగే వెళతాడు" అన్నారు. నేను కిక్కురుమనలేదు.

వసారాలో మంచం వేసుకుని ఏదో ఇంగ్లీషు నవల పట్టుకు కూచున్నాను. మధ్యాహ్నం ఎండలో ప్రపంచమంతా భగభగమడిపోతున్నట్టనిపించింది. కూడదీసుకున్న కల చెదిరిపోయినట్టనిపించింది. మనస్సులో నిరుత్సాహం ఎక్కువయి చికాకనిపించింది. భోజనం చేశాక ఎండ చల్లబడేలోపల తాటితోపు వేపు కబుర్లు చెప్పుకుంటూ నడిచి రావచ్చునన్న ఆలోచన హఠాత్తుగా తోచి కొంతలో కొంత నయమనుకున్నాను. లేచి కూర్చున్నాను. ఎండ మరీ ఎక్కువగా లేదు. దూరంగా బారులు తీర్చిన సరుగుడు చెట్లు యుద్ధానికి

సన్నద్ధంగా ఉన్న పదాతిదళంలాగ ఉన్నాయి. గాలికి చెట్టునుంచి జారిపోయిన పిట్టలు మరో నీడని వెదుక్కుంటున్నాయి. అమ్మ, సుబ్బులు భోజనం పూర్తయేవరకూ అక్కడే ఎదురు చూడదలిచాను. సీతాలు కొడవలి పట్టుకు వచ్చాడు. "తాటికాయలు తెమ్మంటారా బాబూ!" అంటూ

కొడవలి నాకిచ్చి వెళ్ళిపొమ్మన్నాను.

"అదేటి బాబూ నరకడం రాక చెయ్యి మీద చేసేసుకుంటారు" అన్నాడు.

"అయితే నాకు నేర్పు" అన్నాను.

వాడు ఒకటే నవ్వు!

"మీకా పనెందుకు బాబూ, నేనుండగా? చెప్పండి. ఎన్ని ముంజికాయలు తెగనరకమంటారు?" అన్నాడు.

వాడిని ఒప్పించేసరి నా ప్రాణం విసిగిపోయింది. ఇద్దరం చెట్టునీడకి నడిచాం అయిదు పింజల్ని ఎక్కణ్ణుంచో కోసుకొచ్చాడు. అక్కణ్ణుంచి వాడో కాయ నరికి చూపడం, నేను మళ్ళీ చేయడం. దాదాపు అరగంట పట్టింది నాకు చేతనయేసరికి. అప్పటికప్పుడు నాలుగు ముంజికాయలు కోసి కన్ను విడకుండా, నీరు పోకుండా తీయగలిగాను.

"సదువుకున్నవారికి చేతకానిదేటి బాబూ! ఒడుపు తెలియాలే గాని ఇదెంత పని" అని నవ్వాడు సీతాలు.

చాలా గర్వంగా తలపంకించాను.

సుబ్బులుకి స్వయంగా కాయలు నరికి ముంజెలు తినిపించాలి అని నిశ్చయించుకున్నాను.

"తోపుదగ్గర ఉంటాను బాబూ" అంటూ సీతాలు వెళ్ళిపోయాడు.

కొడవలి తీసుకుని ఉత్సాహంగా ఇంటివేపు నడిచాను. అప్పటికి రెండయింది. మరో గంట గంటన్నరకన్నా టైము లేదు. కనీసం నాలుగుకయినా బయలుదేరకపోతే చీకటిపడేసరికి టౌను చేరలేను. ఈ గంటన్నర లోనే అనుకున్న షికారు జరిగిపోవాలి.

కాని ఇంటి దగ్గరికొచ్చేసరికి అక్కడి పరిస్థితి వేరుగా ఉంది. నాన్నగారు గదిలో నిద్రపోతున్నారు. గది గుమ్మం మీద తల ఆనించి లోపలి వేపు అమ్మా నిద్రపోతోంది. అదే గుమ్మం మీద తల ఆనించి ఇటు వేపు సుబ్బులు నిద్రపోతోంది. తెల్లవారుఝామున బయలుదేరారేమో ఆ అలసటవల్ల ఇద్దరూ దీర్ఘంగా నిద్రపోతున్నారు. అమ్మ గుర్రుపెడుతోంది. తాంబూలం వేసుకున్నట్టుంది సుబ్బులు పెదాలు.. నిద్దట్లో రెండూ ఎర్రగన్నేరు పువ్వుల్లాగ కదులుతున్నాయి. నిరుత్సాహంతో, ఆశాభంగంతో ఒళ్ళు మండిపోయింది నాకు. ఏం చెయ్యాలో తోచక మంచం మీద చతికిలబడ్డాను. క్రమంగా ఎండ వాలుతోంది. చెట్లు విశ్రాంతిగా తలలూపుతున్నాయి. కాళ్ళ దగ్గర వాడిపోయిన పూలచెండు కనిపించింది. ఉదయం సుబ్బులు పెట్టుకున్న చెండేనని తెలుస్తోంది. ధైర్యం చేసి సుబ్బులు కాళ్ళమీద పడేలాగ విసిరాను. అందువల్ల ఆమెకు కోపం రావచ్చు కాని ఆ ఆలోచన రాలేదు. వచ్చినా భరించడానికి సిద్దపడేట్టు ఉంది అప్పటి పరిస్థితి. అయితే అంతవరకూ రానేలేదు కథ. చెండు తగిలినచోట చీరె సరిచేసుకుని అటు తిరిగి విశ్రాంతిగా పడుకుంది సుబ్బులు. శరీరం యావత్తూ కోపంతో భగభగలాడింది. ఎండలో తలలూపే సరుగుడు తోటకి ఈ చివరి నుంచి ఆ చివరి వరకు నిప్పంటించి చోద్యం చూడాలనిపించింది.

ఆ కోపంలో ఒక కూలీని పిలిచి బండి సిద్దం చేయించమని చెప్పాను. మరో అరగంటకి తలలాడించుకుంటూ, గంటలు శబ్దం చేస్తూ ఎడ్లబండి వచ్చి నిలబడింది. "సీతాలు తోపు దగ్గర కూచున్నాడండి తమ కోసం. తమతో చెప్పమన్నాడండి" అన్నాడు బండివాడు.

వాడికేం జవాబు చెప్పలేదు నేను. "తిరిగొచ్చాక నేను ఊరికి వెళ్ళినట్లు అయ్యగారికి చెప్పు" అనేసి బండి ఎక్కి కూచున్నాను.

✡ ✡ ✡

# 7

**తీరా ఇంటికి** వచ్చేసరికి అరుగు మీద మేకులాగ కూర్చుని ఉన్నారు శోభనాద్రిగారు. ఇక నా బాధ ఏమని చెప్పను? ఒక్కసారి పెద్ద బండరాయి ఆయన నెత్తిన వేయాలనిపించింది. కాని నిజానికి ఆయన్ని అని మాత్రం ప్రయోజనమేముంది?

"వచ్చావుటోయ్" అని చుట్ట మధ్య నుంచి పలకరించాడు కాని, సమాధానం చెప్పకుండానే లోపలికి చేరాను.

అంత సందడిగల వాతావరణం నుంచి ద్వీపాంతరవాసానికి పంపేసినట్టు ఈ ఇంట్లో గిజగిజలాడిపోయాను. రాత్రికి రాత్రి మళ్ళీ వెనక్కి వెళితే బాగుండుననిపించింది కాని, అక్కడి వాళ్ళమీద కోపం తీరలేదు. పైగా ఈ ఆవేశోద్రేకాలతో బాగా అలసిపోయాను. భోజనం మాట తలపెట్టకుండా నిద్రపోవాలనుకున్నాను.

ఇంకా మసక వెలుతురు ఆకాశం మీద పడమట మూలలలో మిగిలిపోయింది. చాపా, తలగడా తీసుకుని డాబామీదకి బయలుదేరాను. పెరటిలోని చెట్లన్నీ వేటికవి ఒంటరిగా నిలబడి వెంటపెట్టుకున్నట్టున్నాయి. బొగడపూలు నిరర్థకంగా నేలమీద వాలి చపల మనస్కుడి అంతరంగంలాగ  వీచే గాలికి అటు కదులుతున్నాయి. మునగ చెట్టుమీద వాలిన పిట్టల గొంతుల్తో కూడా సాయంకాలపు దిగులు తెలుస్తోంది. అలా చూస్తున్నకొద్దీ ఊరట చెందుతుందనుకున్న మనస్సు మరింత రేగింది. ఎంతసేపూ దేవపల్లి అడవులవేపే ఆలోచనలు పోతున్నాయి. ఇప్పుడు సుబ్బులు ఏం చేస్తుంటుంది? నేనిలా హఠాత్తుగా వచ్చేస్తే ఏమనుకుంటుంది? నిజంగా తనని ఏడిపించాలనే నిద్రపోతుందేమో? పొద్దుట్నుంచీ ప్రయాణం ఏస్తే ఎవరికైనా నిద్రవస్తుంది. **మనస్సులో ఉద్రేకం స్తిమితపడ్డ కొద్దీ ఔదార్యం పెరుగుతుందనుకుంటాను.**

ఇన్నాళ్ళూ నేను సాధించిన ఈ మాత్రపు సాన్నిహిత్యంలో నా మనస్సు ఆమెకు తెలియజెప్పలేకపోయానే అనే శంక హఠాత్తుగా పొటమరించింది. ఇరవైయేళ్ళు అందంగా పెంచుకున్న కోరికల్నీ, ఆశల్నీ ఈ పదిహేను రోజుల్లో నా మాటలు, కళ్ళు వివరించలేకపోయాయా? లేక ఆ అమ్మాయి గ్రహించలేకపోయిందా! అన్నిటిమాట ఎట్లా ఉన్నా మా ఊరు రమ్మన్నానన్న ఆహ్వానాన్ని గుర్తుంచుకుని వచ్చాక, ఆ మాటను గుర్తు చేసిన సుబ్బులు అమాయకురాలనుకోలేకపోయాను. వయస్సు ఆమెను మోసం చేయడం లేదు. వయస్సుని మోసం చేసే గడుసుదనం ఆమె దగ్గర ఉంది.

ఆలోచనల మీద ఆలోచనలు కూడుకుంటున్నాయి. ఆకాశం నాకు తెలియకుండానే నల్లబడింది. ఇంటికెదురుగా ఉన్న ఎలక్ట్రిక్ స్థంభం దీపం ఫక్కున నవ్వినట్టు వెలిగింది.

"ఎప్పుడొచ్చారు మేష్టారూ?" అని ఆడగొంతు హఠాత్తుగా పలకరించేసరికి తుళ్ళిపడి అటు తిరిగాను. రోడ్డుమీద నిలబడి దుర్గ చెయ్యి ఆడిస్తోంది. అమృతప్రాయంగా తింటున్న భోజనంలో ఈగ పడినట్టు దుర్గను చూసి గిలగిల్లాడాను. "మేష్టారూ" అన్న పిలుపులో గౌరవం కంటే పరిహాసం ఎక్కువ ఉందనిపించింది నాకు. అయినా ప్రశ్నకు సమాధానం చెప్పక తప్పదు. ఎలాగో తప్పించుకోవాలి.

"ఇందాకనే, ఎక్కణ్ణుంచి రావడం?"

పళ్ళన్నీ బయటపెట్టి నవ్వింది. "పెద్ద ప్రశ్నే! ఉండండి. మీదకి వచ్చి చెపుతాను." అంటూ చూస్తుండగానే చరచరా డాబా ఎక్కి అవతలి కొసను గోడమీద కూచుంది.

మరికొంతసేపు ఆమెతో మాట్లాడాలన్న ఆలోచనకే వణికిపోయాను. **కొందరు ఎదురుగానే కాదు, ఆలోచనల్లోనే ఎంతో ప్రసన్నతనీ, ప్రశాంతతనీ కలిపిస్తారు. కొందరు ఎదురుగా ఉన్నా అదిరిపడేట్టు కనిపిస్తారు.** అయినా చేసుకున్న పాపమది. ఎప్పుడొచ్చారన్న ప్రశ్నకి మరో ప్రశ్నని కలపడం నాదే తప్పు.

''శారదావాళ్ళ నాన్న కనకాంబరాలు ఎక్కణ్ణుంచో తీసుకొచ్చాడట. రమ్మని వాళ్ళ తమ్ముడిచేత కబురు పంపింది. కనకాంబరాలంటే నాకెంతో ప్రాణం. పరిగెత్తుకు వెళ్ళాను. శారద తెలుసుగా?''

**ఒక వ్యక్తిని అసహ్యించుకోవడం ప్రారంభిస్తే అన్నీ అసహ్యంగానే కనిపిస్తాయి.** ఆ ప్రశ్నకి తెగ చికాకుపడ్డాను. దాచుకోకుండా, ''నాకెలా తెలుస్తుంది?'' అన్నాను.

''అయ్యో, నా పిచ్చి! తను మీకెలా తెలుస్తుంది? అదిగో ఆ నాలుగో ఇల్లు, డ్రైవరు దుర్గారావు అమ్మాయి. చిన్నతనం నుంచీ నా క్లాసుమేటు. మా అందర్లోకీ అదే ఫస్టు. ఎక్కడా ఆగకుండా ఎస్సెల్సీ వరకూ దూసుకు వచ్చేసింది. మా ఇంటికి వచ్చి నాకు లెక్కల్లో తర్ఫీదు ఇచ్చేది. ఎస్సెల్సీలో మా స్కూలుకి ఫస్టుగా వచ్చింది. వాళ్ళ నాన్న కాలేజీలో చేర్చలేనని తేల్చేశాడు. అప్పుడు నేనేం చేశానో తెలుసా?'' కొంగున ఉన్న పువ్వులు గట్టుమీద పోసి దారానికి ముడి వేస్తూ మళ్ళీ ప్రారంభించింది. ''మా నాన్నగారు నన్ను వాల్తేరులో చదివించాలనుకున్నారు. కాని శారదని కాలేజీలో చేర్చకపోతే, నేనూ చేరనని పట్టుబట్టి కూర్చున్నాను. నా పోరు పడలేక మా నాన్నగారు ఓ రోజు దుర్గారావుని పిలిపించారు. మా నాన్నగారు అడిగితే తిండీ బట్టా తప్ప మరేమీ పెట్టుకోలేనని చేతులెత్తేశాడు. అప్పట్నుంచి దానికి జీతం, పుస్తకాలు అన్నీ మా నాన్నగారే భరిస్తున్నారు. అలా స్కాలర్‌షిప్ సంపాదించింది మా శారద. '' దుర్గ మాటల్లో కామాలూ, ఫుల్‌స్టాపులూ లేవు. **కొందరికి మాట ఆగిపోతే మరో మాట దొరకదేమోనన్న భయం. అందుకని ఆగకుండా మాట్లాడేస్తారు. మాట పూర్తయాక ఏదో తప్పు చేసినట్టు మొహం పెడతారు.** సరిగ్గా అలాగే చేసింది దుర్గ.

నా మీద ఓ సదభిప్రాయాన్ని కలిగించడానికి ఇదంతా చెపుతోందా అని అనుమానపడ్డాను. కాని లేదు. చాలా మామూలుగా యాదృచ్ఛికంగానే బయటపెట్టింది.

''ఆ అమ్మాయికి చాలా గొప్ప సహాయమే చేశారు'' అన్నాను.

''ఆఁ నాన్సెన్స్.. సహాయం గిహాయం నాకు తెలీదు. చిన్నప్పట్నుంచీ కలిసి తిరిగాం. కాలేజీలో ఒక్కర్తెనీ చదవలేక మరొకర్ని తోడు తీసుకువెళ్ళాను'' అంది.

''అందుకు మీ నాన్నగారు అంగీకరించడం గొప్పేకదా?''

''గొప్పాలేదు, గోడూలేదు. ఒప్పుకోకపోతే నేనేడుస్తూ కూర్చుంటానని ఆయన భయం అంతే''

ప్రతీ చర్యలోనూ స్వార్థపు కోణాన్ని చూసే ధోరణి కొత్తగానే కనిపించింది నాకు. నవ్వొచ్చింది. దుర్గలో ఈ కుండ బద్దలు కొట్టే స్వభావం నాకు చాలా నచ్చింది. అనుకోకుండా, నాకు తెలియకుండానే ఆమె పట్ల నాకున్న వ్యతిరేకభావాన్ని మరిచిపోయి మాట్లాడడటం ప్రారంభించాను.

ఉన్నట్టుండి అడిగింది. ''మా సుబ్బులు మీతో మీ ఊరు వచ్చిందంటగా?''

అంత సూటి ప్రశ్నకు మొదట తెల్లబోయాను. ''నాతోకాదు. మా అమ్మతో.''

''పోనీ మీ అమ్మతోనే అనుకోండి. ఇప్పుడు మీతో తీసుకురాలేకపోయారా? నాకిక్కడేం తోచటం లేదు. సెలవులు సెలవులని ఎదురు చూడడం.. ఇక్కడ తోచక ఎక్కేగుమ్మం, దిగే గుమ్మం తిరగడం!''

దుర్గకి సాంఘిక మర్యాదలు, మంచిచెడ్డల మీదా దృష్టి ఏర్పడలేదు. ఆ దృష్టి చక్కగా హైస్కూలు స్థాయిలోనే ఆగిపోయి పెరగడం మానేసింది. అందుకే ఆ అమాయకత్వంలో పసిపిల్లలాగ అందంగా కనిపించింది నాకు. అయితే ఎవరికయినా అది అవకాశంగా మాత్రం కనిపించిందా, ఆమె జీవితం పణంగా ఓడిపోవలసి ఉంటుంది.

''సుబ్బులు మీకెలా తెలుసు? ఇక్కడికి వచ్చాకనేనా?''

"అదేం ప్రశ్న? మేమంతా చిన్నప్పుడు ఆడుకునేవాళ్ళమండీ.. మరోత్తి కూడా ఉండేది. దాని పేరు కస్తూరి. మా సుబ్బులే అంటే దానికన్న చాలా అందగత్తె. ఈ ఇల్లు కట్టినప్పుడు లేచీ లేవని గోడల మధ్య దాగుడు మూతలాడి మేస్త్రీలకి తోచనిచ్చేవాళ్ళం కాదు. అప్పుడు మేం పదేళ్ళవాళ్ళం. నాకు చాలా జ్ఞాపకం. ఆ రోజు ఈ డాబా వేస్తున్నారు. ప్లాన్ వేసారు. గోడలు లేవలేదింకా. దాగుడుమూతలాడుతూ అరడజను మంది ఈ డాబా ఎక్కేశాం. శారదా, నేనూ, కస్తూరీ పరిగెత్తుతున్నాం. సుబ్బులు దొంగ, మమ్మల్ని పట్టుకోడానికి మెట్లెక్కింది. దాన్ని చూస్తూ వెనక్కి వెనక్కి అడుగులు వేశాం. నాలుగడుగులు వెళ్ళామో లేదో కెవ్వున కేక వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే ఇంకేముంది? కిందన మా కస్తూరి రక్తం మడుగులో ఉంది. మరో అడుగులో నేనూ పడే దాన్నే!అంతా ఘొల్లుమన్నాం. కస్తూర్ని ఎవరూ చూడలేకపోయాం. తెల్లారేసరికి అందరికీ జ్వరాలు వచ్చేశాయి. ఆరునెలలపాటు ఎక్కడ కలిసినా అంతా భోరుమని ఏడ్చేవాళ్ళం" అంది.

నేను నిశ్చేష్టుడినయి విన్నాను.

అంత దిగులయిన కథ చెపుతున్నప్పుడు మాటలో ఉద్రేకం. ఆవేశం లేదు దుర్గకి. కళ్ళు నీళ్ళు రాలేదు. ఏదో పాత కథని పదే పదే చెపుతున్నదాన్ని వెళ్ళబోసినట్టు చెప్పి పువ్వులు ముడుస్తుంది.

నేను నిశ్చేష్టుడునయి విన్నాను.

నేను నిట్టూర్చి "అయితే మీ స్నేహితురాళ్ళలో ఒకరు పోయారన్నమాట" అన్నాను.

"ఊఁ ఒకరు పోయారు. మరొకరు - అదే మా సుబ్బులు - వాళ్ళ నాన్నకి బదిలీ అయి మద్రాసు వేపు వెళ్ళిపోయింది. ఇది చాలా దొంగ. దాని ముఖం చూసి దాన్ని నమ్మకండి" అని బుంగమూతి పెట్టి, ఆశ్చర్యంతో చూస్తే, నవ్వేసింది. "ఊరికే అన్నాను చాలా తెలివైంది సుబ్బులు. చదివిస్తే మాకంటే బాగా చదువుకునేది." అంది.

ఇంకా అలా చాలా సేపు మాట్లాడేదేమోకాని హఠాత్తుగా వీధి వేపు చూసి ఆగిపోయింది. "వేళయింది. నేను వెళతానండీ. మనిద్దర్ని ఆ ఫూల్ ఇలా చూస్తే నోటికొచ్చినట్టు వాగుతాడు" అంది. దండగుచ్ఛగా మిగిలిన కనకాంబరాల్ని చేతిలోకి తీసుకుంది.

ఆ ఫూల్ ఎవరా అని చూడటానికి పిట్టగోడ దగ్గరికి వచ్చాను. ఎదురింటి అరుగుకి సత్తిరాజులు సైకిల్ చేరేస్తూ కనిపించాడు. అతని తెలివి మీదా, చురుకుతనం మీదా అమ్మాయిలందరికీ ఏకాభిప్రాయం ఉన్నందుకు నవ్వొచ్చింది.

మెట్లు దిగబోతూ, మిగిలిన కనకాంబరాల్ని "చెయ్యిపట్టండి" అని నా చేతులలో పోసింది.

"నాకెందుకూ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

నవ్వింది. "కనకాంబరాలకి వాసన ఉండదు. అయినా పువ్వులు పువ్వులే" అంటూ మెట్లు చకచకా దిగిపారిపోయింది. నిర్ఘాంతపోయాను. ఆ మాటలో ఇంకేదయినా అర్థాన్ని పేర్చిందా అని. సాయంకాలపు చలిగాలికి పువ్వులు స్వచ్ఛంగా ఉన్నాయి, ప్రశాంతమయిన మనస్సులాగ నిర్మలంగాను కనిపించాయి.

చేతిలో వాటిని పట్టుకుని చాపమీద వెల్లకిలా పడుకున్నానో లేదో "ఏం చేస్తున్నారు సార్?" అంటు సత్తిరాజు వచ్చాడు. మొదట దుర్గని చూసినప్పుడున్న భావం ఆమె వెళ్ళేసరికి కరిగి మళ్ళీ రోజంతటి అలసటా నా నెత్తిన రుద్దినట్టు అనిపించింది.

"వాళ్ళు మీ ఊరు సరిగ్గా చేరారా?" కుటుంబ శ్రేయస్సుని కాంక్షించే కులపెద్ద కుటుంబంలోని మరీ చిన్నవాణ్ణి అడిగినట్టు అడిగాడు.

"ఎవరు?" అన్నాను.

నవ్వాడు నా ముఖం చూసి. "ఎవరా? మీకు తెలియదా? అసలు సుబ్బులుకి బండి ప్రయాణం పడదు సార్! మేం మరీ చిన్నపిల్లలప్పుడు మా నాన్నతో కలిసి పెందుర్తి వేణుగోపాలస్వామి తీర్థానికి వెళ్ళాం బండి మీద. అబ్బో! చాలా గొప్ప తీర్థం లెండి. పాపం అక్కడికి చేరేసరికి సుబ్బులుకి ఒకటే వాంతులు. కాలు తీసి కాలు వేయలేకపోయింది."

ఆ అమ్మాయి అస్వస్థతకన్న చిన్నప్పుడు వారి ఆత్మీయతని చెప్పడం అతని ముఖ్యోద్దేశమని గ్రహించాను. కొంతసేపు ఏడిపించాలనుకున్నాను.

"కలరాయేమో? పరీక్ష చేయించలేకపోయారా?"

"ఛ ఛీ! కలరా అయితే ఇన్నాళ్ళూ బ్రతుకుతారా? 'కలర్' త్రాగింది దారిలో... తెలుసుగా? ఐస్ సోడా. అంతే."

విరగబడి నవ్వాడు.

అంతలో సీరియస్‌గా మారి "అసలు చిన్నప్పట్నుంచీ సుబ్బులు మా ఇంట్లోనే పెరిగిందండి. మా ఇద్దరికీ పెళ్ళిచెయ్యాలని - మా మాట అలా ఉంచండి - మా అమ్మా, వాళ్ళ అమ్మా అనుకునేవారట."

ఉల్లిపొర కాగితం మీద ముత్యాల ముగ్గులాగ ఆకాశం కనిపిస్తోంది. చంద్రుడు కిలుం పట్టిన ఇత్తడి పళ్ళెంలాగ కనిపిస్తున్నాడు. చూస్తూ వెల్లకిలా పడుకున్నాను.

"సుబ్బులు పిండిముద్దలాంటిదండి. ఎలా వంచితే అలా వంగిపోతుంది. అందుకే దాన్ని కాపాడడానికి పక్కనే ఎవరో ఒకరు ఉంటూ ఉండాలి. అఫ్‌కోర్సు - మీ అమ్మగారు ఇప్పుడున్నారనుకోండి."

**ఆడది నిస్సహాయురాలనుకుని మగాడు జీవితంలో సంతృప్తిని అనుభవిస్తుంటారు. మగాడిని నిస్సహాయుణ్ణి చేసి ఆడది సంతృప్తిపడుతుంది.**

"ఏమిటాలోచిస్తున్నారు?"

"చిన్నతనంలో - చూశారా, మీకు జ్ఞానం తెలియని చిన్నతనంలో మీ ఇద్దరికీ పెళ్ళి జరిగేవుంటుంది. నా ఊహ" అన్నాను.

తెల్లబోయాడు. "అదెలా"

"ఏముంది? - మన పెద్దవాళ్ళకి బాల్యవివాహాలు కొత్తకాదుగా?"

ఆ ఆలోచన నచ్చినట్టుంది. దాన్ని వదిలిపెట్టదలచలేదు.

"అవునవును. పాయింటే మామయ్యకి తెలుసునేమో కనుక్కొంటాను."

**మగాడు అన్ని విషయాల్లోనూ గడుసుగా ప్రవర్తించవచ్చు. కాని ఆడదాని దగ్గరకొచ్చేసరికి అమాయకమైన గడుసుదనమే మిగులుతుంది.**

ఉన్నట్టుండి అన్నాడు: "మా మావయ్య నన్ను కొడతాడు. మీకు తెలుసా?"

నేను ఆశ్చర్యపడ్డాను.

నవ్వి - "నేనంటే ఆయనకి బాగా చనువు. మీరు చెప్పారటగా. నేను సుబ్బుల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నట్టు? కొడితే కొట్టాడు. నేను చెప్పలేని మాటని మీరు చెప్పేయగలిగారు. అదే పదివేలు. నా ఆస్తంతా నువ్వు తీసేసుకో, ఈ పెళ్ళి మాత్రం జరిగేటట్టు చూడన్నాను."

మొదటిసారిగా సత్తిరాజుల్ని చూసి జాలేసింది. చైనాలో రాజకీయ నేరస్థులకి 'బ్రెయిన్‌వాష్' చేస్తారట - అలాగ ఇతణ్ణి ఎంత డబ్బు ఇచ్చి అయినా ఈ ప్రేమ జబ్బునుంచి కాపాడితే బావుణ్ణనిపించింది.

"మీ మంచితనం నాకప్పటిక్కాని అర్థంకాలేదు - ఆ మాత్రం మీ సహాయం చాలు నాకు. యూ ఆర్ మై ఫ్రెండ్ ఇక వెళతాసార్" అని లేచాడు.

అంతలో వంగి "పొడుగు కావడానికి నా ప్రయత్నాలు నేను చేస్తున్నాను. సుబ్బులుతో చెప్పకండి". అన్నాడు నవ్వుతూ.

నిలబడితే పొట్టిగా, దుబ్బులాగా కనిపించడు సత్తిరాజు. జుత్తు నుదిటిమీదకి జారి, పెదవుల్లో, పొడవు ముక్కులో మరీ అందవికారంగా ఉన్నాడు. చీపి కళ్ళు.

వెళుతూ నా వేపు దయగా, క్షమించినట్టు, చూసి "దుర్గ మంచి పిల్ల సార్. మొదట మేడమీద చూసి సుబ్బులు అనుకున్నాను" అన్నాడు.

ఏదో అర్థమయినట్టు నా ముఖం చూసి ముసి ముసి నవ్వులు నవ్వాడు.

నేను తెల్లబోయి చూస్తే "ఫరవాలేదు. ఎవరితోనూ చెప్పను లెండి" అనేసి వెళ్ళిపోయాడు.

అంతవరకు అతనిమీద కలిగిన జాలి అంతా ఆ క్షణంలో తుడిచిపెట్టుకుపోయింది. అక్కడ నిలబడి ఉంటే ఒక్కసారి మీదపడి మెడ పట్టుకోవాలనిపించింది.

**పరమ లౌక్యుడు, దుర్మార్గుడు, ప్రలోభికి కూడా జీవితంలో ఏదో ఒక విషయంలో సాధుత్వం అబ్బుతుంది. అది ప్రేయసి కావచ్చు, భగవంతుడు కావచ్చు, కన్న కొడుకు కావచ్చు, లేదా భార్యపట్ల భయంకావచ్చు, మీదపడిన వయస్సు కావచ్చు. దాన్ని మినహాయిస్తే - వాళ్ళ అసలు స్వభావాలన్నీ వాళ్ళని ఎల్లకాలం ఆశ్రయించుకునే ఉంటాయి.**

ఆలోచిస్తూ పడుకున్నాను. బాగా నిద్రపట్టేసింది. ఏ రాత్రికో రొజ్జగాలికి హఠాత్తుగా తెలివొచ్చింది.

తెల్ల దోమతెర కట్టినట్టుంది ఆకాశం. దోమతెరకి పడ్డ పెద్ద చిల్లులోంచి కనిపిస్తున్న వెలుగులాగ చందమామ కనిపిస్తున్నాడు. చలేసింది. చాప, తలగడ పట్టుకుని కిందకి దిగిపోయాను. లోపలికి వచ్చా వాచీ చూస్తే నాలుగు. దుప్పటి కప్పుకు పడుకునే ప్రయత్నం చేశాను. అటువేపు శోభనాద్రి వాటాలో మాటలు వినిపిస్తున్నాయి. వృద్ధదంపతులిద్దరికీ నిద్దరపట్టనట్టుంది. లేచి ఏ విషయాన్ని గురించో పోట్లాడుకుంటున్నారు. మాటా మాటా అనుకోవడం తెలుస్తోంది.

తెల్లవారుఝామునే "నీకు బుద్దిలేదు" అంటున్నారు శోభనాద్రిగారు.

"పోనీ మీకుందిగా. మీకు తోచినట్టు చెయ్యండి." అంటోంది ముసలావిడ ఉదాసీనంగా....

"అసలు నిన్నెవడు పంపమన్నాడు? నేను ఊరూవాడా తిరగలేక చస్తున్నాను. మీరు ఇంట్లో తిని కూచోలేక చంపుతున్నారు. రేపే వాళ్ళు వస్తారు. ఛీ ఛీ మీ ఆడవాళ్ళకి బద్దులుండవు. అన్నీ ఇలానే చేస్తారు."

ముసలావిడ అందుకేదో చెప్పినట్టుంది. దానికి ఆయన "నోర్ముయ్" అని సమాధాన మిచ్చారు. తర్వాత ఏం మాట్లాడుకున్నారో యేమో, మళ్ళీ నాకు నిద్రపట్టేసింది.

## 8

మధ్యాహ్నం హోటల్లో భోజనం చేసి గుమ్మంలో అడుగుపెట్టేసరికి సుబ్బులు కనిపించి నిర్ఘాంతపోయాను. వాలు కుర్చీలో శోభనాద్రిగారు కూర్చుని ఉన్నారు. ఆయన కాలికి ముందు రాస్తోంది. నన్ను చూసి నవ్వుతూ పలకరించారు.

"మీ ఊరు చూసి - ఇదే మొదటిసారి వెళ్ళడం. ఎంత ప్రశాంతంగా ఉందనుకున్నావ్? మరో పదిరోజులు అక్కడ ఉండిపోదామనిపించింది. కాని ఏదీ? మా ఆవిడకి ఎప్పుడేనా నా మీద విరక్తి - అప్పుడా అదృష్టం పట్టాలి." అని నవ్వారు. కాని ఎందుకనో సుబ్బులు నవ్వలేదు ఆ మాటలకి. నాకూ నవ్వు రాలేదు.

"తిరిగి వస్తూ గోతిలో పడ్డాను. కాలికి దెబ్బ తగిలింది. మీ నాన్నగారు ఇప్పుడు కులాసాగానే ఉన్నానని చెప్పమన్నారు. ఇల్లు మాత్రం జాగ్రత్తగా చూసుకోమని మీ అమ్మగారు మరీ మరీ చెప్పారు. భోజనం చేశావా?"

తలూపాను. ఇప్పటికి నేను మాట్లాడే అవకాశం దొరికింది. సుబ్బులు వేపు తిరిగి "ఎప్పుడొచ్చారు?" నా వేపు ఆశ్చర్యంగా చూసి. "ఇందాకే" అంది. ఆ మాటల్లోఉత్సాహం కాని, శ్రద్ధకాని, లక్ష్యం కాని కనిపించకపోయేసరికి గాయపడ్డాను. మరింకేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళి కావాలని తలుపులేసుకున్నాను.

హఠాత్తుగా సుబ్బుల్ని ఆయన ఎందుకు తీసుకు వచ్చారా అన్న ఆలోచన ఆ రోజంతా ఉండనే ఉంది.... రాత్రి భార్యాభర్తలు దెబ్బలాడుకున్నా, పరోక్షంగా ఆడవాళ్ళంటే శోభనాద్రిగారికి సదభిప్రాయం లేకపోయినా మనవరాలి దగ్గర మాత్రం ఆయన చిరునవ్వుని మరిచిపోలేదు. అది ఆ అమ్మాయంటే ఆయనకున్న ప్రేమాభిమానాలే అనుకోవాలి - లేక అది కూడా ఆయన లౌక్యంలోనే భాగమయితే, అందువల్ల ఆయన సాధించదలచుకున్నదేమిటి?

మర్నాటి సాయంకాలానికి కాని అసలు విషయం అర్థం కాలేదు నాకు. ఈలోగా సుబ్బులు ఒక్కసారయినా బయట కనిపిస్తే ఒట్టు, నాకు. ముందురోజు వీధిలోకి వెళ్ళబోతే గదిలో పెట్టిమీద కూర్చుని ఏదో వారపత్రిక చదువుతూ కనిపించింది. నేను వెళుతున్నానని తెలిసినా తల ఎత్తలేదు. ఆ ఉదయం స్నానానికి పెరట్లోకి వెళ్ళినప్పుడు అక్కడికి రాబోయి నన్ను చూసి లోపలికి వెళ్ళిపోయినట్టు అనుమానం. ఈ రెండు రోజుల్లోనూ నా పట్ల ఇంత విముఖత కలగడానికి కారణం ఏమిటి? నేనేం చేశాను? తనకు చెప్పకుండా రావడం బాధ పెట్టిందా?

**ఆలోచనలు తేనెటీగల్లాంటివి. కారణం లేకుండానే, ఒక ఈగ బెదిరితే అన్నీ బెదురుతాయి.**

సాయంకాలమవుతున్న కొద్దీ వృద్ధదంపతుల ఆరాటం ఎక్కువవుతున్నట్టు గమనించాను. వీధివేపు గదిలో నుంచి ఉండుండి కేకలు వేస్తున్నారు శోభనాద్రిగారు. "రాజ్యం, ఫలహారం తయారయిందా" , "త్వరగా తెములు" ఇలా సాగుతున్నాయి ఆయన కేకలు. వీధిలోకి బయలు దేరడానికి నేను ఇంటికి తాళం వెయ్యబోతుంటే పక్క గదిలోంచి మొగలి పువ్వుల వాసన గుప్పుమంది. తలెత్తితే మొగలిపూల జడ ఎదురయింది. నీలిరంగు చీరె కట్టుకుని ఉంది సుబ్బులు. తలుపు చప్పుడు కాగానే పక్కకి తప్పుకుంది. ఒక్కసారి ఆమెని చూడాలని మనసు ఉరకలు వేసింది. సుబ్బులు లోపలికి వెళ్ళి ఏదో చెప్పినట్టుంది. శోభనాద్రిగారు చటుక్కున బయటికి వచ్చారు - "వీధిలోకి వెళుతున్నావేమిటోయ్?" అంటూ. తలూపాను.

"ఒక్క క్షణం అలా కుర్చీలో కూర్చో. ఇరవై ఏళ్ళ తర్వాత మా ఆవిడ టొమాటో బాత్ చేసింది. తిని వెళుదువుగాని." అన్నారు.

గుమ్మం దగ్గర్నుంచి సుబ్బులు ప్లేటు అందించినట్టు అర్థమయింది.

"మనక్కావలసినవేవీ అడగడం ఈ జీవితానికి అలవాటు లేదోయ్. వాళ్ళు పెట్టినవి తిని లేచిపోవడమే నేర్చుకున్నాను. ఉదాహరణకి - ఈ టొమాటో బాత్ మా అమ్మ బ్రతికున్న రోజుల్లో ఆప్యాయంగా చేసి పెట్టేది. ఎప్పుడో పెళ్ళయిన కొత్తలో ఎందుకో బుద్ధిపెట్టి మా రాజ్యం చేసింది. మళ్ళీ దాని టర్న్ ఇవాళ్టికి వచ్చిందన్నమాట. అది బాగులేకపోయినా ఫరవాలేదు. మళ్ళీ తినగలిగినందుకే తృప్తి" - ఎదురుగా బల్లమీద కూర్చుని చెపుతున్నారు కబుర్లు.

ఇవాళ శోభనాద్రిగారు ఉత్సాహంగా కనిపించారు.

"ఏమిటి ఇవాళ విశేషం?" అనడిగాను.

"ఏముంది? ఈ ఇంటికి పెళ్ళి కళ రాబోతోంది. దాని కిది నాంది. ఈవాళ పెళ్ళివారొస్తున్నారు. అమ్మాయిని చూడటానికి" ఆ మాటలు గదిలోకి వినిపించేలాగ అన్నారు. అన్నప్పుడు ఒక గొప్ప పనిని సాధించిన కార్య సాధకుడి అహంకారం ఆయన ముఖంలో తొంగి చూసింది. దీని కింత గర్వపడవలసిందేమిటా అనుకున్నాను.

సుబ్బులికి పెళ్ళి! ఎప్పుడో ఒకప్పుడు ఇది ఊహించవలసిన ఫలితమే. అయితే నేనెందుకా పెళ్ళికొడుకు స్థానంలో నిలబడలేకపోయాను? హఠాత్తుగా ఈ ప్రశ్న మనస్సులో మెదిలేసరికి నోటికి ఫలహారం వెళ్ళలేదు.

"ఏం, బాగోలేదు?" అని గుర్తుచేశారు శోభనాద్రిగారు.

నా ముఖకవళికల్ని పోలిక పడతారేమోనని నేనింకేం మాట్లాడకుండా తినడం ప్రారంభించాను. **కొందరు అవకాశం ఉండీ ఆలోచనలేక నష్టపడతారు. కొందరు ఆలోచన ఉండి అవకాశం రాక కష్టపడతారు.** చెయ్యి కడుక్కుని లేచాను. ఒక్కసారి సుబ్బుల్ని చూడాలన్న కోరికని ఆపుకోలేకపోయాను. తలుపు చాటున నిలబడి మా మాటల్ని వినాలని ఎదురు చూస్తున్న వ్యక్తిని గుర్తుపట్టాను ఇప్పుడిక ధైర్యం చేశాను.

"మరి పెళ్ళి కుమారుడికి నా శుభాకాంక్షలు చెప్పొద్దూ?" అన్నాను, లేని నవ్వును తెచ్చి పెట్టుకుంటూ.

శోభనాద్రి గారి ముఖం ఇంతయింది. సుబ్బుల్ని అప్పుడే పెళ్ళికూతుర్ని చేసినందుకనుకుంటాను. "అవునవును. చెప్పొద్దూ మరి? నీది మంచి శకునమే. కాని అమ్మా, సుబ్బలక్ష్మీ" అని పిలిచారు - మొదటిసారి, లక్షణమైన పేరుతో.

కాని సుబ్బులు రాలేదు. "ఉండు. నేను పిలుచుకొస్తాను" అని శోభనాద్రిగారు లేచారు. ఆ పిలుపుతో రావాలని భయపడి సుబ్బులు మామ్మ  చాటుకి వెళ్ళి దాగొన్నట్టుంది. లోపల ముసలావిడ అంటోంది: "అబ్బ అది సిగ్గుపడుతోందండీ. అదేమైనా సినిమా స్టారా ఏమిటి నగలన్నీ పెట్టుకుని వీధి వాకిట్లో నిలబడడానికి" -

ఆ మాట అర్ధమయి నేనే లేచి ముందు గదిలోకి వెళ్ళాను - మొదటిసారిగా వాళ్ళ వాటాలోకి సుబ్బులటు మధ్య గది తలుపు పట్టుకుని నిలబడి ఉంది. ఆ గదిలో ఏమంత వెలుతురు లేదు. కాని ఉన్న వెలుతురులో సుబ్బుల్ని చూసి నిర్ఘాంతపోయాను.

నేను నగరంలో పెరిగినవాణ్ణి. కాని నగర సంస్కారం నా మీద పూర్తి ముద్ర వేసిందని చెప్పలేను. సంప్రదాయాల్లో, పాత పద్ధతుల్లో ఉన్న అందాన్ని హర్షించకుండా ఉండలేను. అయితే నాకు తెలిసిన సంప్రదాయానికి మరో పదేళ్ళు వెనక్కు పోయినట్టు కనిపించింది సుబ్బులు. ఇందుకు సుబ్బులు మామ్మ కారణమేమో! పాత నగలున్నాయి. వాటికి సరిపడే మనిషి కావాలి. ఉన్నవన్నీ ఈమెకు వేశారు. చెంపస్వరాలు, పాపిటపిందెలు, బావిలీలు, నాగరం, వడ్డాణం, వంకీలు, చివరికి అడ్డబాస కూడా పెట్టారు. చూడటానికి అచ్చు అమ్మవారులాగా ఉంది. మరి ఇలా తయారవడానికి సుబ్బులు వప్పుకుందా? సూటిగా ఆమె ముఖం చూశాను. తన అలంకారం మీద అయిష్టత ఏమీ ఆమె ముఖంలో కనిపించలేదు. నిశ్చలంగా ఉంది. ఉద్రేకపరిచే సౌందర్యానికి బంగారం పూత పూసి జోకొట్టే అందంగా తయారు చేసే మార్గాల్ని మన దేశంలో పూర్వులే తయారు చేసి పెట్టారనిపించింది. నేను సూటిగా చూస్తున్నానని తెలిసి తలదించుకుంది. ఆమెకు వినిపించి వినిపించనట్టు 'గుడ్‌లక్' అనేసి బయటకు వచ్చేశాను.

నేను తిరిగి తిరిగి ఇల్లు చేరేసరికి బాగా చీకటి పడింది. అప్పటికి పెళ్ళిచూపులు అయిపోయినట్టున్నాయి. లాయరుగారు ఇంటి వసారాలోంచి బయటికి వస్తూ శోభనాద్రిగారితో ఏదో మాట్లాడుతున్నారు. ఈ సంబంధం రావడంలో సోమయాజులు గారి పాత్ర ఏమయి ఉందా అనుకున్నాను. నన్ను చూసి నవ్వి -

"ఆ రోజు తర్వాత మళ్ళీ కనిపించనే లేదేమోయ్? " అన్నారు.

శోభనాద్రిగారికి నమస్కారం చెప్పి గుమ్మం దిగుతూ మధ్య నా భుజం మీద చెయ్యేసి "మా ఈడియట్ ఎలా ఉన్నాడు?" అన్నారు.

వెంటనే అన్నాను "ఆరోజు మీముందు తొందరపడ్డానేమో బాధపడితే క్షమించండి."

"వాట్ నాన్సెన్స్. బాధలేదు, ఏమీ లేదు. **పొగిడేవాళ్ళని డబ్బిచ్చి కొన్నుక్కోవచ్చోయ్. విమర్శకి - అందులో సద్విమర్శకి డబ్బుకూడా చాలదు.** నువ్వు నాకు ఉపకారమే చేశావు. వస్తాను. పార్టీలు వెయిట్ చేస్తున్నారు. " అని ఎదుటి గుమ్మం ఎక్కారు.

సుబ్బుల్ని చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపడినా అంగీకరించని వ్యక్తి ఉండడని అనుకున్నాను. కాని సుబ్బులే అతణ్ణి చేసుకోడానికి ఇష్టపడలేదని మర్నాడు దుర్గ చెప్పగా విని నిర్ఘాంతపోయాను.

"ఏం, ఎందుకని?" అన్నాను ఆత్రుతగా.

నవ్వింది దుర్గ. "ఆడవాళ్ళ నిర్ణయాలన్నిటికీ కారణాలుండవండీ! నాకు ఉసిరిక కాయంటే ఇష్టం - మా శారద జామపళ్ళు అంటే పడి చస్తుంది. ఎందుకో చెప్పండి?" అని ఎదురు ప్రశ్న వేసింది.

**ఈ ప్రపంచంలో అందానికి అబ్బే ఔన్నత్యం అంతా కేవలం అందానిదే కాదు. దాన్ని చూసే దృష్టిది. చూడగల అభిరుచిదీను.**

అయితే ఈ విషయం మరునాటి సాయంకాలం వరకూ తెలియలేదు. ఈలోగా ఆనవాయితీగా భోజనాల దగ్గర్నుంచి వృద్ధదంపతులిద్దరూ వాగ్యుద్ధం ప్రారంభించారు. మరి సుబ్బులు ఏం చేస్తోంది? తెలియలేదు. వాళ్ళు వెళ్ళగానే ముందు గదిలో ముసుగుతన్ని నిద్రపోతోందేమో, ముసలావిడ తెగ ఉద్రేకపడుతోంది.

"కోప్పడి ఏం లాభం? ఆలోచించి పనిచేయాలి. ఇప్పటికిలా అయింది.కదా! సరే మరో ప్రయత్నం." అంటున్నారు ఆయన.

తలా తోకా అందని ఘర్షణ నాకేం అర్థం కాలేదు. నేను అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యనూ లేదు. కాని సుబ్బులు మాత్రం హఠాత్తుగా నా మనస్సులో ఓ ముఖ్యమయిన ఆలోచనాంశం అయిపోయింది. మన చేతిలో ఉన్న వస్తువుని అడిగి తీసుకుని, హఠాత్తుగా దానికి ఓ అందమయిన ప్రయోజనాన్ని కల్పించినప్పుడు కలిగే ఆశ్చర్యం, ఈర్ష్య, ఉదాసీనతలాంటివేవో నన్ను పెనవేసుకున్నాయి. ఏదో అసంతృప్తి కదులుతోంది గాని, దానికి ఓ రూపం అంటూ లేదు. సుబ్బులుకి పెళ్ళి అన్న ఆలోచన నచ్చలేదేమో! ఏమయినా ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు.

మర్నాడు ఉదయం టూత్ బ్రష్ తీసుకుని అరుగుమీదకి వచ్చేసరికి శోభనాద్రిగారు సుబ్బుల్ని తీసుకుని సోమయాజులుగారింట్లోంచి వస్తున్నారు. రాత్రి దంపతులిద్దరూ పడిన ఘర్షణకి ఇది ఫలితమేమో ననుకున్నాను. లాయరుగారి చేత సుబ్బులుకి నచ్చచెప్పడం శోభనాద్రిగారి లౌక్యంలో ఒక భాగమేమో!

సుబ్బుల్ని చూశాను. ఒకరోజు దేవత్వం అనుభవించే వరాన్ని పొంది తిరిగి మానవలోకానికి అడుగుపెట్టినట్టనిపించింది. పువ్వుల జార్జెట్ చీరెల అతి సామాన్యంగా ఉంది. అందం అభ్యంగన స్నానం చేసి ఆడంబరాల్ని వదిలించుకున్నట్టు తేలికపడింది. మెడకి సన్నటి ఎర్రపూసల పేరు. చెవులకి డ్రాప్స్. ముఖం చూసి ఆశ్చర్యపోయాను. ఏదో భయంకరమైన ఆలోచనతో రాత్రంతా కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ నిద్రపోనీ అలసట ముఖం మీద స్పష్టంగా తెలిసింది.

ఆమెను చూడవచ్చిన కొత్త పెళ్ళికొడుకుని నేను చూడలేదు. కాని ఆ క్షణంలో ఆమె ముఖం చూసి అతని గురించి గ్రంధాలు పలకగలననిపించింది.

✡ ✡ ✡

## 9

**వసారాలోకి వచ్చేసరికి** నన్ను చూసి లేచి నిలబడిన అమ్మాయిని కూర్చోమని సంజ్ఞ చేశాను. కాని ఆమె సిగ్గుపడి నిలబడే ఉండిపోయింది.

"ఫరవాలేదు. కూచోండి."

"సుబ్బులు కోసం వచ్చానండి. స్నానం చేస్తోంది."

"అవును, అర్థమయింది. మీ పరిచయం లేకపోయినా మీ పేరు తెలుసు" అన్నాను స్థంభానికి చేరబడి వీధివేపు చూస్తూ.

ఆమె తలెత్తితే "మీ పేరు శారద కదూ?" అన్నాను.

"మీ గురించి నాకు తెలుసు" అంది శారద తొణక్కుండా.

ఈసారి ఆశ్చర్యపడ్డం నావంతయింది. "దుర్గ చెప్పి ఉంటుంది" అన్నాను.

తల అడ్డంగా తిప్పింది.

"మరి?"

"సుబ్బులు! ఆడవాళ్ళు నలుగురు కలిసినప్పుడు మగవాళ్ళ గురించి మాట్లాడుకోకుండా ఉంటారా!" నవ్వింది.

మాటలో తొణుకూ బెణుకూ లేదు. సిగ్గూ బిడియం లేదు. అయితే ఎక్కడా చిలిపితనం, వెకిలితనం లేకుండా పెద్దమనిషిలాగా మాట్లాడడం అలవాటయింది శారదకి. *బీదతనం ఇచ్చే అందమయిన హుందాతనమేమో అది!*

"ఏం మాట్లాడుకున్నారు నా గురించి?"

చెప్పనన్నట్టు తలూపింది.

"మీరు మాట్లాడుకోగా లేనిది, చెపితే తప్పా?"

"మాట్లాడుకున్నదంతా చెపితే ప్రమాదాలు జరగవచ్చు -"

"అంటే అంత చెడ్డగా మాట్లాడుకుంటారన్నమాట!"

"అంత మంచివి మాట్లాడుకుంటామని ఎందుకనుకోకూడదు? *ప్రమాదాలన్నీ చెడ్డవే కానక్కరలేదు, తప్పించుకోలేనివీ, మంచివీ చాలా ప్రమాదాలుండవచ్చుగా?"*

మాటల్లో చెప్పలేనిది సూచించగల చక్కటి కళ్ళున్నాయి శారదకి. ఎన్నో సంవత్సరాలుగా పరిచయమున్న స్నేహితురాలిలాగా మాట్లాడింది. అలా మాట్లాడడానికి నిర్మలమయిన అంతఃకరణ ఉండాలి. సూటిగా ఆలోచించే మనసూ ఉండాలి.

నవ్వి "థాంక్యూ!" అన్నాను.

"ఎందుకూ?"

"నేనడిగిన ప్రశ్నకి సూటిగా కాకపోయినా సూచనగా సమాధానం చెప్పినందుకు" అన్నాను.

ఒకసారి ఒకరి ముఖం ఒకరు చూసుకుని ఫక్కున నవ్వేశాం.

బొగడపువ్వులు రెండు దండలు చేసి తీసుకువచ్చింది సుబ్బులు. మా ఇద్దరి నవ్వుల్నీ పసిగట్టి తెల్లబోయింది. ఒకసారి నా ముఖం చూసి -

"మీ కిదివరకే తెలుసా మా శారద" అంది.

చిరునవ్వు నవ్వుతూ "తెలుసు" అన్నాను.

"ఎలా?"

"మీ మాటల్లో శారదకి నన్ను పరిచయం చేశావు నువ్వు. ఇప్పుడు శారద నీ మాటల్ని పరిచయం చేసింది."

సుబ్బులు సిగ్గుపడింది. "అవన్నీ చెప్పాలా? సిగ్గులేనిదానా!" అంటూ శారదని భుజం మీద కొట్టింది రహస్యంగా. అది నాకు అర్థమయే రహస్యం. నాకర్థం కాకుండా దాచాలనే ప్రయత్నం లేదు. *ఆడవాళ్ళ 'మోడెస్టీ ' అందంగా ప్రదర్శించే సాధనం ఆ సిగ్గు.*

"నాకో చీర సెలెక్టు చేసి పెట్టమన్నాను సుబ్బుల్ని. బజారుకి వెళుతున్నాం.. వస్తానండీ" అంది శారద.

చేతులెత్తి నమస్కారం చేస్తూ "తన స్నేహితుల్తో మీలాగా సఖ్యతగా మాట్లాడడం నేర్పండి మీ స్నేహితురాలికి" అన్నాను. సుబ్బులు నా వేపు తిరిగి మూతి విరిచి, అంతలో వస్తున్న నవ్వు చేత్తో ఆపుకుంటూ ముందుకు నడిచింది. వీధి మలుపు తిరిగేవరకూ అలాగే చూస్తూ నిలబడ్డాను. ఈలోగా సుబ్బులు రెండుసార్లయినా వెనక్కు తిరిగి చూడడం గమనించాను. వీధి చివర సత్తిరాజులు వాళ్ళకి

ఎదురుపడడం, వాళ్ళను చూసి ఆగి ఏదో మాట్లాడటం గమనించాను. మరో క్షణంలో సైకిలెక్కి చర్రున ఇంటివేపు వచ్చాడు. నన్ను చూసి మా ఇంటి ముందు సైకిలాపాడు.

"గుడ్‌మార్నింగ్ సార్! మీరిక్కడ ఉంటారని తెలుసు" అన్నాడు.

"ఎలా?"

"వాళ్ళనక్కడ చూశాగా!" అన్నాడు నవ్వుతూ

"చూడటమేమిటి? మాట్లాడారుగా?"

"అవునండి. మా మామయ్యకి అల్టిమేటమ్ ఇచ్చేశాను. ఆ విషయమే సుబ్బులతో చెప్పాను."

"మీ మావయ్యకెందుకూ అల్టిమేటమ్!"

"ఎందుకివ్వకూడదు? అతనెంత దుర్మార్గుడో చూడండి మరి. నేను సుబ్బుల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానని తెలిసి కూడా మరో సంబంధాన్ని వెదుక్కు తెచ్చాడు. మరో చిన్న రహస్యం..."

"ఏమిటది?"

"సుబ్బులికీ ఈ సంబంధమంటే ఇష్టం లేదు. ఆ విషయం మా మావయ్యకి చెప్పి సంబంధం తప్పించమంది. నేను చెప్పాను కదా! చిన్నప్పట్నుంచీ మేమిద్దరం ఒక్కచోటే పెరిగాం. దానికి నేనంటే మనసు. వస్తాను, సెకెండ్ షోకి టిక్కెట్లు బుక్ చెయ్యాలి" అంటూ వెళ్ళిపోయాడు.

మాట్లాడింది కొద్ది సమయమే అయినా సత్తిరాజులు చాలా విషయాల్ని చెప్పిపోయాడు. సుబ్బులికి ఈ సంబంధం ఎందుకు ఇష్టం లేదు? ఎంతో ప్రయత్నంతో ఎదిరించి సంబంధాన్ని కొట్టిపారెయ్యడంలో అర్థం ఏమిటి? పిచ్చి ఊహలు ఆశనీ, ఆలోచనల్నీ రెచ్చగొట్టాయి. బాత్‌రూం దగ్గర చిరునవ్వులు, కళ్ళతో పలకరింపులు, అమ్మతో అడవి దగ్గరికి రావడం ఇవన్నీ వేరే అర్థాన్ని స్ఫురింపజేశాయి. ఇంతకన్నా స్పష్టంగా ఏ ఆడది మాత్రం తన అభిప్రాయాన్ని సూచింపగలదు? సందేహం లేదు. ఈ సారి ఈ అవకాశాన్ని వృథా చేసుకోకూడదనుకున్నాను. ఆ రోజంతా సంతోషంగా గడిచింది. ఏనుగు అంబారీ మీద ఉన్నట్టనిపించింది. నిన్న పోగొట్టుకున్నదేదో మళ్ళీ ఇవాళ లభించినట్టు సంతోషించాను. శారద, సుబ్బులు బజారునుంచి తిరిగి వచ్చేవరకూ ఎదురు చూస్తూ వసారాలోని వాలు కుర్చీలో అలాగే కూర్చున్నాను బయటకు వెళ్ళాలనే ధ్యాసను వదులుకుని.

ప్రేమ, పెళ్ళి అనే ఆలోచనలు నా జీవితంలో ప్రవేశించడం అదే కొత్త. ఒక స్త్రీని గురించి నాలో ఆలోచన ప్రారంభం కావడం అదే కొత్త. అందుకనే మనస్సు తలలెత్తే ఆలోచనలకి ఒక రూపం ఇవ్వలేక సతమతమవుతోంది. ప్రతి చిన్న ఆలోచనా మనస్సుని ఉద్రేకపరుస్తోంది. ప్రతి చిన్న ఉద్రేకం మనస్సులో ఏర్పడిన ఈ ఆలోచనని బలపరుస్తోంది. ఈ ఆలోచనకు 'ప్రేమ' అని పేరు పెట్టుకోదలచుకున్నాను. ఆ పేరుతో పిల్చాక సుబ్బులు కోసం మూడు గంటలు అలా ఎదురుచూస్తూ కూర్చోవడం ఏమంత కష్టమనిపించలేదు.

సుబ్బులూ, శారదా కలిసి రిక్షాలో వచ్చారు. సుబ్బులు అక్కడ దిగిపోయాక రిక్షా ముందుకు వెళ్ళిపోయింది శారదతో.

వసారాలోకి రాగానే అప్రయత్నంగా 'సుబ్బులూ' అని పిలిచాను.

నన్ను వింతగా చూసి "మీరా! ఇంకా భోజనానికి వెళ్ళలేదూ?" అంది.

"అంటే భోజనానికి వెళ్ళమనా నీ ఉద్దేశం?"

స్థంభం పట్టుకుని నవ్వింది. "అదేమిటి? అయితే భోజనం చెయ్యరూ? ఉపవాసం చేస్తారా?"

"నువ్వు చెయ్యమంటే" అన్నాను. అచ్చు ప్రేమపక్షిలాగా మాట్లాడానని గర్వపడుతూ.

"నాకెందుకు బాబూ ఆ పాపం. హాయిగా భోజనం చెయ్యండి. వెళ్ళండి" అని లోపలికి వెళ్ళిపోయింది.

ఇదా ప్రేమికుల మధ్య సంభాషణ. హోటల్ సర్వరూ, ఖాతాదారుడూ మాట్లాడుకున్నట్టు!

ఛీ! సుబ్బులికి 'ప్రేమ' తెలియదనుకున్నాను. నా మనస్సును కొంచెమయినా గ్రహించదేం? ఆశాభంగంతో అలాగే కుర్చీలోనే కలలు కంటూ కూర్చున్నాను. అలా ఎంతసేపు గడిచిందో! సుబ్బులు చీకట్లో వసారాలో లైటు వెయడానికి వచ్చి నన్ను చూసి విస్తుపోయింది.

"అయ్యో! రామా! ఇంకా వెళ్ళలేదూ?" అంది.

"నీ మీద కోపంగా ఉంది. అందుకని వెళ్ళను" అన్నాను మరింత చొరవచేసుకుని. *రహస్యం, ఆడవాళ్ళు ఏదీ ఇవ్వరు. మొగవాడే కావలసిందేదో తీసుకోవాలని కోరుకుంటారు. తీసుకుంటే చూస్తూ ఊరుకుంటారు. సంతోషిస్తారు. సహకరిస్తారు.* మంచిగా చెప్పే మాటలు ఇవి ఆ చొరవకి సుబ్బులికి నవ్వొచ్చినట్లుంది.

"ఉండండి, మామ్మ రొట్టెలు చేస్తోంది. రెండు తెచ్చి పెడతాను" అంటూ లోపలికి వెళ్ళింది. మొదటిసారిగా ఆ మాత్రం ధైర్యం చేయగలిగినందుకు చాలా సంతోషం కలిగింది. నా కుర్చీ దగ్గరికి బల్ల ఈడ్చి రొట్టెల్నీ, మంచినీళ్ళ గ్లాసునీ నా ముందుంచింది. వెళ్ళి గుమ్మం మీద కూర్చుని "ఇంక చెప్పండి" అంది.

"ఏమిటి?" అన్నాను.

"నా మీద కోపం వచ్చిందన్నారుగా! ఆ మాటకొస్తే నాకూ వచ్చింది మీమీద."

"నామీదా! ఎందుకని?"

"మీ ఊరు రమ్మన్నారు కదా! నాకు మీ తోటలూ, అడవీ అంతా చూపించారా? భోంచేసి చక్కా ఎక్కడికో వెళ్ళిపోయారు."

"నేను వెళ్ళిపోయానా? తాటికాయలు కోయించి నీ కోసం సిద్ధంగా ఉంచితే!"

"నాకు చెప్పందే నేనేం కలగన్నానా?"

నాలిక కొరుక్కున్నాను.

"మరి నేనొచ్చేసరికి నిద్రపోయావుగా?"

"లేకపోతే మీ కోసం ఎదురు చూస్తూ కూర్చోమంటారా? మీ అమ్మగారు ఉన్నారు, మరచిపోకండి. ఎంతకీ రాకపోతే విసుగేసి నిద్రపోయాను. లేచేసరికి వెళ్ళిపోయారని తెలిసింది. ఏడుపొచ్చింది. నేనెందుకు రావాలి మీ ఊరికసలు?"

సుబ్బులు మాటలు వింటూ సిగ్గుపడిపోయాను. మనస్సులో నేనూహించుకున్నదంతా సుబ్బులు కెలా తెలుస్తుంది? ఒక్కమాటయినా ఆమెతో అనలేదు కదా?

"నాదే తప్పంతాను. నీ మీద కోపంతోనే వచ్చేశాను త్వరగా. చెప్పాలనే గుర్తులేకపోయింది."

"మీరన్నీ ఇలానే చేస్తారు" అంది కళ్ళ కొసల నుంచి చూస్తూ.

నాకు పిచ్చెత్తింది. సరుగుడు తోటల మధ్య ఊహించుకున్న సుఖమంతా ఆ ఒక్క క్షణంలో ఆమె చూపుల్తో అనుభవించేశాను. ముగ్ధుడినయిపోయాను. విచిత్రం! *మనం అనుకుంటున్న ఒప్పులు కూడా ఒక్క క్షణంలోతప్పులుగా కనిపించేటట్టు చేసే నేర్పు స్త్రీగా ఆమె జన్మహక్కన్న విషయం ఆ క్షణంలో మరచిపోయాను.* ఆ క్షణంలోనేకాదు. ఆ తర్వాత మరి ఇరవైయేళ్ళు తెలియరాలేదు. ఎప్పుడు ఈ సంఘటన గుర్తుకొచ్చినా.

చాలా సంవత్సరాలుగా సఖ్యత ఉన్న స్నేహితులు మనస్సు విప్పి మాట్లాడుకుంటున్నట్లు ఆ క్షణంలో అనిపించింది. అల్లంత దూరంలో గుమ్మం మీద కూర్చుని మాట్లాడుతున్న సుబ్బుల్ని చూస్తుంటే.

రొట్టెలు తిని చెయ్యి కడుక్కున్నాక పళ్ళెం తీసుకోడానికి లేచింది. దగ్గరికి వచ్చాక "ఒక ప్రశ్న అడగనా?" అన్నాను.

"చెప్పండి" అంది పళ్ళెం తీసి ఆ బల్లమీద కూచుంటూ, ఆమె కళ్ళు ఎటో పచార్లు చేస్తున్నాయి. ముఖం మీద నవ్వు మాత్రం పోలేదు.

"నీకా పెళ్ళి ఇష్టం లేదు కదూ?" అనడిగాడు.

"ఏ పెళ్ళి?" అంతలో గ్రహించి "ఓ, అదా!" అనేసి ఆగిపోయింది.

"చెప్పు" అన్నాను. గట్టిగా చెప్పడానికి సంశయిస్తోందనుకుని ముందుకి వంగాను. ఆమె ముఖం, ఆమె కనుపాపల్లో నా నీడలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఇంకా ఎటువేపో చూస్తోంది.

"ఏమీ అనుకోనులే, ఊరికే అడిగాను, బాధనిపిస్తే చెప్పొద్దు. ఇష్టమా కాదా?" అని ఆగాను.

నా ధోరణే నాది. హఠాత్తుగా కళ్ళతో ఆపింది. "అటు చూడండి" అన్నట్టు కళ్ళు తిప్పింది. "ఆయన చూస్తున్నారు" అనేసి పళ్ళెం తీసుకుని లోపలికి జారిపోయింది.

అటు చూశాను. లాయరు సోమయాజులుగారు చుట్ట వెలిగించుకుని వీధి అరుగుమీద నిలబడి మావేపే చూస్తున్నారు. నేను చూడడం కనిపెట్టి చిరునవ్వు నవ్వారు.

కాని నాకు చిరునవ్వు రాలేదు.

## 10

మేం విశాఖపట్నంలో ఉండే రోజుల్లో మా ఇంటి పక్కన పంజాబీవాళ్ళుండేవారు. హార్బరులో పనిచేయడానికి కొత్తగా వచ్చాడాయన. వాళ్ళ పెరటి వేపు నీళ్ళు పోయేచోట బచ్చలిపాదు లేచింది. గోడని పట్టుకు లేచి మా మూలకి నిలబెట్టి ఉన్న వెదురుకి అల్లుకుంది. ఓ రోజు మా అమ్మ వాళ్ళింట్లోకి వెళ్ళి బచ్చలి కూర కోసుకుంటానంటే ఆ ఇంటావిడ నిక్షేపంగా తీసుకెళ్ళమంది. వాళ్ళకి దాన్నేం చేసుకుంటారో తెలియదు కనక. ఈ రహస్యం తెలిసి ప్రతి రెండు రోజులకి ఓసారి బచ్చలి కోసుకొస్తుండేది మా అమ్మ. ఒకసారి ఉండబట్టలేక పంజాబీ ఆవిడ అడిగిందట "రోజూ ఇలా తీసుకెళతారు కదా! ఏం చేస్తారు ఇంత ఆకుని?" అంటూ. మా అమ్మ నవ్వి, ఆవిడ అజ్ఞానానికి జాలిపడి, మర్నాడు ఇంత కూరా పులుసూ వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి ఇచ్చింది. అది వండే పద్ధతి అడిగి తెలుసుకుంది పంజాబీ ఆవిడ. అంతే, మర్నాటి నుంచీ ఆవిడే కోయడం ప్రారంభించింది. మరోవారం తిరగనిచ్చి బచ్చలి కూర కోయడానికి వీల్లేదని ఆంక్ష పెట్టింది.

అలాగే సుబ్బులు పట్ల నా ఆకర్షణ బచ్చలి పాదలాగ అల్లుకుపోయింది. కొత్త రుచికి అలవాటు పడ్డ పంజాబీ ఆవిడ కథలాగ తయారయింది నా పరిస్థితి. అయినా తప్పేముంది? ఈ రుచి చూపించిన సత్తిరాజుల్నీ, కొత్తపెళ్ళికొడుకునీ అనాలి గాని!

ఈసారి అమ్మ రాగానే సుబ్బులు పెళ్ళి విషయం ఎలా కదపాలా అని ఆలోచనలో పడ్డాను. ఇలాంటి పనికి సోమయాజులుగారే తగిన మనిషనిపించింది. కాని క్రితంసారి నేను చెప్పిన కథ గుర్తుకొచ్చి కాస్త వెనక్కు తగ్గాను. నేను ప్రేమించకుండా జాగ్రత్త పడుతున్నానని ఆయనకి సూచించి, తీరా ఈ మాట ఎలా చెప్పడం? పోనీ శోభనాద్రిగారికే తెలిసేటట్టు చూస్తే? అయినా ఇంత మనిషిని ఇంట్లో పెట్టుకుని పెళ్ళికొడుకు కోసం వెదుకుతాడేం ఆయన? ఇలాంటి ఆలోచనలే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి నన్ను.

రోజుకి ఇరవై నాలుగ్గంటలు చాలడం లేదు నాకు. ఈలోగా సుబ్బుల్ని చూసి, మాట్లాడే ఏ చిన్న అవకాశాన్నీ వృథా పోనీదలచలేదు నేను ఆమె కనిపించని క్షణాలు జీవితంలో వృథాగా గడిచిపోతున్నట్టూ, ఆమెతో మాట్లాడని రోజు ఏదో మబ్బు పట్టిన గడ్డుదినం లాగానూ అనిపించేది. ప్రేమజ్వరంలో సాధారణంగా అబ్బే లక్షణాలన్నీ నాకు వచ్చేశాయి.

నాన్నగారు క్రమంగా తేరుకుంటున్నారని ఓ రోజు మధ్యాహ్నం సీతాలు వచ్చి కబురు చెప్పాడు. ఎందుకో ఈ ఒంటరితనమే నా ఆలోచనలకి మరింత అనువుగా కనిపించింది. అందుకని అమ్మ బయలుదేరి వచ్చేస్తుందేమోనని భయపడ్డాను. పూర్తిగా నాన్నగారు కోలుకునేవరకూ రానక్కరలేదని చెప్పమన్నాను.

"అదేమిటి బాబూ ఈ పదిరోజులకే చిక్కిపోయినారు" అంటూ పరామర్శించి మరీ వెళ్ళాడు సీతాలు. నవ్వుకున్నాను వాడి తెలివితక్కువతనానికి. జీవితంలో రోజులు ఇంత చురుకుగా, ఇంత హుషారుగా ఎప్పుడూ గడవడం లేదు. ఒక గోడ వేర్పాటుతో నా పక్కనే నేను కోరుకున్న అమ్మాయి బ్రతుకుతుందోన్న ఆలోచన ఎంతో వడినీ, వాడినీ కల్పించింది జీవితానికి.

ఇప్పుడు ఒకటి రెండుసార్లు శోభనాద్రిగారి ముందు గదిలోకి వెళ్ళి వారపత్రికలు తిరగవెయ్యడం అలవాటు చేసుకున్నాను. తీరిక ఉన్నప్పుడు ఆయన నాతో కబుర్లు చెపుతూ మంచం మీద ఒత్తిగిల్లేవారు. ఆ గదికి వీధివేపు చిన్న కిటికీ ఉంది. అది దాటాక రైలు కంపార్టుమెంటులో ఒక దానిలోంచి ఒకదానిలోకి పోయే గుమ్మాలలో మరి రెండు గదులున్నాయి. చివర వంటగది. ఇక్కడ నిలబడితే పెరట్లో మల్లెపందిరి కనిపిస్తుంది.

తీరిక సమయాల్లో సుబ్బులుకి పత్రికలు చదివే అలవాటుందని గ్రహించాను. మెల్లగా చిన్న చిన్న నవలలు చదవడం అలవాటు చేయడం ప్రారంభించాను. ఇందువల్ల నాకు ఒరిగేదేమి లేదు. ***తన కోసం శ్రమపడే వ్యక్తిపట్ల స్త్రీకి కలిగే సదభిప్రాయం సానుభూతిగా మారి, క్రమంగా నాకు కావలసిన అభిప్రాయమేదో కలుగుతుందని ఆశ.*** కాని నిజానికి అలాంటిదేమీ సుబ్బులికి కలగలేదు. నేను తెచ్చిన నవలలు ఆమెకి అర్థం కావడం లేదని నేను చాలా రోజులవరకూ గ్రహించలేకపోయాను. నా మనస్సు బాధపెట్టకుండా ఉండడానికి ఆ పుస్తకాల్ని తీసుకుని తలగడ క్రింద పెట్టుకుని నిద్రపోయేదని తరువాత గ్రహించాను. మూడు రోజుల తర్వాత నాకు తిరిగి ఇచ్చేస్తూ "ఎంత మంచి పుస్తకం తెచ్చారు!" అనేది, కృతజ్ఞతతో నా ముఖం చూస్తూ, ఆమె కళ్ళలో ఏ భావం పలికినా అది ప్రేమలాగానే కనిపించేది నాకు. నేను ధన్యుడినయినట్టు భావించేవాడిని. ఆమె ధోరణికీ, తరహాకూ సరిగ్గా అతికినట్టుండే పాత్రలు దొరుకుతాయని మొదట కుటుంబరావు పుస్తకాలు తెచ్చాను. తర్వాత క్రమంగా చలంగారివి చదివించాలని కోరిక.

ఓసారి 'మైదానం'ని భయం భయంగా అందించి, అది తీరా చదివాక నా మీద కోపం తెచ్చుకుంటుందేమోనని ఓ రోజంతా కనిపించకుండా తిరిగాను. మూడోరోజు చిరునవ్వుతో 'మైదానం' తిరిగి ఇచ్చేస్తూ మామూలుగా కృతజ్ఞతని ప్రకటించింది. కోపమో, అవమానమో, 'నీ సంగతి తెలిసిందిలే' అనే హెచ్చరికో కళ్ళలో దర్శనమిస్తుందనుకున్న నాకు మామూలు కృతజ్ఞత కనిపించేసరికి ఆశ్చర్యం కలిగింది.

మరి కాస్త ధైర్యం చేసి "పుస్తకం ఎలా ఉంది?" అన్నాను.

నవ్వింది.

ఆ నవ్వుకి బాగుందని అర్థమయితే సంతోషించేవాడిని. కాని 'ఇది పుస్తకమా?' అన్న ఈసడింపేమోనని అనుమానం కలిగింది. లేక "ఈ పుస్తకం బాగుందా అని అడుగుతావా!" అనే పరిహాసమేమో!

"ఏం, 'అమీనా' మీకు నచ్చలేదా?" అన్నాను ఆసక్తి తీరక.

"ఏ అమీనా?" అంది తెల్లబోయి.

నాకూ ఆ పరిస్థితి మొదట అర్థంకాలేదు. తరువాత అనుమానం వచ్చి "అసలు ఈ పుస్తకం చదివారా?" అన్నాను.

నవ్వింది మళ్ళీ అదే నవ్వు "రెండు రోజులయి అమ్మ నన్ను బ్రతకనివ్వడం లేదు. ఒకటేపని. నిన్న దుర్గా వాళ్ళు సినిమాకు లాక్కుపోయారు. ఈసారి తెచ్చే పుస్తక చదువుతాలెండి..." అంది.

నాకు నవ్వొచ్చింది. అప్పుడే నా మనస్సులో నాటిన అనుమాన రూఢి అయిందికూడా. నిజంగా చదవాలని ఉంటే "ఇది ఉంచండి చదివి ఇస్తాను" అనాలి గాని, ఈసారి ఇచ్చే పుస్తకం చదువుతానంటుందేమిటి? నేనిచ్చే పుస్తకాల్లో కొన్ని పుస్తకాలు వాయిదా పద్ధతుల్లో చదవకుండా తిరిగి వచ్చినవేమో ననిపించింది. తర్వాత తర్వాత మాటల మధ్య 'ఆ నవల్లో ఫలానా పాత్ర అన్నట్లు' అని ఆమె సమాధానానికి ఎదురు చూసేవాడిని. తెలివిగా ఆమె ఆ ప్రసక్తి తప్పించుకునేది. అప్పటికి నాకు రూఢీ అయింది. ఆమె నేనిచ్చే పుస్తకాలేవీ చదవలేదని. ఇందుకు నాకు ఆమె మీద కోపం రాలేదు. నవ్వు వచ్చింది.

ఆమె సాన్నిహిత్యాన్ని సాధించాలనే నా గడుసుదనాన్ని ఆమె అమాయకపు దొంగతనం గడుసుగా జయించింది. తర్వాత మరి పుస్తకాలు తీసుకురాలేదు. సుబ్బులు అడగనూ లేదు. కాని పదిరోజుల తర్వాత ఒక విషయం తెలిసింది. కూరల సంచితో శారద మా ఇంటి ముందు నుంచి వెళుతూ నన్ను చూసి నవ్వుతూ నమస్కారం చేసింది.

ఏదో పలకరించాలని కనక "అదేమిటి. మీరు వెళ్ళారు బజారుకి? మీ నాన్నగారు లేరా ఇంట్లో?" అన్నాను.

"నాన్న ఎప్పుడూ వెళ్ళరండి. ఖుర్దా రోడ్ విజయనగరాల మధ్య లారీలో తిరుగుతుంటారు. ఇంటిపట్టున ఉన్న నాలుగురోజులూ పదికి లేస్తారు" అని నవ్వింది.

"అయితే కుటుంబ బాధ్యత అంతా మీ మీద పడిందన్న మాట! "

మళ్ళీ నవ్వింది. కూరలు కొనితేవడంతో కుటుంబ బాధ్యత తీరిపోతుందంటారా! కుటుంబ బాధ్యత ఇంత చిన్నదే అయితే చాలామంది ఎందుకు భయపడుతున్నారు?'

వాకిట్లోకి వచ్చి నిలబడింది మాట్లాడుతూ. *కొందరితో మాట్లాడుతుంటే మరొకరు ఏమయినా అనుకుంటున్నారేమోనన్న ఆలోచన వస్తుంది. మాట్లాడుతూ, ఎవరనా చూస్తే అనవసరంగా సిగ్గుపడతాం. ఏదో తప్పు పని చేస్తున్నట్లు, మరికొందరితో మాట్లాడడం ఓ గొప్ప అవకాశంలాగ, పక్కవాళ్ళని గర్వపడుతూ చూసేటట్టుగా సాగుతుంది. అలా మాట్లాడడం ఓ తప్పని అనిపించే ఆలోచనను కలిపించరు* వాళ్ళు అలాంటి కోవకు చెందిన వ్యక్తి శారద.

"మీ వేసవి సెలవులు ఎలా గడుస్తున్నాయి?" అన్నాను.

నవ్వింది.

"ఏం సెలవులండీ! కాలేజీ ఉన్నన్నాళ్ళూ ఇంటి భోజనానికి మొహం వాచినట్టుంటుంది. ఇక్కడికి వచ్చాక అక్కర్లేని తీరిక. ఏమీ తోచదు. మీరూ పుస్తకాలు ఇవ్వడం మానేశారాయె" అనేసి అంతలో నాలిక కొరుక్కుంది.

"పుస్తకాలా?: అన్నాను ఆశ్చర్యపోయి.

"అబ్బే ఏం లేదు లెండి" అని సర్దుకోబోయింది.

అర్థమయింది నాకు.

"అందులో తప్పేముంది? సుబ్బులుకి ఇచ్చిన పుస్తకాలు మీరు చదవకూడదా? " అన్నాను.

కృతజ్ఞతతో ఇటు తిరిగి నవ్వింది. "సుబ్బులుకి చదివే ఓపికా, తీరుబాటూ లేదు. నాకెవరు పుస్తకాలు తెచ్చిస్తారు? మధ్యాహ్నం నా దగ్గర పడేసేది"

"మరి నేనిచ్చినవన్నీ చదివారా?" అనడిగాను.

ఆ ప్రశ్న అర్థం కానంత తెలివితక్కువ పిల్లేం కాదు శారద. "ఆ! మీరిచ్చిన 'మైదానం' కూడా" నవ్వుకుంది తలదించి, "సుబ్బుల్ని 'ఇదయినా చదవ్వే మొద్దూ అన్నాను" అని ఫకాలున నవ్వేసి "వస్తానండీ" అంటూ అక్కడ నిలవకుండా పారిపోయింది.

విస్మయంతో ఆమెను చూస్తూ నిలబడ్డాను.

శారద అందమయినదేమీ కాదు. కాని ఆ మాటలన్నప్పుడు ఆమెలో ద్యోతకమయిన సిగ్గూ, నవ్వూ, అలా పరిగెత్తడం ఆమెను అపూర్వమైన దేవకన్యను చేశాయి.

✡ ✡ ✡

11

**మధ్యాహ్నం** నిద్రలేచి, ఇంకా బద్ధకకంగా ఉంటే గదిలోనే కూర్చుని పేపరు చదువుకుంటున్నాను. వీధి వసారాలో కూచుని శోభనాద్రిగారు ఎవరితోనో మాట్లాడుతున్నారు. అప్పటికి ఎండ వాలు పడుతోంది. వేడి తగ్గి చల్లగాలి క్రమంగా పుంజుకునే సమయం.

ఉన్నట్టుండి ఎవరో పిలిచినట్టయితే, చుట్టూ చూశాను.

"ఏమండోయ్! మిమ్మల్నే!"

గొంతు గుర్తుపట్టాను. వెల్లకిలా పడుకున్నానేమో మా గదికీ ఇంటి వారి వాటాకీ మధ్యనున్న గోడమీంచి సుబ్బులు ముఖం కనిపిస్తే తెల్లబోయాను.

"అదేమిటి ఆ పని?" అన్నాను.

నవ్వింది.

"నేనేం గోడలెక్కడం లేదు లెండి. మామ్మ అటక మీద ఆవకాయ జాడీలను దింపమంది" అంది.

కావిరంగు పట్టు చీరకొంగు మాత్రం తెలుస్తోంది. చీర బిగువుగా భుజం చుట్టూ అల్లుకుపోయి ఉంది. జుత్తు చెమటకి ముఖానికి అంటుకుపోయింది. జడని గుండ్రంగా తిప్పి ముడిలాగ చుట్టింది.

"నువ్విప్పుడు ఎలా ఉన్నావో తెలుసా?" అన్నాను, అలా వెల్లకిలా పడుకునే.

నవ్వుతూ "చెప్పండి" అంది.

"వరాలిచ్చే దేవతలా ఉన్నావు" అన్నాను కళ్ళలో కోరికనంతటినీ పొదిగి.

అర్థమయిందో లేక కాకపోయినా అయినట్టు మాట్లాడిందో తెలీదు కాని వెంటనే సమాధానం వచ్చింది. "మీరు ఏం వరం కోరినా నేనిప్పుడు ఇవ్వగలిగింది ఆవకాయే" కిలకిలమంది.

"ఎందుకే అంత నవ్వు?" అని ముసలమ్మ గొంతు వినిపించింది.

"ఏం లేదు మామ్మా!"

"ఇప్పుడెందుకెక్కావు అటకమీదికి? సాయంకాలం దింపుకోవచ్చుగా!"

కొంత విస్మయం కలిగింది. ఇప్పుడు అలా రావడంలో ప్రత్యేకత ఏమిటి? ఆలోచిస్తూండగానే గోడమీద పెదవులు నిలిచేలా వంటి "ఒక్కసారి డాబా మీదకు వస్తారా? మాట్లాడాలి" అంది.

తల తిరిగిపోయింది నాకు. చటుక్కున లేచి తొందర తొందరగా ముఖం కడుక్కుని పెరటి వేపు నుంచి ఇంటి చుట్టూ తిరిగి వచ్చి డాబా మెట్లెక్కాను.

ఈ లోగా ఎప్పుడు మార్చిందో కనకాంబరం రంగు చీర కట్టుకుని తడి చీర ఆరేస్తూ కనిపించింది సుబ్బులు. పిట్టగోడ మీద కూచున్నాను. నన్నసలు చూడనే చూడనట్టు పిలవనట్టే చీర ఆరేయడలోనే నిమగ్నం అయిపోతే, నిశ్శబ్ధంగా ఆమె కదలికల్ని గమనిస్తున్నాను.

ఎంత సేపూ అటూ ఇటూ చూస్తుందే కాని మాట్లాడదు. ఆ నవ్వూ, ఆ చొరవా ఏమయింది?

"సుబ్బులూ!" అన్నాను ఉండబట్టక

"ఉండండి" అంది కళ్ళతో... నేను ఆమెను బ్రతిమాలి పిలుచుకు వచ్చినట్టు. *ఈ టెక్నిక్ మగవాడికి చేస్తే చాతకాదు. అవలంబించినా బాగుండదు.*

మాష్టారు చెప్పే పాఠం కోసం బుద్ధిగా కూర్చున్న విద్యార్థిలాగ పిట్టగోడమీద కూచుని, ఆకాశాన్నీ, అరటి చెట్లనీ, ఎగిరే పిట్టల్నీ చూస్తున్నాను.

చీర ఆరవేయడం పూర్తయింది. వీధి అంతా ఒక్కసారి కలయజూసింది. పిట్టగోడ మీద నాకు ఎదురుగా కూచుని "ఇప్పుడు చెప్పండి" అంది.

నేను తెల్లబోయి "అదేమిటి! నువ్వు మాట్లాడాలన్నావుగా?"

ఫకాలున నవ్వి "అయ్యో పిచ్చి! నేను అంటే అన్నాను. పోనీ మీరు మాట్లాడకూడదా? "

ఇటువంటి సందర్భాలలో మాటల కన్న, మాటల వెనకనున్న భావాల ప్రాముఖ్యం ఎక్కువని అర్థం కాలేదు నాకు. తరువాత ఆలోచించాను. 'మాట్లాడాలి' అనక, "మీతో మాట్లాడాలి, రండి" అంటుందా ఏ ఆడదయినా?

నాకే మాటలూ పెగల్లేదు. అదేమిటో ఇది చాలా విచిత్రమయిన అనుభవం. ఏ పనయినా దానికాపేరు పెడితే ఈడిగిలపడ్డట్టు, యథాలాపంగా జరిపితే ఉండదు. మాటల పేరిట ఏం మాట్లాడాలి?

"ఒక్క మాట చెప్పనా!"

"చెపితే వినాలనేగా వచ్చింది?"

"మీరేమీ అనుకోకపోతే ఒక సలహా" అని ఆగింది.

ఏం చెపుతుందోనని వణికాను. "మీరు పైజమా, లాల్చీ వెయ్యడం మానెయ్యాలి. మెడ పొడుగు. చూడడానికి అందంగా ఉండదు" అని నవ్వు ఆపుకుంది.

చాలా సిగ్గుపడ్డాను. ఏం మాట్లాడాలో తెలీక వీధివేపు చూస్తూ కూచున్నాను. *ఒక అమ్మాయి నా గురించి విమర్శించటం అదే మొదటి సారి. ఆ తర్వాత దాదాపు పది పన్నెండేళ్ళ పాటు అటువంటి బట్టలు తొడుక్కోలేదు.*

"ఏమీ అనుకోరు కదూ?" అంది అంతలో. చాలా నమ్మకంగా క్షమాపణ చెపుతున్న ధ్వని ఆ గొంతులో వినిపించింది.

నేను తలూపాను. *విమర్శతో ఎదుటి వ్యక్తి మీద విచిత్రమైన ఆధిక్యాన్ని సాధించవచ్చునని ఆ క్షణంలో అర్థమయింది* నాకు. చాలా సేపటివరకూ ఎందుకనో ఆమెకంటే ఒక మెట్టు క్రిందుగా నిలబడ్డట్టు భావించుకుని కుంచించుకుపోయాను.

"మీరు మాట్లాడకపోతే ఇలాగే మాటలు వెదుక్కోవాలి" అంది మళ్ళీ.

అప్పటికి ఆమె జవాబు చెప్పలేని ప్రశ్న ఒకటి సిద్ధం చేశాను.

"ఇంత బాగా మాట్లాడుతారే, ఇన్నాళ్ళూ ఇలా తప్పించుకు తిరిగారేం మరి?"

నవ్వింది. "ఏం ప్రశ్నండీ అది?" అని ఊరుకుంది సుబ్బులు.

"అది జవాబు కాదు" అన్నాను.

సుబ్బులు ముఖం ఎటువేపో తిప్పుకుంది. "మరెప్పుడయినా చెపుతాను దీనికి సమాధానం" అనేసింది.

"నువ్వు చదువుకుంటే చాలా బాగుండేది. దుర్గా, శారదా వాళ్ళలాగ ఈ తెలివితేటలు ఇంకా రాణింపుకు వచ్చేవి."

నా వేపు విచిత్రంగా చూసింది.

"నీ స్నేహితురాళ్ళు కాలేజీకి వెళ్ళి చదువుకుంటూంటే నువ్విలా మీ మామ్మకి సహాయం చేస్తూ ఇంట్లోనే గడపడం దిగులుగా, చికాకుగా లేదూ!"

"నాకేం లేదు. హాయిగా ఉంది. అసలు నాకే చదువు మీద మనసు లేదు. ఇంట్లో పనిచేస్తూ తిరగాలంటేనే ఇష్టం" అంది బద్ధకంగా చేతులు వెనక్కి తిప్పుతూ. సుబ్బుల్ని అంత దగ్గరగా ఎప్పుడూ చూడలేదేమో,లేదా అంత జాగ్రత్తగా ఎప్పుడూ గమనించలేదు. చదువుకుంటున్న ఆమె స్నేహితురాళ్ళకంటే సుబ్బులే తృప్తికరంగా కనిపించింది. ***కొందరికి చన్నీళ్ళు నెత్తిన దిమ్మరించుకోవాలనుంటుంది. కొందరికి వేడినీళ్ళు స్నానం చెయ్యాలని ఉంటుంది. అది అభిరుచి భేదం. అంత మాత్రాన చన్నీళ్ళు చేసేవాడిని చూసి జాలిపడనక్కరలేదు.***

"చదువంటే ఎందుకని ఇష్టం లేదు!" అన్నాను.

"అబ్బో! అది చాలా పెద్ద కథలెండి" అంది . గాలికి ఎగిరే పైట చెంగును నడుం చుట్టూ తిప్పింది. శరీరం వంపులు అందంగా, నిండుగా, కనిపించాయి. సంధించిన ధనస్సులాగ కనిపించింది సుబ్బులు.

"ఫరవాలేదు, వింటా, చెప్పు" అన్నాను.

సుబ్బులు కళ్ళకి ఒక ప్రత్యేకత ఉంది. అవి సాధారణంగా మాట్లాడే వ్యక్తిని సూటిగా చూడవు. అతని చూట్టూ ఉన్న వాతావరణాన్ని పరికిస్తూ ఉంటాయి. ఆ వాతావరణంలో మంచి చెడ్డల్ని బేరీజు వేస్తుంటాయి.

"చెపుతా, కాస్త దగ్గరగా జరగండి" అంది. ఇది కథకుడి మొదటి ట్రేడ్ ట్రిక్? అంటే ప్రాంభించక ముందే కొంత ఆసక్తిని ఆకట్టుకునే ప్రయత్నమిది.

"మా నాన్నగారూ, మా తాతగారూ ఎక్కువ మాట్లాడుకోరు తెలుసా?"

"ఎందుకని?"

"మా నాన్నగారికి మేనరికం చేశారు తాతయ్య. నాన్నగారి కది ఇష్టం లేదు. ఎంచేతనంటే మా అమ్మకి చిన్నప్పుడెప్పుడో ఫిట్స్ వచ్చాయట. అందుకని మామ్మ కూడా వెనకాడితే, ఈ తాతయ్యే పట్టుదలగా పెళ్ళిచేయించాడు మనవరాలి మీద మక్కువతో. నేను పుట్టాక అమ్మకి ఫిట్స్ తగ్గిపోయాయి. కాని, ఇన్నాళ్ళూ నాన్నగారి అయిష్టత, చిన్నచూపు కారణంగా ఆమె మనస్సు దెబ్బతింది. అమ్మ చాలా నాజూకు, చిన్నమాటకి పది రోజులు బాధపడుతుంది. పెళ్ళయిన దగ్గరనుంచీ నాన్నగారి అసంతృప్తికీ, అయిష్టతకీ ఎదురు నిలవలేక పోయింది. నేను పుట్టాక అమ్మ ఆరోగ్యం మారింది. నాన్నగారూ క్రమంగా మారారు. అయితే ముందు అనుభవాలు అమ్మ మనసులో చేసిన గాయాలు మారలేదు. పైగా నేను భూమి మీద పడగానే నాన్నగారిలో కలిగిన మార్పు స్వార్థభూయిష్టంగా కనిపించింది. అప్పట్నుంచీ అమ్మ దూరంగా ఉండడం ప్రారంభించింది. ఈ విముఖత, నిశ్శబ్దంగా రోజులు వెళ్ళబుచ్చడం ఎంతో కాలం సాగలేదు. నాకప్పుడు అయిదో ఏడనుకుంటాను. ఒకరోజున నేను లేచేసరికి అమ్మ భోరున ఏడుస్తోంది. ఉన్నట్టుండి మధ్య మధ్య నవ్వుతోంది. నాన్నగారు ఏదో నచ్చజెప్పబోతున్నారు. బుజ్జగిస్తున్నారు. బ్రతిమాలుతున్నారు. కాని అమ్మ ఆగలేదు. కోప్పడ్డారు, తిట్టారు. ఆఖరికి కొడతానని బెదిరించారు. అమ్మ నవ్వింది. నాన్నగారిని ఏవేవో మాటలంది. మరో గంటలో ఆసుపత్రి లారీ వచ్చింది. అమ్మని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. నాకు బాగా జ్ఞాపకం. నాన్నగారు దిగులుగా ఇంటికి తిరిగివస్తే "అమ్మ ఏది నాన్నా!" అని అడిగాను.

"వంట్లో బాగోలేదమ్మా! ఆసుపత్రిలో చేర్పించాను" అన్నారు నన్ను ఎత్తుకుని.

నాకింక ఏమీ తోచలేదు. ఒకటే ప్రశ్న వేశాను. "అమ్మ లేకపోతే నా జడ ఎవరు వేస్తారు నాన్నా?"

నాన్నగారికి కళ్ళనీళ్ళు తిరిగాయి. నాకు నూనె రాసి, ఎలా వెయ్యాలో నా దగ్గరే నేర్చుకుని, నాకు జడ అల్లి పువ్వులు పెట్టేవారు. సాయంకాలం ఎత్తుకుని ఆసుపత్రికి తీసుకువెళ్ళి అమ్మని చూపించేవారు. నన్ను చూడగానే అమ్మ రెండు చేతులూ చాచి ఎత్తుకుని,

ముద్దుల వర్షం కురిపించేది. అంతలో ఏడ్చేది. నేనున్నంత సేపూ ఏమీ గొడవ చేసేది కాదు. తర్వాత మా తాతయ్య (అమ్మ తండ్రి) అమ్మమ్మా వచ్చారు. తాతయ్య అమ్మ బాధని చూడలేకపోయారు. చాలా కుమిలిపోయారు. తర్వాత ఓ సంవత్సరానికి పోయారు. ఆయన పోయాక మా అమ్మమ్మ కూడా ఎంతో కాలం బ్రతకలేదు. అసలే గుండెజబ్బు మనిషి. ఓ రోజు సుఖంగా ప్రాణం వదిలింది. ఆ రోజుల్లో ఈ తాతయ్యా, మామ్మా కూడా వచ్చి నాన్నగారిని ఓదార్చారు. మరో ఆరునెలలకి అమ్మ ఆస్పత్రి నుండి వచ్చింది. కాని అప్పటికి అమ్మ మారిపోయింది. ఎప్పుడూ బలహీనంగా, పరాకుగా ఉండేది. నాకు అమ్మ ప్రేమంటే ఎక్కువగా తెలిసేది కాదు. పరాయి పిల్లయినట్టు నా చేత పనులు చేయించేది. చెయ్యకపోతే తిట్టేది. ఆ తిట్లలో కొన్ని నన్ను ఉద్దేశించి ఉండేవి. నాన్న నన్ను దయతో దగ్గరకి తీసుకుని ఊరుకోబెట్టేవారు. ఎప్పుడన్నా కళ్ళనీరు కారిస్తే "ఊరుకో అమ్మా! ఏమీ అనుకోకు, అమ్మకేం తెలీదు" అని ఓదార్చేవారు. తాతయ్యకి మాత్రం నాన్నంటే కోపం. ఆయన అమ్మని మొదట్నుంచీ సరిగా చూసుకుని ఉంటే ఇలా జరిగేది కాదని. ఇవి అనుకోడానికి బాగానే ఉంటాయి, కాని అప్పుడేం తెలుస్తుంది. నాన్నగారు మాత్రం ఏం చేస్తారు? ఫిట్సు ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి ఏ పెళ్ళికాని అబ్బాయి ఒప్పుకుంటాడు? అయినా అమ్మకి ఆరోగ్యం పాడయాక నాన్నగారు పూర్తిగా మారిపోయారు. అప్పటికే నా పుట్టుక చాలా మార్చేసింది. ఇప్పుడు నాన్నగారిని చూస్తే ఆ పాత కథ అంతా నిజమేనా అని అనుమానం కలుగుతుంది."

ఏదో ఆలోచిస్తూ ఒక్కక్షణం ఆగింది సుబ్బులు.

వేదాంత బోధ చేస్తున్న ఋషిని చూస్తున్నట్టు నిశ్శబ్దంగా ఆమె ముఖం చూస్తూ కూర్చున్నాను.

మళ్ళీ ప్రారంభించిది. "నేను చిన్న తనం నుంచీ స్కూలుకి వెళుతున్నానన్నమాటే గాని ఇంటికి వచ్చాక అమ్మకి అన్ని పనులూ చేసి పెట్టవలసిందే నాన్నగారికి భోజనానికి పీట వేసి, కంచం నీళ్ళూ కూడా నేనేపెట్టి, పరికిణీ మార్చుకుని స్కూలుకి పరిగెత్తేదాన్ని. మళ్ళీ వచ్చాక ఇంటిపని. చదువుకి టైముండేది కాదు. హోం వర్క్ చెయ్యలేక పోయేదాన్ని. ఆవకాయ రోజులు వచ్చాయంటే పెద్దపని. అప్పడాలు, వడియాలు పెట్టాలన్నా చేతినిండా పని. చదువుకోవాలని ఎంతో కోరిక ఉండేది. కాని చదవలేకపోయేదాన్ని. కళ్ళనీళ్ళు వచ్చేవి. దీపం ముందు అలాగే నిద్రపోతే నాన్నగారు తీసుకెళ్ళి పక్కమీద పడుకోబెట్టి దుప్పటి కప్పేవారు.

"నేను అయిదో క్లాసు అందరికంటే ఫస్టుగా ప్యాసయాను. హైస్కూల్లో చేరుస్తానని నాన్నగారు మాటకిచ్చారు. చేరిస్తే నూతిలో పడి చస్తానని అమ్మ బెదరించింది. మూడు రోజులు నాన్నగారు అమ్మకి నచ్చజెప్పబోయారు. రోజూ వంట కూడా నేనే చేస్తానని అమ్మని బ్రతిమాలాను. కాని అమ్మది ఒకటే పట్టు. చదువుకున్నా ఖర్మం బాగులేకపోతే తన బ్రతుకే అవుతుందనేది. కాని నాన్నని చేసుకోవడం వల్లనే అమ్మ బ్రతుకు ఈ మాత్రమయినా ప్రశాంతంగా గడిచిందని ఎప్పుడూ గ్రహించలేదు. ఇక అమ్మని కాదనలేక నన్నే కాదన్నారు నాన్నగారు. "నువ్వు ఇంటిదగ్గరే బాగా చదువుకో అమ్మా, కాశీ తీసుకెళ్ళి నీ చేత పరీక్షలు రాయిస్తాను" అన్నారు నా భుజం తట్టి. అలా చదువు సాగదని తెలుసు. అయినా నవ్వి 'అలాగే నాన్న!' అని ఊరుకున్నాను. ఆ తర్వాత చదువు సాగలేదు. దాని మీద ఆసక్తి క్రమంగా చచ్చిపోతూ వచ్చింది. ఇప్పుడు నాకు చదువుకోవాలనే ధ్యాస అసలు లేదు. ఎప్పుడైనా పత్రికలు చూస్తాను. బొమ్మల్ని చూస్తాను. ఏవైనా చిన్న చిన్న కథలు కూడబలుక్కుని చదువుతాను. అంతకంటే నాకు చదువు రాదు" అని ఆగింది.

నేను దిగ్భ్రమతో కథంతా విన్నాను.

"ఇంతకూ నీ చదువుకి మీ అమ్మే అడ్డు వచ్చిందన్నమాట."

నవ్వింది, "కాదు, మా అమ్మ జబ్బు అడ్డొచ్చింది. లేకపోతే అమ్మ చాలా మంచిది. నా అయిదో ఏట పిచ్చి ఎత్తకముందు అమ్మ ఆప్యాయత, ఆసుపత్రిలో అమ్మ ముద్దులు ఇంకా గుర్తుండిపోయాయి. తర్వాత కరెంట్ పెట్టించారు. పిచ్చి పోయింది. కాని పిచ్చితో పాటు మా మీద అభిమానమూ పోయింది" అంది నవ్వుతూ. "నా జీవితంలో పుట్టి బుద్దెరిగాక అమ్మకు దూరంగా ఉండడం ఇదే మొదటిసారి. నేను పెద్దదాన్నయాక ఈ మధ్య తాతయ్య మా దగ్గరికి వచ్చారు. నన్ను చూసి ఒక్కసారి భోరున ఏడ్చేశారు. మొదటి సారి

నాన్ననీ, నన్నూ చూసి ఆ రాత్రంతా కబుర్లు చెప్పారు..." అని ఆగి మళ్ళీ చెప్పింది. "పట్టుబట్టి నన్ను తనతో తీసుకువచ్చారు. నాకు పని లేకపోతే తోచదు. మామ్మ వద్దంటున్నా ఏదో పనిలో కల్పించుకుంటాను. పని చెప్పకపోతే నన్ను ఒంటరిని చేసినట్టనిపిస్తుంది." అని నవ్వేసింది సుబ్బులు. "అదండీ నా చదువు సంగతి... బావుందా?" అన్నట్టు కళ్ళెగరేసింది.

జాలితో  ఆమె ముఖం చూశాను. కాని నా నుంచి జాలిని ఆశిస్తున్నట్లు లేదు. ఆ కథలో బ్రతికి, ఆ కథలో పాత్రయిన ఆమెకు దానివల్ల దుఃఖం రాలేదు. కాని నాకు గొంతు పెగల్లేదు.

"అయ్యో! పాపం!" అన్నాను.

"చూశారా మాట్లాడమన్నారు, మాట్లాడేశాను. ఈ మధ్య ఎవరితోనూ ఇంతసేపు మాట్లాడలేదు. ఈ విశేషాలన్నీ ఎవరితోనూ చెప్పలేదు" అంది పిట్టగోడ మీంచి దిగుతూ.

కళ్ళింకా చుట్టూ పచార్లు చేస్తున్నాయి.

అంతలో నా వేపు తిరిగి "ఇదెవ్వరికీ చెప్పరు కదూ...!?" అంది.

నేను ఆశ్చర్యపడ్డాను, "ఇందులో రహస్యమేముంది? తెలిసినవాళ్ళు నీ మీద జాలిపడతారు అంతేగా?"

"నాకు జాలీ వద్దు, ఏమీ వద్దు బాబూ. నన్నిలాగే ఉండనివ్వండి. చెప్పండి. ఎవరితోనూ అనరు కదూ...?" అనడిగింది మళ్ళీ.

"అలాగే. చెప్పను" అన్నాను.

అంతటితో ఊరుకోలేదు. నాకు దగ్గరగా వచ్చి హఠాత్తుగా నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంది. "నా చేతిలో చెయ్యి వెయ్యాలి" అంది నవ్వుతూ.

ఆమె స్పర్శకి నేను పులకించిపోయాను. ఆనందాతిరేకంతో ఆమె ముఖం చూస్తూ ఉండిపోయాను ఎంతసేపో. తర్వాత మెల్లగా అన్నాను.

"నేను వేసేదేమిటి? నువ్వే నా చేతిని తీసుకున్నావుగా!"

నా ముఖంలోకి చూసి నవ్వింది. నా చెయ్యి వదల్లేదింకా. రోడ్డు వేపు చాలాసేపు చూసి మళ్ళీ అంది.

"ఇప్పుడు మీకొకర్ని చూపించేదా?"

"ఎవర్ని?" అన్నాను కుతూహలంతో

"మొన్న నన్ను చూడడానికి వచ్చారే ! ఆ పెళ్ళికొడుకు అతనే" అని కళ్ళతో చూపించింది.

అటు చూశాను విస్మయంతో. డ్రైవరు దుర్గారావు ఇంటికి ఇటు పక్క ఇంటి డాబా మీద పొడుగాటి మనిషి కనిపించాడు. అతణ్ణి చూసి చటుక్కున ఆమె చేతిలోంచి చెయ్యి లాగేసుకున్నాను.

## 12

చీకటికీ వెలుగుకీ మధ్యనున్న రహస్యాన్ని అతి సుతారంగా విప్పే ఉషోదయంలో నిద్రనీ, జాగ్రదవస్థనీ వేరు చేస్తూ ఆ సన్నని గొంతు సంధ్య వేళ పలకరించింది. మెల్లిగా తెలివొస్తోంది. కాని గొంతు గుర్తు తెలియలేదు. ఉదయపు గాలికి రాలిన పువ్వుల్లాగ కలకలమంటూ మధ్య మధ్య ఆడపిల్లల నవ్వులు వినిపిస్తున్నాయి. అంత తియ్యటి పాటమీద వాళ్ళకి లక్ష్యం ఉన్నట్లు లేదు. ఇక నిద్ర రానని తిరస్కరించింది. లేచాను. కిటికీలోంచి పక్కనే ఉన్న చెట్టు నీడలో ఆడపిల్లలంతా కనిపించారు. అందరూ ఏదో పేరంటానికి బయలుదేరుతున్నట్టు అందమయిన బట్టలు కట్టుకున్నారు. ఇంకా తెల్లారలేదు. పెరట్లో దీపం వాళ్ళ ముఖాల మీద పడుతోంది. ఒక చెట్టుకు ఉయ్యాల కట్టి ఊగుతున్నారు. తెగిపోయిన మనస్సు విలవిలలాడినట్టు అటూ ఇటూ కదిలే ఉయ్యాలలో శారద కనిపించింది. అందరూ పెద్ద బొట్లు దిద్దుకుని, గంధం రాసుకుని కనిపించారు.

అనుకోకుండా నాకళ్ళు నాక్కావలసిన వ్యక్తికోసం వెదికాయి. బొగడ చెట్టుకి చెయ్యి ఆనించి చోద్యం చూస్తోంది సుబ్బులు. తెల్లటి సిల్కు బ్లౌజు, తెల్లటి చీర, సిగలో తెల్లటి మల్లెలు. ఆ బుగ్గలూ, పెదవులూ మాత్రమే ఎరుపు. ఈ తెలుపు మీద నల్లటి జడ త్రోవ మరచిపోయిన త్రాచులాగ రొమ్ము మీద సుడులు తిరుగుతోంది. కదిలే శారదతో పాటు ఆమె కళ్ళు కూడా ప్రయాణం చేస్తున్నాయి. వీళ్ళందరి మధ్యా వనదేవతలాగా ఉంది సుబ్బులు. ఇంతసేపూ పాట ఆ వాతావరణాన్ని ముగ్ధమోహనంగా పుకలితం చేస్తోంది ఎవరా అని వెదికాను. పాట వచ్చే చోటు తెలుస్తోంది. కాని కిటికీలోంచి ఆ పాడే వ్యక్తిని చూడడం పడలేదు.

"ఏటికే తలుపు నేడు
రాడులే నీ వలపు రేడు
కనుపాపల నీలాన కదలు విశ్వమువోలె 'ఏటికే తలపు నేడు
పలునొక్కులో కరగు పల్లవాధరములా
ఎదనెదను సంధించి ఏకమౌదామనీ
ఏటికే తలుపు నేడు"

చర చరా మేడ మెట్లెక్కాను. కొమ్మల నీడ పడే చోట గోడకి చేరబడి, రెండు కాళ్ళ మీదా తలని ఆనించి ఇంకా విడని ఆ చీకట్లలోకి చూస్తూ పాడుతోంది దుర్గ. ఆమెను గుర్తుపట్టి నివ్వెరపోయాను. అప్పుడు మొదటిసారిగా అనుకున్నాను. కనిపించే మార్దవతకీ, వినిపించే మాధుర్యానికీ ఎంత దూరముందా అని. ఆ క్షణంలో నాకు దుర్గ మీద ఎనలేని గౌరవ ప్రపత్తులు పెరిగిపోయాయి. ఇంకా అక్కడ నేనెప్పుడూ చూడని ఆడపిల్లలున్నారు. వాళ్ళలో ఎవరు తలెత్తి చూసినా నేను కనిపిస్తాను. కాని ఆ ఆలోచన లేకుండా అలా దుర్గని వింటూ నిలబడ్డాను. దుర్గ పాట వింటూ చెట్టు నీడన నిలబడ్డ సుబ్బులు హృదయం ఆ మాటలు పలుకుతున్నట్లు ఒక్క క్షణం ఊహించుకుని పరవశించిపోయాను.

కాని అంత బాగా పాడుతున దుర్గ మీద దృష్టి ఎవరికీ లేదు. అంతా ఆటలో నిమగ్నులయి ఉన్నారు. పాట అయిపోగానే 'మరొకటి పాడవే' అని ఎవరో అరిచారు.

వాళ్ళని చూస్తూ అలా కూచుంది. ***మనసంతా ఏకీకృతం చేసి ఒక భావం పలికాక కొంతసేపు ఆ భావం వ్యక్తిని లోబరచుకుంటుంది.*** దుర్గ ఆ వెలుగు నీడల్లో భర్త కోసమై ఎదురు చూసే విరహోత్కంఠితలాగ కనిపించింది. పాట ఎవరికో చెపుతున్న హితవు కాదు. తన హృదయంలోని బాధను వ్యక్తం చేసుకొనడానికి ఏర్పరచుకున్న ధోరణి.

ఇంతలో ముసలమ్మగారు వాకిట్లోకి వచ్చి అరిచారు. "అట్లు సిద్ధంగా ఉన్నాయి. రండర్రా" అంటూ.

అందరూ ఒక్కసారి ముందుకు దూకారు.

అప్పటికి అర్ధమయింది. అట్ల తదియ హడావుడి అని. మెట్ల మీదకి దిగి చూశాను. అందరికీ ఇంట్లో వరసగా అట్లు వడ్డించి తన రోజుల్నాటి కథలు చెపుతోంది ముసలావిడ. విన్నవాళ్ళు వింటున్నారు. లేనివాళ్ళు ఏవో కబుర్లాడుకుంటున్నారు. వసారాలోకి వస్తే వాళ్ళకి దొరికిపోతాను. అక్కడే చీకట్లో నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్నాను. మరి కాస్సేపటికి అంతా వసారాలోకి చేరారు. తమలపాకుల్ని ముందేసుకు కూర్చుని మెల్లగా చీల్చుకుంటూ, చిలకలు కట్టుకుంటూ కబుర్లు ప్రారంభించారు. మధ్యలో ఎవరో అన్నారు. "కాస్త మెల్లగా మాట్లాడండి బాబూ! ఆయన పడుకున్నట్టున్నారు లేస్తారు" గొంతు గుర్తు తెలియలేదు. శారదేమోననుకున్నాను. ఇల్లంతా సందడిగా ఉంది.

క్రమంగా చీకట్లు విడిపోతున్నాయి. ఇక ఆ మెట్ల మీద నిలబడలేక డాబా మీదకి వచ్చేశాను. మరో పది నిముషాలకి అంతా కదిలారు. అందరూ వెళ్ళేవరకూ ఆగి నేను మెట్లు దిగాను. చివరి మెట్టుకి వచ్చాక మాటలు వినిపించాయి.

"ఈయనకి మరీ ఇంత మొద్దు నిద్రేమిటి? తలుపు బాది పారిపోదాం" అంటోంది దుర్గ.

నాకు నవ్వొచ్చింది.

*వయసొచ్చినా పువ్వుల్ని కదిపితే రేగే సౌరభంలాగ చిన్నతనపు చిలిపితనం చెదురుతుంది. అది చాలా అందంగానూ చెదురుతుంది కొందరిలో.* అయినా దుర్గ చిలిపితనం ఇప్పుడు మాత్రం ఏం తగ్గుతుందని?

"వద్దోయ్, తెలిస్తే బాధపడతారు" అని చెయ్యి లాగుతోంది శారద.

"నీకేం తెలీదు. నువ్వుండు" అని దుర్గ తలుపు మీద దబదబ బాదింది.

ఒక్క విసురున వెనక్కు తిరిగిన ఇద్దరూ నన్ను చూసి మ్రాన్పడిపోయారు. ఇద్దరికీ మూర్ఛ వచ్చినంత పనయింది. శారదకి కొద్దిగా నవ్వు వచ్చింది కాని, దుర్గ నుదుటిమీద చెమట పట్టేసింది. బెదురు చూపులు చూసింది.

"నన్ను మీకు సహాయం చెయ్యమంటారా?" అన్నాను.

దుర్గ మాట్లాడలేదు.

"మీ అల్లరికి ఇంతవరకూ తెలివి రాకపోతే కదా లేపడానికి?" అన్నాను.

శారదకి నవ్వాగలేదు. తప్పించుకు పారిపోయింది.

కాని దుర్గ అలా వెళ్ళలేకపోయింది. నా ముఖం చూస్తూ "సారీ!" అంది.

నవ్వి "ఫరవాలేదు. మీరంత చక్కగా పాడినందుకు ఇవాళ మీరేం చేసినా క్షమించెయ్యగలను" అన్నాను.

వింతగా నా కళ్ళలోకి చూసి "మీరా పాటను విన్నారా...?" అంది.

అందులో బాగుందన్న కాన్ఫిడెన్సూ, మీరు విన్నారా? అనే ఆశా కనిపించాయి.

తలూపాను. "మీరాశించినట్లే ఇవాళ మీరే నన్ను లేపారు. అయితే తలుపు బాది కాదు. చాలా మృధుమధురంగా మీ పాటతో తట్టి లేపారు."

"ఛీ" అని కళ్ళు మూసుకుంది.

చెక్కడంలో కాస్త చెదిరిపోయిన బొమ్మలకి ప్రత్యేకలక్షణాలేవో, అందానికి ప్రత్యామ్నాయంగా ఇస్తాడనుకుంటాను బ్రహ్మదేవుడు. అలా అయితే ఈమెకు సిగ్గు ఇచ్చివుండాలి.

"ఇంత బాగా పాడతారని నాకు తెలీదే! ఎక్కడ నేర్చుకున్నారు ఇంత తియ్యటి పాటల్ని?"

ఇంకా ఏం మాట్లాడేవాడినో కాని దూరంగా ఎవరో పిలిచారు"దుర్గా" అంటూ.

"థాంక్యూ" అని పారిపోయింది దుర్గ వెనక్కి తిరిగి చూడకుండా.

నాకు చాలా ఉత్సాహంగా ఉంది ఇవాళ. తలుపు తీసుకుని బ్రష్, పేస్టు తెచ్చుకుని వీధి అరుగుమీద కూచున్నాను. ఆకాశానికి తెలివొచ్చింది కాని, ఇంకా ఆ వీధిలో ఎంతో మందికి తెలివొచ్చినట్టు లేదు. వీధి చాలా మట్టుకు నిర్మానుష్యంగా ఉంది. ఇంకా ఏ ఇంట్లోనో ఆడపిల్లల గొంతులూ, నవ్వులూ వినిపిస్తున్నాయి. ఇక్కడ నుంచి వాళ్ళంతా వెళ్ళిపోయినందుకు దిగులేసింది.

ముఖం కడుక్కుని లోపలి రాబోతుంటే తాసిల్దారు గారింట్లోంచి సుబ్బులు రావడం కనిపించింది. అటు చూస్తూ వసారాలోకి వచ్చి నిలబడ్డాను. లోపలికి వచ్చి నన్ను చూసి నవ్వింది సుబ్బులు.

"పొద్దుటే ఎక్కడినుంచి?" అన్నాను.

"మీకు తెలీదూ? ఇవాళ అట్ల తద్దె. మా మామ్మ అట్లు చేసింది. దుర్గ ఇంట్లో కూడా చేశారు. చేసినవన్నీ ఏం కావాలి? అంటే తింటే కాని వీల్లేదని పట్టుపట్టారావిడ. నా వంతు తీసుకొచ్చేశాను. పోనీ మీరు తింటారా?" అని పళ్ళెం నా వేపు జాపింది. తెల్లటి చీర

నడుం చుట్టూ తిప్పుకుని, మెడకు గంధం, నుదిటికి రెండూ కుంకుమ బొట్లతో పెద్ద ఆరిందలాగ కనిపించింది. పెదవులు తాంబూలానికి ఎర్రగా ఉన్నాయి.. మేడమెట్ల నీడ వాకిట్లో జాలుగా పడింది. అక్కడ ఒత్తిగిలి నిలబడ్డాను.

ఆమె చెయ్యి జాపి ఉంది. నేనెంతకీ అందుకోలేదు. "త్వరగా చెప్పండి బాబూ, అక్కడ తాసీల్దారుగారు పెద్ద ఉయ్యాల బల్ల దింపిస్తున్నారు" అని పోబోయింది. కదలబోతున్న సుబ్బుల్ని ఆపాలనే ధ్యాసతో ఒక్కసారి భుజం పట్టుకు ఆపాను. నిర్ఘాంతపోయి నిలిచిపోయింది. ఇప్పుడు ఆమె ముఖంలో తొందరలేదు. కోపం ఉందేమోనని వెదికాను. అదీ లేదు. కేవలం ఆశ్చర్యమే ద్యోతకమైంది.

"నేను... నేను..." ఏదో అనబోయాను.

"ఊఁ ఎలాగూ ఆపారుగా. తీసుకోండి" అంది మళ్ళీ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"నువ్వు అందిస్తే తింటాను. ఇది మీ పండగ. ఎలా తినాలో కూడా మీరే చెప్పాలి."

నిస్సహాయతంటే స్త్రీకి అంత మక్కువనుకుంటాను. ఓసారి నా వేపు చల్లగా చూసి "అబ్బ! ఏం చోద్యం బాబూ! తినడమే రాదట ఈయనగారికి" అంటూ ఒకటి తీసి నోట్లో కూరింది. నేను మాట్లాడబోతే నోరు మూసి "అటు చూడండి" అని లోపలికి పారిపోయింది.

చూశాను. దురదృష్టం కొత్త పెళ్ళికొడుకు పళ్ళు తోముకుందుకు అరుగు మీదికి వచ్చి కూర్చున్నాడు. మేమిద్దరం అతని దృష్టిలో పడనూ పడ్డాం - ఇది రెండోసారి!

✡ ✡ ✡

13

**తరువాత ఏదో** పెద్ద విపత్తు సంభవిస్తుందని అనుకున్నాను. ఎంచేతనంటే ఆ పెళ్ళికొడుకు తాలూకు బంధువులు ఆ ఇంట్లో ఉన్నారట. ఆమె సంబంధం తిరగగొట్టినా సుబ్బులు మీద అతని మనసు తిరగనట్టుంది. అందుకని బంధువుల ఇంటికని వచ్చిన మిషతో అక్కడ బైఠాయించాడు. ప్రతి క్షణం ఈ ఇంటిమీదా, ఇంట్లో కదిలే సుబ్బులు మీదా దృష్టి పెట్టుకు కూర్చున్నాడు. ఇదంతా నాకు తర్వాత సత్తిరాజులు మొరపెట్టుకున్నాడు. వేడి రొట్టెకోసం పోటీ పడుతున్న రెండోపిల్లి అది.

"మరి నేనంటే నీకు కోపం లేదా?" అనడిగాను ఓసారి.

వోరగా నవ్వి "ఊరుకోండీ నాతో హాస్యాలాడతారు, మీరు పెద్దమనుషులు" అన్నాడు. 'పెద్దమనుషులు' అనే పేరిట నా అభిప్రాయాలకి సంకెళ్ళు బిగించగలిగానని అతని విశ్వాసం.

ఏమైనా కొత్త పెళ్ళికొడుకు విషయమే నన్ను కలవరపెట్టింది. రెండు సందర్భాలలో తెలిసో తెలియకో మా ఇద్దరి మధ్యా సంభవించిన సాన్నిహిత్యానికి అతనే రంగయినా పూయవచ్చు. దూరంగా అతన్ని చూస్తే దుబ్బు కనుబొమలు, మామూలుగా చూసినా ఆశ్చర్యపోయి చూస్తున్నట్లున్న పెద్ద కళ్ళు, వెనక్కి గిరజాలు తిరిగిన జుత్తు తెల్సింది. ఏమైనా అతని మంచితనం మీద అంత దూరం నుంచి సదభిప్రాయం కలగలేదు నాకు. కాని తనమీద సదభిప్రాయం ఏర్పరచుకునే సదవకాశాన్ని అతనే ఒకసారి కల్పించాడు. అది చాలా విచిత్రంగా జరిగింది.

అమ్మ రావడం ఆలస్యం కావడం, పొద్దుటా సాయంకాలం హోటల్ భోజనం తినవలసి రావటం కాస్త ఇబ్బందిగా పరిణమించింది. హోటల్‌కి వెళ్ళాలంటే చాలా దూరం నడవాలి. నడక ఆయాసం కాదు కానీ, ఇంతా నడిచి ఆ హోటల్ మెతుకులు

తినాలనే ఆలోచన కలిగించే ఆయాసం అంతా ఇంతా కాదు. ఆ ఊళ్ళో హోటళ్ళ రుచి చూడడం అదే కొత్త. ఈ గుంజాటన క్రుంగదీసి రెండు లంఖణాలు చేయించింది. ఓ రోజు లేవడానికి మరీ ఓపిక లేకుండాపోయింది. దీన్ని మొదట కనిపెట్టింది సుబ్బులే. రోజూ హోటల్‌కి పోయేటప్పుడో, వచ్చేటప్పుడో ఇద్దరం తటస్థపడడం అలవాటు. మాట్లాడాలనో, ఏదో చెప్పాలనో దగ్గరకి రాబోతే ఎదురుగ్గా సత్తిరాజులో, లాయరుగారో దర్శనమిచ్చేవారు. లేకపోతే కొత్తపెళ్ళికొడుకు కనిపించేవాడు. హనుమంతరావుని అడిగితే "షీరో పామిస్ట్రీ చదివి కాస్త వంటబట్టించుకో. ఆడపిల్లలు చెయ్యిచూడడం, తద్వారా స్నేహం చెయ్యడం కొత్త టెక్నిక్" అన్నాడు. కాని సుబ్బులు చెయ్యి పట్టుకున్నప్పుడు ఎన్నోసార్లు సత్తిరాజులకో, కొత్త పెళ్ళికొడుక్కో తప్పనిసరిగా దొరికిపోయాం. ఒకసారి నేను సిగ్గుపడి చెయ్యి వదిలేయబోతే "చెప్పండి ఆపేశారేం?" అని రెట్టించింది. "మీ గదిలో కూర్చుందాం పద" అన్నాను. నా పక్కన చూసి నవ్వి, "పోనీ, తర్వాత చెపుదురుగాని లెండి" అని తప్పించుకుంది. చెప్పొచ్చేదేమిటంటే ఇలాంటి సందర్భాలలో కలుసుకోవడం అలవాటయాక బొత్తిగా ఈ రెండురోజులూ కనిపించకపోవడం అనుమానం కలిగించింది గావును. సుబ్బులు వాళ్ళ మామ్మకి చెప్పేసింది. మర్నాడు ఉదయమే నీరసంగా లేచి కాఫీకి పొయ్యి రాజేయబోతే సుబ్బులు కాఫీకప్పుతో వచ్చింది వంటింట్లోకి. అప్పుడే లేచినట్టుంది. పరుపుమీద వాడిన మల్లెపువ్వులాగ ఉంది.

"ఇదేమిటి?" అన్నాను.

"జ్వరానికి ఇంత రహస్యమెందుకు బాబూ. మీరు చెపితే కాని తెలీదేమిటి? ఇందండి కాఫీ" అంది తల ప్రక్కకి తిప్పి. నవ్వొస్తోందిగావును.

"సుబ్బులూ" అన్నాను ప్రేమగా. చూసింది, మరోక్షణంలో చెయ్యిపట్టుకుంటాననుకుందేమో, దూరంగా జరిగి కిటికీ దగ్గరికి వచ్చింది.

"సుబ్బులూ! ఈ కాఫీ తాగుతుంటే ఇప్పటికి నాకో విషయం అర్థమైంది" అన్నాను.

"ఏమిటి!"

"జ్వరం రావడమే హాయిగా ఉంటుందని."

గది మధ్యగా నడిచాను. ఆమె దగ్గరకి నడవాలంటే ఎంత దూరం! గది అంత పెద్దగా ఉన్నందుకు మొదటిసారిగా విసుగేసింది. కిటికీ దగ్గరికి చేరానో లేదో "జ్వరం వచ్చిందటగా నాయనా నాతో చెప్పలేకపోయావా?" అంటూ వాళ్ళ మామ్మ వచ్చింది.

ఒక్కసారి అధఃపాతాళానికి కృంగిపోయాను. జ్వరం రావడం వల్ల అంతవరకూ కలిగిన ఆనందం చెదిరిపోయింది.

వాళ్ళ మామ్మతో మాట్లాడుతున్నంతసేపూ కిటికీ వేపు చూస్తూ సుబ్బులు ఒకటే నవ్వు. ఆమె వెళ్ళాక ఇటు తిరిగితే సుబ్బులు వాకిట్లోకి వచ్చి కూర్చుంది. నోటికి కొంగు అడ్డంపెట్టుకుని, కృత్రిమ కోపంతో బయటికి వచ్చాను. ఆమెను సాధిద్దామని. నావేపు వింతగా చూస్తోంది. కళ్ళల్లో బెదురు లేదు. ఏం చేద్దామనో మీదకు వంగాను. కాని ఆ క్షణంలో పొరపాటు చెయ్యలేదు. ఒక్కసారి చుట్టూ చూడదలిచాను.. చూస్తే ఏముంది ఆ శనిగాడు ఆ పెళ్ళికొడుకు అక్కడే నిలబడి చూస్తున్నాడు. అంత దగ్గరగా ఉన్న నా ముఖంలో చికాకుని సులువుగా పోలిక పట్టినట్టుంది.

"చుట్టూ చూడడంలో చెప్పదలుచుకున్నది మరిచిపోయారా? సాహసవంతులే!" అని తలమీంచి ముందుకు వాలిన ఉంగరాల్ని గాలిలో రెపరెపలాడించి లేచిపోయింది. అలా లేచినప్పుడు ఆమె వెచ్చని ఊపిరి నా చెంపలకి సోకడం మరిచిపోలేదు నేను ఇప్పటికీ.

ఎంత అందమయిన అనుభవం అది!

ఆ శనిగాడి వల్ల కాకపోతే మరెంత అందంగా ఉండేదో!

✡ ✡ ✡

ఆ మధ్యాహ్నం ఎంగిలిపడాలని, నీరసంగా ఉన్నా, హోటల్‌కి బయలుదేరడానికి సిద్ధమయ్యాను. శోభనాద్రిగారు తలుపు తోసుకుని లోపలికి వచ్చారు.

"ఏమిటోయ్, జ్వరమని నాకు తెలియనే తెలీదు. మేమిక్కడ ఉండగా ఆ మాత్రం సహాయం చెయలేకపోతామా?" అంటూ మంచం మీద కూర్చున్నారు. "ఏదీ, ఇలా రా" అని నన్ను దగ్గరికి పిలిచి చెయ్యిపట్టుకు చూశారు. "ఇది ఏదో దొంగ జ్వరం. ఈ పాటికి తగ్గిపోయే ఉండాలి. నీ వయసులో జ్వరం వస్తే సింహాచలం చందనోత్సవానికి సైకిళ్ళ మీద వెళ్ళివచ్చాం. పద పద మా ఇంట్లో ఇంత చారన్నం తిందువుగాని" అన్నారు.

"లేదండీ, హోటల్‌కి పోతాను. మీకెందుకా శ్రమ?" అన్నాను. కాని ఆయన వదల్లేదు. "హోటల్లో పథ్యం భోజనం ఏమిటోయ్! ఇవాళ మా సుబ్బులు వంట. నీ భోజనానికి పొద్దుట్నుంచీ ప్లాను వేస్తున్నారు ఇంట్లో. మంచి కట్టుచారు కాచారు. పదపద" అని తువాలు నా భుజం మీద వేసి లాక్కుపోయారు.

భోజనం చేస్తున్నంతసేపూ మాట్లాడుతూనే ఉన్నారు శోభనాద్రిగారు. *మధ్య మధ్య హాస్యానికి తనే నవ్వుతున్నారు. కొందరు భోజనాన్ని విలాస కార్యక్రమం చేసుకుంటారు. కొందరికి భోజనం నిత్యకృత్యంలాంటిది. కొందరికి బాధ్యత, మరికొందరికి ఖర్మ.*

సుబ్బులు తలుపు చాటునుంచి మామ్మకి అన్ని వస్తువులూ అందిస్తోంది. భోజనం పూర్తయే సమయానికి ముందు గదిలోకి వచ్చి తమలపాకులు చీల్చి తాంబూలం సిద్ధం చేసింది. ఎప్పుడు మళ్ళీ అందుకుందో, భోజనం పూర్తి చేసి పెరటి వేపు నడిచే సరికి నూతి దగ్గర తువాలు తీసుకుని సిద్ధంగా ఉంది. ఆమె శ్రద్ధకి ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగింది!

"ఈ దెబ్బతో నా రోగం పోతుంది. నీ చేతి వంట రుచి చూశాను కనక" అన్నాను. ఆమె చేతిమీద నీళ్ళుపోస్తున్నప్పుడు మామూలుగా ఆమె కళ్ళు దిక్కులు చూస్తున్నాయి.

"ఈ చివరి సపర్య ఇంత అందంగా చేయాలని ఎవరు చెప్పారు?"

"సపర్యా లేదు నా నెత్తీ లేదు. ఓ మాట చెపుదామని ఇంటి చుట్టూ తిరిగి ఇటొచ్చాను."

"ఏమిటీ?" అన్నాను తెల్లబోతూ.

"అతను వచ్చి మీ గదిలో కూర్చున్నాడు"

"ఎవరు!"

"ఇంకెవరు? నన్ను చూడడానికి వచ్చిన..."

నిర్ఘాంతపోయాను.

"నన్ను చూడడానికా? బహుశా మీ తాతగారిని..."

"అబ్బ? మీకేం తెలీదు. మీకోసమే వచ్చాడు. నాకు తెలుసు. మీ గదిలో కూర్చున్నాడు"

"ఎందుకు?"

తలపట్టుకుంది.

"మీతో మాట్లాడి మీరొప్పుకుంటే మిమ్మల్ని పెళ్ళి చేసుకోడానికి"

సుబ్బులు హాస్యం ఆడుతోందేమోననుకున్నాను కాని, ఆమె ముఖంలో నవ్వులేదు.

హఠాత్తుగా మా ఇంటి పెరటి వేపు కిటికీ దగ్గర ఎవరో కదలినట్టు నాకనిపించింది. కాని నేను నూతి వేపు తిరిగి ఉన్నాను. నేనటు తిరగబోతే సుబ్బులు నన్ను భుజం పట్టుకు ఇటు తిప్పి తువాలు అందించింది.

నెమ్మదిగా నా చెవి దగ్గర అంది "మాటలు పెరగనీకండి. మీ మీదే నా భారమంతా వేస్తున్నాను" అనేసి చటుక్కున ఇంట్లోకి మాయమయింది. ఆక్షణంలో సుబ్బులు వెళ్ళిపోయినా నాకు చాలా ఆనందం కలిగింది. *పుస్తకాలు చదువుకోకపోయినా మనస్సులో మాట బాగానే చెప్పొచ్చు.*

## 14

ఏదో పాతపుస్తకం పేజీలు తిప్పుతూ కూర్చున్నవాడల్లా నేను రాగానే లేచి నమస్కారం చేశాడు నవ్వుతూ. నేను బిగుసుకుపోయి ఉన్నాను. అలాగే ప్రతి నమస్కారం చేశాను.

"నా పేరు భగవాన్లు.." ఇంకేదో చెప్పేలోగానే,

"గ్లాట్టుసీయూ" అన్నాను మూతిబిగించి, ముందు వాగ్యుద్ధానికి సిద్ధపడి "నన్నేం చెయ్యమన్నారు?"

తెల్లబోయాడు భగవాన్లు. కాని అంతలో నవ్వాడు. నవ్వినప్పుడూ ఆ కళ్ళు ఆశ్చర్యపడుతున్నట్టే ఉన్నాయి! అప్పుడనుకున్నాను. మమ్మల్ని చూసినప్పుడు మాత్రమే ఆశ్చర్యం కలగలేదని 'ఆశ్చర్యం' అతని ముఖం మీద స్థిరంగా ముద్రవేసుకున్న భావం.

"మొదట ఈ ఉత్తరం చదవండి మీకంతా అర్థమవుతుంది" అని కాగితం ఇచ్చాడు. ఆశ్చర్యపోతూ విప్పి చూశాను. హనుమంతరావు వ్రాశాడు. "ఇతని పేరు భగవాన్లు. మా తోడల్లుడికీ ఇతనికీ బాగా పరిచయం. నీతో ఏదో పనుందట. వీలుంటే చేసిపెట్టు."

చకితుడినయాను. ఊరిలో ఉంటున్న వాడికి అక్కడ ఉంటున్న స్నేహితుడి నుంచి ఉత్తరం తీసుకొచ్చిన అతని ప్రతిభ ఏమని చెప్పను? అతను నన్నడగబోయే సహాయం హనుమంతరావుకి తెలియదన్నమాట.

"నాతో మీకేం పని?" అన్నాను కాగితం మడతబెడుతూ.

నవ్వి "మొదట కూర్చోండి" అన్నాడు తన ఇంట్లో నాకు మర్యాదలు చేస్తున్నట్లు. కూర్చున్నాక చెయ్యిజాపి "నాకు మీరు చెయ్యి చూడాలి" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. "ఇదా నాతో పని?" అన్నాను.

"అవును. ఈ మధ్యనే నాకు వీటిమీద నమ్మకం పెరిగింది. ఎందుకంటే విన్నదానికీ, చూసినదానికీ పొత్తు కుదరడం లేదు జీవితంలో. పోనీ ఇలా చెప్పగా తెలుసుకున్న దానికి విలువ ఉంటుందేమోనని మొన్న హనుమంతరావుగారి షాపుకెళ్ళాను. మాట మధ్యలో మీరు 'షీరో' చదువుతున్నారని చెప్పారు. నాకు చాలా ఇష్టం ఈ సైన్సంటే. నాకు మీరో ముఖ్యమయిన విషయం చెప్పాలి"

"ఏమిటి?"

"నా పెళ్ళిని గురించి"

నిజానికి నాకా చదువు వంటబట్టలేదు ఎక్కువగా. అయితే *అబద్ధాన్ని కూడా అందంగా వర్ణిస్తే నిజంలాగా ఉంటుందన్న మాట గుర్తుకొచ్చింది.* ఏదో చెయ్యాలి గనక అతని చెయ్యి చూశాను. నాకేం అర్థంకాలేదు. ఒక్కసారి కళ్ళు మూసుకున్నాను. ఇతను కేవలం ఈ పనికే వచ్చాడా అని మథనపడ్డాను మనసులో.

"మీరు ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోలేరు. మిమ్మల్ని ప్రేమించిన అమ్మాయినే మీరు చేపట్టగలుగుతారు" అన్నాను చివరికి మాటలు కూడదీసుకుంటూ.

అంతే, ఒక్క గెంతు గెంతాడు భగవాన్లు. "నిజం!" అన్నాడు దిగ్భ్రమతో, ఆ ఉత్సాహం చూసి నేనే తెల్లబోయాను.

"నాకు మహోపకారం చేశారు. ఐ థాట్ సోమచ్" అన్నాడు ఒక్కసారి లేచి గదంతా పచార్లు చేశాడు. అంతలో నా రెండు భుజాలూ పట్టుకుని కుదిపి "ఎంత బాగా చెప్పారండీ" అన్నాడు. హఠాత్తుగా కూర్చుని "ఈ మాట మా చిన్నాన్నకి చెపితే సుతరామూ ఒప్పుకోడండీ" అన్నాడు.

నాకేం అర్థం కాలేదు. "ఎందుకని?"

నా ముఖం చూసి "మీకేం అర్థం కాలేదు. కథ చెపుతాను చూడండి. మా మావయ్య కూతురు సుందరి ఉంది. చిన్నప్పట్నుంచీ అదీ, నేనూ కలిసి తిరిగాం. కలిసి పెరిగాం కొట్టుకున్నాం, తిట్టుకున్నాం. నేను ఖర్గపూర్‌కి చదువుకి వెళ్ళిపోయాక దానికి మశూచి వచ్చింది. ముఖమంతా మచ్చలు మిగిలిపోయాయి. జబ్బుతో ఉన్నన్నాళ్ళూ నన్నే తలుచుకునేదట. తర్వాత సెలవులకి వస్తే నాకు ముఖం చూపించడానికే సిగ్గుపడి లోపలికి పారిపోయేది. నాకు జాలేసింది. ఆమెను చూస్తుంటే ఎవరో మనస్సులో చెయ్యిపెట్టి కెలికినట్లు బాధపడేవాడిని. చిన్నప్పట్నుంచీ మేమిద్దరం భార్యాభర్తలవుతామని అంతా అంటుండేవారు. మేమిద్దరం ఎప్పుడు కనిపించినా వేళాకోళం చేసేవారు. అలాంటిది ఆ సెలవుల్లో ఆ విషయం ఎవరూ మాట్లాడలేదు. మావయ్య కూడా నా ముఖం చూస్తూ గుడ్లనీరు కుక్కుకున్నాడే కాని, ఆ మాట అనలేకపోయాడు. సుందరి మాట్లాడలేదు. "వచ్చావా బావా! రావనుకున్నాను" అని మాత్రం అంది. మా చిన్నాన్న గార్డియను. ఇంట్లోనే పెళ్ళికూతురుందని అంతవరకు హాయిగా కూర్చున్న చిన్నాన్న హఠాత్తుగా పెళ్ళిసంబంధాలు వెతకడం ప్రారంభించాడు. కాని నేను మాత్రం సుందరినే చేసుకోవాలనుకున్నాను. చిన్నప్పటినుంచీ పెంచుకున్న ఆలోచనని చిన్న అపభ్రంశంతో తుడిచిపెట్టేస్తామా సార్? ఆ మాటకి వస్తే సుందరి ఎప్పుడూ అందమైంది కాదు. ఇప్పుడీ స్ఫోటకంతో ఆమెలో పెద్దపోయిందేమీ లేదు. ఇదీ నా అభిప్రాయం. నేను ఆమెనే చేసుకుంటానన్నాను. కాని వినలేదు. ఇక్కడికి తీసుకొచ్చాడు. మీకు తెలిసే ఉంటుంది. ఈ అమ్మాయిని చూపించాడు" అని ఆగాడు.

ఇప్పుడు కథకు నాకు కావలసిన రుచి వచ్చింది. "చెప్పండి" అని తొందర చేశాను.

"ఈ అమ్మాయిని చూడగానే నా మనస్సంతా ఒక్కసారి మారిపోయింది సార్. మీతో నిజం చెప్పేస్తున్నాను."

నా గుండె గొంతులో కదిలింది. "అంటే" అన్నాను నూతిలో గొంతుతో.

"అంటే ఇదివరకు మా సుందరి విషయంలో ఉండే అనుమానం కూడా విడిపోయింది. తప్పనిసరిగా సుందరినే చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చాను. అందం, గుణం ఒక్కచోటే ఉండనక్కరలేదని అందమైన గుణపాఠం నేర్పింది ఈ అమ్మాయి" అని ఆగాడు.

"ఎందుకిలా అనుకుంటున్నారు?" అని అడిగాను.

"పోనీండి సార్, మనకెందుకా గొడవలన్నీ? నాకెలాగూ ఆ విషయాల మీద ఆసక్తి లేదు. మిగతావి చెప్పండి" అని చెయ్యిజాచాడు.

"అలాకాదు. మీరెందుకిలా అనుకోవలసి వచ్చిందో తెలుసుకోవాలను ఉంది" అన్నాను.

నా ముఖం చూసి నవ్వాడు. "చెప్పమంటారా? మీకు సత్తిరాజులుగారని తెలుసా?"

తలూపాను.

"ఆయన్ని కదపండి. రకరకాల కథలు చెపుతాడు - ఆయనతో ఎన్నిసార్లు కలిసి తిరిగిందో, చిన్నప్పట్నించీ ఆమె స్వభావం ఎలాంటిదో అయినా రూపం ఉన్నవాళ్ళ దగ్గర గుణం ఉండదని.."

"అదంతా పచ్చి అబద్దం" అని అరిచాను. అంతలో తేరుకుని "భగవాన్లుగారూ! రూపంలేని వ్యక్తిని ప్రేమించాననుకుంటూ ఆమెలో గుణాన్ని చూస్తున్నారు మీరు. బాగానే ఉంది. కాని రూపం ఉన్న వ్యక్తికి గుణం ఉండదన్న అభిప్రాయం ఎవరు కలిగించారు మీకు?" అన్నాను.

అతను తెల్లబోయి చూశాడు.

"ఆ అమ్మాయిని నెలరోజులకు పైగా తెలుసు. ఇన్నాళ్ళలో ఆమెలో ఒక్క కళంకం కనిపించలేదు" అన్నాను మళ్ళీ నేనే.

"నిజం!" అన్నాడు భగవాన్లు.

"నా సాక్షిగా" అన్నాను ఉద్రేకంగా. "పదిమందీ పది రకాలుగా మాట్లాడుకుంటారు. దానికేం? నలుగురూ అన్నంత మాత్రాన తాడు పాము అవుతుందా?"

భగవాన్లు ముందుకి వంగాడు. "కాని ఆలోచించండి సార్. పది పదిహేను రోజులు పరిచయమున్న వ్యక్తితో ఆమె వాళ్ళ ఊరు వెళ్ళిందట. నాకు తెలీదనుకోండి. మరి దీన్నేమంటారు?"

నేను విస్మితుడినయాను. "ఇదీ సత్తిరాజులే చెప్పాడా?"

"చుశారా! నిజమేనని మీరెంత చక్కగా సమర్థిస్తున్నారో!"

నాకు ఆశ్చర్యంతో, సత్తిరాజులు మీది జుగుప్సతో నోటమాట రాలేదు.

"అఫ్‌కోర్స్ నేను నమ్మలేదనుకోండి. కలిసి ప్రయాణం చేసినంత మాత్రాన మనసులు కలుస్తాయా? అదో పిచ్చిభ్రమ. కాని, సత్తిరాజులు ఓ అమాయకుడు. విని నవ్వుకున్నాను"

"మీకు దూరం ఆలోచించే నేర్పుంది. అది చాలామందికి సాధ్యం కాదు" అన్నాను చివరికి.

థాంక్స్ అంటూ లేచాడు. నా రెండు చేతులూ పట్టుకుని "చూసినదంతా నమ్మకు, విన్నదంతా నిజమని ఒప్పుకోకు మా ఇంటెలిజెన్స్ డిపార్టుమెంటులో అలవాటైన మొదటి సూత్రం ఇదే మీకేం భయం అక్కరలేదు. నాకన్నీ తెలుస్తాయి. కానీ అన్నీ తెలిసిన రీతిలోనే అర్థం చేసుకోను. అర్థం కావలసిన పద్ధతిలోనే అర్థంచేసుకుంటాను. మీ సహాయానికి థాంక్స్" అని వెళ్ళిపోయాడు.

అతని ప్రసంగం నన్నాశ్చర్యపరచింది. ఇంత చిన్న విషయం తెలుసుకోడానికి నా దగ్గరికి రికమెండేషన్ లెటర్ పట్టుకు రావలసినంత ఆగత్యమేమిటి? ఆలోచించిన కొద్దీ ఇంటెలిజెన్స్ డిపార్టుమెంటు మనిషికీ, షీరో జ్యోతిష్యానికీ ఎలా పొత్తు కుదురుతుందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు."

ఈ విషయం మరి కొన్నాళ్ళవరకూ అలా అర్థం కాకుండానే ఉండిపోయింది.

✡ ✡ ✡

## 15

**లాయరు సోమయాజులుగారు** సాయంకాలం మా గుమ్మంలోకి వచ్చి "ఈ మధ్య కనిపించడం లేదేమీటోయ్? రేపు పొద్దున్నే సిద్ధంగా ఉండు. అలా అయ్యకోనేరు గట్టు వేపు నడిచివద్దాం" అంటూ వెళ్ళిపోయారు.

ఓ విధంగా నేనూ లాయరుగారిని సంప్రదించాలనుకుంటున్నాను సుబ్బులు పెళ్ళి విషయం. అమ్మ రెండు రోజుల్లో వస్తున్నట్లు అప్పలాజుగారే స్వయంగా కబురు చెప్పి వెళ్ళారు. ఈలోగా సోమయాజులుగారితో మాట్లాడితే కొంత మార్గాంతరం అర్థమవుతుందని తలపోశాను. ఈలోగా ఆయనే ఈ అవకాశాన్ని కల్పించారు. ఉదయమే లేచి సిద్ధంగా ఉన్నాను. మల్లుపంచె, లాల్చీ వేసుకుని పైన తువాలు, చేతికర్రతో సిద్ధమయిపోయారు సోమయాజులుగారు. 'రావోయ్' అంటూ మారుతీమందిరం దాటి గట్టంతా నడిచి దక్షిణపు గట్టువేపుకి మళ్ళాం. ఆంజనేయస్వామి కోవెలలోకి వెళ్ళి దర్శనం చేసుకున్నాం. అంతసేపూ ఆయన ఏవేవో చెపుతున్నారు. వింటున్నాను. చెప్పవలసింది

అది కాదనే సూచన ఆ మాటల్లోనూ ఉంది. నేను వినడానికి చూసే శ్రద్ధలోనూ కనిపించింది. ఏవో మాటలు పెగిలి, మధ్యలో తెగిపోతున్నాయి.

ఉండుండి ఓ ప్రశ్న వేశాను. "సుబ్బులుకి మరో సంబంధం మీరే తెచ్చినట్లున్నారు. సత్తిరాజులకి అన్యాయం చెయ్యడం లేదా?"

నా వేపు విచిత్రంగా చూసి, నవ్వారు ఆయన. "అన్యాయమా! అదే చెయ్యాలనుకుంటే, అసలు ఆ సంబంధం కూడా చూడనక్కరలేదు. నీకు తెలుసా? ఈ సంబంధం ఖాయం చేస్తే తన ఆస్తి నాకు అప్పగిస్తానన్నాడు. ఉద్రేకంతో అన్నమాటో, నిజంగా అన్నమాటో అదలా ఉంచు. వాడేం మైనరు కాడు" లాయరు లాగ చెప్పాడు పాయింటు తీసి.

"అవును, నాకు తెలుసు."

"తెలుసా!"

"సత్తిరాజులే చెప్పాడు."

"మరి అప్పుడైనా నా న్యాయం అర్థం కాలేదా? వీడిని మోసం చెయ్యడానికా నా చెల్లెలు ఆస్తినీ, వాడినీ నా చేతిలో ఉంచింది? వీడి తిక్క తలకెక్కిందని అర్థమై వెంటనే పనికట్టుకుని ఆ అమ్మాయికి సంబంధం వెదికాను. వీడి నీ పిచ్చి నుంచి రక్షించాలంటే అదొక్కటే మార్గం" అన్నారు.

ఆయనలోని నిజాయితీ నన్నాశ్చర్యపరచింది. నవ్వుతూ అనకూడని హాస్యోక్తి అయినా చటుక్కున అనేశాను.

"న్యాయవాద వృత్తిలో ఉంటు న్యాయం మాట్లాడుతున్నారు. ఆశ్చర్యమేః."

"నాకే కాదు. నా క్లయింట్లకూ అదే ఆశ్చర్యం. అందుకనే నా దగ్గరికి ఎక్కువమంది రావడంలేదు" నవ్వారు ఫక్కున. ఆయనలో సెన్సాఫ్ హ్యూమర్ ముచ్చటగా కనిపించింది.

"అదలా ఉంచు. నీతో ఒక విషయం మాట్లాడాలని పిలిపించాను" అన్నారు ఉన్నట్టుండి.

"ఏమి"టన్నాను.

"నీ సంగతి ఇన్ని రోజులు కనిపెడుతూనే ఉన్నాను. నువ్వు బుద్ధిమంతుడివే. సందేహం లేదు. అందుకనే ఈ విషయం నా దగ్గరికి రాగానే తలూపాను" పెద్దవాళ్ళ లెక్కలో విషయాన్ని దాచిమాట్లాడడం సాగించారు. వింటున్నాను.

"ఎలాగయినా నువ్వు అదృష్టవంతుడివోయ్" అని భుజం తట్టారు. మళ్ళీ ఆలోచన తెగిపోయినట్టు. "మా ఆవిడకీ నాకూ మాటా మాటా కుదిరేసరికి మా పెద్దమ్మాయికి పెళ్ళయిపోయింది. మరి మనసు కలవని మనువులే ఆ రోజుల్లో సాధ్యపడేవి. ఇవాళ మనువుకి ముందు మనసూ తెలుస్తోంది. ఆ అమ్మాయికి నువ్వంటే ఇష్టమేనటలే, తెలిసింది," అన్నాడు.

ఏ అమ్మాయని అడిగి సోమయాజులుగారితో ప్రయోజనం లేదు. అలా చెప్పడం ఆయనకు సరదా. అయినా, ఆ ప్రశ్న అడక్కుండానే నాకర్థం బోధపడిపోయింది. జ్వరంలో ఉన్న నాకు శోభనాద్రిగారూ, ఆవిడ మరీ మరీ ఆదుకోవడం, వాళ్ళింట్లో భోజనం, ఈ మధ్య తరుచు శోభనాద్రిగారు లాయరుగారింటికి వెళ్ళి వస్తుండడం, మధ్య మధ్య 'మీ నాన్నగారికెలా ఉందోయ్?' అని అడుగుతుండడం ఇటీవల సుబ్బులు మరీ సిగ్గుపడుతుండడం, ఇది వరకు కన్నా ఎక్కువయిన చొరవా ఇవన్నీ కలిపి ఆ ప్రశ్నకు సమాధానాన్ని చెప్పేశాయి.

"మీ ఇద్దరూ చాలాసార్లు మాట్లాడుకున్నారటగా. అవునులే. నేనూ ఒకటి రెండుసార్లు గమనించాను. వెరీగుడ్" అన్నారు.

కేసు 'ఓపెన్' చేసేటప్పుడు మొదట అనుకూలమయిన పాయింట్లన్నింటినీ లాగేసుకోవడం సోమయాజులుగారి అలవాటనుకుంటాను. ఆయన అడుగుతున్న ప్రశ్నలకి గాని, చెపుతున్న విషయాలకి గానీ ఎదురు చెప్పలేకపోయాను.

తర్వాత చాలాసేపు కోర్టురూం ప్రశ్నలు చాలా వేశారు. చాలా రోజులయి అలవాటు తప్పిపోయినట్టుంది. అనుభవం తక్కువున్న క్లయింటు దొరికిన ఆనందాన్ని పూర్తిగా అనుభవించారు సోమయాజులుగారు.

"డిగ్రీ చేతికి వచ్చాక ఏం చేస్తావు? పై చదువులకి వెళ్తావా? ఉద్యోగం చేస్తావా? మీ నాన్నగారిలాగ వ్యాపారమా? పట్నాల్లో ఉండాలని ఉందా, లేక మాలాగ విజయనగరంలోనే సరిపెట్టుకుంటావా? పిల్లలు ఎక్కువగా ఉన్న కుటుంబమైతే ఇష్టమా, లేక పుట్టకుండా జాగ్రత్త పడతావా?" సహజంగా, శ్రేయస్సు కోరిన మిత్రుడిలాగా ప్రశ్నలు వేస్తారు. వాటికి ఎదురు తిరగాలనిపించదు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాలని తోచదు. ఇంత మంచి గుణం ఉండే సోమయాజులుగారు ఎందుకు 'పాపులర్' కాలేదా అని నాకాశ్చర్యం కలిగింది.

ఒక విషయాన్ని గురించి ఒకసారే మాట్లాడి ఇక దాన్ని దాటేసే లౌక్యం కూడా నాకు విచిత్రంగానే తోచింది. ఎందుకంటే మళ్ళీ మా సంభాషణల్లో ఎక్కడా సుబ్బులు గురించి కానీ, పెళ్ళి గురించి కానీ ప్రస్తావన రాలేదు. "రావోయ్. మంచి కాఫీ తాగుదాం" అన్నారు నా భుజం మీద చెయ్యివేసి.

నాకు మేఘాల్లో తేలిపోతున్నట్టనిపించింది ఆ రోజు....

# 16

అమ్మ ఊరి నుంచి వచ్చాక తీరిక మరీ ఎక్కువయింది. ఆరోగ్యం కూడా కుదటబడింది. ఇప్పుడు వాకిట్లోనే ఇరవై నాలుగ్గంటలూ గడిచిపోతున్నాయి. సుబ్బులు కూడా ఇదివరకులాగ తప్పించుకుపోవడం లేదు. కనిపించినప్పుడు ఒక మాటో, చిరునవ్వో రువ్వుతుంది. ఆ తియ్యదనంతో ఒకపూట గడిచిపోతుంది. చాలా సందర్భాల్లో నేను చదువు ముగించి లోపలికి అడుగుపెట్టే సరికో, లేక స్నానికి బయలుదేరేసరికో అమ్మ మాటలు వింటూ సుబ్బులు గుమ్మం మీద కూచుని ఉండేది. ఆ మాటల్లో 'మావాడు ఉత్త అమాయకుడు' లాంటి మాటలు వినిపిస్తే ఏమీ ఎరగనట్లు బయటకి వచ్చేసేవాడిని. బయటకు వచ్చి ఈ ఇంట్లో సుబ్బులు స్థానాన్ని ఊహించుకుని కలలు కనేవాడిని. అవి పగలు వచ్చేవి కనక మాత్రమే పగటి కలలు గాని వాటికి చాలా విలువ రాబోతున్నదనీ, అందుకు లాయరు సోమయాజులుగారు ప్రయత్నాలు చేస్తున్నారనీ గుర్తుతెచ్చుకుని మరింత సంతోషపడేవాడిని.

వేసవి సెలవులు ముగింపుకు వచ్చాయని అందరికంటే సుబ్బులుకి దిగులు ఎక్కువయింది. ఇక కాలేజీలు తెరిస్తే స్నేహితురాళ్ళందరూ విశాఖపట్నం పోతారు. ఈ మాట నాతో అంటే నవ్వి -

"ఒంటరితనం బాధాకరంగా ఉంటుందని చెప్పడానికి ఇంత మంది స్నేహితురాళ్ళు కావలసి వచ్చారా? నాకు ఒక్కరివల్లే అర్థమయిందే!" అన్నాను.

నవ్వి ఊరుకుంది. అలాటప్పుడు పరాగ్గా ఉన్నట్టు తప్పించుకోవడమో, హఠాత్తుగా మాట మార్చడమో సుబ్బుల్లో కనిపించే పెద్ద నేర్పు. ఆ తర్వాత పరాగ్గా మాట్లాడుతుంది. అంటే ఆ భావం మనసులో మెదులుతుందన్నమాట.

సుబ్బులు స్నేహితురాళ్ళెవరూ ఈ మధ్య ఇటు రాలేదు. రాలేదన్న విషయం ఒకరోజు ఉదయమే ఒంటరిగా శారద వచ్చినప్పుడు హఠాత్తుగా స్ఫురించింది. అవును, ఇన్నాళ్ళూ వీళ్ళంతా ఏమయ్యారనుకున్నాను.

ఆ మాట అడిగాను "ఇన్నాళ్ళూ కనిపించలేదేం?"

నవ్వింది శారద. సమాధానం చెప్పలేదు.

"సుబ్బులు కోసం వచ్చారా? లోపల ఉన్నట్టుంది" అన్నాను యధాలాపంగా

వసారాలోకి వచ్చి గోడకి ఆనుకుని నిలబడింది. "మీ కోసమే వచ్చాను" అంది తలొంచుకునే ఆశ్చర్యపోయాను. తలెత్తి ఆమె ముఖంలోకి చూశాను. ఏదో తీరని దుఃఖంతో దిగులుతో బాధపడుతున్నట్లు పసిగట్టాను. నేనూహించింది పొరపాటు కాకపోతే శారద ఆ రాత్రంతా ఏడ్చివుండాలి.

విస్మయంతో "ఏం జరిగిందమ్మా?" అన్నాను.

"మా నాన్నగారు నాలుగురోజుల క్రితం యాక్సిడెంటులో ఇరుక్కున్నారు. కాలు విరిగిపోయింది."

నిర్ఘాంతపోయాను. నోటమాట రాలేదు క్షణకాలం. "ఇప్పుడెక్కడున్నారు? ఎలా ఉన్నారు?" అన్నాను.

"ఇప్పుడు బాగానే ఉన్నారు. కాని ఇంక లారీ నడపడం పడదు. కాలుపోయినట్లు ఇంకా ఆయనకి తెలియదు. మంచం మీద ఉన్నారు బాగవుతుందనే అనుకుంటున్నారు. కాని డాక్టర్లు చెప్పేశారు" అంది మెల్ల మెల్లగా మాటలు పేరుస్తూ.

"చాలా పెద్ద కష్టమేనే!" అన్నాను ఏమీ తోచక.

"మీరు నాకో సహాయం చెయ్యాలి" అంది కొంతసేపటికి తలెత్తి.

"ఏమిట"న్నాను.

"నాకేదయినా ఉద్యోగం చూసిపెట్టాలి. ఎక్కడయినా సరే, వెళ్ళి చేస్తాను" నేను తెల్లబోయి చూస్తే నవ్వి "మరి కుటుంబం నడవాలిగా?" అంది.

"మరి మీ కాలేజీ చదువు?"

"మానేస్తాను. మొదటినుంచీ నాన్నకిష్టంలేదు. ఇప్పుడిక అది ఎలాగూ ఆగిపోక తప్పదు. తాసీల్దారుగారికి చెప్పేశాను. ఆయనా బాధపడ్డారు. ఉద్యోగం చూసిపెట్టమని వారికీ చెప్పాను."

ఆలోచనలో పడ్డాను. ఉన్నపాటునే ఆమెకు ఉద్యోగం ఎలా దొరుకుతుంది? ఉద్యోగం చెయ్యాలన్న ఆలోచన వచ్చినంత సులువా ఉద్యోగం దొరకడం? కాని ఆమె చెప్పింది నిజం. ఈ పరిస్థితిలో ఈమె తప్ప ఆ కుటుంబానికి ఆస్కారం మరొటి లేదు. దయనీయ పరిస్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని తలుచుకుంటే గుండె కలుక్కుమంది. అయినా చేసేదేమీ లేదు.

"నేను ఉద్యోగం చూపగలనన్న ధైర్యం లేదు. నా స్నేహితుల్లో వాకబు చేస్తాను. అయినా మీ ప్రయత్నంలో మీరూ ఉండండి." అన్నాను.

కృతజ్ఞతతో నమస్కారం చేసి వెళ్ళిపోయింది శారద.

ఆమె గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆ వయస్సులో వివాహ సమస్య తొంగిచూడకముందే జీవిత సమస్య మొదటి మెట్టెక్కి కూర్చొంది శారదకి. ఆమెకు చదువు అభిరుచి, జీవితం బాధ్యత, వివాహం అవకాశం. కాని సుబ్బులికి వివాహమే జీవిత సమస్య. నవ్వొచ్చింది నాకు.

తలెత్తితే దోసిట్లో ఎర్రగులాబీలను పోసుకుని మెట్లెక్కుతోంది సుబ్బులు. దుర్గారావు ఇంటివేపు చూస్తూ లోపలికి వచ్చి నన్ను చూసి ఆగింది.

"శారద నాకోసం వచ్చిందా?"

"కాదు. నాకోసం" అన్నాను.

నా వేపు వోరగా చూసి నవ్వింది.

"వాళ్ళ నాన్నగారికి ఆక్సిడెంటు అయిందటగా?"

"ఆఁ! తాగి ఏ చెట్టుకో లారీని గుద్దించాడట. నిక్షేపంలాంటి లారీ పోయిందట."

"ఆయన కాలు విరిగిందని శారద అంది."

"విరగదూ మరి? ఇంకా నయం. తల పగలలేదు"

ఆశ్చర్యంతో సుబ్బుల్ని చూశాను. దృక్పథంలో మనిషికీ మనిషికీ ఎంత తేడా ఉంటుంది? అదేం పట్టించుకోలేదు సుబ్బులు. నా ఎదురుగా గట్టుమీద గులాబీ పువ్వుల్ని పోసి గోడకి చేరబడి కూర్చుంది. జడముందుకి తోసి చేతికందినన్ని పువ్వుల్ని తురుముకుంది.

"నాకీ విషయం చెపుతారా?" అంది పువ్వుల్నే చూస్తూ.

"అడుగు"

"చాలా సూటిగా అడుగుతాను. మీరేం అనుకోకూడదు" అంది మళ్ళీ నన్ను హెచ్చరిస్తూ. *ఆడది మాట్లాడేముందు హెచ్చరికలు చేస్తే చాలా తియ్యటి విషయం బయట పెట్టబోతున్నదని లెక్క. మగాడి హెచ్చరికలు ప్రమాదకరమయిన విషయాన్ని చెప్పడానికి గుర్తు.*

మనస్సు తెలియని ఉత్సుకతతో ఉత్తప్తమయింది.

"ఏమిటో అది?" అన్నాను.

"ఆడది పెళ్ళి చేసుకోవాలని ఎందుకనుకుంటుంది?"

"ఇంకేం చెయ్యాలో తెలీక" విషయం తేలిపోయేసరికి నవ్వుతూ అన్నాను.

"నవ్వడం కాదు. నిజంగా అడుగుతున్నాను చెప్పండి."

"ఏం ప్రశ్న? ఆడది పెళ్ళి సిద్ధపడుతోందంటే సంసారం మీద మక్కువతో.. మగాడు సిద్ధపడుతున్నాడంటే స్త్రీ మీద వ్యామోహంతో"

నన్ను కొత్త మనిషిని చూసినట్లు చూసింది.

"అంతేనా?" అంది.

ప్రశ్నలు వేస్తుంటే ఆమె బుగ్గలు ఎర్రబడడం గమనించాను. నాకు మరీ ఆటగా ఉంది. ఏదో అడగాలని అడగలేక సందిగ్ధంలో పడినట్లు గుర్తించాను. అయినా చిరునవ్వుతో ప్రశ్నకు ఎదురు చూస్తూ కూర్చున్నాను.

"ఆడది ప్రేమించడం సుఖం కోసం కదా?"

"ప్రేమ" అని నవ్వాను.

"నవ్వుతారేం?" అంది ఆశ్చర్యపోతూ.

"నువ్వు పుస్తకాలయినా చదవలేదే? ఈ ప్రేమ నీకెక్కడ కనిపించింది? ఇది మన జీవితాల్లో ఎక్కడాలేదు. 'ప్రేమ' అని ఆలోచించడాన్ని మన పూర్వులు మనకి నేర్పలేదు దానికి మరేవో గుర్తులు పెట్టారు. ఎవరి దగ్గర్నుంచో దిగుమతి చేసుకున్న వికారం ఈ 'ప్రేమ', మన జీవితాల్లో దేన్ని ఈ 'ప్రేమ' అనాలో తెలీక సతమతమయిపోతున్నాం ఇప్పుడు. నువ్వు అడగదల్చుకున్నది ఆడది పెళ్ళి చేసుకోవడం సుఖం కోసం కాదా అని. అవునా? కాదంటాను నేను. అక్కడే ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ పెద్ద తేడా ఉంది. ఆడది సుఖం వల్ల వచ్చే ప్రతిఫలానికి పెళ్ళికి సిద్ధపడితే, మగాడు సుఖం కోసమే పెళ్ళికి సిద్ధపడతాడు. రెండూ దాదాపు ఒకటే కాని ఒకటి మాత్రం కాదు."

నవ్వి "మీకు పెళ్ళికాలేదూ కదా? మీకెలా తెలుసు ఇవన్నీ?"

"నేను నిప్పు ఎప్పుడూ ముట్టుకోలేదు. కాని కాలుతుందని తెలుసు. అలాగే ఇదీను. ముట్టుకుని కాల్చుకున్న వారి సాక్ష్యం దొరికింది. నేను తెలుసుకోవడానికి పెళ్ళి చేసుకోదలుచుకోలేదు. తెలుసుకుని పెళ్ళిద్వారా ఋజువు పరచదలచుకున్నాను."

సుబ్బులు మాట్లాడలేదు. గులాబీరేకులు విరుస్తూ ఒకొక్కటే నోటిలో వేసుకుంటోంది.

నవ్వొచ్చింది. "ఉదాహరణకి నీ చేతిలోని గులాబీపువ్వులనే తీసుకో. కొందరు వాటిని తలలో తురుముకుంటారు. అది అభిరుచి. కొందరు రేకుల్ని రుచి చూస్తారు. ఈ రెండు స్వభావాలకీ ఆడా, మగా పేరు పెట్టు వివాహధర్మం అర్థమవుతుంది." అన్నాను అల్లరిగా.

సుబ్బులు ఇంకా మాట్లాడలేదు. రేకులు తినడం ఆపేసింది.

నవ్వొచ్చింది నాకు. "ఆపేశావేం? అడుగు" అన్నాను.

"ఏమో బాబూ. మీరేవేవో చెప్పి గాభరా పెట్టేశారు. నాకేమడగాలో తెలియడం లేదు."

"బాగుంది నీ పిచ్చి. ఏదో అడగాలని ప్రారంభించి ఎలా అడగాలో తెలియదంటావేం? పోనీ నీకు తోచినట్లుగానే అడుగు."

"మీరు ప్రేమే లేదంటే అడగడం ఎలా?" అంది అమాయకంగా.

ఏదో జిజ్ఞాస మనసులో ఉంది. మాట్లాడాలంటే మాటలు చాలడం లేదు. చదువురాదనే ఆలోచన పదే పదే గుర్తుకొస్తోంది. తనకున్న పరిజ్ఞానంతో తోచిన భావాల్ని చెప్పడం చాతకావడం లేదు. ఆ తరహా మనుషులు తమ ఆలోచనలకి విచిత్రమయిన గుర్తులు పెట్టుకుంటారు. 'దేవుడు' అంటే తమకు తెలిసిన ఆలయంలోని నల్లటి విగ్రహం. ఇక దేవుని గురించిన ఆలోచనలన్నీ దాని చుట్టూనే అల్లుకుంటాయి. ఇది కేవలం ఉదాహరణ అనుకుంటే, ఇప్పుడు సుబ్బులు చెప్పాలనుకున్న విషయంలో 'ప్రేమ' అన్నది కొండగుర్తు అని అర్థమయింది. ఆమె చెప్పదలుచుకున్న దానిమీద నా మాటలు ఎలా దెబ్బతీశాయో అర్థమయింది. నా తప్పు తెలుసుకుని వెంటనే దిద్దుకున్నాను.

"నేనన్నదీ తప్పులే, ప్రేమ లేకపోతే బ్రతికేదెట్లా? ఉంది. ఇప్పుడు చెప్పు"

చటుక్కున ముందుకు వంగి అంది కదా -

"చాలామందికి నచ్చనివి కొన్ని, ప్రేమించుకొన్నవాళ్ళకే నచ్చుతాయి. ఇది ప్రేమవల్ల కాకపోతే మరెందువల్లో చెప్పండి."

ప్రశ్న అడగడం చాతకాకపోయినా తను అనుకున్నది చెప్పేసింది. ఆ ప్రశ్నలోని తీవ్రతకు ఆశ్చర్యపోయాను.

"ఇప్పుడా పరిస్థితి ఎవరి కొచ్చిందో కాస్త చెప్పు"

నా పక్క గడుసుగా చూసి, కళ్ళు ఉంగరాల్లాగ తిప్పి - " ఏమీ అర్థం కానట్టు మాట్లాడుతారే! గట్టివారే!" అంది.

"అంటే?" అన్నాను.

"నా కన్నీ తెలుసులెండి. ఇప్పుడే విన్నాను" అంది మళ్ళీ నవ్వుతూ

నేను మరింత తెల్లబోయాను.

"ఏమిటి విన్నావో విపులంగా చెప్పు."

"మీరు... మీరు... దుర్గని ప్రేమించారటగా?" అనలేక అని నవ్వేసింది. పెద్ద గులాబీ పువ్వు చేతిలోకి తీసుకుని తన కళ్ళు కనిపించకుండా అడ్డం పెట్టుకుని దాని గుండెలోకి చూస్తోంది.

నేను తుళ్ళిపడ్డాను. "ఏమిటీ?" అన్నాను.

నాతో పరిహాసం ఆడుతోందా అని సుబ్బులు వేపు సూటిగా చూశాను. కాని కాదు. అప్పటికే సుబ్బులు ముఖం ఎర్రగా అయింది.

నాకు ఉదాసీనత, కోపం పెనవేసుకొచ్చాయి.

"సుబ్బులూ! పరిహాసం కాదు. ఎవరన్నారా మాట?" అన్నాను.

నా కంఠంలోకి ఉద్విగ్నతకి బెదిరిపోయింది సుబ్బులు. బిత్తరపోయి చూసింది. "దుర్గ చెప్పింది. నాకేం తెలుసు? కోపం తెచ్చుకోకండి. నాకు చెప్పాలని చెప్పలేదు. మళ్ళీ ఎప్పుడు వస్తావన్నాను. 'పెళ్ళికి' అంది. అడిగితేనే చెప్పింది. మంచిపిల్ల. మిమ్మల్ని తప్ప అది మరొకర్ని చేసుకోదట. నాకేం తెలుసు?" అంది న్యాయాధిపతి ముందు సంజాయిషీ చెప్పుకొంటున్నట్లు ముఖం పెట్టి.

"ఛీ ఛీ! ఆ అమ్మాయికి సిగ్గు లేదూ, ఇలాంటి మాటలు చెప్పడానికి?"

"నిజమైతే చెప్పడానికేం? పెళ్ళి చేసుకుంటూంటే చెప్పడానికి ఇందులో సిగ్గుపడవలసినదేముందో చెప్పండి."

"సుబ్బులూ! నువ్వూ ఆ మాటల్ని నమ్ముతున్నావా?"

తెల్లబోయింది. "ఐతే దుర్గ మాటలు అబద్ధమా? మీరు ఇష్టపడ్డారటగా?"

దిమ్మరపోయాను. "అదీ ఆ అమ్మాయే చెప్పిందా?"

నా ఆశ్చర్యం నిజమయిందో, కృత్రిమమయిందో ఒక్క క్షణం కనిపెట్టింది. "మొన్న మీతో సోమయాజులుగారు గంటసేపు మాట్లాడారట. మీరు సరేనన్నాకా తాసిల్దారుగారికి ఆయన చెప్పారట. ఆయన ఇవాళో, రేపో మీ నాన్నగారితో మాట్లాడాలనుకుంటున్నారట. ఇదంతా పొరపాటేనా?"

నాకు కళ్ళు తిరిగాయి. లాయరు సోమయాజులు గారితో మాట్లాడిన రెండు సందర్భాల్లోనూ రెండు బ్రహ్మాండమైన నాటకాలు నడిచిపోయాయన్నమాట. ఆయన సగం సగం మింగేస్తూ మాట్లాడిన మాటల్లో, ముసి ముసి నవ్వుల్లో ఏదో అర్థం చేసుకున్న ధీమా ఉందేగానీ, ఇలా అర్థం చేసుకున్న సూచన లేదు. ఒక్కసారి ఆ రోజు ఉదయపు షికారు, మా మాటలూ గుర్తు చేసుకుంటున్న కొద్దీ నవ్వొచ్చింది. ఒక్కసారి విరగబడి నవ్వేశాను. నన్ను తెల్లబోయి చూస్తూ కూర్చుంది సుబ్బులు. చాలాసేపు ఆగాక "ఏమీటా పిచ్చి?" అంది.....

"సుబ్బులూ! నేను దుర్గకి అలాంటి నమ్మకం కలిగించానంటే నువ్వు నమ్ముతావా?"

సుబ్బులు ముఖం పేలవమయింది. "అయితే దుర్గ చెప్పింది నిజం కాదా?"

"అంతా ఆ లాయరు గారు తెచ్చిపెట్టిన ఇబ్బంది. నా విషయమంతా కాచి వడపోసినట్లు మాట్లాడితే నన్నూ నా మనస్సునీ సరిగ్గా అర్థం చేసుకున్నాడనుకుని నేనేం మాట్లాడలేదు. అర్థమయిందనుకుని ఆయనా ఆ విషయం కదపలేదు. ఆయన లాయరు లౌక్యంతో ఆ విషయం తప్ప మిగతాదంతా మాట్లాడాడు. అమ్మాయెవరని నేనడగనూ లేదు, నాకాయన అవకాశం ఇవ్వనూ లేదు. పాపం, అనవసరంగా ఆ అమ్మాయిని ఇరకాటంలో పెట్టామన్నమాట. పోనీ, ఒక్కసారి దుర్గనిక్కడికి రమ్మను. మనం మాట్లాడి అసలు విషయం చెపుదాం"

"దుర్గ ఇందాకే వాల్తేరు వెళ్ళిపోయింది."

"అరెరె! పెద్ద పొరపాటే జరిగిపోయిందే!" అనుకుంటూ ఆలోచనలో పడ్డాను. "ఉండు, మొదట లాయరుగారితో మాట్లాడి వస్తాను" అని లేచి, అంతలో ఆగి "అసలు నా మనస్సులో ఉన్న వ్యక్తి ఎవరో తెలుసా?" అనబోయి ఇటు తిరిగాను. కానీ అక్కడ సుబ్బులు కనిపించలేదు.

✡ ✡ ✡

## 17

ఈ షాక్ నుంచి నేను తేరుకునేసరికి నాలుగయిదు రోజులు పట్టింది. లాయరుగారికి ఈ విషయం చెప్పగానే ఆయన మొదట్లో నమ్మలేకపోయారు. తర్వాత ఫకాలున నవ్వేశారు. అంతలో మళ్ళీ సీరియస్ అయి –

"పెద్ద పొరపాటు జరిగిపోయిందోయ్. పాపం! ఆ అమ్మాయ్‌కి ఫాల్స్‌హోప్స్ ఇచ్చామే!" అన్నారు.

"ఇచ్చాం అని నన్ను కలుపుతున్నారేమిటి?" అన్నాను.

"మరి మాటవరసకేనా నువ్వు ఆ అమ్మాయి ఎవరని అడగలేదు కదా!"

"నాకేం తెలుసు. మీరాఊసు ఎత్తకపోతే, మీకంత రూఢీగా తెలుసనుకున్నాను."

ఒక్క క్షణం ఆలోచించి, తల పంకించి...

"సరేలే, జరిగిందేదో జరిగిపోయింది. నయమే, వెంటనే చెప్పావు. లేకపోతే తాసీల్దారుగారు మీ నాన్నగారిని కూడా కలుద్దామనుకుంటున్నారు. నేను ఆయనతో మాట్లాడుతాలే" అన్నారు.

ఆ విషయం అంతటితో ముగిసిందేకాని, దుర్గని తలుచుకుని కాసేపు బాధపడ్డాను. ఆమెతో మాట్లాడిన నాలుగయిదు సందర్భాలూ గుర్తుచేసుకుని, నాకు ఆమె పట్ల ప్రేమ ఉన్నదనే అభిప్రాయాన్ని ఎక్కడయినా కలుగజేశానా అని ఆలోచించుకున్నాను. ఎక్కడా నా పొరపాటు కనిపించలేదు. ఆమె పాటను మెచ్చుకున్న సందర్భం ఒక్కటీ మాత్రం కొట్టొచ్చినట్టు గుర్తుకొచ్చింది. కాని ప్రశంసను ప్రేమగా అర్థం చేసుకునే అమాయకురాలే కాదు దుర్గ. ***స్త్రీ జీవితంలో ప్రేమకి కొత్తరూపులు వెదుక్కుంటూంటుందిగావును. కొందరికది ప్రశంస, స్నేహంలాగ కనిపిస్తే కొందరికది త్యాగం, అభిమానంగా గోచరిస్తుంది.*** ఏమైనా ఒక్కసారి దుర్గతో మాట్లాడగలిగితే బావుణ్ణనిపించింది. సంజాయిషీ చెప్పుకోడానికి అవకాశం లేని దోషిలాగ తయారయాను నేను. ఎంచేతనంటే ఆ తర్వాత మరెప్పుడూ ఆమెతో ఆ విషయం మాట్లాడే అవకాశం రాలేదు.

ఈ సంఘటన సుబ్బులికి అంత షాక్‌ని కలిగించిందనుకుంటే అది పొరపాటే. ఆమె స్వభావానికి ఆశ్చర్యపడవలసిందేదీ లేదు. ***కొన్ని విచిత్రంగా కనిపించి విచిత్రాలుగానే నిలిచిపోతాయి. కొన్ని విచిత్రంగా కనిపించి వెంటనే విడిపోతాయి. మనం గ్రహించడంలో ఉంటుంది గాని, జరిగిన దానిలో ఏమీ లేదు.*** ఇదంతా నాకెలా అర్థమయింది అంటే, ఆ తర్వాత సుబ్బులు స్వభావాన్ని ఇలా 'అనలైజ్' చేసుకున్నాను.

ఇద్దరు రిక్షావాళ్ళు వరసగా నిలబడి ఉంటారు. మొదటివాడితో బేరం కుదరదు, రెండోవాడితో కుదుర్చుకొనేలోగా మొదటివాడు తొందరపడతాడు. కొంత నష్టానికయినా ముందరికొస్తాడు. రెండో వాడిమీద కక్షతోకాదు, రెండోవాడు పడ్డ రాజీ తనెందుకు పడకపోవాలీ అని. లేదా రెండోవాడు చేసుకున్న నిర్ణయమే సరైనదేమో అనే నమ్మకంతో లేదా తను చూడని స్వారస్యాన్ని రెండొవాడూ ఈ బేరంలో చూశాడేమోనన్న ఆత్రుత కావచ్చు. ఒక అభిప్రాయం మంచిది కావడానికి పక్కనే మరొక అభిప్రాయం ఉండాలి. అది చెడే కానక్కరలేదు. ఏదయినా చాలు. దుర్గ గురించి సుబ్బులు ఎక్కువగా ఆలోచించదని నా అభిప్రాయం. ఆ సందర్భాల్లో ప్రతీసారీ నా గురించి ఎక్కువ ఆలోచించి ఉంటుంది. ఇది కొత్త ధోరణిలో సాగిన ఆలోచన. నా ఊహకీ, ఉద్దేశానికీ దగ్గరగా వచ్చే ఆలోచన. తత్ఫలితంగా మూడోరోజు సుబ్బులు నవ్వుతూ పలకరిస్తే ఆశ్చర్యపోలేదు నేను. తల దువ్వుకుంటూ కిటికీ దగ్గర నిలబడ్డ నన్ను చూసి "ఏమిటో అనుకున్నాను. మీరు చాలా గట్టివారే!" అని రహస్యంగా నవ్వేసి జారిపోయింది. ఇప్పుడు ఆమె కళ్ళలో ఏదో అన్వేషణ, ఏదో తెలుసుకోవాలనే తపన, తను ఏదయినా నష్టపోలేదు కదా అన్న జిజ్ఞాస - ఇన్ని కనిపించాయి. ***సుష్టుగా భోజనం చేసినవాడు మిఠాయి దుకాణం వేపు చూసే చూపు వేరు. ఆకలివేసిన వాడి చూపు వేరు.***

సాయంకాలం ముఖం కడుక్కోడానికి పెరటి వేపు వస్తే - మునక్కాడలు కొయ్యడానికి తంటాలు పడుతోంది సుబ్బులు. అందీ అందనట్టున్న మునక్కాడల కోసం ఎగురుతూంటే తమాషా చూస్తూ నిలబడ్డాను. అంత బరువయిన శరీరం గాలిలో తేలడం విచిత్రంగా ఉంది. మొదట నన్ను గమనించలేదు. మరోసారి ఎగిరి కాలిలో ముల్లు దిగితే చెట్టుని ఆనుకుని తీసుకోబోయి, నన్ను చూశాక, ముఖం ఎరుపు చేసుకుంది.

"మహా గొప్ప - అలా చూడకపోతే ఒచ్చి కొయ్యకూడదు!" అంది కోపంతో ఉదాసీనంగా.

"అడగడంలో కూడా అధికారమేనా?" అంటూ దగ్గరికి వచ్చాను. చెట్టెక్కి కాడలు కోస్తూ అడిగాను "ఈ మధ్య నాతో మాట్లాడడం లేదేం?" అని.

"మీతోనే కూర్చోడానికి నాకేం పనిలేదనుకున్నారా!"

"కోపం వచ్చిందా?"

"ఎందుకూ?"

"దుర్గ విషయంలో"

నవ్వింది, " బాగుంది. మీరు దుర్గని చేసుకుంటానంటే నాకేం బాధ?"

"అదిగో, ఆ మాటంటా..." మునక్కాడ ఎత్తాను కొట్టబోయినట్టు. తప్పించుకు దూరంగా వెళ్ళి నవ్వింది. "సరే లెండి బాబూ, అక్కడ కూచుని కబుర్లు చెప్పడం బాగానే ఉంది. అవతలి వాళ్ళు కూడా చూస్తారు. త్వరగా కొయ్యండి"

"ఒక విషయం చెపితేకానీ దిగను."

"ఏమిటది!"

"మొదట నన్ను దుర్గ చేసుకుంటుందని అన్నప్పుడు ఏమనుకున్నావ్?"

"నాకేం పట్టింది ఏమన్నా అనుకోవడానికి?"

"ఎందుకా దొంగతనం! పోనీ, నేనేమనుకున్నానో చెప్పనా, నీ నోటివెంట ఆ మాట విన్నప్పుడు?"

"అక్కర్లేదు" అంది కాని, నేను వదల్లేదు.

"మొదట లాయరుగారు ఈ మాట చెపుతున్నప్పుడు కనక దుర్గని ఉద్దేశించి మాట్లాడుతున్నాడనుకోలేదు."

"అలాగా!" అని చెంపపిన్ని సవరించుకుంటూ అంది ఎటు వేపో చూస్తూ.

"అదే నా ప్రశ్న - 'మరెవరి గురించి అనుకున్నారు' అని అడగవేం?"

నవ్వు కనిపించకుండా ముఖం తప్పించి, "చెపుతున్నారుగా వద్దన్నా?"

"నిజం నా మాట. మనిద్దరనీ ఒకటి రెండూ సార్లు ఆయన చూడడం - నాతో ప్రత్యేకంగా మాట్లాడతాననడం - ఒట్టు. నేను నీ గురించేనని...."

విసురుగా తలెత్తి ఆశ్చర్యంగా నా ముఖం చూసింది. ఆ కళ్ళలో ద్యోతకమయింది ఆశ్చర్యమా, ఆనందమా, కోపమా అర్థమయేలోగా ఇంట్లోకి వెళ్ళిపోయింది తొందరగా - ఎంత పిలుస్తున్నా వినిపించుకోక.

ఒక్క క్షణం దిమ్మరపోయాను. చేతినిండా కోసిన మునక్కాడలున్నాయి. మెల్లిగా చెట్టు దిగి వాళ్ళింట్లోకి వెళ్ళాను. శోభనాద్రిగారున్నట్టులేరు. వంటింట్లో ముసలమ్మగారు వంట చేసుకుంటున్నారు. వాటిని గుమ్మం మీద పెట్టాను.

"అయ్యో నాయనా, నువ్వు కోసిపెట్టావా?" అంటూ గారం ఒలకబోసిందావిడ. నాకా దృష్టిలేదు. వీధివేపు గదిలోకి వచ్చాను. కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని తలదించుకుని జడకుచ్చు దారాల్ని లెక్కబెడుతోంది సుబ్బులు. నేను రావడం గమనించింది కాని తలయెత్తలేదు. మొఖం ఎర్రబడడం తెలుస్తోంది. దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను.

"సుబ్బులూ, నీ మనస్సు బాధపెట్టానా?" అన్నాను మెల్లగా, సుబ్బులు తలెత్తలేదు. తల తిప్పింది అడ్డంగా. నాకు పరమానందమైంది. "ఎప్పుడూ ఇలా చెప్పాలనిపించలేదు. ఇవాళ సందర్భం వచ్చింది కనక - అయినా అనుకున్నదీ.."

"అబ్బ! ఊరుకోండి. అక్కడ లాయరుగారు నిలబడి చూస్తున్నారు" అంది మెల్లగా తలెత్తి.

నిజమే, సోమయాజులుగారు గుమ్మంలో నిలబడి ఉన్నారు. అయినా మా వేపు చూడడం లేదు, కొంచెం దృష్టి అటు తిప్పారు. నవ్వొచ్చింది.

"నీకు తెలీదేమో, నిన్ను చేసుకోవాలని వచ్చిన పెళ్ళికొడుకూ చూస్తున్నాడు" అన్నాను.

ఆమె ఆశ్చర్యపోయి అటు చూసింది. వెంటనే నన్ను చూసి నవ్వేసింది.

"మీరూ గమనిస్తారే!" అంటూ.

"ఇవాళ ఎవరు చూసినా నేను భయపడను. అప్పుడప్పుడు చూసి వాళ్ళు ఏర్పరచుకునే దురభిప్రాయంకంటే, జాగ్రత్తగా చూసి ఒక్కసారయినా సరే అభిప్రాయం ఏర్పరచుకోనీ."

అంతే, గుక్క తిప్పుకోకుండా నవ్వింది. దాంట్లో నవ్వొచ్చే విషయమేదో తెలియక తెల్లబోయి చూశాను.

"అయితే ఏం చేద్దామంటారు? ఇద్దరం చెయ్యీ చెయ్యీ కలుపుకుని అలా వీధిగుమ్మంలో నిలబడదామా కాస్సేపు" అంది ఆ నవ్వు అంధ్య ఆగి ఆగి.

ఇక ఆగలేదు. "నిలబడనక్కరలేదు. కాని నా ముందు నువ్వు ఒక్కక్షణం కూర్చుంటే చాలు నా మనస్సంతా విప్పి చెప్పేస్తాను." అన్నాను కవిత్వం అల్లుతూ.

"కూర్చున్నాగా? ఇప్పుడు చెప్పండి." అన్న ఆమె సమాధానంలో సవాలు కనిపించింది.

"ఇలా కాదులే, నేను డాబామీద పడుకుంటున్నాను. గుర్తుంచుకో - " అనేసి అక్కడి నుంచి వచ్చేశాను.

ఆ సాయంకాలమంతా ఇక నా ఆనందం ఏమని చెప్పను? రాబోతున్న రాత్రి ఏవో అందమయిన అనుభవాల్ని ఆవిష్కరిస్తుందన్న ఆనందంలో ఊరంతా తిరిగాను. బజార్లో నడుస్తుంటే మల్లె పువ్వుల వాసన గుప్పుమంది. మొదటిసారిగా కొని చేతబట్టుకు బయలుదేరాను. ఆలోచన మీద ఆలోచనలు రేగుతున్నాయి. ఇంక ఆలస్యం చెయ్యకుండా ఇంటికి చేరాను. వేసవికాలం ముదిరినా డాబా మీద నిద్రపోవలసిన రాత్రి కాదది. వెన్నెల రాత్రులు గడిచిపోయి నక్షత్రాలు వెక్కిరిస్తున్నట్టు మెరుస్తున్నాయి. బజారు నుంచి తెచ్చిన మల్లె పువ్వులు చీకటిలో చల్లదనానికి రెచ్చిపోయాయి. వాటి గుబాళింపు డాబా అంతా కమ్ముకుంది. ఎక్కడో దూరం నుంచి కర్ణాటక సంగీతం తోవ తెలీని పథికుడి ఆర్తనాదంలాగ వినిపిస్తోంది. తెలియకుండానే గుండెవేగం హెచ్చింది. కోటగంట ఎనిమిది కొట్టేసరికి గుండెఝల్లుమంది. అమ్మ నిద్రపోతోంది. సుబ్బులు ఇంట్లో గిన్నెలు చప్పుడు మానుకున్నాయి. శరీరం స్థిరంగా ఉంటే ఆలోచనలు మరిన్ని ముసురుకుంటున్నాయి.

పచార్లు ప్రారంభించాను. పెరటివేపు చూస్తూ నిలబడ్డాను కాసేపు. శోభనాద్రిగారింట్లోంచి దీపం వెలుగు చారలాగ పడుతోంది. అక్కడ మనిషి నీడ తెలిసింది. సుబ్బులు పెరటివరకూ వచ్చి బాల్చీతో నీళ్ళు తీసుకెళ్తోంది. నా ఉనికిని ఎలా తెలియచెయ్యాలో తెలియక హఠాత్తుగా పాట ఎత్తుకున్నాను. కాని ముఖం ఎత్తి చూడలేదు సుబ్బులు. అయితే క్షణమాత్రం కదిలిన ఆమె తల, పెద్ద కళ్ళు - నన్ను కనిపెడుతున్నాయని తృప్తిపడ్డాను.

రాత్రి నిశ్శబ్దంగా ఉంది. దుర్గారావు భార్య ఏడుస్తున్న ఏడుపు కాబోలు, కర్ణాటక సంగీతంలో కలిసిపోయింది. పక్క మైదానంలో ఎవరో ముష్టివాడు గుడ్డిదీపం వెలుగులో పోగుచేసుకు తెచ్చుకున్న అన్నం తింటున్నాడు. అన్నీ చూస్తుంటే నా భావాలు చెదిరిపోతాయని భయమేసి నడుం వాల్చాను. మల్లెలు మళ్ళీ పలకరించాయి. కోటగంట మరో అరవై యుగాలు గడిచిపోవడాన్ని గుర్తుచేసింది.

సుబ్బులు ఇంట్లో దీపం కూడా ఆరిపోయింది.

నా మాట సరిగా అర్థమయిందా లేదా అన్న సందేహం వచ్చింది. కాని ఆ సందేహాన్ని పెరట్లో కనిపించిన ఆమె కళ్ళు తీర్చేశాయి.

సుబ్బుల్ని అట్లతదియనాడు చూసిన తెల్లని చీరెలో, తెల్లని బ్లౌజులో, నా చేతిలో ఉన్న తెల్లటి మల్లెలలో ఊహించుకున్నాను. అలిసిపోయిన నక్షత్రాలు కొన్ని మరుగవుతున్నాయి. మరికొన్ని వెలగడానికి తొందరపడుతున్నాయి.

చిన చిన్న వెలుగులతో మెరిసే నల్లటి ఆకాశం - కోరికతో ఉత్తప్తమయిన ప్రేమికుడి మనస్సులాగ ఉంది.

కాలం నడుస్తోంది బద్ధకంగా, మొద్దులాగ, కాని డాబా మెట్లమీద ఎవరి అలికిడీ వినిపించడంలేదు. ఎప్పుడు దీపం ఆరిపోయిందో వసారాలో కూడా చీకటయింది. శోభనాద్రిగారు ఇవాళ లోపలే పడుకున్నారు. గుమ్మం దగ్గర పడుకున్నారేమో! ఆ నాలుగు గోడల మధ్యా నా గురించి ఆలోచిస్తూ రాలేక తపనపడే మనస్సుని ఊహించుకుని జాలిపడ్డాను. చల్లగాలి ఎక్కువవుతున కొద్దీ శరీరం వేడి తెలుస్తోంది. నిరీక్షణా భారంతో ఆలోచనలు అలిసిపోతున్నాయి.

నష్టపోయిన కాలాన్ని మళ్ళీ గుర్తుచేసింది కోటగంట, అలా మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూనే ఉంది మూడు ఝాములు గడిచినా, పక్క మీద మల్లెలు ముఖాలు చిన్నబుచ్చుకున్నాయి. ఎదురు చూసిన అనుభవాన్ని ఇవ్వలేని ఆ రాత్రిమీద, ఇంటి చుట్టూ పహరా ఇస్తున్న నిశ్శబ్దం మీద, నడిచి పోయే కాలం మీద కసి పెరిగిపోయింది. కోపంతో ఆకాశం నలుపుని చూస్తూ వెల్లకిలా పడుకున్నాను. ఎప్పుడో చిన్న కునుకుపట్టింది. ఓ రాత్రికి చలివేసింది. కాని తెలివిరాలేదు. కళ్ళు విప్పేసరికి పరిహాసం చేస్తున్నవాడి చిరునవ్వులాగ ఎండ పెళ్ళుమంది. సిగ్గువేసి కళ్ళు మూసుకున్నాను. తెల్లవారు ఝామున గాలికి మల్లెపూవులు చెదిరిపోయాయి. మళ్ళీ కర్ణాటక సంగీతం వినిపిస్తోంది. కోటగంట ఆగలేదు. పెరట్లో బాల్చీ చప్పుడవుతోంది. ఊరంతా లేచిన శబ్దాలూ, బస్సు హారన్లూ వినిపిస్తున్నాయి. రాత్రినాకు జరిగిన అన్యాయాన్ని లక్ష్యం చెయ్యనట్టు ప్రకృతి మళ్ళీ మేలుకొంది. కొన్ని గంటల క్రితం పొందిన ఆశాభంగపు అలసట మళ్ళీ ఆవరించుకుంది. మనస్సు నీరసంతో కృంగిపోయింది. ఒళ్ళు విరుచుకుని లేచి పెరటివేపు చూశాను. అప్పుడే స్నానం చేసి చీరె ఒంటి చుట్టూ ఒదులుగా చుట్టుకుని బాత్ రూం లోంచి బయటికి వస్తోంది సుబ్బులు. నుదుటిమీద ముత్యాల్లాగ నీటి బొట్లు కనిపించాయి.

నన్ను చూసి "అర్థమయిందిలే నీ సంగతి" అన్నట్టు, జోకొట్టినట్టు నవ్వింది. కోపంతో నాలిక బయటపెట్టి వెక్కిరించాను.

ఆమె మరింత నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

## 18

ఉదయం హనుమంతరావు వచ్చి "అదేమ్రిటా అలా ఉన్నావు లంఖణాలు చేసినట్టు" అనేవరకూ నా స్థితి నా కర్థం కాలేదు.

"ఏమిటి? బొత్తిగా కనిపించడంలేదు! ఊర్లోనే ఉండి కనిపించనంత వ్యాపకమేమిటో తెలుసుకుపోదామని వచ్చాను. ఈ వేపు చిన్న పని ఉందిలే" అన్నాడు.

కేవలం లాభనష్టాల దృష్టితోనే వాళ్ళ నాన్నగారు ప్రారంభించిన వ్యాపారాన్ని సంస్కారం, విజ్ఞతలతో మరో మెట్టు ఎక్కించి అభివృద్ధి కూడా చేశాడు హనుమంతరావు. పని ఉందంటే ఏదో పెద్ద వ్యవహారమే అయివుంటుంది.

"ఏమిటి ఇటువేపు పని?" అన్నాను యధాలాపంగా.

"మా బిజినెస్ ఇబ్బందులు నీకేం తెలుస్తాయి? పండక్కి మరో షో రూమ్ తెరవాలని ఆలోచన. పక్కనున్న షాపు కూడా అద్దెకి తీసుకున్నాను. ఓ గ్రూప్ మిల్లు మనచేతుల్లోకి వచ్చింది. సరిగ్గా జరిగితే వ్యాపారం మంచి పాకాన పడుతుంది" అన్నాడు.

షోరూం అనగానే మనస్సులో ఏదో ఆలోచన రూపం దాల్చకుండా కదలడం ప్రారంభించింది. ఏమిటా అని కాస్సేపు మధనపడ్డాను. మెల్లగా గుర్తుకొచ్చింది. షోరూమ్ అనగానే కొత్తగా కొందరిని ఉద్యోగంలో చేర్చుకుంటాడు హనుమంతరావు. సేల్స్ గర్ల్స్ కావాలేమో అడిగాను.

"మంచి అమ్మాయి, ఉద్యోగం కోసం వెదుకుతోంది. బియ్యే చదువుతూ మానేసింది. నలుగురి ముందూ సిగ్గుతో ముడుచుకుపోయే తరహా కాదు. నీకు అవసరమనిపిస్తే ఉద్యోగం ఇవ్వు. నేనూ సంతోషిస్తాను."

"ఏమిట్రోయ్ రికమెండేషన్‌ల వరకూ వచ్చింది కథ, ఎవరేమిటి ఆ అమ్మాయి?"

నవ్వాను, సమాజంలోని సాధారణ సభ్యుడు హనుమంతరావు. ఈ విషయంలో అతని అభిప్రాయాలు, ఆలోచనలూ నలుగురికంటే భిన్నంగా ఉంటాయని ఆశించనవసరంలేదు. అసలు ఉంటేనే ఆశ్చర్యం.

"రికమెండేషన్ వరకే వచ్చింది. అంతకు మించి కథ లేదు. ఆ అమ్మాయి తండ్రి ఈ మధ్యనే ఆక్సిడెంటులో దెబ్బతిన్నాడు. ఉద్యోగం పోయింది. ఇప్పుడీమె సంపాదిస్తే ఉంది, లేకపోతే లేదు."

కాస్సేపు ఆలోచించాడు. "మంచి ఆలోచనే. ఏదో ఉన్నవాళ్ళతో సరిపెట్టేద్దామని చూస్తున్నానుగాని, షోరూములోకి సేల్స్‌గర్ల్స్ ని తెచ్చేవరకూ ఆలోచించలేదు. ఏమైనా అవకాశంతోపాటు ఆలోచనా నువ్వే ఇచ్చావు. కాస్త టైం ఇవ్వు. ఆలోచించి చెపుతాను" అన్నాడు.

లేస్తుంటే హఠాత్తుగా గుర్తుకొచ్చి అడిగాను, "ఆ రోజు నీ ఉత్తరం పట్టుకుని భగవాన్లు అనే అతను వచ్చాడు గుర్తుందా?"

"అవును ఏం?"

"అతను ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్నాడా?"

"వాడా! అలా అని చెప్పాడా?"

"కాదా యేం?"

గుక్కతిప్పుకోకుండా నవ్వి, "వాడా! చోడవరం రేషన్ షాపులో గుమస్తా. మొదట ఇక్కడ పనిచేసేవాడు. బదిలీ అయి అక్కడికి వెళ్ళాడు. మా ఫ్యాన్ వాడి ఫేవర్‌తో మా రేషన్ తెచ్చేవాడట. అలా పరిచయమయాడు. 'నీతో ఏదో పని వుం'దంటేనూ - మన రికమండేషన్‌తో ఈ ప్రపంచంలో ఓ పని సాధ్యపడుతోందా' అని ఆశ్చర్యపోతూ ఇచ్చా. ఏం, ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంటంటూ నిన్నేమయినా భయపెట్టాడా? చెప్పు. నలుగుర్నీ పెట్టి తన్నించేస్తాను."

నేను దిమ్మెరపోయాను. ఒక్కసారి వెనక్కి తిరిగి ఆ సన్నివేశం గుర్తుతెచ్చుకో ప్రయత్నించాను. అయాచితంగా చేసుకున్న పరిచయం, అవసరంలేని వినయం, సందర్భం లేకుండా చెప్పిన కథ ఇవన్నీ ఆలోచించిన కొద్దీ వింతగా కనిపించాయి. హనుమంతరావు వెళ్ళాక కూడా ఎంతో సేపు ఆలోచిస్తూ కూచున్నాను. ఆలోచనల్లోంచి తేరుకున్నాక అతని మీద కోపం రాలేదు - నవ్వే వచ్చింది.

అది గమనించి "ఏమిటండోయ్. అంత నవ్వు!" అంది సుబ్బులు, మామిడిపండు ముక్కలు నములుతూ, నేనటు చూస్తే చేతిలో ప్లేటు నా ముందుంచింది.

"నిన్ను చేసుకోవాలనుకున్న పెళ్ళి కొడుకు గురించి ఆలోచిస్తున్నాను."

వెంటనే ఆమె ముఖంలో రంగు మారింది. అమృతమని చేతికిచ్చి తీరా సగం తాగాక విషమని గుర్తుచేసినప్పటి భయం ఆమె ముఖంలో కనిపించింది. అంత భయం ఎందుకని?

"ఏమిటి?" అంది.

"నువ్వు భయపడ్డట్టు ఆ రోజు అతను నాతో దెబ్బలాడడానికి రాలేదు. నా దగ్గర్నుంచి కొన్ని కూపీలు లాగడానికి వచ్చాడు."

ఆశ్చర్యపోయి చూస్తోంది.

"ఒక్క విషయం చెప్పనా, అతనికి నీమీద మంచభిప్రాయం లేదు." అన్నాను చాలా గొప్ప రహస్యాన్ని చెపుతున్న ఫోజు పెట్టి.

నా ముఖం చూసి ఫక్కున నవ్వేసింది.

"నిజం, అతనే నీ గురించి చాలా విన్నాట్ట. సత్తిరాజులు ఏవేవో చెప్పాడు."

ఇంకా నవ్వుతోంది సుబ్బులు.

"నీకతని వల్ల ఏమీ బాధలేదు అలా చూస్తూండు. నిన్ను చేస్తే చేసుకోనని అతనే అంటాడు" అన్నాను ఠీవిగా, తల గాలిలో ఎగరేసి.

ఇక నవ్వలేక నోరు మూసుకుంది, "ఎంత అమాయకులండీ మీరు? తెల్లనివన్నీ పాలనుకుంటారు." కాసేపు ఆగి మళ్ళీ అంది, నల్లబడ్డ మొహంతో, "నన్ను తప్పకుండా చేసుకుంటానని నిన్న తాతయ్యకి మాట ఇచ్చాడట."

నిర్ఘాంతపోయాను. "నిజం!" అన్నాను.

"ఇప్పుడు చెప్పండి - మీకు తెలిసినదేమిటో?" అంది నవ్వుతూ.

నా ముఖ కవళికలు నల్లనవుతున్నకొద్దీ ఆమె నవ్వు ఎక్కువయింది.

"ఉండండి. మరో పండు కోసి తెస్తాను" అని లోపలికి వెళ్ళింది. సాయంకాలం శారదని పిలిపించాను. ఉద్యోగం విషయం చెప్పినప్పుడు ఆమె కళ్ళల్లో కనిపించిన కన్నీళ్ళని చూశాక అర్థమయింది, నేనెంత సహాయం చేయగలినో, ప్రతిఫలం ఆశించని సహాయమో ఆర్ద్రత ఉన్నది గావును. ఆమెను చూస్తుంటే తోబుట్టువులు లేని లోటు ఆ క్షణంలో గుర్తుకొచ్చింది. ***నిస్సహాయత కూడా ఒక ఆకర్షణే. అందుకే అబలత్వం ఒక శక్తి అనుకుంటాను.*** శారద ఆ ఎర్రటి బొట్టుతో, నిమీలితాలయిన చిన్న కళ్ళతో, గౌరవ ప్రపత్తులతో, ఎరుపెక్కిన చెక్కిళ్ళతో దేవతా మూర్తిలాగ కనిపించింది.

శారద మాట్లాడుతునంతసేపూ సుబ్బులు ఆమె భుజం మీద చెయ్యి వేసే నిలబడింది. వెళ్ళబోతూ శారద నా వేపు తిరిగి "రాత్రి బాగా మంచుపడింది, డాబా మీద పడుకున్నారేం!" అంది.

నేనేం మాట్లాడలేదు. సుబ్బులు ముఖంవేపు చూస్తూ ఊరుకున్నాను. సుబ్బులు ఏదయినా అంటుందేమోననుకున్నాను. కాని తను ఇంటి కప్పు కేసి చూస్తూ ముఖం తిప్పించుకుంది. పెదవుల అంచుల దరహాసంపు ఛాయలు అర్థమయాయి.

"ఇదేమిటీ ఈయన మంచులో డాబా మీద పడుకున్నారు అనుకున్నాను. ఉదయం ఆలస్యంగా లేచినట్టున్నారు. అప్పుడు చూశాను!" అంది శారద నవ్వుతూ.

సుబ్బులు ముఖం చూస్తూ అన్నాను, "అంతదూరం నుంచయినా నా ఇబ్బందిని మీరు గమనించారు. దగ్గర్లో ఉన్నవాళ్ళు నా కష్టాల్ని గమనించడంలేదు. చీకట్లో ఉన్నవాడికి వెలుగు చూసినప్పుడే తను ఉన్నది చీకటని అర్థమవుతుంది. నాకు వెచ్చదనం ఏం తెలుసు 'ఇది చలి' అనుకోడానికి?"

ఇంత ఎందుకు చెప్పానో అర్థంకాక శారద తెల్లబోయి చూసింది. సుబ్బులికి నవ్వొచ్చింది. "ఏదో సరదాకి అంటున్నాను. ఏమీ అనుకోకండి. మరచిపోండి" అని సర్దేశాను. శారద మెల్లగా మెట్లు దిగి వెళ్ళిపోయింది. సుబ్బులు లోపలికి తిరిగి రాబోతుంటే వినిపించీ వినిపించనట్టు అన్నాను.

"ఇవాళా డాబాయే శరణ్యం. ఎదుటి వాళ్ళకి అర్థమయే బాధన్నా అర్థం చేసుకుంటే ఇవాళ్టికి ధన్యుణ్ణే" అన్నాను.

సుబ్బులు విన్నదో లేదో, విని ఏమనుకున్నదో తెలుసుకోడానికి ఆమె ముఖం చూడం లేదు నేను.

రావాలని మనస్సు పడ్డ ఆరాటం, రాలేక పడిన యాతన - ఆ రోజంతా సుబ్బులు ముఖంలో ఊహించుకున్నాను. రాత్రి నా నిస్సహాయ స్థితికి ఆమె ముఖంలో పరిహాసం వెనక, రాలేని తన నిస్సహాయ స్థితికి క్షమాపణ కనిపిస్తోందా అని వెదికాను. ఏమయినా చెప్పడం కష్టం. మరో రాత్రి నిరీక్షణే ఆ అనుమానాన్ని తీర్చాలి. ఈ సారి మల్లెపువ్వులులేవు, చల్లగాలులు లేవు, నిట్టూర్పులు లేవు. చీకటి ఆకాశం మీద నక్షత్రాలూ లేవు. తెల్లటి మబ్బు తెర డాబా మీద కదలాడింది. సుబ్బులు కోసం ఎదురుచూస్తూ పచార్లు చెయ్యదలచలేదు. కింద వంటింట్లో చప్పుళ్ళు చెవుల కెక్కించుకోలేదు. కోటగంటలు మ్రోగినా లక్ష్యం చెయ్యలేదు. కాని అలక్ష్యం చేయాలనే భావనపైన కేంద్రీకరించిన లక్ష్యం అర్థరాత్రికి నన్ను అలిసిపోయేటట్లు చేసింది. ***ఓ పని చేయకూడదనుకున్న నిశ్చయం ఇచ్చే అలసట, చేసినదానికన్న***

గొప్పది. నిద్రపట్టదు. నేను ఆవలించకుండానే, ఎదురు చూడకుండానే వో చల్లని చెయ్యి నా మీద పడి పలకరించదా అన్న ఆశ. "నిద్రపోతున్నారా?" అన్న పలకరింత చీకటి నిశ్శబ్దాన్ని సుతారంగా భంగపరచాలని పిచ్చికాంక్ష. వీటి మధ్య - ఈ కోరికకి లొంగిపోకూడదన్న పట్టుదల. ఏమని చెప్పను? సగం రాత్రికి ముందు రోజు కంటే ఎక్కువ డీలా పడిపోయాను. ఈ తిరస్కారభావం ఇక నిలవలేదు. ఒక్కసారి లేచాను. ఊరంతా గాఢంగా నిద్రపోతోంది. పెరట్లో మల్లెచెట్టు, మైదానంలో ఒళ్ళుగోక్కుంటూ నిద్రపోతున్న కుక్కా, దూరాన సినిమా హాలు వదిలినప్పటి కోలాహలం, జట్కాల కదిలికలు - ఇవే వినిపించాయి. విసుగేసి మళ్ళీ నిద్రపోయాను.

ఓ రాత్రికి ఎవరో మేడమెట్లు ఎక్కుతున్న శబ్దానికి తెలివొస్తే మళ్ళీ లేచి కూర్చున్నాను. ఆ శబ్దం విని గాజుల చప్పుడు పట్టి సుబ్బుల్ని గుర్తుపట్టడానికి ఎక్కువ సమయం పట్టలేదు. గుండె వేగంగా కొట్టుకుంది. నరాలు వేడెక్కాయి. ఎట్టకేలకు సుబ్బులు డాబా మీద కనిపించింది. నేను కూర్చునివుండడం చూసి -

"ఇదేమిటి? ఇంకా నిద్రపోలేదా?" అంది నవ్వుతూ

"అహా! ఇంతసేపటికా?" - అనబోతున్న మాటలు సగంలోనే ఆగిపోయాయి.

ఆమె వెనక ఎవరో డాబా మీదకి వచ్చారు.

నేను అర్థంకాక తెల్లబోయి చూస్తున్నాను.

మునిసిపాలిటీ దీపం వెలుగులో తనతో వచ్చిన వ్యక్తిని నాకు పరిచయం చేసింది. "ఈయన మా నాన్నగారు. రైలు ఆలస్యంగా వచ్చింది. ఇప్పుడే వచ్చారు. మా అమ్మకూడా వచ్చింది. ఈయనకీ మీలాగే చలిలో పడుకోవడమంటే చాలా ఇష్టం -" అని ఆయన వేపు తిరిగి "ఈయన మన ఇంట్లో ఉన్నవారబ్బాయి. మద్రాసులో చదువుకుంటున్నారట." అని మళ్ళీ నా వేపు తిరిగి "ఈ మాటు మీరు మద్రాసు వెళ్ళేటపుడు దారిలోనే కనక తప్పక మా ఊళ్ళో దిగాలి. ఏం నాన్నా? " అంది ఆయనకి పక్క వేస్తూ.

ఆయనేం మాట్లాడలేదు. సిగరెట్టు తీరుబాటుగా వెలిగించుకుని "మీ నిద్ర పాడుచేసినట్టున్నాను -" అన్నాడు మెల్లిగా.

"అబ్బే - పరవాలేదు లెండి" అని తప్పనిసరిగా అన్నాను.

చికాకు ఎక్కువయింది. మర్యాదగా ఉండదని ఆగిపోవలసి వచ్చిందికాని ఆ క్షణాన ఎక్కడికయినా పారిపోవాలనిపించింది. సుబ్బులు మీద కోపం పెరిగిపోయింది. నా వేపు వోరగా చూస్తోంది మధ్య మధ్య.

"అప్పుడే మంచుపడుతోంది. కప్పుకోడానికి తెచ్చుకోకపోతే ఎలా. ఇందాండి మీ అమ్మగారే ఇచ్చారు" అది మా శాలువ కానేకాదు - మాట్లాడకుండా తీసుకున్నాను. మధ్య మధ్య నన్ను చూస్తోంది.

"ఏం చెయ్యను?" అన్నట్టు ఉంది ఆ చూపు. పక్క వెయ్యడం అయిపోయింది.

"మంచి నీళ్ళు కావాలా నాన్నా?" అనడిగింది.

"అక్కర్లేదమ్మా, నువ్వెళ్ళి పడుకో" అన్నారాయన.

"వస్తానండి. పాపం మీకు శ్రమ ఇచ్చాం" అంది. ఒక్క మాటలో నన్నెంత దూరమయినవాడిగా చేసేస్తూ.

గుండె నీరయింది. ఒక్కసారిగా ఉత్సాహం దిగజారిపోయింది. నా చదువూ, గ్రూపూ మద్రాసులో ఎక్కడ ఉండేదీ, తను ఎప్పుడెప్పుడు మద్రాసు వచ్చేదీ, వచ్చినప్పుడు ఎక్కడ ఉండేదీ ఆయన మాట్లాడుతున్నారు. కానీ నాకవేవీ తలకెక్కలేదు. అడిగినవాటికి సమాధానాలు చెప్పాను. చెప్పినవన్నీ విన్నాను. ఆయన నిద్రపోయాక ఆలోచిస్తూ తెల్లవార్లూ జాగరణ చేశాను. తెల్లవారేసరికి వొళ్ళంతా బిగుసుకుపోయి జ్వరం వచ్చినట్టయింది.

✡ ✡ ✡

## 19

**భగవాన్లు** సుబ్బుల్ని చేసుకుంటానని చెప్పగానే శోభనాద్రిగారు కొడుక్కి టెలిగ్రాం ఇచ్చారు వెంటనే రమ్మని. కొడుకు కోదండ రామయ్య భార్యతో సహా మర్నాటి రాత్రికే దిగాడు. తెల్లారాక ఒక్క నిముషం కూర్చోలేదు శోభనాద్రిగారు. తొలికోడి కూసేవేళకే డాబా మీదకు వచ్చేశారు. అప్పటికే స్నానం పూర్తిచేసి గోరంచు ఉప్పాడ పంచె కట్టి, పెద్దాపురం సిల్కు కండువా మీద వేసుకుని సిద్ధమయారు. 'రాముడూ' అంటూ. కోదండరామయ్య మెల్లగా లేచాడు. నాకు తెలివొచ్చినా కళ్ళు విప్పాలని లేదు. అలాగే శాలువా కప్పుకుని పడుకున్నాను.

"లే. చాలా మాట్లాడుకోవాలి. అబ్బాయి ఎదుటింటిలోనే ఉంటున్నాడు. నువ్వు దగ్గరుంటే మంచిదని పిలిపించాను" అంటున్నారు శోభనాద్రిగారు.

కోదండరామయ్య తండ్రంత మనిషిలాగ లేడు. భార్యవల్లా, సహజంగా, సాంసారికంగా, ఇతరత్రా పడ్డా ఒడుదొడుకులవల్ల జీవితంలో సాపుదేరిన మనిషిలాగ కనిపించాడు. శోభనాద్రికంటే గడ్డు జీవితం అనుభవించిన అలసట ముఖంలో కనిపించింది. శోభనాద్రిగారికి తెల్లటి కిరీటంలాగా తలమీద పల్చటి క్రాపింగ్ ఉంది. కాని కోదండరామయ్యది దాదాపు బట్టతల. ముఖం కోలగా ఉంది. కళ్ళు లోతు. అతణ్ణి చూడగానే అర్ధమయింది - సుబ్బుల్లో కనిపించే అందం తనది కాదని. కానీ స్వభావంలో ఎంచేతనో ఆయన పోలికలు ఎక్కువ కనిపించాయి. తల్లినిచూశాక నా ఊహ నిజమనిపించింది.

ఆమెకి దాదాపు నలభై అయిదేళ్ళుంటాయి. కాని వయస్సులో ఉన్న అందపు ఛాయలు చెరిగిపోలేదు. వాడిన సంపెంగ పువ్వులాగ ఉంది. చెంపల దగ్గర జుత్తు తెల్లబడుతోంది. పెద్ద జుత్తు. కళ్ళు ఎదురుగా చూస్తున్నదాన్ని కాక - మరింత లోతుగా దేన్నో అన్వేషిస్తున్నట్టుంటాయి. ఆమె 'పిచ్చి' గుర్తుకొచ్చింది. అప్పుడిక ఆ చూపుకి అర్థం బోధపడిపోయింది. ఇప్పుడామెకు పిచ్చిలేకపోవచ్చు. కాని దాని జ్ఞాపకం ఆ అందమయిన కళ్ళల్లో నిలిచిపోయింది. ఆమెను చూస్తూ ఊరికినే జాలి ముంచుకు వస్తుంది. ఆమెకు జీవితంలో ఏదో అన్యాయం జరిగినట్లు. దాన్ని తీర్చడానికి మార్గం తెలిస్తే బావుండుననిపిస్తుంది.

వచ్చినరోజు ఉదయమే ఆవిడ మా అమ్మకి మంచి స్నేహితురాలైపోయింది. దాదాపు రోజంతా ఇద్దరూ కబుర్లతో గడిపారు. దాంట్లో చాలా భాగం నా గురించి, ముఖ్యంగా సుబ్బులు గురించి సంభాషణ సాగివుంటుందని నా అనుమానం, అన్ని కబుర్ల మధ్య ఒక్కసారైనా మా ఇద్దరికీ పెళ్ళిచెయ్యాలనే ఆలోచన వచ్చివుండదా? వస్తే, అమ్మ నాతో మాట్లాడదేం? నా అభిప్రాయం తెలుసుకోవలసిన అవసరం లేదనుకుందా? నా ప్రమేయం లేకుండానే నాన్నగారితో మాట్లాడి వచ్చిందా. అసలు ఆయనకు చూపటానికే సుబ్బులును తనతో తీసుకు వచ్చిందా? ఇవన్నీ తేలని ప్రశ్నలు: పెద్దవాళ్ళు ఒక పక్క పెళ్ళి వ్యవహారంలో పడిపోతే, నేను యధావిధిగా ప్రశ్నలతో అతలాకుతలం అయిపోయాను. సుబ్బుల్ని ఆ రోజు కనీసం చూడడం కోసం కాళ్ళు కాలిన పిల్లిలా ఇంట్లోంచి పెరట్లోకి తిరిగాను. కాని ఆ రోజు సుబ్బులు కనిపించడమే గగనమైపోయింది. పెద్దవాళ్ళ మాటల్ని వినడానికి కొన్ని కీలక స్థానాల్ని ఎన్నుకుని వాటి మధ్య కాలం గడుపుతోందని నాకు తోచింది.

పొద్దుటే శోభనాద్రిగారు కోదండరామయ్యను తీసుకుని సోమయాజులుగారింటికి వెళ్ళారు.

సత్తిరాజులు ప్రత్యేకంగా కొత్తబట్టలు వేసుకుని కోదండ రామయ్యగారి దృష్టిలో పడడానికి హూనమైపోతున్నాడు. వసారాలో కూర్చుంటే వాళ్ళంతా తీవ్రంగా చర్చలు జరపడం, మధ్యలో సత్తిరాజులు చొరవ, అతన్ని లాయరుగారు కేకలు వెయ్యటం - ఇవన్నీ తెలుస్తున్నాయ్! తరువాత పెద్దలంతా లేచి భగవాన్లు ఉంటున్న ఇంట్లోకి వెళ్ళారు.

ఈ సంబంధాన్ని ఖాయం చెయ్యటానికి ఇంత ప్రయత్నం ఎందుకనో, ఇందువల్ల ప్రత్యేకంగా సుబ్బులుకి గాని, వీళ్ళకి గాని ఒరిగేదేమిటో అర్థంకాలేదు. లేక ప్రతి పనిని ఇంత కట్టుదిట్టంగా, ఇంత లౌక్యంతో జరిపించటం శోభనాద్రిగారికి అలవాటేమో!

రాత్రి కోదండరామయ్యగారూ, నేనూ మళ్ళీ డాబా మీదకి చేరాము. నిజానికి అక్కడ పడుకోవాలని లేకపోయినా క్రితం రోజు రాత్రి సుబ్బులు చెప్పిన అబద్ధాన్ని నిజం అనిపించటానికి తప్పనిసరిగా పరుపు తీసుకుని డాబా మీదకి వచ్చాను. ఈసారి చాలాసేపు కబుర్లు చెప్పారు కోదండరామయ్యగారు - మనిషి చాలా నెమ్మది. ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు మరచిపోలేడు.

"రైల్వేలో ఎందుకు చేరారు?" అంటే -

"మా నాన్నగారి సరదా తీర్చడానికి" అన్నారు "నాకు కారు మెకానిజం నేర్చుకోవాలని ఉండేది. కాని కారు మెకానిక్‌కి అవసరమయిన దానికంటే ఎక్కువ చదువే చెప్పించారు నాన్నగారు. దీనితో నిరుత్సాహపడిపోయాను. ఇంక అంతకన్న పెద్ద ఉద్యోగమేదో చెయ్యక తప్పలేదు ఆలోచించాను. చదువుతో ఎక్కువ ప్రమేయంలేని ఉద్యోగం ఏమిటా అని. చివరికిది కనిపించింది" -

పరిహాసానికన్నారా అని ఆయన ముఖం చూశాను. అయితే అక్కడ సహజంగా కనిపించే నవ్వుతప్ప మరేమీ కనిపించలేదు. విచిత్రమయిన మనిషనుకున్నాను. ఏ విషయమయినా మనం చెప్పిందంతా విని - మనం ఊహించనిదీ, తనకి మాత్రమే తట్టినట్టు ఒక విషయం చెప్పి చిరునవ్వు నవ్వుతాడు.

ఉదాహరణకి - "మద్రాసులో చదువంటే మా నాన్నగారికి నమ్మకం. అందుకని అక్కడ చేర్చారు" అంటే -

"అంతే కాదు. అదేం చిత్రమో. మద్రాసు గాలిలో, నీటిలో తెలివితేటలు, బ్రతక నేర్చినతనం ఎక్కువయే గుణం ఉంది" అన్నారు.

దాదాపు గంటన్నరసేపు మాట్లాడుకుని ఉంటాం ఇద్దరం. కాని ప్రసక్తివశాత్తూ అయినా సుబ్బులు పెళ్ళిగురించి, తను వచ్చిన ఉద్దేశాన్ని గురించి మాట్లాడలేదు. తర్వాత ఇద్దరం నిద్రపోయాం.

అదిన్నీ ఎక్కువసేపు నిద్రపోలేదు. దాదాపు పదకొండు అయి వుంటుందేమో - తెలివొచ్చి పక్కకి చూస్తే కోదండరామయ్య కనిపించలేదు. డాబా అంతా వెదికాను. కాని లేడు. లేచి వీధి గోడవరకూ వచ్చాను. శోభనాద్రిగారి వాటాలో దీపాలు వెలుగుతున్నాయి. మాటలు కూడా వినిపిస్తున్నాయి. అంతా ఏవో చర్చలు జరుపుతున్నారని అర్థమయింది. మరి కోదండరామయ్యగారు ఎప్పుడు లేచారో, ఎవరు లేపారో -

అందర్లోకి శోభనాద్రిగారి గొంతూ, ముసలమ్మ గొంతూ వినిపిస్తున్నాయి. శోభనాద్రిగారు ఉద్రేకంగా మాట్లాడుతున్నారు. మాటలు స్పష్టంగా తెలియడంలేదు. కాని ఎవరితోనో చెపుతున్నట్టుగా, ఎవరినో వేస్తున్న ప్రశ్నల్లాగ, నిలదీసి అడుగుతున్న ధోరణి తెలుస్తోంది. నాకు నిద్రమత్తు వదిలిపోయింది. జాగ్రత్తగా వింటున్న కొద్దీ విషయం అర్థంకాలేదుగాని, ధోరణి అర్థమయింది. మెల్లగా మెట్లు దిగాను. చివరిమెట్టు మీదకి వచ్చేసరికి -

"ఇంతకన్న మరో మార్గం లేదు -" అంటోంది కోదండరామయ్యగారి గొంతు. మళ్ళీ శోభనాద్రిగారి ప్రశ్న.

"ఏమంటుంది?" అని ముసలమ్మగారి బుకాయింపు.

అస్పష్టంగా ఏదో అంది సుబ్బులు. లేక అనాలని ప్రయత్నించిందో - అంతే. చెంప ఛెళ్ళుమంది. తుళ్ళిపడాను. ఊపిరి బిగబట్టి ఏం జరగనుందోనని విన్నాను. ఎవరూ ఏం మాట్లాడలేదు క్షణకాలం. హఠాత్తుగా వాళ్ళు తలుపులు తెరుచుకుని బయటకి వచ్చారు.

వెంటనే మీదికిపోయే అవకాశం లేదు. నీడకి ఒత్తిగిలి నిలబడ్డాను. మెట్లమీదకి వచ్చాక సుబ్బుల్ని గుర్తుపట్టాను. కాళ్ళ మధ్య తల ఆనించి ఏడుస్తోంది. నాకు జాలేసింది. ఒకసారి నా వేపుకు తిప్పుకుని కావలించుకుని ఓదార్చాలనిపించింది.

మరో మెట్టు కిందకి దిగి భుజం మీద చెయ్యేసి "సుబ్బులూ" అన్నాను రహస్యంగా.

ఒక్కసారి బెదిరి కెవ్వుమనిబోయి అతి ప్రయత్నంలో ఆపుకుంది. అంతలో దుఃఖం మరిచిపోయి - "ఎందుకు లేచివచ్చారు? త్వరగా వెళ్ళిపొండి. వాళ్ళు వస్తారు" అంది భుజం మీంచి నా చెయ్యి తప్పిస్తూ. నాకింకేమీ అనడానికి తోచలేదు. గదిలో మాటలు ఆగిపోయాయి. భయమేసింది. ఎవరయినా మమ్మల్ని చూస్తే ఏ ప్రమాదమయినా జరగవచ్చు. సహాయం చెయ్యబోతే సుబ్బులికి అన్యాయం జరగవచ్చు.

మరో ఆలోచన లేకుండా చరచరా మేడమెట్లు ఎక్కేశాను. కప్పుకుని పడుకున్న మరికాస్సేపటికి కోదండరామయ్య వచ్చి సిగరెట్టు వెలిగించి ఆకాశాన్ని చూస్తూ వెల్లకిలా పడుకున్నాను. ఆయన అలా దాదాపు పది సిగరెట్లయినా కాల్చడం నాకు తెలుస్తూనే ఉంది.

## 20

రాత్రి సంఘటన నా మీద బాగా పనిచేసింది. ఇక నేను ఆలస్యం చెయ్యదలచుకోలేదు. నా పిరికితనమే పరిస్థితిని ఇంతవరకూ తెచ్చిందనుకున్నాను. లాయరుగారిమీదా, నా పట్ల అనుకూలంగా మారే పరిస్థితులమీదా, భవిష్యత్తులో నేను కూడదీసుకోగల ధైర్యం మీదా ఆధారపడితే సుబ్బులు ఇంకా నలిగిపోతుందనిపించింది. శోభనాద్రిగారు చూసిన పెళ్ళి సంబంధం దానంతటదే తప్పిపోయిందనుకున్న నమ్మకం సడలిపోయి, అనుకోకుండా ఎదురు తిరిగిన పరిస్థితులకి బిత్తరపోయాను. ఇంకా ఆలోచిస్తే సుబ్బులు దక్కకపోవచ్చు. అందుకని ఉదయమే పోస్టాఫీసుకి వెళ్ళి దాదాపు రెండు గంటలు శ్రమపడి నాన్నగారికి పెద్ద ఉత్తరం వ్రాశాను. కోదండరామయ్యగారు వెళ్ళిపోయేలోగా నాన్నగారు రాగలిగితే అంతా నిర్ణయమయిపోతుందని నా ఆశ. ఉత్తరం పోస్ట్ చేసి ప్రశాంత చిత్తంతో ఇంటికి తిరిగివచ్చాను.

కానీ ఆ సాయంకాలమే కోదండరామయ్యగారు భార్యతో కలిసి ప్రయాణమయారు. దిగులు చూపులతో నిస్సహాయంగా నిలబడిపోయాను, వాళ్ళబండి సందుమలుపు తిరిగేవరకూ. నా అంతట నేను ఎందుకు కల్పించుకు బయట పడలేదు? - వాళ్ళ మాటల మధ్య నా ప్రసక్తి వచ్చి ఉంటుందని నా కెందుచేతనో అనిపించింది. నన్ను కాదని బయటి వ్యక్తి కోసం సంబంధాలు వెదకడంలో నాకు తెలియని విషయమేదో వాళ్ళకి తెలిసి ఉండాలనుకున్నాను.

మరి - ఏమిటా విషయం?

✡ ✡ ✡

సుబ్బులు మునుపటిలాగ లేదు. దుఃఖాన్ని మనసులో దాచుకుని, చిరునవ్వు చిందించే శక్తి ఆమెలోనూ పోయింది. రెండోరోజు చూస్తే జబ్బుపడ్డ మనిషిలాగ దిగులుగా కనిపించింది. నేను పలకరించటానికి అవకాశం లేదు. ప్రక్కనే శోభనాద్రిగారున్నారు. ఆయన మనుమరాలిపట్ల యిదివరకటి శ్రద్ధా, ఉత్సాహం చూపుతున్నట్టు లేదు. ఇద్దరు వ్యక్తుల్ని ఒక గదిలో బంధించినప్పుడు తప్పనిసరిగా మసిలే తీరులో కనిపించారు వారిద్దరూ. ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఉత్సుకత రానురానూ నాలో పెరిగిపోయింది. ఇవాళో రేపో నాన్నగారు వస్తారు. వచ్చేలోగా ఇక్కడి విషయాలు తెలియడం మంచిది. అందుకని సుబ్బుల్ని కలవాలని శతధా ప్రయత్నించాను.

మర్నాడు ఉదయం సత్తిరాజులు కనిపించి నన్ను చూసి సైకిలాపి "ఆ పెళ్ళికొడుకుగారు నిన్నరాత్రి మకాం ఎత్తేశారు తెలుసా?" అన్నాడు

నేనాశ్చర్యపోయాను. "అదేం?" అన్నాను.

"ఏముంది సార్. మళ్ళీ వెయ్యోసారి చెపుతున్నాను. సుబ్బులు మనసు నాకు తెలుసు" అని దగ్గరికి వంగి "మా అమ్మాయికి ఇష్టంలేదని మా మావఁయ్య ద్వారా కబురుపెట్టారు. మా మావఁయ్యమీద కారాలు మిరియాలూ నూరి నిన్న బస్సు ఎక్కేశాడు" అనేసి వెళ్ళిపోయాడు.

అది విన్నాక పూర్తిగా సంతోషం కలగలేదు నాకు. ఎదురుగా గజ తురగ పదాతిదళాలతో ఢీకొంటున్న శత్రువు హఠాత్తుగా ఆగి వెనుతిరిగి పోయాడంటే నమ్మదగిన విషయం కాదు. అది మరోవేపు మంచి దెబ్బ తీసే ఎత్తయినా కావాలి. లేదా ఎదటి బలాన్ని హఠాత్తుగా ఎరిగిన కారణమయినా కావాలి. అలా అయితే ఇటువేపు బలం ఏమిటి? రోజూ రెండుపూటలా ఆమె స్నానానికి వెళ్ళే సమయంలో పెరట్లో తచ్చాడాను. కాని నేను ఉండడం చూసి లోపలికి వెళ్ళేదేగాని బయటకు వచ్చేది కాదు. ఇది గమనించి మనస్సు చివుక్కుమన్నా నా ప్రయత్నం మానలేదు.

ఓ సాయంకాలం మల్లెలు కోస్తుంటే గమనించి, అప్పటికప్పుడే మూడుసార్లయినా ముఖం కడుక్కుందుకు మళ్ళీ వచ్చాను. ముఖం కడుక్కుంటూ 'సుబ్బులూ' అన్నాను మెల్లగా.

మల్లెల నుంచి దృష్టి మరల్చక "ముఖం కడుక్కుని వెళ్ళండి బాబూ. మా తాతయ్య చూస్తున్నాడు" అంది. అవును. వంటగదిలో పీటమీద కూర్చుని ఇటే దృష్టి ఉంచారు శోభనాద్రిగారు. ఉస్సురమనిపించింది, చేసేదిలేక మరొకసారి ముఖం కడుక్కున్నాను. తడి చీరల్ని ఇప్పుడు మేడమీద ముసలమ్మగారే ఆరేస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ సుబ్బుల్ని వీధిలోకి రానివ్వడంలేదు. ఎందుకని? ఆమె మీద పెద్దలిద్దరూ నిఘా ఉంచారని గమనించాను. అది కట్టుబాటులాగా కాకుండా ఆమె ఉండే చోట తమలో ఎవరో ఒకరు ఉండేట్టు చూసుకున్నారు. ఆమె తనంతట తాను బయటకు వచ్చే అవకాశం ఇవ్వలేదు.

రోజంతా నిర్విరామంగా తిరుగుతున్నారు శోభనాద్రిగారు. ఏ సాయంకాలానికో, మరీ చీకటిపడేవేళకో వస్తారు. అప్పుడు ఇంట్లో మాటలేం జరుగవు. భోజనాలయాక ఎక్కడివాళ్ళక్కడ పడుకుంటారు. మర్నాడు బయలుదేరేముందు ఒక్కసారి సోమయాజులు గారిని చూడడానికి వెళితే వెళతారు. లేకపోతే లేదు. కాని ఈ కార్యక్రమంలో ఎదిరింపు లేక నిశ్శబ్దంగా ఇరుక్కుపోయింది సుబ్బులు, దానినుంచి బయటపడే ఉద్దేశమూ లేదు, ధ్యాసా లేదు. లేకపోతే ఇన్నాళ్ళూఈ ఎందుకని మాట్లాడదు?

టూత్ బ్రష్ పాడయిందని ఆ సాయంకాలం షికారు నుంచి వస్తూ ఓ ఫాన్సీషాపులో దూరాను. బయటికి వస్తుంటే దూరంగా పాములవాడి గారడీ కనిపించింది. అటు తిరిగి దూరంగా నిలబడి చూస్తున్నాను.

ఇంతలో ఎవరో పలకరించారు - "అటుచూస్తున్నారా? చిన్నపిల్లల్లాగ" అంటూ.

తుళ్ళిపడ్డాను సుబ్బుల్ని చూసి. "ఇదేమిటి? ఒక్కదానివే ఎలా వచ్చావు?" అన్నాను.

"మా తాతయ్య కూడా ఉన్నాడు. ఆ షాపులో పంచెలు బేరం చేస్తున్నాడు. నాకూ మీకు పుట్టిన బుద్ధే పుట్టి ఇక్కడికి వచ్చాను" అంది. రెండు చేతులూ కట్టుకుని నవ్వుతూ.

ఆ క్షణంలో సుబ్బులు నిర్బంధంలో ఉన్న రాజకుమారిలాగ.. ఆమెను చూడవచ్చిన ప్రియుణ్ణి - దుఃఖాన్నంతా దిగమింగి, చిరునవ్వుతో - పలకరిస్తున్నట్టు ఓ జానపద దృశ్యాన్ని ఊహించుకున్నాను.

"ఏమిటాలోచిస్తున్నారు?" అంది పాములవాడి వేపే దృష్టి నిలిపి, నా వేపు ఓరగా చూస్తూ.

"ఉన్నపాటునే నిన్నిలా ఎత్తుకుపోగలిగితే ఎంత బాగుండుననిపిస్తోంది."

"అది చాతకాకనా మరి ఇన్నాళ్ళూ ఆలస్యం చేశారు?" నేను తెల్లబోయి చూస్తే ఫక్కుమంది. "నావేపలా చూడకండి. ఎవరేనా చూస్తే ఇక్కడ మరో ఆట జరుగుతుందనుకుంటారు" - అంది వెంటనే దాన్ని పరిహాసంగా మార్చేస్తూ.

"పరిహాసం కాదు సుబ్బులూ. నేను నీతో మాట్లాడాలి" అన్నాను దగ్గరకు జరుగుతూ. కట్టుకున్న చేతులతో ఎడం చేత్తో నన్ను దూరంగానే ఆపి "నాకూ మాట్లాడాలనే ఉంది. కాని ఎప్పుడో మోక్షం!?" అంది. అంతలో శోభనాద్రిగారు మెట్లు దిగడాన్ని గమనించి, దూరంగా తప్పుకొని జనంలో కలిసిపోయాను.

ఇన్నాళ్ళ సాంగత్యంలో సుబ్బులు స్వభావం నాకర్థమయింది. తనంతట తాను ఎప్పుడూ సాన్నిహిత్యాన్నీ, మాట్లాడాలనే ఉత్సుకతనీ ప్రకటించలేదు. కాని ఇప్పుడిలా తనే కోరడం నాకు వింతగానూ, విశేషంగానూ తోచింది. ఏం మాట్లాడుతుంది నాతో? ఏ రోజు కారోజు నాన్నగారు వచ్చేస్తారన్న ఆతృతా, వస్తే పరిణామం ఎలా ఉంటుందన్న ఆలోచనా ఎక్కువయింది. ఈసారి వస్తే విషయాలు తెలుసుకునేందుకు రారు. అన్నీ తెలుసుకుని వస్తారు - ఎందుకంటే - నేను రాసిన ఉత్తరం మినహా - నేనిక ఆయనకి చెప్పగలిగింది ఏమీ లేదు.

అయితే ఓ రోజు చిన్న సందర్భం కలిసి వచ్చింది.

ఉదయమే హనుమంతరావు మోటర్ సైకిలు ఇంటిముందు ఆపి "అర్జంటుగా నెల్లిమర్ల వెళ్ళాలి. నువ్వూ వస్తావా భాయ్" అన్నాడు. తీరిగ్గా ఇంట్లో కూర్చుని చేసేదేమి లేదు. 'పద' అన్నాను. ఎప్పుడు తిరిగి వస్తామో వాడు చెప్పలేదు. నేనూ అడగలేదు. మధ్యాహ్నానికి పని పూర్తిచేసుకుని, దగ్గర్లో ఉన్న మామిడి తోటలోకి వెళ్ళి రకరకాల పళ్ళు తిని, జూట్‌మిల్స్ చుట్టి, మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ ఇల్లు చేరేసరికి దాదాపు చీకటి పడింది. ఇంటిదగ్గర నన్ను వదిలేసి తను వెళ్ళిపోయాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ముఖ్యంగా మా ఇంటికి తాళం వేసి ఉంది. అమ్మ పురాణానికి బయలుదేరిందేమోననుకున్నాను. శోభనాద్రిగారి ఇంటి తలుపు తీసే ఉంది. ఇంట్లో ఎవరు ఉంటారో తెలుసు. సుబ్బులు జాడ ఎక్కడా కనిపించలేదు. అమ్మతో బయలుదేరిందేమోనన్న ఆలోచన తట్టి, వెంటనే అటు వెళ్ళాలనుకున్నాను. కానీ ఆ రోజంతా తిరిగిన అలసట కదలనివ్వలేదు. అయినా పురాణం దగ్గరా, దారిలోనూ మాట్లాడేదేముంది. డాబామీదకి వచ్చి పచార్లు ప్రారంభించాను. శారద సాయంకాలం తలంటు పోసుకున్నట్లుంది, డాబా మీదకి వచ్చి తల ఆరబోసుకుంటోంది. నన్నంత దూరంలో గుర్తుపట్టి చెయ్యెత్తి నమస్కారం చేసింది. నవ్వాను. మరోక్షణంలో అటూ ఇటూ పచార్లు చేసి దిగిపోయింది. పెరటివేపు మల్లెపువ్వుల వాసన తెలుస్తోంది. పచార్లు చేస్తూ పెరటి గోడవేపు వచ్చి నిలబడ్డాను. శోభనాద్రిగారి వాటా మెట్లమీద సుబ్బులు కనిపించేసరికి నిర్ఘాంతపోయాను. జుత్తుముడి వేసుకోలేదేమో వీపంతా జుత్తు పరుచుకుంది. మెట్లమీద కూచుని మోకాళ్ళ మీద తల ఆనించి నేలవేపే చూస్తోంది, నిశ్చలంగా.. పరిస్థితి అర్థమయింది. ముసలమ్మ గారిని తీసుకుని అమ్మ బయలుదేరి ఉంటుంది. వెంటనే చరచరా మెట్లుదిగాను. ఇంటిచుట్టూ తిరిగి పెరటివేపు వచ్చాను.

"సుబ్బులూ..ఇక్కడ కూచున్నావేం?" అన్నాను దగ్గరగా నిలబడి.

తుళ్ళిపడి తలెత్తింది. ఆ సంధ్య వెలుగులో ఆమె కళ్ళలో నీళ్ళు తెలిశాయి. వాటిని తుడుచుకునే వ్యవధికూడా లేదు. పైట తీసి ఒక్కసారి కళ్ళకద్దుకుంది.

"మీరా! ఎప్పుడొచ్చారు?" అంది.

"ఇలా ఒంటరిగా కూర్చుని ఏమాలోచిస్తున్నావు?" అన్నాను ఆమె పక్కనే మెట్లమీద కూచుంటూ.

చిన్న మెట్లు. ఇద్దరం కూచునే స్థలం కాదు. ఒకరి భుజం ఒకరికి రాసుకుంటుంది. దుఃఖంతోనో, ఉద్రేకంతోనో, అలసటతోనో ఎగిరిపడే ఆమె ఎద కదలిక తెలుస్తోంది.

"ఏముంది? తీరిగ్గా కూర్చుంటే ఏమిటో ఆలోచనలు –" నవ్వబోయింది. కాని నవ్వురాలేదు. కనీసం ఎప్పుడూ సుబ్బులు నవ్వే నవ్వు గుర్తు తెలియరాలేదు.

ఆమె ముఖం చూడడానికి పక్కకి తిరిగితే - చాలా దగ్గరలో మెత్తటి చెక్కిళ్ళూ, హెయిరాయిల్ వాసనా, ఎర్రగా మెరిసే చెవి డ్రాప్సూ కనిపించాయి. అంతకుమించి ఆపుకుందామనుకున్నా ఆగని కన్నీటి చుక్కలు కొలకుల్లో కొట్టుమిట్టులాడాయి. అంత పెద్ద కళ్ళు కవ్వింపులో రాణించినంతగా కన్నీటికి రాణించలేదు. సుబ్బులు దిగులుగా కనిపించింది.

ఆమెను చూస్తుంటే ఎవరో మనస్సులో చెయ్యిపెట్టి కెలికినట్టనిపించింది. ఆమె ఇరుక్కున్న కష్టాల రూపం ఆ క్షణంలో చూచాయగానయినా కళ్ళకు కట్టినట్టనిపించింది. ఆడుతూ పాడుతూ తిరిగే అందాల బొమ్మ ఇక ఎంతోకాలం మనస్థాపాన్ని తట్టుకోలేదు. ఇంకా నిర్లక్ష్యం చేస్తే ఇక సుబ్బులు కనిపించదు. ప్రపంచమంతా ఎదురు తిరిగినా సరే, ఈ కష్టం నుంచి సుబ్బుల్ని తప్పించాలి. నేనొక్కణ్ణే ఆ పనిని నెత్తిన వేసుకోవాలి. అవసరమయితే సుబ్బుల్ని తీసుకుని ఎక్కడికి పారిపొమ్మన్నా పారిపోతాను.

నన్ను చూడగానే ఎటువంటి ఆలోచనల్నయినా దాచుకుని చిరునవ్వు నవ్వే సుబ్బులు స్థయిర్యం ఆ క్షణంలో ఓడిపోయింది. మాట్లాడుతూనే పరాకుగా ఏదో ఆలోచనలో పడింది.

ఉద్రేకం పూరించుకుని "సుబ్బులూ" అన్నాను.

ఏదో కలలోంచి తేరుకున్నట్లు తుళ్ళిపడి "ఊఁ" అంది.

రుద్ధమయిన ఆ కంఠం నన్ను మరింత కలచివేసింది. ఇక నాకు దిక్కుతోచలేదు. ఆవేశంగా ఆమె భుజం చుట్టూ రెండు చేతులు వేసి ఆమె తలని నా ఒడిలోకి తీసుకున్నాను.

"సుబ్బులూ, బాధపడకు నీకేం కష్టం రానివ్వను. ఎటువంటి సహాయమయినా చెయ్యడానికి నేనున్నాను. ఎవరు ఎదిరించినా సరే" అంటూ ఆప్యాయంగా తల నిమిరాను. కన్నీళ్ళతో మెత్తబడిన చెక్కిళ్ళు నిమిరాను. వేలితో పెదిమలు రాశాను. నుదుటిమీద పడిన జుత్తుని సవరించాను. కాని ఇదంతా క్షణకాలం. మరుక్షణంలో నన్ను విడిపించుకుంది సుబ్బులు. ఒక్కసారి లేచి నిలబడి నూతిగట్టువరకూ నడిచింది. తనకున్న దుఃఖం కంటే నా స్పర్శ ఎక్కువ బాధపెట్టినట్లు చలించడంతో మనస్సు కలుక్కుమంది. నేనూ లేచి నూతిగట్టు దగ్గరకు నడిచాను.

నూతిలోని చీకటిని చూస్తూ చీకటిని నిలబడింది సుబ్బులు.

"సుబ్బులూ! నామీద కోపమా! నేనేమైనా తప్పుచేశానా? చేస్తే క్షమించవచ్చుగా?" అన్నాను ఉద్రేకంతో ఉత్తప్తమయిన కంఠంతో.

తల అడ్డంగా తిప్పింది.

"ఏమిటి నీ బాధ సుబ్బులూ! నాతో చెప్పవూ! నా మీద ఇంకా నమ్మకం లేదా?" అని దగ్గరకి రాబోయాను. ఒక్కసారి ఇటు తిరిగి నా ముఖం చూసింది సుబ్బులు. ఆ క్షణంలో మూర్తీభవించిన శోక మూర్తిలాగా కనిపించింది. ప్రపంచంలోని నిస్సహాయత అంతా ఆమె ముఖంలో ద్యోతకమయినట్టనిపించింది. ఎక్కడినుంచి వచ్చిందో దుఃఖం కట్లు తెచ్చుకుని ప్రవహించింది. ఎక్కడినుంచి వచ్చిందో దుఃఖం కట్లు తెంచుకుని ప్రవహించింది. ఒక్కసారి నూతిగోడకు తల ఆనించి బావురుమంది.

ఏం చెయ్యాలో తెలీక, ఏమీ చెయ్యలేక శిలాప్రతిమలాగా నిలబడిపోయాను.

✡ ✡ ✡

# 21

**హఠాత్తుగా** ముంచుకొచ్చి దుఃఖాన్ని అంత హఠాత్తుగానూ ఆపుకుంది సుబ్బులు. కళ్ళు తుడుచుకుని ముందుకు జారిన జుత్తుని సవరించుకుంది. మెల్లగా నడిచివచ్చి మొదట కూర్చున్న చోటే మెట్లమీద కూర్చుంది. మా ఇద్దరి మధ్య దూరం ఎక్కువయింది. అయినా

నేను కదల్లేదు. నూతిగట్టుకు చేరబడి నిలబడ్డాను. రుద్ధమయిన గొంతు మామూలుగా ఉంచడానికి ప్రయత్నిస్తూ మాట్లాడింది. "ఈ విషయం ఇక్కడెవరికీ చెప్పకూడదనుకున్నాను. కానీ ఇవాళ మీకు చెప్పక తప్పడం లేదు. నిజానికి, చేప్తే మీ ఒక్కరికే చెప్పాలి."

"ఏమిటది సుబ్బులూ?" అన్నాను.

మనసులో ఉన్న భావాల్ని చెప్పడానికి తగిన భాషలేని లోపం మొదటిసారి అనుభవిస్తున్నట్టుంది. ఆ తికమక అర్థమవుతోంది. నా ముఖం చూసి తల దించుకుంది.

**"నేనిదివరకే ఒకరికి మనిసిచ్చాను"**

అచేతనుడినయి వింటున్నాను. మానవ హృదయం తరచగల ఏ రహస్యపు లోతుల్లో చూసినా ఇది అసాధ్యమని నమ్మినవాణ్ణి నేను. భగవాన్!

"అబద్ధం! సుబ్బులూ! ఆత్మవంచన చేసుకోకు. నా ముఖం చూసి నిజం చెప్పు" అన్నాను.

నా కంఠం నేనే గుర్తుపట్టనంత బొంగురుపోయింది. గుండె గొంతులో కదిలి మాటలు అర్థాంతరంగా తెగిపోయాయి.

"నిజం చెపుతున్నాను. నన్ను నమ్మండి. నా తోడు." అంది తల మీద తన చెయ్యి ఉంచుకుంటూ. అంతకంటే నమ్మకంగా చేప్పే మార్గం తెలీదు సుబ్బులికి.

"నాన్నగారు ప్రస్తుతం పనిచేస్తున్న చోట మూడు సంవత్సరాలుగా ఉంటున్నాం. నాకు ఊహ పెరిగి, జీవితంలో ఆకర్షణ అర్థమయినప్పటినుంచీ అతణ్ణి చూస్తున్నాను. అతడు మా ఇంటికి ఎదురుగా ఉండేవాడు. అతని తాత గార్డుగా పనిచేసి రిటైరయారు. తండ్రి రైల్వే డాక్టరు. బాగా డబ్బు ఆర్జించాడు. ఇతను ఏం పని చేస్తాడో నాకిప్పటికీ తెలీదు. తెల్లగా ఉంటాడు. నల్లటి బారుమీసాలూ, విశాలమయిన నుదురు. ఎప్పుడూ ముదురు రంగు బట్టలు వేసుకునేవాడు. ఓ పాత మోటారు సైకిలు. దానిమీద వెళుతుంటే ఎవరో మహారాజు వెళుతున్నట్లు విచిత్రంగా చూసేదాన్ని. నన్నూ అతను మొదట గమనించలేదు. తర్వాత తర్వాత మోటరు సైకిలు బయటకు తెచ్చినప్పుడల్లా యధాలాపంగా గుమ్మంలో కనిపించే అమ్మాయిని గుర్తుపట్టాడు. *కాని నిర్లక్ష్యం చాలా గొప్ప ఆకర్షణ అనుకుంటాను.* అలా అతను తిరస్కారంతో వెళ్ళిపోవడం నాకెంతో బాగుండేది. మళ్ళీ అతనెప్పుడు తిరిగి వస్తాడో తెలుసు. దాదాపు పదినెలలు ఈ దినచర్యకి నేను అలవాటు పడిపోయాను."

"ఒక్కసారి కూడా అతను నీతో మాట్లాడలేదా?"

నవ్వింది "అతనికి తెలుగు రాదు. అరవ్వాళ్ళు. నాకు అరవం రాదు. ఇప్పటికీను. తర్వాత నేను అరవం నేర్చుకోవడానికి ప్రయత్నించాను. కాని అతను తెలుగు నేర్చుకోవడానికి ప్రయత్నించలేదు. నేను మాట్లాడితే అర్థమయేది. అతను మాట్లాడకపోయినా నాకు బాధ అనిపించేది కాదు" అని ఆగింది.

నేనేం మాట్లాడలేదు.

మళ్ళీ తనే ప్రారంభించింది మునగచెట్టు వేపు చూస్తూ. చేతిలో ఆమెకు ఆమెకు తెలియకుండానే వాడిపోయిన మల్లెపువ్వు నలిగిపోతోంది.

"నాకు ప్రేమా గీమా తెలీదు. సినిమాలు ఎక్కువ చూడలేదు. పుస్తకాల్లో చదవలేదు. అయినా నేనేం చెడ్డగా ప్రవర్తించలేదు. నాన్నగారు ఆశ్చర్యపడ్డారు. నేను అలా మాట్లాడతానని ఊహించి ఉండరు. తెల్లబోయారు మొదట. తర్వాత నిల్రదొక్కుకుని అది సాధ్యం కాదని నచ్చచెప్ప చూశారు. కాని ఆ ప్రాంతాల్లో మనవాళ్ళు చాలా తక్కువ. అందుకని ఈ ఊరికి రావాలనుకున్నారు. కాని సెలవులు దొరికినట్టు లేదు. తాతయ్యకి ఉత్తరం వ్రాశారో, ఆయనే వచ్చారో తెలీదు. మరో పదిరోజులకి తాతయ్య అక్కడ ఉన్నారు. ఆయనా నన్ను

బ్రతిమాలారు. చాలా మంచి సంబంధాన్ని చూసి చేస్తానన్నారు. *అయినా దాహం వేస్తున్న వాడికి మంచి సినిమా చూపిస్తానంటే ఏమయినట్లు?* నాకు కావలసింది పెళ్ళికాదు. నేను కోరుకున్న వ్యక్తిని చేసుకోవడం కాని, ఎవరితోనయినా కాపురం చెయ్యడం కాదు. అందుకని వాళ్ళు అడుగుతున్న కొద్దీ నా పట్టుదల ఎక్కువయింది. ఓ రోజు మా అమ్మ కొట్టింది. చాలా పిచ్చిగా బాదింది. నేనేం మాట్లాడలేదు. నాన్నగారు మాత్రం మూడు రోజులు పిచ్చివాళ్ళ లాగా తిరిగారు ఆ తర్వాత. తనతో రమ్మని తాతయ్య బలవంతం చేశారు. నేను అక్కణ్ణించి కదలనన్నాను. ఇంటిలో ఒక విష వాతావరణం ఏర్పడింది. ఎవరూ నాతో మాట్లాడలేదు. నేనేం చేస్తున్నానో ఎవరూ పట్టించుకోలేదు. కాని బయటికి వెళ్ళనిచ్చేవారు కాదు. మోటారుసైకిలు చప్పుడయితే చాలు కిటికీ దగ్గరకు పరిగెత్తేదాన్ని. అతని పేరు కురియప్పన్. చిరునవ్వు కనిపించేది. అది వెయ్యి ఏనుగుల బలం ఇచ్చేది. ఒకరోజు ఉన్నట్టుండి అతను కనిపించలేదు. ఆ రోజునుంచీ పదిరోజులు కనిపించలేదు. నేను గాభరా పడ్డాను. నాన్నగానీ, తాతయ్యగానీ వాళ్ళతో ఏమైనా పేచీపడ్డారా అని భయపడ్డాను. పక్క ఇంట్లో చిన్న అమ్మాయిని బ్రతిమాలి మెల్లగా విషయం తెలుసుకున్నాను. ఏదో పనిమీద కోయంబత్తూరు వెళ్ళాడట. తిరిగి రావడానికి నెలరోజులు పడుతుందట. పోయిన ధైర్యం మళ్ళీ వచ్చింది. కదలక మెదలక మూగనోము పట్టుక్కూర్చున్నాను. మా తాతయ్య రోజూ నన్ను బుజ్జగించేవారు. మా నాన్నగారిని ఎదిరించి, అవసరమైతే ఈ పెళ్ళి తను చేయిస్తానని నచ్చచెప్పేవారు. మామ్మ కూడా నావేపే మాట్లాడేది. మా అమ్మమ్మ కథ చెప్పి అలాంటి అన్యాయం నాకు జరగకూడదని ఉండుండి శోకం పెట్టేది. క్రమంగా మా తాతయ్య మీద నమ్మకం కుదిరింది. మా నాన్నగారు బొత్తిగా నాతో మాట్లాడడం మానుకున్నారు. మా తాతయ్య నాకు పెద్ద అండ అయారు. సాయంకాలం వేళల్లో ఇద్దరం రైలు పట్టాల వెంబడే షికారు తిరిగి వచ్చేవాళ్ళం. అప్పుడు మా వంశం గురించీ, పరువు ప్రతిష్టల గురించీ చెప్పేవారు. అరవల్ని నమ్మకూడదనీ, వయసులో పోయే వికారాలు, ప్రేమలూ జీవితాన్ని నిలబెట్టవనీ అనేవారు. ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకోబోయి, కుల పెద్దల పోరు పడలేక 'వెలి' అయి ఆత్మహత్యలు చేసుకున్న అమ్మాయిల కథలు భయంకరంగా చెప్పేవారు. అన్నీ చెప్పి కూడా "నీకీ పెళ్ళి ఇష్టమయితే నీవేపే నిలబడతాను" అని భుజం తట్టేవారు. ఉన్నట్టుండి తాతయ్యకి ఇక్కడి నుంచి టెలిగ్రాం వచ్చింది పొలం వ్యవహారాల విషయమై వెంటనే బయలుదేరి రావాలని. విషయమంతా నచ్చచెప్పి "నేను రెండురోజుల్లో మళ్ళీ తిరిగివస్తానమ్మా" అని చెప్పారు. మరునాడు తాతయ్యా, మామ్మా బయలుదేరబోతుంటే నన్ను సమర్ధించే ఇద్దరూ వెళ్ళిపోతున్నందుకు దిగులేసింది. వెళుతూ - "పోనీ మాతో వస్తావా తల్లీ, పని పూర్తయాక అంతా కలిసి తిరిగి వచ్చేద్దాం" అన్నారు తాతయ్య. అప్పటికి తాతయ్యని పూర్తిగా నమ్మాను. ఇక్కడ కురియప్పన్ కూడా కోయంబత్తూర్ వెళ్ళారు. తిరిగి వచ్చేదాకా కూర్చుని చేసేదేమీ లేదు. ఎప్పుడో చిన్నతనంలో తప్ప ఈ మధ్య ఇక్కడికి రాలేదు. ఒక్కసారి స్నేహితురాళ్ళందరినీ చూసి రావచ్చనిపించింది. సరేనన్నాను. అంతే. అప్పటికప్పుడు నన్నూ ప్రయాణం కట్టించారు. నాన్నగారు స్టేషన్‌కి కూడా రాలేదు. మేం ముగ్గురమే బయలుదేరి వచ్చాం. వచ్చాక ఇక్కడ నాకు అర్ధమయిందేమిటో తెలుసా? మాకసలు పొలాలే లేవని తెలిసింది. వాళ్ళిద్దరూ బయలుదేరడం, చివరి క్షణంలో నన్ను బయలుదేరదీయడం వాళ్ళ పథకంలో ఒక భాగమేనని తెలిసింది. ఇంకేం చెయ్యను? ఇక్కడ ఇరుక్కుపోయాను" అని ఆగింది.

మధ్య మధ్య ఆగుతూ, ఎటువేపో చూస్తూ మెల్లగా చెపుతోంది సుబ్బులు. చెపుతున్నప్పుడు తనకు ఎదురు తిరిగిన వాళ్ళమీద కోపం, కసీ ఆ మాటల్లో స్పష్టంగా తెలిసింది.

"తాతయ్య సామాన్యులేం కాదు. ఇక్కడికి వచ్చాక మా ప్రయాణాన్ని మెల్లగా వాయిదా వేస్తూ వచ్చారు. ఇదిగో వెళదాం. అదిగో వెళదాం అంటూ తేదీలు దాటించారు. ఈలోగా ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా సంబంధాలు వెదుకుతుండడం, నాన్నగారికి ఉత్తరాలు రాస్తుండడం నాకర్ధమవుతోంది. అక్కడ మా ఇద్దరి కథ దాదాపు చుట్టుపక్కల వాళ్ళందరికీ తెలిసిపోయింది. కురియప్పన్ నన్ను చూస్తూ బయలుదేరడం, వీలున్నప్పుడు నేను అతనితో మాట్లాడుతుండడం ఇవన్నీ నలుగురికీ తెలియకపోలేదు. అందుకనే అక్కణ్ణుంచీ ఇంత దూరం తీసుకొచ్చి ఇక్కడ ఎవరికో ముడిపెట్టెయ్యాలని పెద్దవాళ్ళ ఆరాటం. చాలా దయతో, అనురాగంతో పెంచిన నాన్నగారు ఇప్పుడు

నన్ను వదిలించుకోవడం ఎలాగా అని తాప్రత్రయపడుతున్నారు. ఆడపిల్ల కోరుకునే కోరిక వాళ్ళ అభిమానాన్ని ఎట్లా మార్చేస్తుందో చూడండి" అంది.

"మీ కోరిక కుటుంబ ప్రతిష్టకి ఎదురు తిరిగేదయిందే అని వాళ్ళ బాధ. అయినా కురియప్పన్ మిమ్మల్ని ఆదరిస్తాడని నమ్మకం ఏమిటి?" అనడిగాను.

"అసలు వాళ్ళా ప్రయత్నం చేస్తేకదా! అంతవరకూ వస్తే వాళ్ళ తల్లితండ్రుల్ని ఒప్పించగలనని అతని నమ్మకం."

చాలాసేపు నేనేం మాట్లాడలేదు. సుబ్బులు విషయంలో నాకు తెలిసినదానికంటే తెలియనిదే ఎక్కువవుందని ఇప్పుడర్థమయింది.

"మరి నాకిదంతా ఇంతవరకూ చెప్పలేదేం?" ఆ ప్రశ్న అడిగే హక్కు లేదని తెలిసే అడిగాను.

"చెపితే నన్ను సమర్థించే ఒక్క వ్యక్తినీ పోగొట్టుకుంటానని బాధ. మీకు తెలుసునో లేదో మీ వల్లే ఈ పెళ్ళికొడుకు నుంచి నన్ను నేను రక్షించుకున్నాను" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ. ఆ నవ్వులో మెత్తని నిస్సహాయత, చేసిన దొంగతనం బయటపడ్డప్పటి సంజాయిషీ ఉంది.

"అదెలాగ?" అన్నాను ఇంకా అర్థం కాక.

"ఈ ఇంట్లోనే పెళ్ళికి సిద్ధపడుతున్న మనిషి ఒకరున్నారనిపించారు మీరు. అది నిజమని నమ్మవలసిన వాళ్ళంతా నమ్మారు. నేను నమ్మించాను. అందుకనే ఆ సంబంధాలన్నీ చెడ్డాయి. సంబంధాలు తీసుకురావాలనుకున్న వాళ్ళు వెనక్కి తగ్గారు. మీకు తెలీదేమో తాతయ్యకీ మీమీద అనుమానం పెరుగుతోంది. *ఆడదానికి అపకీర్తి కూడా మంచి ఆయుధమని ఇప్పుడర్థమయింది* నాకు" అంది ఆలోచిస్తూ.

విషయాన్ని సూటిగా చెప్పడానికి ఇష్టం లేదు. కాని ఆ మాటల్లో ఆమె చెప్పాలనుకున్నదంతా సూచించింది.

*ఒక్కసారి వెనక్కి తిరిగి ఆమె సాన్నిహిత్యానికి కారణమయిన సన్నివేశాలన్నీ గుర్తు చేసుకుంటే కళ్ళు తిరిగాయి. నాకు తెలియని జీవితాన్ని నేను ఇంతవరకూ గడుపుతూ వచ్చానా అనిపించింది. ఇంతవరకూ నడిచింది పూలబాటకాదనీ, నిప్పుకుండ అనీ అప్పుడర్థమయింది. పెళ్ళికొడుకునీ, లాయరు సోమయాజులు గారినీ, సత్తిరాజులునీ వదిలించుకునేందుకు నేను కేవలం సాధనమయానని ఆలోచించిన కొద్దీ, అనిపించసాగింది. ఇదంతా అడిగి తెలుసుకోవలసిన పనిలేదు. వెనుదిరిగితే పెనుభూతాల్లాగా ఎదురుగా కనిపిస్తున్న సత్యాలివి.*

*నాకు సుబ్బులు సన్నిహితంగా వచ్చినప్పుడల్లా వాళ్ళు కనిపిస్తూ వచ్చిన సంఘటనలు అనుకోకుండా జరిగినవి కావు. వాళ్ళు చూడడానికి సుబ్బులు ప్రత్యేకంగా ఎన్నిక చేసుకున్న సందర్భాలు. వాళ్ళు కనిపించినప్పుడే ఆమె దగ్గరికి వచ్చేది. నన్ను చూసి నవ్వే చిరునవ్వు వాళ్ళ కోసం పదును పెట్టింది. నాతో చెప్పే తియ్యటి మాట, ఊరించే అందమయిన కదలిక వాళ్ళని మభ్యపెట్టడానికి సిద్ధం చేసింది. వాటి ప్రలోభంలో పడి నేను పడ్డ యాతననీ, ప్రకటించే భావాల్నీ క్షమిస్తూ వచ్చింది. సహజంగా నాలో కలిగే సంచలనానికి లొంగిపోకుండా దూరంగా ఉంటూ, నా ఉనికి ద్వారా తన పనిని నెరవేర్చుకుంటూ పోయింది.*

అయితే నేను ఏ పరిస్థితిలోనూ తొందరపడలేదు. కాని నా ఉద్రేకం ఏ క్షణంలోనయినా కట్టు తెంచుకుని ఉంటే? మాకు లభించిన ఏకాంతాల్లో ఉద్రేకాలు రెచ్చిపోయి ఉంటే?

తలెత్తి అడిగాను "ఆ పెళ్ళికొడుకు మీదా, సత్తిరాజులు మీదా కసి తీర్చుకొందుకు నన్ను పనిముట్టుని చేసుకున్నావు. కాని నేను తొందరపడి ఉంటే ఏం జరిగేది?"

సుబ్బులు చలించలేదు. నవ్వింది. "మీరు తొందరపడరని తెలుసు" అంది మెల్లగా, ధ్రుఢంగా, నిశ్చయంగా.

"ఎలా?"

"తొందరపడే స్వభావం కాదు కనక" అంతలో నా వేపు తిరిగి "మీరు జీవితంలో ఎవరినీ ఇంతవరకూ ప్రేమించలేదు అవునా?" అంది.

"అమాయకంగా తలూపాను.

"అందుకే తొందరపడడం సాధ్యం కాదని అర్థమయింది. *ఒక్కసారి ప్రేమరూపంలోనో, కోరిక రూపంలోనో శరీరం ఆకలి తీర్చిన వ్యక్తి, రెండోసారి తొందరపడతాడు. ఒకసారి మనిషి రుచి మరిగిన పులిని చూసి భయపడాలి.* మీ మంచితనం మీద నమ్మకం నాకెప్పుడూ ఉంది. అవకాశం రాలేదు గాని, అవసరమయితే మీతో చీకటి రాత్రిలో ఒంటరిగా నడవమన్నా నడవగలిగేదాన్ని" విశ్వాసంతో చెప్పింది సుబ్బులు.

మళ్ళీ తనే అందుకుంది. "మరో కారణంతో ప్రేమించాను. అందుకనే నా ప్రేమలోనూ తొందర కాకుండా విచక్షణపాలే ఎక్కువ. అదీగాక మరో కారణం కూడా ఉంది?"

"ఏమిటది?"

"మీరు తొందరపడితే మాత్రం ఏమవుతుంది. అప్పుడే నా కథంతా చెప్పి మీ క్షమాపణ కోరేదాన్ని."

నవ్వుకున్నాను. అవును. ఆమె చెప్పింది నిజం. ***మామిడికాయ కిందపడాలి. ఏ రాయి అయితేనేం! ఈ రాయివల్ల ఉపయోగం లేకపోతే మరొక రాయి ఉండనే ఉంటుంది. తినవలసింది పండుకాని రాయి కాదన్న విచక్షణ ఉన్నంతవరకూ నోరు పాడవదు.***

మరొకప్పుడయితే మగవాడి ఆత్మసంయమనానికి స్త్రీ ఇచ్చే ప్రశంస గర్వకారణమయేది కాని, ఇప్పుడు గతాన్ని గురించిన ఆలోచన దుఃఖావమానాలతో తలెత్తకుండా చేసింది నన్ను.

"నేను చదువుకోలేదు. నాకు మంచిచెడ్డల్ని నిర్ణయించుకునే శక్తిలేదు. నేను చేసిన పని మంచిదో కాదో నాకు తెలీదు. కాని నా మనసుకి నచ్చినది నేను చేశాను. నాలాంటి వాళ్ళకు మూర్ఖత్వమే ఎక్కువగా ఉంటుందనుకుంటాను. నేను ప్రేమించిన వ్యక్తిని తప్ప మరొకర్ని చేసుకోదలచుకోలేదు. అందుకోసం ఏ పరిస్థితినయినా ఎదుర్కోదలిచాను. నా పరిస్థితిని దేవుడులాగ వచ్చి మీరు కాపాడారు. మిమ్మల్ని చాలా బాధ పెట్టానని నాకు తెలుసు. *మా తాతయ్య చెప్పేవారు, చచ్చిపోయిన చేపని ఎరగా వేస్తేనే పెద్ద చేప పట్టుబడుతుందట. చచ్చిపోయిన చేప ఎక్కడ దొరుకుతుందో తెలీదు. అందుకని నేనే చేపని చంపాను. రోజులు గడిచిన కొద్దీ వీళ్ళందరినీ మోసం చేసి జయిస్తున్నానన్న సంతోషం కంటే, మిమ్మల్ని మోసం చేస్తున్నానన్న బాధ ఎక్కువయిపోయింది.* ఇవాళ కాకపోయినా రేపయినా మీకీ విషయం చెప్పేదాన్నే. నా ఖర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఇక ఈ దౌర్భాగ్యపు బ్రతుక్కి మిమ్మల్ని కూడా బాధపెట్టదలుచుకోలేదు. మీకు నేనెంతయినా కృతజ్ఞురాలిని. మీరు చదువుకున్నారు. నన్ను మీరు అర్థం చేసుకోగలిగితే క్షమించగలరు. నా మీద ఇంకా కోపంగా ఉంటే ఏం చెయ్యగలను? ఇక నా ముఖం చూడొద్దు. ఇంతకంటే ఏమీ చెప్పలేను."

మ్రాన్పడిపోయి అలాగే ఉండిపోయాను.

కొంతసేపయాక "ఏం మాట్లాడరు?" అంది సుబ్బులు.

ఒకసారి సూటిగా ఆమె కళ్ళలోకి చూసి, ఉద్రేకంతో ఊగిపోతూ అన్నాను. "నువ్వు రాక్షసివి, గుండెలు తీసిన బంటువి. మరొకప్పుడయితే ఇంత అన్యాయం చేసినందుకు ఏం చేసేవాడినో? కాని నీ కథంతా విన్నాక, నిన్ను చూస్తూ ఏమీ చెయ్యలేకపోతున్నాను. వెళ్ళిపో నా ముందు నుంచి వెళ్ళు" అని అరిచాను.

***కళ్ళు విశాలం చేసుకుని నిండుగా, నా ముఖంలోకి చూసింది. నమస్కారం చెయ్యడానికి ఎత్తిన చేతులు ఆమె పెదాల దగ్గర ఆగి, అవి చలించకుండా పట్టుకున్నాయి. క్షణంలో ఆమె కళ్ళు రెండూ నీటితో నిండుకున్నాయి.***

మరో మాటలేకుండా నా ముందు నుంచి నడిచి వెళ్ళిపోయింది సుబ్బులు.

## 22

ఆలోచించిన కొద్దీ సుబ్బులు మీద కోపం, అసహ్యం పెనవేసుకున్నాయి. సుబ్బులు ఆ మాటలు చెపుతున్నప్పుడు నాలోని ఏ సంస్కారం ఆమెను పీకనులిమి చంపకుండా ఆపిందా అనుకున్నాను. స్వార్థం, మోసం మూర్తీభవించిన పిశాచ శక్తిలాగ కనిపించింది సుబ్బులు. సుబ్బులు అన్న మాటేమిటి? ఆ క్షణంలో సమస్త స్త్రీ ప్రపంచం మీద ఏహ్యాభావం, జుగుప్సా కలిగాయి. ఒకరి ప్రేమను వర్థిల్లజేయడానికి మరొకరిలో ప్రేమను రెచ్చగొట్టి సమూలంగా ధ్వంసం చేసే సాహసాన్ని ఏమనాలి? స్త్రీ స్వభావరీత్యా రీత్యా అవకాశవాది. మగవాడు పరిస్థితుల్ని బట్టి అవకాశవాది అవుతాడు. అందువల్లనే ఎప్పుడయినా మగాడు మారే అవకాశం ఉన్నది. కాని స్త్రీలో పరివర్తనని ఊహించడం వ్యర్థం అన్నాడో రచయిత. గుర్తుకొచ్చింది. కన్నీళ్ళు రావడమే తరువాయి. *నాది కాని జీవితంలాగ గతాన్ని పునశ్చరణ చేసుకుంటూ ఒంటరిగా ఎన్నో యుగాలు గడిపాను.*

వెనక్కి తిరిగి చూస్తే సుబ్బులు ప్రతీ చర్యకి కొత్త అర్థం, వింత కథా కనిపించింది. ఆమె చిరునవ్వు చిరునవ్వులాగ కనిపించలేదు. సమస్త పురుష ప్రపంచం మీదా ఆమె తీర్చుకునే పగలాగ కనిపించింది. ఆమె కళ్ళలో నేనంతవరకూ ఊహించుకున్న ఆహ్వానం ఇరుకయిన నూతిలోని మృత్యుదేవత పిలుపులాగ వినిపించింది. మరి దేవుపల్లి ఎందుకొచ్చింది?

ఎదురుగా ఎవరయినా ఉన్నప్పుడు సరే లేనప్పుడు నాతో చనువుగా ఎందుకు గడిపినట్టు? అర్థం లేకుండా చిక్కుపడ్డ దారాలన్నీ విడిపోయి విచిత్రమయిన సాలెగూడుల్లాగ అల్లుకుంటున్నాయి. ఆలోచనలకి రూపం కనిపిస్తోంది. వాళ్ళ ముందు నాకు కలిగించిన విశ్వాసం సడలిపోకుండా ఉండడానికయి ఆమె నడిపే ప్రమాదం ప్రయాణం అది. భగవాన్! ఏం తెలివితేటలు ఇవి!

వెనక్కి తిరిగి ప్రతి సంఘటనకీ అర్థం వెదికాను. ఆ ఉదయం ఆవకాయ జాడీలకని అటక ఎక్కి, నన్ను మేడమీదకి ఆహ్వానించడం పెళ్ళికొడుకుని కనిపెట్టి అతని మనస్సు మీద గాయం చేయడానికని ఇప్పుడర్థమయింది. ఆ రోజు నా ముందు కూర్చుని "చాలామందికి నచ్చనివి కొన్ని ప్రేమించుకున్నవాళ్ళకి నచ్చుతాయి ఎందుకని?" అన్న ప్రశ్న దుర్గ విషయంలోనే అడుగుతోందనుకోవడం ఎంత పొరపాటు! అందరికీ నచ్చని కురియప్పన్ తనకి నచ్చడం ప్రేమకాక మరేమిటి? అన్న జిజ్ఞాస కాదా అది? అది తన గురించే వేసుకున్న ప్రశ్నని గుర్తు రాసాగింది.

*అపూర్వ మేధాసంపత్తి గల పురుషుడినయినా అతి సులువుగా వీగిపోయేటట్టు చేసే అపూర్వ భావనా సంపత్తిని ఏ సాధారణ స్త్రీలోనయినా సిద్ధం చేశాడు దేవుడు.* మరి అంతటి అగ్నిహోత్రం ముందు నేను గడ్డిపోచనయాను. ఇప్పటి సుబ్బులు నవ్వు నన్ను పరిహసిస్తున్న వెక్కిరింతలాగ, *కళ్ళలో ఆకర్షణ, కాటు వేశాక కప్ప ప్రాణం పోయిందో లేదోనని అటూ ఇటూ తిప్పి చూసుకునే పాము కంటిలో ఆసక్తిలాగ కనిపించింది.*

ఆమె చిరునవ్వులాంటి ఆయుధమే ఆమె కన్నీరు కూడానేమోనని ఒక్కోసారి అనిపించేది. మరేదో ప్రయోజనాన్ని సాధించడానికి అంత అందమయిన కథ అల్లుకుందామనుకున్నాను. కాని కాదు. ఆమె స్వభావానికి ఈ కథ అతికినట్టు మరేదీ అతకదు. సుబ్బులు లాగ గుండె పగిలే దుఃఖాన్ని ఎవరూ ప్రదర్శించలేరు. ఆమె తన రహస్యాన్ని చెపుతున్నప్పుడు నేను ఆశాభంగంలో తొందరపడకపోవడానికి కారణం ఆమె చిరునవ్వుతో కట్టిపడేసే శక్తిలాగే, ఆమె కన్నీళ్ళల్లో కరిగించే శక్తికూడా ఉంది. వాటిని చూస్తూ ఆమె చెప్పే ఏ విషయాన్నయినా నమ్ముతావు ఏం చెప్పినా వింటావు. ఎందుకంటే ఆ క్షణంలో మాత్రమే ఆవిడ మోసం చేసిన స్త్రీ. కాని అంతవరకూ ఆరాధ్యదేవత. ఆరాధ్యదేవతలో నువ్వూహించుకుంటున్న నిజాయితీని ఆమె విషాదగాథకూ బదిలీ చేస్తుంది నీ మనస్సు. అదీ నిజంగా, నిప్పులాగ కనిపిస్తుంది. ఈ కన్నీళ్ళూ ఆమె ప్రేమలాగే బలంగా బరువుగా కనిపిస్తాయి. చలించడం తప్ప, ఎదురుతిరగడం మరచిపోతావు నువ్వు.

తగలడిపోయిన ఇంటిలో ఇంకా కాలుతూ కూలుతున్న గోడల్లాగ కనిపించాయి - ఆ డాబా, పెరట్లో మల్లెపందిరీ, వసారా, ఆమెతో మాట్లాడుతూ కూర్చున్న స్థలాలు అన్నీను. వీలయినంత వరకూ వీధిలో గడపడం అలవాటు చేసుకున్నాను. *నిరాశా, నిర్వేదం ఆక్రమించుకున్న మనిషికి త్వరగా వేదాంతం అబ్బుతుందనుకుంటాను. విరిగిపోయిన మనస్సులో మెరిసే ఔదార్యం పెరిగే మనస్సులో కనిపించదు. ఆకాశాన్ని చూస్తూ నడిచేవాడు భూమిమీద నడవలేకపడిపోయేవాడిని చూసి జాలిపడలేడు.* ఆలోచించిన కొద్దీ, కాలం గడుస్తున్న కొద్దీ నా మనస్సులో ఏదో పెద్ద మార్పు రాసాగింది. ఒకసారి వెలుగులోంచి వచ్చాక కళ్ళు చీకటిని చూడడానికి అలవాటు పడ్డట్టు సంతోషం పక్కనే హఠాత్తుగా పరుచుకున్న నిరాశకి నా దృష్టి సర్దుకుంటూంది. చీకటితో రాజీ పడవలసిన పరిస్థితి కంటే పడగలిగిన నా శక్తి, ఔదార్యాల మీద విశ్వాసం పెరిగింది. *ఔదార్యం అంటే మరేమీ లేదు. నీ దృష్టితో కాక ఎదుటివారి దృష్టితో ఒక విషయాన్ని పరిశీలించి, నువ్వు చెయ్యలేని పనిని వాడు చెయ్యడాన్ని అర్థం చేసుకుని నోరు మూసుకోవడం.* అప్పుడే మొదటిసారిగా సుబ్బులు సమస్యని సుబ్బులు దృష్టితోనే చూడటం ప్రారంభించాను. ఆ ‘చూపు‘ సుబుల్ని చాలా కొత్తగా, గొప్పగా, ఉదాత్తంగా తయారుచేసి నా ముందుంచింది.

ప్రేమించిన వ్యక్తికోసం, తను నమ్ముకున్న మనిషి కోసం అందర్నీ ఎదిరించి నిలబడింది. ఆ పోరాటంలో క్షణమాత్రం అలసట తీర్చుకొందుకు ఒక అండ కావలసి వచ్చింది. అది నేనయాను. సేద తీర్చుకుని ముందుకు సాగిపోనుంది. *మహాసముద్రంలో కొట్టుకుపోతున్నాడు ఒకడు. అచ్చమైన శాకాహారి అతను. చేపవాసన కొట్టే కొయ్యదుంగ తేలుతూ కనిపించింది. ఆ వాసన అసహ్యమని ఊరుకుంటాడా లేక ఆ క్షణానికి దాన్ని ఆధారం చేసుకుని ప్రాణాన్ని నిలుపుకుంటాడా? దాన్ని ముట్టుకుంటే జీవితం మైలపడ్డట్టేనా?*

ఈ సందర్భంలో నేను సుబ్బులికి అండగా దొరికాను. పీడిత వాతావరణం నుంచి బయటపడడానికి నేను కాకపోతే సత్తిరాజులే ఆ పాత్రను నిర్వహించేవాడేమో. తర్వాత నిజాన్ని నా అంత ధైర్యంగానూ తట్టుకోలేకపోవచ్చు. అందుకు సుబ్బులు బాధ్యత వహించదు. అసలు ఆ పాత్ర నిర్వహించేది సత్తిరాజులే అయితే, ఇంతవరకూ కథ నడవనిచ్చేది కాదేమో, సుబ్బులుకి ఏ నేలమీద బండి సరిగ్గా నడుస్తుందో తెలుసు. ఎక్కడ ఆగితే శ్రేయస్కరమో తెలుసు. ఒక్క చదువు మాత్రమే ఇవ్వని చాలా విచక్షణలు ఆమెకు పుట్టుకతో జన్మహక్కుతో సంక్రమించాయి.

ప్రేమికుడి కోసం ఒంటరిగా పరిస్థితులకు ఎదురునిలిచిన సాహసమూర్తిగా సుబ్బుల్ని ఊహించుకుంటున్న కొద్దీ నా కోసం పటాపంచలయిపోయింది. నిరాశతో ప్రిదిలిపోయిన నా మనస్సు క్రమంగా దయతో ఔదార్యంతో కూడుకుంది. ఇప్పుడా చిరునవ్వులో పరిహాసం కంటే కృతజ్ఞత, కళ్ళల్లో తృష్ణకంటే తృప్తీ, తను చేపట్టిన నాటకం సుఖాంతమయిందన్న తృప్తే కనిపిస్తున్నదని ఊహించుకున్నాక మనస్సు తేలికపడింది.

ఏమైనా సుబ్బుల్ని ప్రియురాలిగా ఇన్నాళ్ళూ ఊహించుకుంటూ గడిపాక, ఇవాళ హఠాత్తుగా మరొకరి ప్రేమను కాంక్షించే స్నేహితురాలిగా ఊహించుకోలేకపోయాను. *కొన్ని ఆలోచనలు ఆలోచించడానికే బాగుంటాయి. ఆచరణలో గుచ్చుకుంటాయి.* అలాంటిదే సుబ్బులు ముందు నిలబడి "నిన్నర్థం చేసుకున్నాను సుబ్బులూ నీ ప్రేమ పవిత్రమయింది. నిన్ను నీ ప్రియుని చేతుల్లో ఆనందంగా ఉంచుతాను. మీ ఇద్దరూ సుఖంగా ఉండండి" అని దీవించడం కూడా.

ఇది సినిమాలో బాగుంటుందేమో కాని, జీవితంలో కాదు. ఆవేశాలు చల్లబడ్డాక, ఆలోచనలు సాధువులయాక నాకూ అలాగే కనిపించింది. సెలవులింకా కొద్దిరోజులే ఉన్నాయి. అయినా అక్కణ్ణించి వెంటనే పారిపోవాలనిపించింది. కొన్నాళ్ళు పోయి నాన్నగారి దగ్గర గడపవచ్చు. ఆ సరుగుడు తోటల్లో, అప్పలరాజుగారితో కబుర్లలో, ఆ పల్లెజనం మధ్య కొంత మనస్సుకి విశ్రాంతి కలగవచ్చు. కాని నాన్నగారికి నా కథ ఎలా ఎదురుతిరిగిందో చెప్పడం ఇష్టం లేదు. సుబ్బులుతో మాట్లాడిన వెంటనే నాన్నగారికి వైరిచ్చాను. బయలుదేరి రావద్దని. దానికి కారణం ఆయన వెదుకుతూనే ఉంటారు. నేను కనిపిస్తే తప్పకుండా ఆ ప్రసక్తి వస్తుంది. ఇక్కడ తగిలిన గాయం మళ్ళీ

అక్కడ రేగుతుంది. ఇష్టంలేక సరాసరి మద్రాసుకే బయలుదేరదలిచాను. వెళ్తానని తెలిసి అమ్మ ఆశ్చర్యపడింది. "అదేమిట్రా సెలవులయిపోయినా కదలనివాడివి, ఈసారి కాకుండానే పోతానంటున్నావే" అంది.

"ఈసారి నాకిక్కడ తోచడం లేదమ్మా. అక్కడ కొంత పని ఉంది" అని బొంకాను.

ఈ విషయం తెలిసినట్టుంది. సాయంత్రం ముఖం కడుక్కుంటున్నప్పుడు మల్లెతీగకి నీళ్ళు పోస్తూ పలకరించింది సుబ్బులు -

"నా మీద మీకింకా ప్రేమ ఉందా?" అని

"ఉంటే తప్పా?" అన్నాను.

నా వేపు విస్మయంతో 'నన్నర్థం చేసుకో' మన్నట్టు చూసింది.

*ఏ దృష్టితో ఏ వైద్యం చేయాలో సుబ్బులికి బాగా తెలుసు.* నా రోగం కుదిరిపోయింది.

"ఉంటే క్షమాపణలు చెప్పుకుంటాను. మీ కాళ్ళుపట్టుకుని" అంది.

కదిలిపోయాను. "అబ్బే! అదేంకాదు. నిన్ను చూశాక ఇంత హృదయపూర్వకంగా ఏ అమ్మాయి అయినా నన్ను ప్రేమిస్తే ఎంత బావుణ్ణు అనిపిస్తోంది" అన్నాను.

నవ్వింది.

"ఏమయినా మీ అదృష్టాన్ని కోరతాను గాని ఆ అమ్మాయికి నా అంత దురదృష్టాన్ని కోరను" అంది.

మళ్ళీ అంతలో నా వేపు తిరిగి "వెళ్ళిపోకండి. నేనెలాగూ పోయేదాన్నే. మీరుంటే నన్నర్థం చేసుకున్నవాళ్ళూ, అండగా నిలిచేవాళ్ళూ ఇక్కడ ఉన్నారని ధైర్యంగా ఉంటుంది. "

తలెత్తాను. "ఇక్కడ ఉంటే ఇంకా నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. అది నీకిష్టమా?" అన్నాను.

తెల్లబోయి చూసింది.

నవ్వాను. "నీ కథ విని నీమీద ప్రేమ మాపుకున్నాను అనుకోకు. ఆ ప్రేమకు ప్రతిఫలం కావాలన్న కోరికను ఆపుకున్నాను. ఆ విచక్షణ సంస్కారానిది కనక. ***మనస్సు మీద సంస్కారం సాధించిన విజయం బలమైంది కాదు. సామంతరాజు చక్రవర్తిని క్షణకాలం జయించగలిగినట్టు.*** మళ్ళీ కోరిక తిరగబడిందా, నేనూ సత్తిరాజుల్నవుతాను నీ దృష్టిలో. అందుకని నేను వెళ్ళిపోవడం నీకే మంచిదది."

నా మాటల్లో చాలా సుబ్బులికి అర్థం కాలేదని తెలుసును. కాని ఇలాంటి విషయాలు ఎవరితోనో చెప్పుకోవడంలో కొంత ఉపశమనం కలుగుతుంది. ఈ సందర్భంలో ఆ పాత్రలు మా ఇద్దరిలో ఎవరో ఒకరు వహించాల్సిందే.

"ఏమో! మీరంటే నాకెలాంటి దురభిప్రాయంలేదు. మీరుంటేనే నేను సంతోషిస్తాను" అంది.

ఇదీ ఆమె నాటకంలో చివరి అంకమా అని చూశాను కాని, ఆమె కళ్ళను చూశాక ఆ అభిప్రాయం పోయింది. ఆమెను చూస్తూ నవ్వుకున్నాను. ***ఇప్పటి ఆమె ఓదార్పు వెయ్యి రూపాయలు దొంగిలించాక, డబ్బు పోగొట్టుకున్నవాడిమీద దొంగ చూపించే సానుభూతిలాగ కనిపించింది.***

"ఏమిటాలోచిస్తున్నారు?" అనడిగింది.

"నీ గురించే, నిన్నింతగా ఆకర్షించిన ఆ కురియప్పన్‌ని చూడాలని ఉంది. నిన్ను సంపాదించుకొనడానికి పురాణాల్లోలాగ మా ఇద్దరికీ చిన్న యుద్ధం పెడితే బావుణ్ణు" అన్నాను నవ్వడానికి ప్రయత్నిస్తూ.

దానికీ నవ్వుతుంది సుబ్బులు. ఆ నవ్వులో జాలే గాని, ప్రేమ లేదు. ఎంత గట్టి మనస్సు తనది! ఆమె ఏకాగ్రతను చూశాక ఆమె మీద నాకు గౌరవం పెరిగిందే గాని తగ్గలేదు.

✡ ✡ ✡

పాత అనుభవం మిగిల్చిపోయిన కొత్త అలవాటు ఏమిటంటే రాత్రివేళల్లో డాబా మీద పడుకోవడం. రేపు బయలుదేరుతాననగా ఆ రాత్రి కూడా డాబా ఎక్కాను. *తెగతెంపులు చేసుకోవాలనుకుంటున్న వాతావరణానికి మనస్సు అంత త్వరగా విడాకులు ఇవ్వడం లేదు. మళ్ళీ ఆ నిశ్శబ్ద వాతావరణంలో మొరాయించి ఆలోచనలబారికి గురయింది. ఎంతోసేపు నిద్రపట్టలేదు. అయితే ఇది నిరీక్షణా భారంతో క్రుంగదీసే రాత్రికాదు. నిర్వేదంతో కృంగదీసే రాత్రి. రేపు రైల్లో ఉంటాను. ఆలోచిస్తూ అర్ధరాత్రివరకూ అలా మేలుకునే ఉన్నాను.*

ఏ రాత్రికో ఎవరో పిలిచినట్టయితే మళ్ళీ తెలివొచ్చింది. కళ్ళిప్పాను. ఎదురుగా సుబ్బులు కనిపించింది. నిర్ఘాంతపోయాను.

"సుబ్బులూ!" అన్నాను ఆశ్చర్యంగా.

"అబ్బ! ఏం నిద్దర బాబూ! ఎంత పిలిచినా లేవరు. మీమీద పోయడానికి నీళ్ళచెంబు తీసుకురావలసింది" అంత అర్ధరాత్రిలోనూ చిరునవ్వులో స్వచ్ఛత చెడలేదు.

*రావాలని ఎదురుచూసిన రోజున కనిపించలేదు. రాదని నిశ్చయంగా నిద్రపోతున్న రోజున వచ్చి పలకరించింది.*

"ఇదేమిటి? ఇంత అర్ధరత్రి వచ్చావ్?"

*ప్రశ్న ఎలా వేసినా ఆడవాళ్ళ అవసరాన్ని బట్టి దానిలో ధ్వనికో, లేదా సూటి అర్థానికో సమాధానం చెప్పగలరు. మనని ఎటువేపు మళ్ళించాలనుకుంటారో ఆ ఉద్దేశ్యాన్ని బట్టి కూడా ఉంటుందనుకుంటాను ఆ ప్రయత్నం.*

నా ప్రశ్న చాలా సూటిది. "మీతో పని ఉంది" అని సమాధానం చెపితే చాలు. కాని అలా అనలేదు. "వస్తే ఏం? మీ దగ్గర నాకు భయమేమిటి?" అనే నా మాటలో నా మంచితనాన్ని గుర్తుచేసి తన చుట్టూ కోటకట్టుకుంది సుబ్బులు.

"ఈ నాలుగయిదు రోజుల నుండీ మీ జబ్బు నాకంటుకుంది" అంది నవ్వుతూ

ఏమిటన్నాను.

"నేనూ ఆలోచిస్తున్నాను."

వెంటనే ఓ ప్రశ్న వేశాను. "నేనూ ఆలోచిస్తున్నట్లు నీకేం తెలుసు?"

బిత్తరపోయినట్టుంది. ఒక క్షణం ఆగి "నేనింత చేశాక నన్ను తిట్టడానికయినా ఆలోచనలో పడరూ?"

"నిన్ను తిట్టడానికి అంత యత్నం చెయ్యాలా?" నవ్వాను. "నీకు నచ్చిన పనిని, నువ్వు మంచిదనుకున్న పనిని నువ్వు చేశావు. అలా చెయ్యడానికి ఎవరికయినా అధికారం ఉంది. కాని ఆ పనిలో నాకూ పాత్రని కల్పించావు. అందుకనే నాకూ ఆలోచించే అవసరం పడింది. అయినా నీమీద నాకు కోపం లేదు. ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు దాన్ని జయించగలిగాను."

"నా పనిలో పాత్రని ఇచ్చానంటున్నారు. మరి చివరంటా దాన్ని నడుపుకురారా?" అంది ఎంతో ఆలోచించి. *చీకటి మధ్య ఇలా నిలిచిపోయే నిశ్శబ్దం చాలా పెద్దది.* ఆచితూచి మెల్లగా మాట్లాడుతోంది.

"అంటే?" అన్నాను.

"నేను మా నాన్న దగ్గరికి వెళ్ళిపోవాలనుకుంటున్నాను."

"ఎందుకని?"

"తాతయ్య నన్ను పంపించే ధోరణిలో లేడు. నాన్నా, ఆయనా ఏం కూడబలుక్కున్నారో మొన్నటి సంబంధం పాడయాక మళ్ళీ పట్టుదలగా ఉన్నాడు తాతయ్య. ఏవో సంబంధాలు వెదుకుతున్నట్టున్నారు. ప్రతిసారీ వీళ్ళందరినీ ఎలా జయించుకురాను? అందుకు ప్రతిసారీ మీలాంటివాళ్ళని మోసం చేసి శత్రువుల్ని చేసుకోలేను" అని నవ్వింది.

"అది మనసులో హత్తుకుంటే మంచి పాఠమే" అన్నాను కసిగా.

"అదిగో చూశారా? నా మీద మీకు కోపం పోలేదు."

విసురుగా, ఉదాసీనంగా ఆమెవేపు తిరిగాను. "కోపం పోవడమంటే నీ ఉద్దేశం? కళ్ళనీళ్ళు కారుస్తూ నీ రెండు చేతులూ పట్టుకుని నిన్నర్థం చేసుకున్నాను. నన్ను క్షమించు. నేనే దుర్మార్గుణ్ణి అనాలా? మంచితనమంటే అదే అయితే నేనుమంచివాడిని కాను. నేను తిన్న ఎదురుదెబ్బకి బాధపడే హక్కు నాకుంది. దానికి సమాధానంగా మరో దెబ్బ తియ్యకపోతేవడమే నా మంచితనం. మళ్ళీ చెపుతున్నాను నువ్వంటే నాకు కోపం లేదు. పైగా నీ అభిప్రాయాలన్నా, నీ పట్టుదలన్నా నాకు గౌరవం ఉంది". అన్నాను.

నిర్ఘాంతపోయి విన్నది సుబ్బులు నా మాటల్ని.

"నాకు మీరో సహాయం చెయ్యాలి" అంది చివరికి.

*"నిన్ను పెళ్ళిచేసుకోవడం తప్ప, ఏ సహాయమన్నా చేస్తాను" కావాలని ఆమె అహంకారం మీద దెబ్బ తీశాను. వెన్నుమీద చురకత్తితో చీరినట్లు తుళ్ళిపడింది. నాకు చేతనయిన ప్రతీకారమిది.*

"ఫర్వాలేదులే చెప్పు. నువ్వన్నట్లు నేను మంచివాడనే" అన్నాను. "నువ్వు మీ ఊరు వెళ్ళాలనుకుంటున్నావు. నేను చేసే సహాయం ఏముంటుంది?"

"నాన్నగారి దగ్గరికి వెళ్ళిపోతే ఆయన్ని ఎలాగో ఒప్పించి నా మాట నెగ్గించుకోగలననే ధైర్యం ఉంది. తాత్కాలికంగా కోపం వచ్చినా, నా మీద ఆయనకి అభిమానమే, ఏడ్చి మొత్తుకుని తలబ్రద్దలు కొట్టుకునయినా సాధిస్తాను."

"మరి మొదటే ఆ పని ఎందుకు చెయ్యలేదు?"

*"బెల్లం కావాలనుకున్న పసివాడు కావాలని మొదట అడుగుతాడు. ఇవ్వకపోతే ఏడుస్తాడు. మారాం చేస్తాడు. నేలన పడతాడు. అప్పటికీ సాధ్యం కాకపోతే అమాయకుడయితే అలసి నిద్రపోతాడు. తెలివైన వాడయితే ఎవరూ చూడకుండా ఎత్తుకు పారిపోతాడు!"*

నేనాశ్చర్యంతో ఆమె మాటలు విన్నాను. సుబ్బులు చదువురాని మూర్ఖురాలన్న అభిప్రాయం నా మనస్సులో ఏ మూలనన్నా మిగిలిపోతే ఈ మాటలతో పటాపంచలయిపోయింది. తన ఆలోచనని ఇంత సూటిగా అందంగా చెప్పగలగడం సాధ్యమని నాకు తోచలేదు.

"మరి నా సహాయమేమిటి? బెల్లాన్ని ఎత్తుకుని తీసుకొచ్చి ఇవ్వమంటావా?"

నా ముఖాన్ని చూసి ఫకాలున నవ్వింది. "గడుసువారే!" అంది.

"నీకంటేనా?" అందామనుకున్నాను.

"నా గడుసుదనం నాకయినా ఉపయోగించలేదు కదా?" అన్నాను.

"మీరు నన్ను మా ఊరికి పంపించాలి."

"నేనా! నేనెందుకు?"

"అబ్బ! గోల! మీకెందుకు అర్థం కాదు. మా ఊరు వెళ్ళాలంటే డబ్బు కావాలి. మీకయితే ఇచ్చేవాళ్ళున్నారు. మరి నే వెళ్ళాలంటే ఇవ్వరు సరికదా, కట్టిపడేస్తారు. అందుకని..."

ఆమెనే చూస్తున్నాను.

"మీరు డబ్బు సర్దిపెట్టండి. మీ దగ్గర దాచడానికింకేమీ లేదు. ఇలా అడిగినా నన్నర్థం చేసుకోగలరని అడుగుతున్నాను. డబ్బును ఎప్పుడూ తీర్చుకోలేనేమో! ఎలా తీర్చుకోవాలో తెలీదు. పోనీ నా వల్ల మీరు నష్టపోయిన చాలా వాటిల్లో ఇదొకటనుకుని ఇవ్వండి. ఓ యాభై ఇవ్వగలిగితే చాలు."

నేను ఇవ్వనంటాననుకునే, దానికీ సమాధానాలు చెప్పడం ప్రారంభించింది. ఇంక ఎలా ఇవ్వననడం?

"సరేలే, చూద్దాం" అన్నాను.

"అంటే, ఇస్తారా?"

"అమ్మని అడగాలి. కారణం చెప్పననుకో. రేపే బయలుదేరుతున్నాను. ఏ మాత్రం వీలయినా ఇస్తాను."

మనస్ఫూర్తిగా చిరునవు నవ్వింది సుబ్బులు చిరునవ్వు విలువ తెలిసి.

"అవును, ఇస్తారని నాకు తెలుసు" అని లేచి నిలబడింది.

అప్పటికి చాలా రాత్రి అయివుండవచ్చు. ***చీకట్లో రూపం దిద్దుకుని పిచ్చికోరికలాగ*** నిలబడ్డ సుబ్బుల్ని చూశాను. హఠాత్తుగా ఓ ప్రశ్న ముందుకు వచ్చింది.

"సుబ్బులూ! ఇలా మనిద్దరినీ ఎవరయినా చూస్తారనే భయంలేదా?"

కొన్ని రోజుల క్రితం ఎటువంటి భయమూ లేకుండా ఆమె కోసం ఎదురుచూసిన నేను, భయం లేకుండా ఎదురునిలిచిన ఆమెని ఇవాళ "భయం లేదా?" అని అడుగుతున్నాను.

పిట్టగోడ మీద చెయ్యేసి నడుస్తూ "ఈ క్షణం అదే ఆలోచిస్తూ ఎవరన్నా మనల్ని చూస్తే ఎంత బాగుణ్ణు అనుకుంటున్నాను. ఇంతకన్నా నాకు కావలసిన అపకీర్తి ఉంటుందంటారా?" నేను ఆశ్చర్యంగా చూస్తే నావేపు తిరిగి ***"నేను ఈ ప్రపంచంలో ఇద్దరికే పవిత్రంగా కనిపించాలి. దేవుడికి కూడా కాదు. కురియప్పన్‌కి, నా మనస్సుకి"*** చేతులు ఆడించుకుంటూ తేలికగా మెట్లు దిగింది. చివరి మెట్టుమీద నిలబడి, నేను చూస్తున్నానో లేదోనని మళ్ళీ వెనక్కి తిరిగి చూసి నవ్వింది.

***నలుగురూ ముట్టుకోవడానికి భయపడే నిప్పును సుబ్బులు ఒడిని కట్టుకుంది. నలుగురూ తేలికగా వాసన చేసే పువ్వుని పామని భయపడి దూరంగా తోసింది.***

ఆ తర్వాత మళ్ళీ ప్రయత్నించినా నిద్దర పట్టలేదు.

✡ ✡ ✡

## 23

నేను బయలుదేరే రోజున నేనన్నాళ్ళూ కిందమీదులాడినా జవాబు తెగని మరొక ప్రశ్నకి సమాధానం దొరికిపోయింది. సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటూ మధ్య గదిలో కూర్చున్నప్పుడు పక్కవాటాలోంచి అమ్మ మాటలు వినిపించాయి. నేను ఊరికి వెళుతున్నట్టు ముసలావిడతో చెప్పినట్టుంది.

"అబ్బాయికేం, బుద్ధిమంతుడు. ఏ అమ్మాయి కట్టుకుంటుందో?" అంటోంది ముసలావిడ.

"అన్నీ కలిసి రాలేదు గాని మీ ఇంటి అల్లుడే కాకపోయేవాడా?" అంది అమ్మ.

"ఆ అదృష్టమే ఉంటే దానికా బుద్దులు పుట్టడమేం?"

"అవునులెండి. అది తెలిశాక నేనూ అడగలేకపోయాను. మనసొకచోట, మనువొక చోట అదేం సుఖం?" అంది అమ్మ.

ఆ మాటలు విన్నాక కొంతసేపు నాకు కరచరణాలు ఆడలేదు. ఈ పెళ్ళివిషయంలో నా గురించి ఇరుపక్షాలూ ఆలోచించి ఎందుకు వెనుదీశారో ఇప్పటికి అర్థమయింది. అయితే సుబ్బులు కథ అమ్మకి ఎప్పట్నుంచీ తెలుసు? దేవుపల్లి రాకముందు నుంచీనా? తరువాత అర్థమైందా? పెళ్ళి సంబంధాలు వెదకమన్నప్పుడు శోభనాద్రిగారి దృష్టి నా మీద ఉన్నట్టేనా? ఇవన్నీ క్రాస్‌వర్డ్ పజిల్లో అతి సమంజసంగా కనిపించే రెండర్థాలున్న ప్రశ్నలు. ఒక్కోసారి ఒక్కో సమాధానం తట్టేది. ఏమయినా నాన్నగారిని ఒప్పించినా ఇంత తెలిశాక

అమ్మ అడ్డుపడేది. లేక దేవుపల్లి శోభనాద్రిగారు వచ్చినప్పుడు నాన్నగారి ద్వారా అమ్మ అడిగిస్తే ఆయనే బయటపెట్టారో! మొత్తం మీద నా వరకూ రాకుండానే నా సంబంధం ప్రసక్తి వాళ్ళ మనస్సుల్లోంచి జారిపోయింది.

జాగ్రత్తగా కట్టిన పేకమేడ గోపురాలన్నీ విప్పాక, చివరగా మిగిలిన గోపురమూ ఇప్పుడు విడిపోయింది. పోతున్నది చీకటిలోనికైనా ఇక సంకోచం లేకుండా పోవచ్చు. కాని పోయే ముందు సుబ్బులు నా మీద వేసిన చివరి బాధ్యత గుర్తుకొచ్చింది.

ఇంకా కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థికి ఓ యాభై రూపాయలు ఎక్కువ సొమ్మేం కాదు. పైగా కారణం చెప్పకుండా తీసుకోవాలి. నేనివ్వనంటే సుబ్బులు ఏమీ చెయ్యలేదు. కానీ ఇవ్వననలేకపోయాను. అది కూడా ఆమె పట్ల నాకుగల ఆకర్షణలో ఒక భాగమేనేమో! విడిపోవడంలోనూ ఆమె మనస్సులో నా పట్ల దురభిప్రాయం ఉండడం ఇష్టం లేకనేమో. నాన్నగారు నాకిచ్చే సొమ్ములో ఏభై ఇస్తే ఆ నెల చాలా ఖర్చులు తగ్గించుకోవాలి. ఆఖరికి తగ్గించుకోవడానికే నిర్ణయించుకున్నాను.

కాని ఆ రోజంతా ఆమెతో మాట్లాడడానికి గాని, ఇవ్వడానికి గాని వీలుపడలేదు. కనీసం ముఖం చూడడం కూడా సాధ్యపడలేదు. ఆమె కూడా చాలా పని సందడిలో ఉన్నట్లు తోచింది. అయితే నేను కనిపించక పోవడాన్ని తప్పించుకు పోవడం క్రింద అర్థం చేసుకుంటుందేమోనని కించపడ్డాను. డబ్బివ్వడం ఇష్టంలేక చేసిన ప్రయత్నమని ఆమె అనుకోకూడదు. అందుకని వీలయినంతవరకూ ఆమె దృష్టిలో పడడానికి ప్రయత్నించాను. సాయంకాలం అయిదయింది. మరో గంటలో ప్రయాణం. నన్ను కలవడానికి సుబ్బులు ప్రయత్నం చేస్తోందా? ఆమెకు వినిపించేలాగ అమ్మతో అన్నాను. ఆరుగంటలకి ప్రయాణమని. అది ఆమెకు వినిపించిందో లేదో, అమ్మ పెట్టిన ఫలహారం తిని పెరట్లోకి వెళ్ళాను చెయ్యికడుక్కోవడానికి, నా ఉనికిని సూచించడానికి చేతనయినన్ని శబ్దాలూ చేశాను. కాని సుబ్బులు రాలేదు. విసుగు ఎక్కువైంది. లోపలికి రాబోతుండగా మునగచెట్టుకీ గోడకీ మధ్య ఆరేసిన సుబ్బులు చీర కనిపించింది. చటుక్కున ఆలోచన తోచి తొందరగా చెట్టు దగ్గరికి వెళ్ళి ఏభై రూపాయలూ ఆ చీరకి ఒక మూలన ముడివేశాను. లోపలికి వచి పక్కవాళ్ళకి వినిపించేలాగ అన్నాను. "నూతి దగ్గరికి వెళ్ళాలంటే వీల్లేదు. చెట్టుకు చీరలు ముడివేసుకుంటారా ఎవరన్నా? ఇంకా నయం. చీరెలకి డబ్బులు కూడా ముడివేస్తే సరి ఎత్తుకుపోయేవాడికి అన్నీ అందుబాటులో ఉంటాయి."

అమ్మ నవ్వి, సుబ్బుల్ని కేకేసి చెట్టుకి కట్టిన చీర విప్పుకోమంది. అప్పటికి స్థిమితపడ్డాను.

బయలుదేరే సమయానికి కిటికీ దగ్గర కనిపించింది. నేను వెళుతున్నానని తెలిసింది గావును. గుమ్మం దిగే సమయానికి శారద ఎదురువచ్చింది.

"మద్రాసు వెళుతున్నాను. మళ్ళీ సెలవులకి వచ్చేసరికి మంచి ఉద్యోగంలో ఉండాలి" అన్నాను.

నవ్వింది. "మంచివాళ్ళిప్పించే ఉద్యోగం మంచిదే అవుతుంది" అంది. కళ్ళనిండా కృతజ్ఞత, దయ.

"చాలా నష్టపోయి వెళ్ళిపోతున్నానని బాధపడుతున్నాను. మీరు ఎదురొచ్చారు. నాకా నమ్మకం లేదు కాని, మిమ్మల్ని చూశాక మద్రాసులోనైనా చాలా మనశ్శాంతి లభిస్తుందన్న విశ్వాసం కలుగుతోంది" అన్నాను సుబ్బులికి వినిపించేటట్టుగా. గుమ్మం ఎక్కింది శారద. బయటికి వచ్చి నిలబడింది సుబ్బులు. అమ్మ లోపల్నుంచి హడావిడిగా వచ్చింది. జట్కాలో కూర్చున్నాను. చెయ్యెత్తి నమస్కరించింది శారద. సుబ్బులు ఓదార్పుగా చూసి చిరునవ్వు నవ్వింది. *ఇద్దరి కళ్ళల్లో రెండు రకాలైన కృతజ్ఞతలు వెల్లడయాయి. కాని వాటిని ప్రకటించడంలో ఎంత వైవిధ్యం? ఇంతకన్న ఇద్దరి వ్యక్తిత్వాలకూ, స్వభావాలకూ తేడా ఏం కావాలి?*

"నాన్నగారికి వెళ్ళగానే ఉత్తరం వ్రాయి" అని కేకలు వేస్తోంది అమ్మ.

సందు మలుపులో వెనక్కి తిరిగాను. శారద ఏదో చెపుతోంది సుబ్బులుతో. సుబ్బులు దృష్టిమాత్రం ఇటువేపే ఉండడం గమనించాను.

ఈలోగా జట్కా మలుపు తిరిగింది.

✡ ✡ ✡

రైలు రావడం గంట ఆలస్యమవుతుందంటే పేపరు కొనుక్కుని, చదివినంతసేపు చదివి ప్లాటుఫారం మీద పచార్లు చేస్తున్నాను. రైలు వేళకి ఒక వ్యక్తి వంతెన మీద నుంచి దాదాపు పరిగెత్తుకుంటూ రావడాన్ని గమనించాను. నేనాశ్చర్యపడే వ్యవధికూడా లేదు. సుబ్బులు ప్లాటుఫారం మీదకి వచ్చేసింది. చేతిలో చిన్న సంచి మాత్రమే ఉంది.

ఆమెని చూసి నిలువునా నీరైపోయాను. నోటమాట రాలేదు. నేనింకా ఆశ్చర్యం నుంచి తేరుకునే ముందే నన్ను కనిపెట్టి దగ్గరికి వచ్చి నిలబడింది నవ్వుతూ.

"అమ్మయ్య .. వచ్చేశాను! బండి తప్పిపోతుందేమోనని ఎంతో భయపడిపోయాను" అంది పట్టాలవేపు చూస్తూ.

"ఇదేమిటి? ఏమిటీ పని?" అన్నాను మాటలు కూడదీసుకుని.

ఐస్ క్రీం తింటున్న కుర్రాడిని 'ఏమిటి'దని అడిగితే చూసినంత పరిహాసంగా చూసి "ఏమిటి?" అంది.

"ఎందుకొచ్చావ్?"

"ఏమిటండీ ఆ ప్రశ్న? నిన్ననంతా విన్నారు. డబ్బు కూడా ఇచ్చారు. మళ్ళీ అడుగుతారేం?" అంది.

"మీ నాన్నగారి దగ్గరకి బయలుదేరావా?"

"మరి!"

"ఇంట్లో చెప్పే వచ్చావా?"

"లేదు. మీరూ వెళ్ళిపోయారు. ఇల్లంతా బోసిగా ఉంది. నన్నెవరో తీసుకెళ్ళి హఠాత్తుగా జైల్లో పడేసినట్టనిపించింది. పక్క గదిలో ఉన్నా ఓ మంచి స్నేహితుడున్నాడన్న ధైర్యం ఎంత గొప్పదో అప్పుడర్థమైంది. హఠాత్తుగా భయం వెయ్యడం ప్రారంభించింది. తాతయ్య ఎక్కడికో వెళ్ళాడు. మామ్మ మొన్నట్లాగే మీ అమ్మగారితో పురాణానికి వెళ్ళింది. నేను దొరికిన బట్టల్ని తీసుకుని, ఇంటికి తాళం వేసి శారద ఇంట్లో ఇచ్చేసి వచ్చేశాను."

"పోనీ, శారదకి తెలుసా నీ ప్రయాణం సంగతి?"

"ఊహూఁ అదీ ఇంట్లో లేదు. ఎవరికీ తెలీదు" వెనక్కి వెనక్కి నడిచి బల్లమీద కూచుంది నవ్వుతూ చూస్తూ. విచారం, సంశయం ఏమీ లేదు. సెలవులిచ్చాక ఇంటికి పరిగెత్తే బడి కుర్రాడు విశ్రాంతిని అనుభవిస్తున్నట్టుంది. ఆమెలో ఇన్నాళ్ళూ కనిపించే గడుసుదనం, నిండుదనం ఎక్కడికి పోయిందో? ఆ క్షణంలో చిన్నపిల్లలాగా కాళ్ళాడించుకుంటూ బల్లమీద కూర్చున్న ఆమెను విచిత్రంగా చూస్తూ ఆమె తెలివి తక్కువతనాన్ని ఎలా గుర్తుచెయ్యాలో అర్థంకాక తికమకపడ్డాను.

"నాకు మంచి ఐస్ క్రీం తినాలని ఉంది, తినిపించరూ?" అంది ఆలోచనల్ని చీల్చేస్తూ.

మరో మాటలేదు, లేచి 'పద' అన్నాను. ఇద్దరం ఐస్ క్రీం తీసుకుని మళ్ళీ బల్ల దగ్గరికి వచ్చి కూచున్నాం. మెల్లగా అన్నాను.

"సుబ్బులూ! నువ్వేం మంచి పనిచెయ్యలేదు"

"ఏం?"

"నువ్వు చేసిన పనిని అందరూ నీ దృష్టితోనే చూడరు"

అర్థంకాలేదు "అంటే?" అంది.

"నీకు మీ నాన్న దగ్గరికి వెళ్ళాలని ఉంది. నీ దగ్గర డబ్బు ఉంది. వెంటనే బయలుదేరావు. అంతేనా?"

"అవును"

"కానీ నేనూ ఇవాళే బయలుదేరాను. నీ దగ్గర డబ్బు ఉన్నట్టు ఎవరికీ తెలీదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నువ్వూ వచ్చేశావు.. ఇద్దరం ఒక బండిలో వెళ్ళినట్టు వాళ్ళందరికీ ఎలాగో తెలుస్తుంది. మనిద్దరి సాన్నిహిత్యాన్ని గురించి నిస్సంకోచంగా నువ్వు సిద్ధం చేసిన సాక్ష్యమే బోలెడంత ఉంటుంది. అప్పుడేమవుతుంది?"

ఒక్కక్షణం ఐస్క్రీం తినడం మానేసింది. ఆమె ముఖం హఠాత్తుగా నల్లబడింది. "నేనింత ఆలోచించలేదు సుమా?" అంది. ఆ మాటలో తత్తరపాటు, వణుకు కనిపించి అంతవరకూ ఉన్న సంశయం ఒకటి మనస్సులోంచి మాయమయింది. నా దగ్గర్నుంచి డబ్బు అడగడం, చెప్పకుండా ఇలా బయలుదేరి రావడం ఆమె ఆలోచనల్లో మరేదైనా ప్రయత్నానికి సోపానమేమో అనుకున్నాను. కాని ఈ మాట విన్నాక ఆమె మీద నమ్మకం కుదిరింది. ఇకనుంచీ ఆమెని పూర్తిగా నమ్మవచ్చు ననిపించింది.

"నువ్వు తొందరపడ్డావు సుబ్బులూ. చాలా సులువుగా జరిగే పనికి అనవసరంగా ఇద్దరమూ అపకీర్తిని మూటకట్టుకోవాలి. అమ్మ బాధపడుతుంది. మీ తాతయ్యా, మామ్మా బాధపడతారు. వాళ్ళని వ్యతిరేకించి ఇంటికి వెళ్ళడమే కాని, వాళ్ళని అవమానించడం కాదుగా నీ ఉద్దేశ్యం?" అన్నాను.

సుబ్బులు మెల్లగా ఐస్ క్రీం తింటూ వింటోంది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" అంది చివరికి.

ఆ ప్రశ్నకి ఎదురు చూస్తున్నట్లు సమాధానం చెప్పాను. "అదృష్టవశాత్తూ నువ్విలా బయలుదేరినట్టు ఎవరికీ తెలీదు. వెంటనే ఇంటికి వెళ్ళిపో. మరో నాలుగు రోజులు పోయాక బయలుదేరు. బయలుదేరే ముందు మీ నాన్నగారికి ఉత్తరం వ్రాయి. నువ్వు మీ నాన్నగారి దగ్గరికే వెళుతున్నట్టు మీ తాతయ్యకి ఓ ఉత్తరం వ్రాసి ఇంట్లో ఒదిలెయ్. వాళ్ళని ఆందోళన పరచడం వల్ల నువ్వు సాధించే ప్రయోజనమే లేదు.

"నువ్వు సాధించాలనుకున్నది తిరుగుబాటు! విప్లవం కాదు మీ తల్లిదండ్రుల్ని, వీలయితే అందరినీ ఒప్పించి నీకు కావల్సిన వ్యక్తిని చేపట్టడం. ఆ పని పట్ల దురభిప్రాయాల్ని సృష్టించే ఏ తొందరపాటూ పనికిరాదు. ఇది మాత్రం గుర్తుంచుకో."

అలాగేనన్నట్టు తలూపింది.

"మన ప్రయత్నాల్ని సాధించడానికి పదునయిన సాధనాలను ఉపయోగించేటప్పుడు చాలా నెమ్మదిగా ఉపక్రమించాలి. తొందరపడితే చెయ్యి తెగుతుంది" మళ్ళీ హెచ్చరించాను.

ఆశ్చర్యంగా నా ముఖం చూసింది. ఇంత తెలిసిన వ్యక్తినా ఇన్నాళ్ళూ మభ్యపెట్టానని ఆలోచిస్తోంది గావును.

"ఏమిటి చూస్తున్నావు?" అన్నాను.

"చివరగా నా అమాయకపు తొందరపాటు వల్ల సంపాదించుకునే అర్థంలేని అపకీర్తి నుంచి కూడా మీరే కాపాడారు" అంది నా వేపు చూస్తూ.

*"నీకు తెలియనిది నేనొక విషయం చెప్పగలగడం సాధ్యమనుకోలేదు నిజానికి"* అన్నాను సంతృప్తిపడుతూ.

రైలు మరో అరగంటలో వస్తుందని ప్రకటించారు.

"ఈ లోగా ఎవరూ ఇల్లు చేరేది లేదు. ఎలాగూ వచ్చానుగా. మీరు వెళ్ళేవరకూ ఉండిపోతాను" అంది.

అంతవరకూ వాతావరణంలో ఏర్పడిన భయాందోళనలు చెదిరిపోయాయి. ఇద్దరం మొదటిసారిగా ఏ ప్రతిఫలాపేక్ష లేని స్నేహితుల్లాగ కబుర్లు చెప్పుకున్నాం. ఆ ముప్ఫై నిముషాల సేపు. ***తర్వాత చాలా సంవత్సరాలు ఆ ముప్ఫై నిముషాల అనుభవం మనస్సులో మెదులుతూనే ఉంది.***

ఆమె తన గురించి చెప్పుకుంది. నేను నా చదువు, నేనూహించుకుంటున్న భవిష్యత్తు, బ్రతకదలచిన వాతావరణం గురించి చెప్పాను. మంచిచెడ్డలన్నీ మాట్లాడుకున్నాం. నిస్వార్థ సంభాషణలోని మాధుర్యమంతా ఆ క్షణాన మా సమక్షంలో ఆవిష్కృతమైంది. కల్మషాల్లేని మనసుల్ని ఇద్దరం విప్పి చెప్పుకుంటూ మరో గంట రైలు ఆలస్యంగా వస్తే బావుణ్ణనుకున్నాం. *ఒకరి నొకరు అర్థం చేసుకుని, ఫలితానికీ, పర్యవసానానికీ రాజీపడి కలియడంలో కాక విడిపోవడంలో సఖ్యత కలుపుకున్న అపూర్వ బాంధవ్యం మాది.*

రైలు రావడానికి గంటకొడితే -

"అయ్యో! సమయం గడిచిపోయిందే!" అంది సుబ్బులు.

రైలెక్కుతూ "సుబ్బులూ! నువ్వనుకున్నది సాధించి, ఆయన్ని చేసుకోగలవని నమ్మకం ఉందా?" అన్నాను.

ఎంతో నిబ్బరంతో, విశ్వాసంతో తలూపింది సుబ్బులు. "నాకు పెళ్ళంటూ జరిగితే ఆయనతోటే జరుగుతుంది అందుకు ధైర్యం మీవల్లనే వచ్చింది. నా మనస్సు గట్టిదని మీతో ఇంతకాలం సన్నిహితంగా ఉండి కూడా చలించకపోవడంలో అర్థమయింది" అంది.

నేను ఆశ్చర్యపోయాను. ఓ విధంగా ఆనందమూ అయింది. ఏ ఆడదీ ఇంతకన్న తన మనస్సును విప్పి చెప్పలేదు. భగవంతుడే ఆమె ఆత్మశక్తికి దోహదకారి కావాలి. ఆ మాటే ఆమెతో అన్నాను.

కళ్ళనీళ్ళు తెచ్చుకుని నా చెయ్యి పట్టుకుంది. మాలో ఇంతవరకూ నిలిచిన వాంఛా కల్మషాలు ఆ క్షణంలో కరిగిపోయి చెప్పలేని ఆత్మీయతలు పెనవేసుకోసాగినయి.

"నాకెంతో మేలు చేశారు. ఇక్కడ కాళ్ళకు నమస్కారం చేయలేను"

రైలు కూతవేసింది.

"నువ్వు ఆయన్ని చేపట్టి సుఖంగా ఉన్నావని నాకెలా తెలుస్తుంది?" అన్నాను *తల్లిని వదిలిపెట్టిపోతున్న కొడుకు అడిగినట్టు అమాయకంగా.*

నవ్వింది ధైర్యం చెపుతున్న మాతృమూర్తిలాగా.

"తెలియనక్కరలేదు. అన్యోన్యంగా, ఆప్యాయంగా కనిపించే ప్రతి దంపతుల్లోనూ నేను మీకు కనిపిస్తాను. అలాంటి ఓ స్త్రీకి తియ్యటి దాంపత్యం మీరు పెట్టిన భిక్ష అని గుర్తుకొస్తుంది. దాంపత్య జీవితానికి నోచుకోలేని స్త్రీ కనిపించినప్పుడు ఆమె జీవితంలో మీలాంటి మిత్రుని సంపాదించుకునే అదృష్టానికి నోచుకోలేదని గుర్తుకొస్తుంది" అంది.

అనుకోకుండా నాకూ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవును, సుబ్బులు జీవితం ఏమయిందో నే తెలుసుకోవలసిన పనిలేదు. తెలుసుకోను. నేను చేసినపని అది సుకృత్యమే అయితే దాని ప్రయోజనాన్ని తెలుసుకోవడంలో అది చులకనవుతుంది. ఎక్కడున్నా సుబ్బులు సుఖంగానే ఉంటుంది. పదికాలాలపాటు పచ్చగా ఉంటుంది.

రైలు కదిలింది.

*విడిపోవడంలో ఏకీభావానికి వచ్చిన ఇద్దరి హృదయాలూ విడిపోతూ మళ్ళీ మమతా మాధుర్యాలలో బందీలయి స్పందించాయి.*

కళ్ళు ఇద్దరికీ వర్షిస్తున్నాయి.

సుబ్బులు ఇంకా కనిపించే దూరంలో ఉండగానే కన్నీటి తెర వెనక మాయమయిపోయింది.

*కాని ఇప్పుడు కనిపిస్తున్నట్టు ఆమె మరెప్పుడూ నాకు కనిపించలేదు.*

# 24

ఇంతవరకే కథ.

వయస్సు మళ్ళిందేమో చెప్పడం పూర్తయేసరికి అలసట వచ్చింది. అలసట కేవలం శరీరానిదే కాదేమో. పాతజ్ఞాపకాలతో కదిలిన మనస్సుది కూడా ననుకుంటాను.

సుబ్బులు కొడుకువేపు చూశాను. రాజారావు నా వేపు చూడడం లేదు. అప్పుడే కొత్తగా లేచిన కృష్ణవంతెన వేపూ, నదివేపూ, దూరాన కొండమీద వెలిగే దుర్గ గుడివేపూ చూస్తున్నాడు. అతన్ని చూశాను. కళ్ళల్లో సుబ్బులు పోలికలు మరీ కొట్టవచ్చినట్టు కనిపించాయి. ఎదురుగా కనిపించే వస్తువుని కాని, చూపులో గతాన్నో, మరి దేన్నో గుర్తు చేసుకోవడం ఆవిడ అలవాటు. కాని రాజారావుకి పెద్ద గతం లేదు. అతనికి ఇరవైరెండేళ్ళకన్నా ఎక్కువ ఉండవు. లేకపోతే ఒకటి రెండేళ్ళు అటూ ఇటూ.

నాకు నలభై అయిదు పైమాటే. జుత్తు నెరిసింది. అంతకు మించి గొంతులో వేగం తగ్గి, మాటలో ఆలోచనా, ఆపుదలా అలవాటయాయి. 'లో బ్లడ్‌ప్రెషర్' మధ్య మధ్య ఆలోచనల్ని తెంపుతోంది. అందుకని మళ్ళా పాతకథంతా గుర్తుచేసుకు చెప్పడానికి ఒకరోజు పూర్తిగా పట్టింది. రాజారావులో చాలా వినయం ఉంది. ఎదుటి వ్యక్తి మాటలు వినడంతో సరిపెట్టుకోడు. వింటూనే అతని వ్యక్తిత్వాన్ని బేరీజు వేసే ఆసక్తి అతని కళ్ళల్లో కనిపిస్తుంది. నిజానిజాల్ని బేరీజు వేసే న్యాయాధికారిలాగా కనిపిస్తాడు. ఆ పోలికలూ తల్లి దగ్గర్నుంచి వచ్చినవేనేమో!

అంతా విన్నాక "ఇక లేద్దామా" అన్నాడు. ఇద్దరం లేచి సీతానగరం వేపు నుంచి వంతెన మీద మెల్లగా నడుస్తున్నాం. రాజారావులో ఠీవి ఉంది. చేతులు వెనక్కి కట్టుకుని అడుగువేస్తున్న అతనూ, అతని పక్కన వయస్సు మళ్ళిన నేనూ.. అతను నేరస్థుణ్ణి జైలుకి తీసుకువెళుతున్న పోలీసు అధికారిలాగ కనిపించాడు.

నేనూ నడుస్తున్నాను. వంతెన పూర్తయేలోగా నేను చెప్పదలుచుకున్నది పూర్తికావాలి.

నాకు తెలిసిన గతాన్ని మాత్రమే ఇంతవరకూ చెప్పాను. ఇక సుబ్బులు నిన్ననంతా కూర్చుని నాకు తెలియచెప్పిన గతాన్ని చెప్పాలి. రెండు కథలకీ అన్వయం కుదర్చాలి. అది అతని మనస్సులో హత్తుకోగలగాలి. నేను చేసే ఈ ప్రయత్నం మీద రాజారావు జీవితం, అతని నిర్ణయం మీద సుబ్బులు జీవితం ఆధారపడి ఉన్నాయని తెలుసు. ఇలా రెండు జీవితాల సమస్యల్ని మళ్ళీ దాదాపు పాతికేళ్ళ తర్వాత సుబ్బులు నా చేతుల్లో పెడుతుందని ఊహించలేదు. తన జీవితానికి మార్గం చూపానన్న నమ్మకంతో అవ్యవస్థలో పడబోతున్న కొడుకు జీవితానికీ మార్గం చూపమంటుంది. అసలు సుబ్బులు ఉత్తరం రాయకపోతే వచ్చేవాడినా?

✡ ✡ ✡

ఇరవై అయిదేళ్ళ తర్వాత కొక్కిరి బిక్కిరి అక్షరాలతో వచ్చిన ఉత్తరాన్ని ఆశ్చర్యపోతూ చదువుకున్నాను. ఉత్తరం చివర సుబ్బులు పేరు చూసి విస్మయంతో, ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాను. మెదడులో ఏమూలో నిద్రపోతున్న అనుభవాల జ్ఞాపకాలు ఝుమ్మని మూగాయి. సుబ్బుల్ని చూసి ఎన్నో ఏళ్ళయింది. అప్పటికి సుబ్బుల్ని గురించి వినడమే గాని, చెప్పే నాథుడెవడూ కనిపించలేదు. ***విశాలమైన సముద్రతీరాన నడుస్తూ చేతిలోంచి జారిపోయిన నత్తగుల్ల ఎక్కడ దొరుకుతుందని అడిగితే ఎవరు సమాధానం చెపుతారు? అది నాకు విలువైనది కావచ్చు. కాని నిలబడ్డది సువిశాల సముద్రతీరాన. దాని జ్ఞాపకం నీకెందుకు? అంటారు. కాని ఆ జ్ఞాపకమే, దానికి సంబంధించిన అనుభవమే నా జీవితంలో ఒక భాగంగా మిగిలిపోయిందంటే ఎవరూ నమ్మరు.***

కాని నాతో దుర్గ పెళ్ళి ఆ రోజుల్లోని సంఘటనలు నా మీద మిగిల్చిపోయిన ప్రభావాల ఫలితమే. అది చాలా విచిత్రంగా జరిగిపోయింది. తాసిల్దారుగారు మా నాన్నగారిని కలిసి తన అమ్మాయి వివాహానికి సంప్రదింపులు జరుపుతున్నారని తెలిసినప్పుడు

మొదట చిరాకుపడ్డాను. కొంత అనుమానంగా భావించాను. నిజానికి దుర్గ అంత అనర్హురాలా నా జీవిత భాగస్వామి కావడానికి? ఆ ప్రశ్న అప్పట్లో నిలవలేదు నా ముందు. నాన్నగారు నన్ను వెంటనే అభిప్రాయం అడగలేదు. ఎందుకు అడగలేదో అర్థమైంది. నేను రాసిన పెద్ద ఉత్తరం నా మనస్సునీ, అభిప్రాయాన్నీ పూర్తిగా ఆవిష్కృతం చేసేది కనక.

ఓసారి మద్రాసు వచ్చినప్పుడు హోటల్ నుంచి నాకు కబురు చేస్తే వెళ్ళాను.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ "సుబ్బులు పెళ్ళి మాట ఏం చేశావు?" అన్నారు.

తుళ్ళిపడ్డాను. "అదేం లేదు. మరిచిపోండి ఇప్పుడది జరిగే పనికాదు" అనేశాను.

అప్పుడాయన ఈ విషయం ఎత్తారు. "తాసిల్దారుగారు నా దగ్గరకు చాలాసార్లు కబురు పంపారు. ఓసారి ఆయనే వచ్చారు. కాని నువ్వప్పుడు ఉత్తరం రాయడం గుర్తుంది. అందుకని ఏమీ తేల్చిచెప్పలేదు. ఇవాళో రేపో ఆ వ్యవహారం తెగతెంపులు చేసుకుందామనుకుంటున్నాను. అయినా ముందు నీతో ఒక్కసారి మాట్లాడదామనుకున్నాను" అన్నారు.

నేను వెంటనే సమాధానం చెప్పలేదు. "కొంచెం టైమివ్వండి. ఆలోచించుకుని వస్తాను" అన్నాను.

సెంట్రల్‌లో రైలు కదలకముందు మళ్ళీ గుర్తుచేసి ఆ విషయం "ఏం నిర్ణయించుకున్నదీ రాస్తావు కదూ? వాళ్ళు ఆడపిల్లగలవారు. ఇదికాకపోతే మరొకటి వెదుక్కొంటారు" అంటూ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు "అన్నట్టు, నీకీ పెళ్ళి ఇష్టంలేదని ఎలా తెలిసిందో ఆ అమ్మాయికి తెలిసిందట. తెలిసి వారం రోజులు మంచం పట్టిందట. నాలుగు లంఖణాలు కూడా చేసిందట. మరి మీ భాషలో దీన్ని ప్రేమ అంటారో ఏమో" నాన్నగారు నవ్వారు. రైలు కదిలిపోయింది. ఆయనను ఆశ్చర్యంగా చూస్తూనే చెయ్యి ఊపాను.

హాస్టల్‌కి తిరిగివస్తూ దుర్గ గురించే ఆలోచించాను. తెల్లవారు ఝామున మధురాతి మధురంగా వినిపించిన కోకిల కంఠం, మా ఇంటిముందు ఆ ఉదయం సిగ్గుతో వాలిపోయిన కళ్ళూ, ఆశించిన కోరిక తీరక మంచం పట్టిన అమాయకపు ముఖం గుర్తుకొచ్చాయి. దుర్గ మీద జాలి కలిగింది. చాలారోజులు మళ్ళీ అటు ఆలోచనపోలేదు. కానీ మనస్సు అట్టడుగున ఆలోచనలు ఒక రూపం ధరిస్తున్నాయి గావును. ఎప్పుడైనా దుర్గ గుర్తుకొచ్చినప్పుడు ఒక రకమైన జాలీ, దయా, ఒక్కసారి కనిపించి, వీపు తట్టి ఓదార్చాలనే కోరికా కలిగేవి. అనూహ్యమైన చైతన్యమూర్తిగా సుబ్బులు గుర్తుకొస్తే ఆ పక్కన ప్రశాంతంగా, ఒక పిచ్చికోరికను మనసులో ఏర్పరుచుకుని దానికి రూపుదిద్దుకుని, దాన్నే నముకుని సూటిగా బ్రతికే దుర్గ గుర్తుకొచ్చేది. ఒక వ్యక్తిని కోరుకునే స్త్రీలో ఆత్మశక్తిని సుబ్బులులో చూశాక దుర్గ మనసు ఊహించడం కష్టం కాలేదు. ఇది అందమైన గ్లాసులో పోసిన వేడిపాలైతే అది వెండిగిన్నెలో నింపిన పాయసం. రెండు పదార్థాలకూ మూలం ఒకటే. రుచి బేధం. క్రమంగా మనస్సు దుర్గ మానసిక సౌందర్యాన్ని ఊహించుకోనారంభించింది. మరో పదిరోజుల తరువాత నాన్నగారు ఉత్తరం వ్రాస్తూ "నీ నిర్ణయం ఇంకా వ్రాయలేదేం?" అని తొందర చేసినప్పుడు పెళ్ళికి ఒప్పుకుంటున్నట్టు ఉత్తరం రాసేశాను. అంతే. పై వేసవిలో పెళ్ళయిపోయింది.

అప్పటికే సుబ్బులు కరియప్పన్‌తో కాపురం చేస్తోంది. ఇది ఎలా ఊహించానంటే పెళ్ళికి ఆమెకు ఆహ్వానం పంపాలని శోభనాద్రిగారిని కదిపినప్పుడు ఆయన నోరు మెదపలేదు. అసలు ఆ విషయం మాట్లాడడానికే అయిష్టత చూపారు. ఆమె పేరు విని ముఖం నల్లగా మాడ్చుకున్నారు. అప్పుడు మనస్సులో సంతోషపడ్డాను. సుబ్బులు అనుకున్న పనిని సాధించి ఉంటుందని. పెళ్ళిలో చాలాసార్లు సుబ్బులు జ్ఞాపకం వస్తూనే ఉంది.

నా చదువు పూర్తయి ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో స్థిరపడ్డాక విజయనగరం నుంచి మకాం ఎత్తేశాం. నాన్నగారు దాదాపు కాంట్రాక్టు పనుల్ని అప్పలాజుగారికి అప్పగించేవారు. ఎప్పుడైనా అడవికి వెళ్ళివచ్చేవారు. మేం విశాఖపట్నం తరలిపోకముందే శోభనాద్రిగారు తమ వాటా కూడా అద్దెకిచ్చేసి కొడుకు దగ్గరికి వెళ్ళిపోయారు. తండ్రీ కొడుకుల మధ్య అంతవరకూ ఉన్న స్పర్ధలు ఇద్దరికీ సుబ్బులు

పెళ్ళిద్వారా కలిగిన మనస్తాపంతో తీరిపోయి వారిద్దరూ మళ్ళీ ఏకమయారు. *కొందరిని సుఖసంతోషాలు ఏకం చేస్తే కొందరిని కష్టనష్టాలు కలుపుతాయి.* తర్వాత ఆ విషయమే దాదాపు మరిచిపోయాను.

ఒకసారి ఏదో పనిమీద మద్రాస్ వెళుతున్నాను. తెల్లవారుఝాముున తెలివొచ్చేసరికి రైలు ఆగి ఉంది. ఏదో రైలు ఎదురువస్తోందని సూళ్ళూరు పేటలో ఆపారు. యధాలాపంగా కంపార్ట్‌మెంటు దగ్గరికి వచ్చి నిలబడ్డాను. దూరంగా ప్లాట్‌ఫారం గేటు దగ్గర నిలబడ్డ వ్యక్తిని గుర్తుపట్టి దిమ్మెరపోయాను. సుబ్బులు ఏమంత మారలేదు. మరికాస్త పల్చబడింది. చేతిలో ఏడాది అబ్బాయి ఉన్నాడు. ఒక్క గెంతులో రైలు దిగి ఆమె దగ్గరికి వచ్చి నిలబడ్డాను. నన్ను చూసి మొదట ఆశ్చర్యపడింది. ఆనందంతో ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలవడం గమనించాను. "మళ్ళీ మనం కలవమనే అనుకున్నాను. ఎంత మంచిరోజు ఇవాళ!" అంది. గొంతు ఈసారి నిండుగా, జీవితంలో అనుభవం నేర్పిన స్థాయి తెలిసింది. దుర్గను చేసుకున్నానని తెలిసి కొంత ఆశ్చర్యమూ, కొంత తృప్తీ ప్రకటించింది. "నాకు తెలుసు మీరు చేసుకుంటారని, మీరు కాదనుకున్నా దుర్గ మిమ్మల్ని వదిలేది కాదు" అంది.

"ఈ రైల్లో వస్తున్నావా?" అన్నాను.

తల తిప్పింది. "విజయవాడ వెళుతున్నాను. మా ఆయన బంధువులెవరో ఉన్నారట అక్కడ" అంది కుడిచెంప మీద చెయ్యి ఆనించి నిలబడింది. "చూశారా, మావాడు, రాజా" అని అబ్బాయిని అందించింది. చూశాను. నిండుగా, పొడవుగా ఉన్నాడు, నుదురు విశాలం. "కళ్ళు నీవే" అన్నాను ఏం చెప్పాలో తెలీక.

"మా ఆయన్ని చూపిస్తానుండండి" అంటూ ప్లాట్ ఫారం అంతా వెదికి, ఓ చివర నిలబడి జెండా ఊపుతున్న వ్యక్తిని చూపి "అదిగో ఆయనే" అంది. మనిషి గుర్తు తెలియడం లేదు. పొడవుగా ఉన్న మనిషి కనిపిస్తున్నాడు. "ఉండండి, పిలుచుకు వస్తాను, మీ గురించి ఆయనకు తెలుసు. చూస్తే సంతోషిస్తారు" అని అటువేపు తొందరగా నడిచింది.

ఎదురుగా రావలసిన బండి వచ్చేసింది. ఆయన దగ్గరకు వెళ్ళి ఏదో చెపుతోంది. అతను నావేపు ఒక్కసారి చూశాడు. ఏదో చెపుతున్నాడు. బిగ్గరగా మాట్లాడుతున్నాడని నాకెందుకో అనిపించింది. అతను కదిలేలోగా రైలు కదిలింది. నేను తొందరపడి కంపార్టుమెంటు మెట్లెక్కాను. రైలు కదలడం చూసి ఆత్రుతగా ఇటువేపు తిరిగింది. నా వేపు చూసి నవ్వుతూ చెయ్యి ఊపింది. ఆ నవ్వులో ఈసారి అలసట, చెప్పరాని వ్యగ్రత కనిపించాయి. రైలు వేగం అందుకుంది. కురియప్పన్ ముందు నుంచి రైలు కదిలేసరికి అతను సిగరెట్టు వెలిగించుకుంటున్నాడు. ముఖానికి చేతులు అడ్డం. అదే మొదటిసారీ, చివరిసారీ కురియప్పన్‌ని చూడడం.

తర్వాత మరెప్పుడో చాలా సంవత్సరాల తర్వాత అనుకుంటాను. విశాఖపట్టణం మెయిన్ రోడ్డు మీద సుబ్బులు తండ్రి కోదండరామయ్యగారు కనిపించారు. మొదట ఆయన్ని గుర్తుపట్టలేకపోయాను. ఇదివరకటికంటే నల్లగా, మరింత సన్నంగా కనిపించారు. పలకరిస్తే చాలా సేపటివరకూ నన్నసలు పోలికే పట్టలేకపోయారు. గుర్తుచేశాను. విజయనగరం ఇంట్లో ఇద్దరం డాబా మీద పడుకుని కబుర్లు చెప్పుకున్న రాత్రిని. అప్పటికి అర్థమయి నవ్వారు.

"మీరు చాలా మారిపోయారే!" అన్నారు.

మాట మధ్యలో "శోభనాద్రిగారెలా ఉన్నా"రని అడిగాను.

"నాన్నగారు పోయి అప్పుడే రెండేళ్ళయింది. జబ్బేమీ లేదు. ఒకరోజు హాయిగా భోజనం చేసి చుట్టకాల్చుకుని, అరుగుమీద కూర్చుని అక్కడే ఒరిగిపోయారు. వయస్సు అంతే" అన్నారు.

ఓ ప్రశ్న అడగాలని మనస్సులో పీకుతోంది. కానీ ఈయనా శోభనాద్రిగారిలాగే ముఖం ముడుచుకుంటాడేమోనని సాహసం చెయ్యలేక పోయాను. కానీ విడిపోయే ముందు ఇక ఆగలేక అడిగేశాను. "సుబ్బులు క్షేమసమాచారాలు మీకు తెలుస్తున్నాయా?" అని.

"తెలియడం ఏమీటి? మొన్న పండుగకి రెండు నెలలు మా దగ్గరే ఉండి వెళితే! ఇప్పుడదేం లేదు. అంతా వచ్చిపోతున్నారు" అన్నాడు.

"అయితే అంతా రాజీపడ్డారన్నమాట. వాళ్ళ కాపురం సుముఖంగా గడిచిపోతున్నదనుకుంటాను" అన్నాను తృప్తిగా.

నవ్వారు. "అది మాత్రం నిజం కాదు. నిజం చెప్పాలంటే వాళ్ళ మధ్య ఏవో పొరపొచ్చాలున్నాయని నా అనుమానం. అమ్మాయి కుడిచెంప మీద చూశారా?"

లేదన్నాను విస్తుపోతూ.

"అతనెప్పుడో దాన్ని కొట్టి ఉంటాడని నా అనుమానం. కాని అడిగితే చచ్చిగింజుకున్నా చెప్పదు. నాకేం హాయిగా ఉన్నానంటుంది. ఆ పట్టుదలా, మొండితనం దానికెలా వచ్చాయో నాకిప్పటికీ ఆశ్చర్యమే. కష్టాలు పడుతోందని అనుమానం కలిగే ఇక ఆగలేక నేను ఓసారి వెళ్ళి ఇద్దర్నీ ఇంటికి ఆహ్వానించాను. అది చిన్నప్పటినుంచీ కష్టాల్లోనే పెరిగింది. పెళ్ళి విషయంలో కూడా దాన్ని సుఖపెట్టలేకపోయాను. ఏం చేస్తాం? అది చేజేతులా చేసుకుంది" అని వాపోయాడు.

నాకు హఠాత్తుగా ఓ విషయం గుర్తుకొచ్చింది. క్రితం సారి స్టేషన్లో కలిసినప్పుడు నేను చూసినంతసేపూ కుడిచెంప మీద నుంచి చెయ్యి తియ్యలేదు. ఇప్పుడాలోచిస్తే ఆనాటి ఆమెలోని నిరుత్సాహం, భర్త ఆమెతో గట్టిగా మాట్లాడడం, నన్ను చూడగానే కళ్ళల్లో తిరిగిన నీళ్ళూ గుర్తుకొచ్చాయి. అది నన్ను చూసినప్పుడు కలిగిన ఆనందం కాదేమో, కష్టాల్లో ఉన్నప్పుడు ఆప్తుడు కనిపించిన దుఃఖమేమో. ఒక్కసారి చలించిపోయాను. తర్వాత నా ఉద్యోగం, ఉనికి, మంచిచెడ్డలన్నీ వాకబు చేశారు కోదండరామయ్యగారు.

విడిపోయే ముందు యధాలాపంగా అడిగాను "విశాఖపట్టణం ఏం పనిమీద వచ్చారు?" అని.

మళ్ళీ నవ్వారు. "పదిరోజుల క్రిందట మళ్ళీ మా ఆవిడకి మతి చలించింది. ఈ ఊరి ఆసుపత్రిలో చేర్చమన్నారు డాక్టర్లు. సుబ్బులు కాపరానికి వెళ్ళిపోయాక ఆ ఒంటరితనం దానికి భరించరానిదయింది. మొన్న పండక్కి అదీ, కొడుకూ వచ్చారు. మళ్ళీ ఆ జ్ఞాపకాలు కదిలినట్లున్నాయి. అది వెళ్ళిన మూడో రోజే తను వెళతానని పిచ్చిమాటలు మొదలెట్టింది. దాని జీవితం పాడు చేశానని నన్ను తిట్టడం ప్రారంభించింది. అంతే, దుఃఖం నానాటికీ ఎక్కువయి మళ్ళీ పిచ్చిలో పెట్టేసింది" అన్నారు.

నేను నిశ్చేష్టతతో వింటూ నిలబడిపోయాను. ***కొన్ని జీవితాలు ఎంత ఆనందంగా, సంతృప్తికరంగా ప్రారంభమయినా చివరికి ఎలాంటి మలుపులు తిరుగుతాయో ఊహించడం కష్టం.*** నా దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోతున్న ఆ పొట్టిమనిషి చాలా రోజుల పాటు జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు.

## 25

***మరచిపోయే శక్తి మనిషికి దేవుడిచ్చిన అపూర్వమయిన వరమేనని ఒక్కొక్కప్పుడు అనిపించినా, కొన్ని తియ్యటి అనుభవాలనీ, వెచ్చటి జ్ఞాపకాలనీ మరిచిపోయినప్పుడు మనస్సు విలవిలలాడుతుంది.*** సుబ్బులు ఉత్తరం చదివి ఆమె గుంటూరులోనే ఉంటోందని తెలిశాక అంత దగ్గరలో ఉంటూ ఆమెను ఇన్నాళ్ళూ చూడలేకపోయేందుకు గిజగిజలాడాను. నాకామె విశాఖపట్నం ఆఫీసుకు పోస్ట్ చేసిన ఉత్తరం కనీసం నాలుగయిదు ఊర్లు తిరిగి విజయవాడ చేరింది. తీరా ఆమె గుంటూరులోనే ఉంది. ఉత్తరంలో విశేషాలేం లేవు. "నాకు మరల మీ సహాయం కావలెను. దయచేసి గుంటూరుకు ఒక పర్యాయం రాగలరు. మేమెక్కడ ఉండేది రాస్తున్నాను" అని రాసింది. అప్పటికి సుబ్బుల్ని చూసి రెండు దశాబ్దాలయింది. ఎప్పుడయినా అబ్బాయి నెత్తుకున్న ఇల్లాలు గుర్తుకొచ్చేదే గాని, వయస్సు మళ్ళిన తల్లిగా గుర్తురాలేదెప్పుడూ. సుబ్బులు ఉత్తరం చదివి మరుసటి ఆదివారమే తీరిక చేసుకుని గుంటూరు బయలుదేరాను. ఉత్తరం చూసి నేనూ వస్తానని దుర్గ తగాదా వేసుకుంది. అతి ప్రయత్నంతో వెయ్యి విధాల నచ్చచెప్పి ఆమెను ఆపగలిగాను.

సుబ్బులు ఇంటికి చేరుతుంటే వెయ్యి రకాల ప్రశ్నలు నన్ను వెన్నాడాయి. కురియప్పన్ ఇక్కడ ఏం చేస్తున్నాడు? వాళ్ళ జీవితం ఇప్పుడెలా సాగుతోంది? ఎందరు పిల్లలు? సుబ్బులులో మార్పు ఎలాంటిది? కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇల్లు చేరగానే దొరికింది. సుబ్బులు ఒంటరని ఆమె ముఖం చూడగానే అర్థమయింది. నుదిటిన బొట్టు లేదు. వయస్సులో పోరాటం సాగించి అప్పుడు సంపాదించుకున్న సతీత్వపు గుర్తు ఇప్పుడు చెరిగిపోయింది. కురియప్పన్ ఎలా పోయాడు? చెప్పింది, ఏదో రైల్వే ఆక్సిడెంటులోనట. ఆ రోజు ఇంట్లో దెబ్బలాడి పనికి బయలుదేరాడు. అర్ధరాత్రి సిగ్నల్ పడలేదట. కారణం వెదుక్కుంటూ పనివాళ్ళతో పట్టా వెంబడే వెళ్ళాడు. బాగుచేశారు. ఇంకా రైలు రావడానికి వ్యవధి ఉన్నదనే దృష్టితో పరాకుగా పట్టామీదే ఉన్నాడట. ఎదురుగా వచ్చిన ఇంజను తొక్కేసింది. అది ఆమె చెప్పిన కథ, ఇందులో నిజమెంతో అర్థంకాలేదు నాకు. సిగరెట్టు వెలిగించుకుంటున్న తెల్లటి వ్యక్తి అంత సులువుగా మృత్యువు చేతికి దొరికిపోతాడనుకోను తనకు మనసుంటే తప్ప. అయినా ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? లేదా వాళ్ళకు అర్థంకాని మరేదైనా కారణం ఉందేమో?

"మరి గుంటూరులో ఉన్నారేం?"

"అబ్బాయి ఇక్కడ మెడికల్ కాలేజీలో చదువుతున్నాడు. వాడికోసం ఉండవలసి వచ్చింది. ఇంకెక్కడ ఉండను?" నవ్వింది. ***రాత్రంతా కురిసిన వర్షానికి ఎలాగో స్థిరంగా చెట్టుని పట్టుకు వేలాడి ఉదయపు ఎండలో తళతళ మెరిసిన పువ్వులా స్వచ్ఛంగా ఉంది ఆ నవ్వు.*** సుబ్బులు వంటిమీద ఆభరణాలు ఏమీ లేవు. ఇంట్లోనూ పెద్ద విలువయిన వస్తువులున్నట్టు కనిపించలేదు. ఈ సాంసారిక జీవితంలో మిగుల్చుకున్నదంతా కొడుకు చదువుకే ఆమె ఖర్చు చేస్తోందని ఊహించగలిగాను. భర్తపోయి దాదాపు రెండేళ్ళయ్యింది. కాని సుబ్బులు పెద్దగా దిగులు చెంది, క్రుంగిపోయినట్లు కనిపించదు. అందుకు కారణం అతని మీద ప్రేమ లేకపోవడం అనుకుంటే పొరపాటే అవుతుంది. ఐనప్పటికి సతీత్వపు లక్ష్యాన్ని ఇప్పుడు మాతృత్వపు మమతగా మలుచుకుని, ఆశతో బ్రతుకుతున్న తల్లే నాకు సుబ్బులులో కనిపించింది. సుబ్బులుకు పెద్ద వయస్సు రాలేదు. కానీ తన ఈడు వారికంటే ఆరేడేళ్ళు పెద్దదానిలాగ కనిపిస్తుంది. జుత్తు కొద్దిగా నెరవడం ప్రారంభించింది. మధ్య తరగతి జీవితం, సాంసారిక బాధ్యతలూ, పరిస్థితులూ ఆమె మీద చాలా కఠినంగా ప్రతీకారాన్ని తీర్చుకున్నాయి.

"కురియప్పన్ పోయాక మరి మీ నాన్నగారు నిన్ను ఆదుకోలేదా?"

నవ్వింది.

"***అభిమానం ఉన్న ప్రతివాళ్ళ నుంచీ ప్రేమను పొందలేము.*** అర్థం కావడానికి ఇన్నాళ్ళు పట్టింది. మీకు తెలీదు. అమ్మపోయింది. పిచ్చి ఎక్కువయిందట. విశాఖపట్టణంలో కరెంట్ షాక్ పెట్టించారు. మరో రెండేళ్ళు బ్రతికింది. తర్వాత ఎలక్ట్రిక్ షాక్ వల్లనేమో నీరసించిపోయింది. నా దగ్గర ఉండాలనిపించింది తనకి. ఈసారి పిచ్చిలో నామీద ప్రేమ ఎక్కువగా కనిపించిందంట. చిన్నతనంలో ఏదయితే నాకివ్వలేకపోయిందో అదంతా ఇప్పుడు తోసుకొచ్చిందనుకుంటాను. కాని నాదగ్గర ఎలా ఉంటుంది? నేను మాత్రం ఎలావెళ్ళగలను? రెండేళ్ళకి పోయింది. మా మామ్మ మాత్రం ఇంకా బ్రతికే ఉంది ముసలి ముద్దలా. ఆమెని పెట్టుకుని నాన్నగారు గ్రామంలో ఉంటున్నారు. మా ఆయన పోయారని తెలియగానే వచ్చారు. మమ్మల్ని తమ దగ్గరకి వచ్చెయ్యమన్నారు. కాని వీడి చదువు నేనెలా వెళతాను?" నవ్వి "అక్కడ కొడుకు మీద ఆధారపడ్డ తల్లి బాధ్యత ఆయనకుంటే ఇక్కడ తల్లిమీద ఆధారపడ్డ కొడుకు బాధ్యత నాకుంది" అంది.

అన్నీ పోయినా బలమయిన జ్ఞాపకాల్ని కొడుకు రూపేణా మిగిల్చిపోయాడు కురియప్పన్. పాత జీవితానికి ఇప్పుడు మిగిలిపోయిన ఈ బ్రతుకుకి బలమైన సంకెల కొడుకు. అతణ్ణి చూడాలనిపించింది. అడిగాను.

"వస్తాడు. వాడి గురించే మీ సహాయం కావాలని రమ్మన్నాను."

"ఏమిటా సహాయం?"

"మీరు నా కథనంతా వాడికి చెప్పాలి"

"అదేమిటి?"

"అవును. నేను చాలా రోజులబట్టి కిందా మీదా పడుతున్నాను. ఈ చిక్కుని ఎలా విప్పాలా అని. ఒక నెలరోజుల క్రిందట మీరు గుర్తుకువచ్చారు. విశాఖపట్టణంలో ఉన్నారని నాన్నగారు ఎప్పుడో చెప్పారు. ఆ గుర్తుతో మీకో ఉత్తరం రాశాను. మీరు రాలేదు. ఉత్తరమూ లేదు. మీకా ఉత్తరం అందిందో లేదో, రాసిన అడ్రసు తప్పేమోనని ఆ ఆశ వదులుకున్నాను."

"ఏమిటా చిక్కు? చాలా పెద్ద చిక్కుని నా వేళ్ళతో విప్పించావు ఆ రోజుల్లో. నీకంటే నాకు చేతనవునా మార్గం?" అన్నాను నవ్వుతూ.

ఆ విషయాలు గుర్తుకొచ్చాయి గావును. నవ్వలేకపోయింది. ఆ రోజుల్లో నన్ను మభ్యపెట్టినందుకు పశ్చాత్తాపపడుతుందేమో! ఇవాళ్టి స్వభావంతో ఆమె ఇవాళయితే ఆ పని చేసేది కాదనిపించింది. ఎదురు తిరిగి పోరాడే శక్తి ఆమెలో సడలిపోయింది. ఆ విశ్వాసాలూ, స్వయంనిర్ణయ శకీ తగ్గిపోయింది. అందుకే నా సహాయం కావలసి వచ్చింది ఆమెకు.

"అబ్బాయి ఎవరినో ప్రేమించాడు" అంది ఆగి.

నేను తుళ్ళిపడ్డాను.

మళ్ళీ తనే మాట్లాడింది. "మొదట నాకూ చెప్పలేదు. కానీ ఈ మధ్య తనే మాట కదిపి ఎవరో అమ్మాయి ఫోటో చూపించాడు. అమ్మాయి చక్కగా ఉంటుంది. తనతో పాటు చదువుకుంటోందట. ఇద్దరూ ప్రేమించుకున్నారట."

"అయితే ఇంక ఇబ్బంది ఏముంది?"

సుబ్బులు కళ్ళు ఎర్రనయాయి. "కాని నాకా పెళ్ళి ఇష్టంలేదు"

"అదేం?" అన్నాను.

"ఆ మాత్రం గ్రహించలేరూ? వాడింకా చిన్నవాడు. చిన్నప్పుడు పెళ్ళిచేస్తే చదువు పాడుతుంది."

"పోనీ చదువయేదాక ఆగమని చెప్పు."

"నేనెదుర్కోవలసినవన్నీ సుఖంగా ఎదుర్కున్నాను. కష్టాలనుకుని ఆగిపోలేదు. విచారించలేదు. కాని నేను చేసిన సాహసానికి ఇది అంత మంచిప్రతిఫలం అనుకోను. ఈ జీవితం కోసం అంత తిరుగుబాటు ఎవరూ చెయ్యనక్కరలేదు" అంది నిర్ధారణగా.

"అంటే ఈ తిరుగుబాటు ద్వారా నువ్వు పొందిన కష్టాలు నీకు కష్టాలుగా కనిపించడం లేదు. కాని అందరూ అలా అనుకోలేరని నీ భయం, కనీసం నీ కొడుకు విషయంలో. అవునా?"

అవునంది.

"మరి ఇరవై ఐదేళ్ళ క్రిందటి నీ జీవితమే నాకు తెలుసు. నీ తిరుగుబాటే నాకు తెలుసు. దాని పర్యవసానం తెలీదు."

"ఫరవాలేదు. అదంతా విపులంగా చెప్పండి. దొంగతనం అక్కరలేదు. నేనే ఇబ్బందులకీ, కష్టనష్టాలకి ఓర్చి ఆయన్ని చేసుకున్నానో మీరు చెప్పాలి. నేనే చెప్పేదాన్ని కానీ, ఇలాంటివి నేను చెప్పడం వాడికి నచ్చకపోవచ్చు. నాకూ బాగుండదు. అంతా చెప్పాక దానివల్ల నాకెట్లా గొప్ప ఆనందం లభించలేదో చెప్పండి. అది వాడికి అర్థమైతే మనస్సు మార్చుకుంటాడు."

సుబ్బులు వేపు విచిత్రంగా చూశాను. విసురుగా, విశృంఖలంగా ఉన్న మానసిక స్వభావానికి పదును అంచులు అరిగిపోయాయి. కానీ, ఆమెలో ఆ స్వభావాలు మారలేదని గ్రహించాను. ఈ పట్టుదలతో 'పాత సుబ్బులు' ఛాయలు కనిపించాయి. ఏమైనా ఈ

బాధ్యతను నిర్వహించటంలో నా సమర్థత మీద నాకు నమ్మకం కుదరడం లేదు. కానీ కాదని చెప్పినా సుబ్బులు ఒప్పుకోదని తెలుసు. ఇంకేమో అడిగేలోగానే బయట తలుపు చప్పుడైంది.

"వాడే అయివుంటాడు. పరిచయం చేస్తాను. రేపు మీ హోటల్‌కి పంపిస్తాను. అంతా చెప్పండి. మీరే సహాయం చేసి పెట్టాలి."

రాజారావు లోపలికి వచ్చాడు. తెల్లగా, నిండుగా, పొడుగ్గా ఉన్నాడు. అతణ్ణి చూసిన మొదటి క్షణంలోనే తల్లి పోలికలన్నీ పుణికి పుచ్చుకున్నాడని అర్థమైంది. అంతేకాదు. నేను చెయ్యబోయే పని ఫలితమూ అర్థమైంది. ఇది కాదు. మరి ఎన్ని కథలు చెప్పినా రాజారావు మార్చుకోడని నాకెందుకో నమ్మకం కలిగింది.

చిన్ననాటి స్నేహితునిగా నన్ను పరిచయం చేసింది సుబ్బులు. చెయ్యెత్తి వినయంగా నమస్కారం చేశాడు రాజారావు. పెద్ద గొంతుతో మాట్లాడాడు. చాలా నెమ్మది. మెల్లగా తెలిసినట్టు భావించి మాట్లాడుతాడు. అతనితో పదినిముషాలు మాట్లాడాక, అతని స్వభావం కనిపెట్టాక ఈ కథ అతణ్ణి మార్చవచ్చునేమో నన్న పిచ్చి ఆశ మళ్ళీ కలిగింది.

కాఫీ తీసుకు లేచాను. "ఫలానా హోటల్లో ఉంటున్నాను. రేపు ఉదయమే నీకోసం ఎదురు చూస్తుంటాను" అని లేచి వచ్చేశాను.

✡ ✡ ✡

కేవలం మాట్లాడుకుంటూ హోటల్లో కూర్చోవడం విసుగ్గా ఉంటుందని నాకు తెలుసు. అదీగాక రాజారావు పని మరీ చికాకయింది. ఆ రోజంతా నా మాటలు వింటూ కూర్చోవాలి. అందుకని రాగానే హోటల్ ఖాళీ చేసి ఇద్దరం బస్సులో విజయవాడ బయలుదేరాం. దారిపొడుగునా మాట్లాడుకున్నాం. కథ చెపుతూనే ఉన్నాను. ఇంటికి చేరేవరకూ వింటూనే ఉన్నాడు. మరొకరయితే మధ్య మధ్య వెయ్యి ప్రశ్నలు వేసేవారు. కానీ రాజారావు ఏమీ అడగలేదు. చెప్పింది వింటున్నాడు.

ఇద్దరం ఇంటికి వచ్చాం.

సుబ్బులు కొడుకుని చూసి, దుర్గ సుబ్బుల్ని చూసినట్లే సంతోషించింది. భోజనాలయాక మళ్ళీ కథ కొనసాగించాను. ఇద్దరం కృష్ణానది దాటాం. బారేజ్ అంతా నడిచి సీతానగరం కొండల నీడల్లో చేరాం కథ పూర్తయ్యేసరికి సాయంకాలమయింది.

✡ ✡ ✡

వంతెన మీద నడవడం దాదాపు పూర్తయింది. మిగతా విషయం చెప్పడానికి తొందరపడ్డాను. అయితే అతని తల్లితండ్రుల సాంసారిక జీవితాన్నీ, దానిలోని అసంతృప్తినీ మరొక వ్యక్తికి తెలియచెప్పడం అంత పెరిగిన కుర్రాడికి నచ్చుతుందా లేదా అనే సందిగ్ధంలో పడ్డాను. ఏమయినా అలా చెప్పబోవడం ఔచిత్యం కాదు. నిజానికి తర్వాత ఇక చెప్పవలసింది సుబ్బులు. కొడుకుని దగ్గర కూర్చోపెట్టుకుని చెప్పవచ్చు. అయినా తప్పదు. చేసేపని సగం సగం చెయ్యడంలో అర్థం లేదు. మెల్లగా, భయంగా, సంశయంతో ప్రారంభించాను.

"ఇంతవరకూ జరిగింది ఎవరయినా చెప్పొచ్చు నిజానికి. కానీ తర్వాత జీవితంలో నువ్వు పాత్రవే. మీ నాన్నగారిని సుబ్బులు పెళ్ళి చేసుకున్నాక జరిగినదంతా మీ అమ్మ చెప్పాలి. సాంసారిక జీవితంలో చాలా లోటుపాట్లు వస్తుంటాయి. పోతాయి. కానీ దాంపత్యం దైవ నిర్ణయమని, మనకి తెలీని విధి చేతిలో దాన్ని వదిలేసి కష్టసుఖాల్ని భరించడం ఓ విధంగా శ్రేయస్కరమయిన పద్ధతి. కాని జీవిత భాగస్వామినిగా ఎన్నుకున్నప్పుడు అప్పుడెదురయే ఒడుదుడుకులకు ప్రతిసారీ కారణం తమ ఎన్నికలో లోపమేమోననుకుంటే ఆ సంసారం నరకమే అవుతుంది.  అలాంటి ఒడిదుడుకులు బాగా ఎదురయిన సంసారం మీ అమ్మా, నాన్నా గడిపారని అనిపిస్తుంది. కాని తన ఎన్నిక ఎప్పుడూ తప్పని బయటపడలేదు మీ అమ్మ. మనస్సులో అనుకుంది. కనీసం ఎప్పుడో ఒకప్పుడయినా, ఇప్పుడు నువ్వు తనలాగే ప్రేమలో పడ్డావంటే అటువంటి ఆత్మవంచనలో పడ్డావేమోనని భయపడుతోంది. ఎన్నుకోవడంలో గొప్పతనంలేదు. రేపు ఎదురయ్యే ప్రతి కష్టానికీ ఆమే కారణమని ఆమెతో పెళ్ళే కారణమని అనుకునే దౌర్భల్యానికి లోను కాకూడదు. దానికి మీనాన్న లోనయాడు. ఆమె అయినా

తట్టుకు నిలబడింది. అయినా ప్రతిఫలాన్ని ఇద్దరూ అనుభవించారు. అలా దౌర్భల్యానికి లోను కాకుండా, తప్పనిసరిగా బ్రతికిన మీ అమ్మ నువ్వు ఆ 'తప్పనిసరి' పరిస్థితికి ఎర కాకూడదంటుంది. నువ్వు కోరిన వ్యక్తి కావాలని మీ అమ్మ అడగడంతో బాధ్యత తీరిపోయింది. కానీ ఆ రోజుల్లో తన కోరికని చెప్పుకునే ధైర్యం లేని ఆడపిల్ల కోరిన వ్యక్తిని సంపాదించుకోవడం ఎంత కష్టమో ఆలోచించు. సంప్రదాయానికీ, సమాజానికీ, సౌశీల్యానికీ భిన్నంగా పోకుండా తను అనుకున్న పనిని సాధించి కూడా ఏమీ ప్రయోజనాన్ని పొందలేకపోయింది. అయినా ఆ మాటకి జీవితమంతా ఒప్పుకోలేదు. కానీ ఇవాళ నీకోసం ఒప్పుకుంటుంది. ఇదంతా నీతో చెప్పడం చేతకాక, చెప్పే శక్తిలేక నా సహాయం కోరింది! వ్యతిరేకించి, భయపెట్టి శాసనం చేయవలసినంత చిన్నవాడివేం కావు కనక, మంచి చెడ్డల్ని బేరీజు వేసుకునే స్తోమత నీకుంది కనక చెప్పడమే మంచిదని మీ అమ్మ ఆలోచించింది. నువ్వు నీ నిర్ణయం మార్చుకుంటే ఆమె సంతోషిస్తుందనుకుంటాను. చిన్నప్పుడు మీ అమ్మ తల్లిప్రేమను పొందలేకపోయింది. వయస్సులో కోరిన వ్యక్తికోసం గరళాన్ని పుక్కిట పట్టింది. ఇక ఈ వయస్సులో ఒక్క శ్రేయస్సే ఆమెకు ఆనందాన్ని ఇవ్వగలదని నేను వేరే చెప్పనక్కరలేదు. చివరగా ఒక్కటే చెప్పదలచుకున్నాను. జీవితంలో ప్రతి వ్యక్తికీ తల్లి ఉంటుంది. కానీ నీ తల్లిలాంటి తల్లి వెయ్యిమందిలో ఒక్కరికి ఉంటుందేమో! ఇది దృష్టిలో పెట్టుకుని ఆలోచించుకో. నీ ఇష్టం వచ్చిన నిర్ణయం చెయ్యి. ఇంతే నేను చెప్పదలచుకున్నది."

క్రిక్కిరిసిన వాతావరణంలోకి, ఊపిరి తిరగని జనసందోహం మధ్యకి వచ్చేశాం. కృష్ణానది చల్లదనం ఆలోచనలతో, అలసటతో వేడెక్కిన శరీరాల్ని సముదాయిస్తోంది.

అంతా విన్నాక ఏదో చెపుతాడనుకున్నాను. అంతసేపూ నేను చెప్పింది విన్నా ఒక్కమాట అనలేదు. అతని ఓర్పు నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

చివరగా నావేపు తిరిగి

"మీలాంటి మంచి స్నేహితులు దొరకడం నిజంగా అమ్మకు అదృష్టమే. చాలా శ్రమ తీసుకున్నారు. థాంక్స్" అన్నాడు నవ్వుతూ.

"ఇంతకూ ఇంత విన్నాక నీకేమనిపించింది?"

నవ్వి నా కళ్ళలోకి చూశాడు.

"ఇరవై నాలుగేళ్ళ అనుభవాన్ని చెప్పారు మీరు. నాకు ఈ అనుభవం అర్థమయి ఇరవై నాలుగ్గంటలే అయింది. కొంచెం వ్యవధి ఇవ్వండి. మా అమ్మలాగా కాకుండా నా ఆలోచనకూ, విచక్షణకూ చోటిచ్చారు మీరు. నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు.

అతణ్ణి చూస్తూ నేను చెప్పింది చాలా జాగ్రత్తగా విన్నాడనీ అది అతనిమీద చాలా ప్రభావాన్ని కలగజేసిందనీ, ఎరుపెక్కిన అతని కళ్ళని బట్టీ, బిరుసెక్కిన పెదవుల్ని బట్టీ తెలుసుకున్నాను. ఇక అతణ్ణి కదపదలచుకోలేదు. గుంటూరు బస్సు ఎక్కిస్తూ "రేపు ఉదయమే వచ్చి కనిపిస్తానని మీ అమ్మతో చెప్పు, నీ నిర్ణయం మీ అమ్మకు చెప్పు. నా మాటలు మరిచిపోకు" అన్నాను.

బస్సు కదులుతుంటే నవ్వుతూ చెయ్యెత్తి నమస్కారం చేశాడు. అతణ్ణి చూస్తూ నాకో పెళ్ళీడు కొచ్చిన కూతురయినా లేకపోయింది కదా అని ప్రలోభపడ్డాను...

✡ ✡ ✡

పని ఒత్తిడి వల్ల అన్నమాట ప్రకారం వెళ్ళలేకపోయాను. ఎలాగో వీలుచేసుకుని సాయంకాలం బయలుదేరాను. బయటికి నిండుకుండలా కనిపించేలా రాజారావు నిర్ణయంకూడా నిండుగానూ, నిజంగానూ ఉంటుందని నాకెందుకో నమ్మకం కలిగింది. ఆ నిర్ణయాన్ని తెలుసుకోవాలని ఉత్సాహపడ్డాను. చేతిలోని నాణాన్ని గాలిలో విసిరి బొమ్మా, బొరుసా అని ఎదురుచూసే ఉత్సుకతలాంటిదేమో అది! అదీగాక, తన తల్లి కథ ఆ కుర్రాడి మనస్సు మీద ఎటువంటి ప్రభావం కలిగించి ఉంటుందో పలువిధాలుగా ఊహించనారంభించింది మనస్సు.

వెళ్ళేసరికి నాకోసమే ఆత్రుతగా ఎదురు చూస్తోంది సుబ్బులు.

నన్ను చూసి ముఖం ఇంత చేసుకుని "వచ్చారా, రండి, రండి మిమ్మల్ని ఊసేవరకూ నాకేం తోచడం లేదు. ఇది చూడండి ముందు" అని ఓ కాగితం నా చేతిలో ఉంచింది.

ఆమె ముఖం చూసి... ఊహించని సంఘటన జరిగి ఉంటుందని గ్రహించాను. అంత పాలిపోయిన సుబ్బులు ఎప్పుడూ కనిపించలేదు. నిద్రలో ఏదో పిశాచాన్ని చూసి కలవరపాటులో హఠాత్తుగా లేచాక - ఆ విస్మయం ముఖం మీద నిలిచిపోయినట్లు కనిపించింది. చేతనున్న కాగితం విప్పాను.. రెండే రెండు వాక్యాలు కనిపించాయి.

"ప్రేమించిన వ్యక్తిని దక్కించుకోడానికి ఏం చెయ్యాలో తెలీక సతమతమవుతుంటే - నీ కథ చెప్పించి నాకు మేలే చేశావు. అమ్మాయిని తీసుకుని నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడ ఉన్నా నీ కొడుకు - రాజారావు."

చదవగానే కళ్ళు బైర్లు కమ్మాయి. దిమ్మెరపోయి శిలాప్రతిమలా నిలబడిపోయాను. '

తలెత్తితే సుబ్బులు ఏడుస్తోంది.

"ఇలా చేస్తాడనుకోలేదు. నా కథ చెపితే మారుతాడనుకున్నాను" అని గొణిగింది.

రాజారావు మనస్సుని ఉహించడానికి ప్రయత్నించాను. ఆలోచించిన కొద్దీ నవ్వొచ్చింది.

"నీ కథ చెప్పకపోతే పెళ్ళికి కొంత ఆలస్యం చేసేవాడేమో! కానీ రాజారావు నీ అంత పట్టుదల మనిషి. ఈ పని నాకేం ఆశ్చర్యం కలిగించడంలేదు" అన్నాను చివరికి.

తెల్లబోయి నావేపు చూసింది. "అయితే మీకీ విషయయం తెలుసా? ముందే చెప్పాడా మీతో? మరి నాకెందుకు చెప్పలేదు?" - ప్రశ్నలు కురిపించింది.

"నాతో చెప్పలేదు - కానీ ఉహించగలను. ఎందుకంటే అతను నీ కొడుకు. అదీగాక మరో ముఖ్యకారణం కూడా ఉంది" అన్నాను. రాజారావు మనస్సుని ఊహిస్తూ.

"ఏమిటి?" అంది సుబ్బులు.

"మూడు పొరపాట్లు జరిగిపోయాయి, అతణ్ణి మార్చే ప్రయత్నంలో - ఒకటి: నీ కథలో నువ్వు ఊహించిన నీతిలేదు. రెండు: కథ చెప్పడానికి నేను సరైన వ్యక్తిని కాను. నీ ప్రేమ కథని మనస్సులో హత్తుకునేటట్టు చేయగలిగినట్టు - నీ సాంసారిక జీవితాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పలేకపోయాను. అది నాలోపమే. కానీ నేనంతకన్నా చేసేదేమీ లేదు. నిజానికి నీ జీవితంలో యౌవనంలో కనిపించినంత వ్యక్తిత్వం, విసురూ వయస్సులో లేవు. యౌవనంలో ఉన్న కుర్రాడికి నీ యౌవనంలో జరిగిన సంఘటనలే ఆకర్షణీయంగా కనిపించాయి."

ఆలోచిస్తుంది సుబ్బులు.

"వీలయితే యౌవనంలో కథని చెరిపేయాలని ఉందా?" అన్నాను నవ్వుతూ.

ప్రశ్న మాట అటుంచి నాకు విచారం లేనందుకు కోపం వచ్చింది సుబ్బులికి. "అంత కొడుకు పారిపోతే మీకు విచారంలేదా? ఎంత క్రూరులు మీరు? - నిజమే. యౌవనంలో జరిగినవంటే నా కసహ్యం. నా కిష్టం లేదు" అంది.

ఇంతవరకూ నా మనస్సులో కదులుతున్న ప్రశ్నకు సమాధానం స్పష్టంగా కనిపించింది. దాదాపు అదే ప్రశ్నను కదిపింది సుబ్బులు.

"నేను చేసిన మూడో పొరపాటు ఏమిటి?" అంది తలెత్తి.

"నువ్వు అపూర్వమనుకుని అభిలషించే లక్ష్యానికి నీకు నువ్వే అసహ్యించుకునే మార్గాన్ని అవలంబించావు. అందుకనే నీ తర్వాతి తరాన్ని 'ఆ మార్గాన్ని అనుసరించకూడ'దనే హక్కు నీకు లేదు. నీ యౌవనంలో నిన్ను ఆకర్షించిన మార్గం వాళ్ళ యౌవనంలో ఎందుకాకర్షించకూడదు?"

బోనులో నిలబడ్డ దోషి సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు బలహీనంగా అంది:

"ఇంతకీ నేను చేసిన తప్పేమిటి? ఆయన్ని ప్రేమించాను. పెళ్ళిచేసుకోవాలనుకున్నాను. మీతోపాటు బయలుదేరి మా ఊళ్ళో దిగాలనుకున్నాను. తీరా మీరు ఆపితే వెనక్కి తిరిగాను... "

"ఆపి వెనక్కి పంపే మిత్రుడు అప్పట్లో నీకు దొరికాడు. ఉన్నా ఆగవలసిన అగత్యం ఇవాళ రాజారావుకి కనిపించక పోవచ్చు."

"అయితే నాదే తప్పంటారా?"

"అవును. నీదే" అన్నాను నిర్ధారణ. "భగవద్గీత నుంచి మహాత్మా గాంధీ వరకూ చెప్పిన అపూర్వమయిన సత్యానికి అందమయిన విపర్యయం నీ జీవితం" అన్నాను ఉత్సాహంగా. నా ఆలోచనకు మార్గం దొరికింది. "కేవలం లక్ష్యాలు ఉన్నతమయినంత మాత్రాన ప్రయోజనం లేదు. దాన్ని చేరడానికి అనుసరించే మార్గమూ ఉన్నతమూ, పవిత్రమూ కావాలి. అలా కానప్పుడు నీ తర్వాతి తరాన్ని లక్ష్యం వేపే చూడమని అడగడానికి నీకేం అధికారం ఉంది? సరి అయింది కాకపోయినా, ఆకర్షణీయమైన మార్గాన్నే వాళ్ళు అనుసరిస్తే వాళ్ళని ఎలా నిందిస్తావు?"

నా కంఠంలో ఎక్కడలేని బలం, జవం వచ్చింది.

సుబ్బులు దీనంగా, దిగులుగా శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. ఆమెను చూస్తుంటే నాకు జాలేసింది. ఏమీ చదువులేని సమాజంలోని సగటు మనిషి - తన ఉద్రేకాలతో, స్వభావాలతో ఇంత వరకూ నయినా ప్రయాణం చెయ్యడం ఎంత గొప్పో ఆలోచిస్తే ఆమె మీద ఇంకా గౌరవమే మిగిలింది. ఏమయినా ఇప్పుడిక ఓదార్చడం నా ధర్మమనిపించింది. లేచి సుబ్బులు తలమీద చెయ్యివేశాను.

"బాధపడకు. రాజారావు బుద్ధిమంతుడు. మంచివాడు. నీతో అతనికేం తగాదా లేదు - నీ అభిప్రాయాలతో తప్ప. తప్పనిసరిగా ఎప్పటికయినా తిరిగి వస్తాడు. ఇప్పటికయినా నీ మనస్సుతో రాజీపడు - అతను భార్యతో తిరిగి వచ్చాక ఆ జీవితంతో ఎలాగూ రాజీ తప్పదు గనక"

కన్నీరు నిండిన కళ్ళను నా వేపు తిప్పింది సుబ్బులు.

చేతనా ప్రపంచంలో పొరపాట్లు దిద్దుకుంటూ మళ్ళీ పొరపాట్లు చేస్తూ పయనించే జీవుని వేదనంతా ఆ కళ్ళలో ద్యోతకమయింది.

**(ఐపోయింది)**

సుబ్బులు పాత్రని తలుచుకుని కలవరిస్తున్న ఇప్పటి ఫాన్ కిరణ్‌ప్రభగారు. ౩౮ సంవత్సరాల తర్వాత ఈ నవల సాధించుకున్న బంధువు ఈయన.

ఒక్కసారి వెనక్కి వెళ్ళి ఆలోచిస్తే - సుబ్బులు పాత్రకి మాతృక - నాపధ్నాలుగో ఏట నా ఆలోచనల్లో దొరికింది. మేము అద్దెకుండే ఇంట్లో ఒక వాటాలో ఉండే వారింటికి ఓ అమ్మాయి వచ్చింది. నా వయస్సేనేమో. ప్రేమా దోమా తెలీని దశ అది. ఒకవేళ మనస్సులో ఏదో ఆకర్షణ ఉన్నా - దానికి ఇతమిత్థమనే రూపం లేదు. తీరా ఆమె కొన్నాళ్ళుండి వెళ్ళిపోయాక

*ఓ పద్యం రాసుకున్నాను.*

**పోయితివి నీవు నను వీడిపోయి ఎటకో**
**యేను నీ పదఛాయల నేగలేక**
**వేడి నిట్టూర్పు కెరటాల నీడలందు**
**జీర్ణమయిపోవు దుఃఖంపు జీరనైతి**

మరో పదేళ్ళకి - సుబ్బులు ప్రాణం పోసుకుని నా నవలలో పాత్రయింది.

ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా ఈతరం పాఠకులని ఇంతగా కదిలించిందంటే..అది సున్నితమైన మానవ సంబంధాలకున్న బలం..!

గొల్లపూడి మారుతీ రావు